RNI No.APTEL/15835/2019

ప్రజా

మణిపూస
తెలుగు
మాసపత్రిక

సంపుటి - 1 సంచిక - 9 | అక్టోబరు - 2020 | పేజీలు : 80 | వెల : 25/-



ఇ. జయకర్ డానియల్
Chief Executive Officer (CEO)

చీఫ్ ఎడిటర్ & పబ్లిషర్
కనపర్తి రాజారావు

కొడుకుల శ్రీనివాస్, యాక్టివ్ జర్నలిస్ట్

అసోసియేట్ ఎడిటర్
శ్రీ కె.వెంకట అప్పారావు (Ph.D)

సీనియర్ సబ్ ఎడిటర్ & టెక్నికల్ అడ్వయిజర్
శ్రీ డా॥ ఎం.జయకుమార్,MBA.,Ph.D,.

ఎడిటర్ : **శ్రీ బి.రాజేష్,** B.Sc,.

సీనియర్ జనర్నలిస్ట్, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్
ఎన్.భావన్నారాయణ (భాను)

ఫొటోగ్రాఫర్ :
బి.వీరయ్య

డిజైన్ & డి.టి.పి
ఆర్.తేజేష్, Cell : 9866789072

Office Address
D.No.10-12-6/44, Plot No.302,
Sai Towers 1, Rednam Gardens,
Visakhapatnam.530002
Cell : 9492423833

విషయ సూచిక

Registration No.1140/2019

ప్రజా మీడియా నెట్‌వర్క్
PRAJA MEDIA NETWORK

ఇ. జయకర్ డానియల్
Chief Executive Officer (CEO)

కనపర్తి రాజారావు
చీఫ్ ఎడిటర్ & పబ్లిషర్

సాయి టవర్స్-1, ఫ్లాట్ నెం.302, రెడ్నం గార్డెన్స్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 94924 23833.
హెచ్.నెం. 9-1-38, వైఎంసిఎ కాంప్లెక్స్, సర్దార్‌పటేల్ రోడ్డు, సికింద్రాబాద్, తెలంగాణ,
ఫోన్ : 9885715927, 9912202720

ప్రైవేట్ విద్య ఎవరి కోసం?



దేశప్రజల సమగ్రాభివృద్ధిలో విద్య ప్రముఖ పాత్ర వహిస్తుంది. దేశ ప్రగతికి సమ సమాజ అభివృద్ధికి అవసరమైన విలువలతో కూడిన విద్యా విధానం కావాలని విద్యా వేత్తలు, ప్రగతిశీల మేధావులు, అభ్యుదయ వాదులు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు ఒకవైపు ముక్తకంఠంతో నినదిస్తూ డిమాండ్ చేస్తుంటే.. మరోవైపు మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగాన్ని తమ దోపిడీ ప్రయోజనాలకు అనుగుణంగా మలుచుకుంటూ సామ్రాజ్య వాదులకు, విదేశీ పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తున్నాయి. ఇప్పటికే ప్రాథమిక స్థాయి నుంచి హైస్కూల్ స్థాయి వరకు ప్రైవేట్ యాజమాన్యాలకు ధారా దత్తం చేశారు. ఇటీవల కాలంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు లేరు అనే నెపంతో అనేక పాఠశాలలను మూసివేయడం మనం చూశాం. ఇలా విద్యారంగం నుంచి ప్రభుత్వాలు క్రమంగా తప్పుకుంటూ డబ్బున్నవారికే విద్యను పరిమితం చేసే విధానాలను కొనసాగి స్తున్నాయి. తొండ ముదిరి ఊసరవెల్లి అయిన విధంగా ప్రైవేటీకరణ దశను దాటి విద్యారంగం కార్పొరేట్ కబంధ హస్తాల్లో చిక్కుకున్నది. గత కొన్ని సంవత్సరాలుగా నిర్విరామ కసరత్తుతో విద్యను ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టిన పాలకులు నేడు ప్రైవేటు విశ్వవిద్యాలయాల బిల్లును ప్రవేశపెట్టడం ద్వారా ఉన్నత విద్యారంగాన్ని సైతం విదేశీ పెట్టుబడిదారుల చేతుల్లో పెట్టడానికి రంగం సిద్ధం చేశారు. ఉన్నత విద్యను ఇలా ప్రైవేటీకరించడంలో పెట్టుబడిదారి శక్తుల ఆర్థిక ప్రయోజనాలతో పాటు, పాలక పార్టీల రాజకీయ ప్రయోజనాలు కూడా ఉన్నాయి.

సంవత్సరాలు గడుస్తున్నా విశ్వవిద్యాలయాలలో అత్యున్నత స్థాయి వీసీ, రిజిస్ట్రార్, రెక్టార్, వివిద రకాల డీన్స్ పోస్టులు, టీచింగ్, నాన్ టీచింగ్ మరియు ఇతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయకుండా వదిలేశారు. కాలంచెల్లి శిథిలావస్థకు చేరిన భవనాలకు మెరుగులు దిద్దడం మానేశారు, కొత్త భవనాలను నిర్మించడం మర్చిపోయారు. కానీ పెట్టుబడిదారుల కరెన్సీ కట్టలకు గులాంగిరి చేస్తూ ప్రైవేట్ యూనివర్సిటీ యాజమాన్యాలకు ఎర్రతివాచీలు పరిచి స్వాగతం పలుకుతున్నారు. పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడుతూ అణగారిన కులాలకు విద్యను దూరం చేసి ఆధిపత్య బావజాలంతో రాజ్యాంగ చట్టాలను కప్పిపుచ్చుతూ ప్రైవేట్ యూనివర్సిటీలలో రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఫీజు రీయింబర్స్‌మెంట్ లేకుండా కొనసాగిస్తే సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనకబడిన శ్రామిక వర్గాలు ఉన్నత విద్యకు దూరం అవుతారు. ఈ ప్రభుత్వాల నిర్ణయాలను తిప్పికొట్టకపోతే ప్రభుత్వ యూనివర్సిటీలు ప్రమాదంలో పడటమే కాకుండా ఉన్నత స్థాయి విద్యను కోల్పోతున్నాము. కనుక విద్యార్థులు, బుద్ధిజీవులు, ప్రజాస్వామిక విలువలతోకూడిన ప్రత్యామ్నాయ వ్యవస్థ కోసం నాణ్యమైన ఆధునిక, శాస్త్రీయ విద్యావిధానం కోసం న్యాయ పోరాటం చేయాలి.



చీఫ్ ఎడిటర్

రథాలే కాదు.. గుడిసెలు తగలబడుతున్నాయి..!

– డాక్టర్ కత్తి పద్మారావు, 9849741695



మాటలు మార్మికంగానే వుంటున్నాయి మాటల్లో మంత్రాలు వల్లిస్తున్నారు మాటల్లో సత్యం లోపిస్తూ వస్తుంది చెక్కముక్కలు తగలబెడితే ఆందోళనలు మనుషులు తగలబడితే కన్నీటి బొట్టు రాలటం లేదు మనుషుల మెదడులు ఎండిపోతున్నాయి అక్కడ భావాలు మొలవడం లేదు ఒక మరణం ఖరీదైంది ఇంకొక మరణానికి విలువే లేదు మనిషి ఏదో ఒక మత్తును వెతుక్కుంటున్నాడు చైతన్యంగా ఉండటమే వారికి రావడం లేదు శాస్త్రం అంతా కథనాత్మకమవుతూ వుంది కథలన్నీ చరిత్రగా పరిచయం అవుతున్నాయి జీవితంలో అస్పష్టత ఎక్కువవుతుంది జీవితానికి అర్థం కోల్పోతున్నవారి సంఖ్య పెరుగు తుంది. జీవితాన్ని అతిగా అనుభవించటం తప్పు కాదా! జీవితం క్రమబద్ధమైంది విశ్వం కూడా క్రమంలోనే నడుస్తుంది పాల సముద్రాలు సృష్టించారు మజ్జిగ చుక్కబడితే అది పెరుగు సముద్రం కాదా.. అనే వివేచన ఏది? ఆదిశేషుణ్ణి పాన్పు చేశారు విష్ణువు, లక్ష్మి ఇద్దరూ దానిమీద ఎలా నిద్రిస్తారు? ఇప్పుడు మీరు పామును పక్కలో పెట్టుకు పణుకోగలరా? అభూతానికి ఒక అర్థం ఉండాలి కదా! జీవించడానికి అర్థం పోయింది కల్పనలో వున్న అలంకారం మారిపోయింది వయస్సుకు, స్నేహానికి అంతరం పోయింది పరవర్షన్స్ పెరిగాయి అతి కాంక్షాపరులు అంతర్జరణలో వున్నారు హింసాత్మక దృశ్యాలు చూసి చూసి హింసాత్ముకులుగా మారిపోతున్నారు పరహింస పోయి స్వీయ హింసకు గురవుతున్నారు మరణానికి దు:ఖించడం మానివేశారు కన్నీరు ఇంకిపోయాక జీవితంలో ఆర్థతకు తావేది? సోమరులుచేసే భజనలకు విగ్రహాలు విస్తుపోతున్నాయి విగ్రహాలకు పట్టు చీరలు, విగ్రహాలకు నగలు, విగ్రహాలకు పెండ్లిండ్లు వినోదానికి దేవాలయాలే స్థావరాలు పార్కులు, లైబ్రరీలు, ల్యాబ్లు కరువయ్యాయి విజ్ఞానం అందుకోవడానికి స్థావరం లేదు పబ్బులు కొన్నిరోజులు ఆపితే ఇళ్ళే పబ్బులు చేశారు తాగి చిందులు వేస్తున్నారు పిల్లలకు, తల్లిదండ్రులకు అంతరాలు ఎవరి శ్రుతి వారిది, ఎవరి నృత్యం వారిది వంటశాల విస్తుపోతుంది ఏ పదార్థంలో ఏమి కలిపి తింటున్నారో తెలియదు ఊబకాయులు అవుతున్నారు కరోనా భయం పోయింది, కరోనా విజృంభిస్తుంది పోయినోళ్ళుపోతారు, ఉన్నోళ్ళు ఉంటారనేదే సిద్ధాంతం అదనపు ధనం అంతా వ్యసనాలకు ఆయువు పోస్తుంది కులం పోయినట్టు అనిపిస్తుంది. అంతరాల్లో అది ఘనీభవిస్తుంది రాజ్యం కూడా కులం చుట్టూ తిరుగుతుంది మనిషి మెదడు కులం కోరల్లో ఇరుక్కుంది. మనుషులు వ్యసనపరులు అయ్యాక ఉత్పత్తి శూన్యమేగా! 'ఆహారం, వస్త్రం, గృహం మేము ఇస్తాం మాకు మీరు భజన చేయండి' అంటున్నారు బుద్ధి తాకట్టులోకి వెళ్ళాక ఆలోచనలు ఎక్కడనుండి పుడతాయి అక్షరాన్ని యాంత్రికం చేస్తున్నారు దృశ్యమాన ప్రపంచమే ఆబాస రథాలే కాదు, గుడిసెలు తగులబడుతున్నాయి బుద్ధి కేంద్రాలు తగులబడుతున్నాయి విజ్ఞానార్జనను సాగించండి! బుద్ధి కుశలతను పొందండి! సాత్వికతను అలవర్చుకోండి!! దేశంలో జీవనగమనం పెరుగుతుంది! జీవించే హక్కే ప్రధాన సూత్రం..!

ఆత్మనిర్భర్ భారత్ - ఆర్థిక ప్యాకేజీ ఎవరి కోసం ?

- ఆచార్య కె.ఎస్.చలం,యు.పి.ఎస్.సి.పూర్వసభ్యులు

కోవిడ్-19 ప్రపంచాన్ని అతలాకుతలంచేసింది. అయితే డబ్బున్న మారాజులు ఇంట్లో కూచొని ఆన్‌లైన్‌లో అన్నీ రప్పించుకొని టి.విలు, మొబైల్‌లతో కాలం గడిపేస్తున్నారు. రెక్కాడితే కాని డొక్కాడని పేదజనం, అసంఘిటిత రంగంలోని కార్మికులు, రైతు కూలీలు గ్రామీణ ప్రజానీకం నూటికి 90 శాతం మంది రోడ్డున పడ్డారు. ఈ మహమ్మారి ధాటికి ప్రపంచ అగ్ర దేశమని విర్రవీగే ట్రంప్ అమెరికా సైతం గజ గజ లాడుతోంది. అయితే భారతదేశ పాలకులకంటే ట్రంపే నయం. కోవిడ్ తాకిడి తగిలిన వెంటనే పేద అమెరికా పౌరుని యింటికి 1200 డాలర్ల చెక్కు (సుమారు రూ. 92,000) అడగకుండానే పంపించాడు. మూడు లక్షల కోట్ల డాలర్ల ప్యాకేజి ప్రకటించుకున్నాడు. పెట్టుబడిదారి వ్యవస్థకు డిమాండ్ ముఖ్యం అందుకే దాన్ని తగ్గించకుండా ఉండటానికి ఆ ప్యాకేజి అవసరమయింది. మరి రామరాజ్యంలో అటువంటి ప్రయత్నం జరిగిందా అంటే అయోధ్యలో 300కోట్ల రూపాయల రాములవారి గుడికి భూమిపూజ జరిగింది. అంతకుమునుపు 12మే 2020న మోడీగారు ఒక ఆర్థిక ప్యాకేజి ప్రకటించారు. దానికి ముందు కొన్ని రోజులుగా అదిగో కోట్లు యిదిగో రక్షణ అని రామభజన విన్న జనానికి మోడిగారు 20 లక్షల కోట్ల రూపాయల ప్యాకేజి అంటే మన జాతీయాదాయం, 2 కోట్ల కోట్లు రూపాయలలో 10 శాతం ప్రకటించటంతో చప్పట్లు, లైట్లు, మందు గుండు సామాను వెలిగించేలా భక్తజనం గంతులేశారు. ఇంతకీ ఈ 20 లక్షల కోట్లేమిటో తమ బ్యాంక్ అకౌంట్లలో లోచేరిపోతుందని బ్యాంకుల చుట్టూ తిరిగిన ప్రజలకు ఏమీ రాక పోవటంతో అర్థంకాలేదు. ఆర్థిక మంత్రి నిర్మలమ్మకూ అర్థంకాలేదు. ఐదుసార్లు పత్రిక సమావేశాలు పెట్టి లక్ష కోట్లు, లక్షన్నకోట్లు, ఏభై వేలకోట్లు అని ప్రకటించి ప్యాకేజీని వివరించారు. వాళ్ల ఆర్థికశాస్త్రవేత్తలకు సామాన్యులకు అర్థం కాక తలలు గోక్కుంటున్నారు.

20 లక్షల కోట్ల అప్పుల ప్రణాళిక

ఇంతకీ నిర్మలమ్మ వివరించిన ఐదుదఫాల ప్యాకేజి ఇలావుంది. మొదటి దఫా 1,92,800కోట్లు, రెండోసారి, 5,94,550 కోట్లు, మూడోసారి 3,10,000 కోట్లు, నాలుగోసారి, 1,50,000 కోట్లు, చివరగా 48,100 కోట్లు ప్రకటించి మొత్తం 12,95,400 కోట్లు అని చెప్పి అపసోపాలుపడ్డారు. మరి 20 లక్షల కోట్లు గదా అంటే అదే రిజర్వ్ బ్యాంక్ వారు ప్రకటించిన 8,01,603 కోట్లతో మొత్తం 20,97,053 కోట్లు లెక్కల్లో చూపించారు. సామాన్యులు లెక్కలు వేసుకొని కనీసం ఇంటికి 80,000 రూపాయలు అంటే దేశంలో వున్న 25 కోట్ల కుటుంబాలకు అందుతాయి అని ఎదురుచూస్తున్నారు. ఐదు కేజీల బియ్యం ఒక కేజి శనగలు తప్ప ఏమీ రాకపోవడంతో అయోమయంలో పడ్డారు.

ఆ 20 లక్షల కోట్ల రూపాయలలో గతంలో జూన్ బడ్జెట్‌లో ప్రకటించిన అనేక స్కీములు వున్నాయి. వాటిని ఇందులో చేర్చి ఆర్భాటం కోసం ఇరవై లక్షల కోట్లు అని ప్రకటించిన ప్యాకేజీ పెద్ద ఆత్మ ద్రోహం ప్రజలను పక్కదారి పట్టించడం. ఆ డబ్బంతా ఏవిధంగా పెట్టుబడిదార్లకు అప్పులు, అప్పులు చెల్లంచలేని వారికి సహాయకారాలుగా చూపించారు. మరి అందులో సామాన్యులకు వలస కార్మికులకు, వీధి దుకాణాదారులకు, పేదల ఇళ్లకు నరేగా కార్మికులకు ఏమి సహాయం లేదా అంటే గతంలో బడ్జెట్‌లో చెప్పిన స్కీములు తప్ప అదనంగా విదిల్చింది కొంచమే మీరే చూడండి!.

1. ఇప్పటి వరకు వున్న సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమ నిర్వచనం మారింది. కనీసం ఒక కోటి, 10 కోట్లు, 20 కోట్లు పెట్టుబడిని 5 కోట్లు, 50 కోట్లు, 100 కోట్లు టర్నోవర్ వున్నవాళ్లు యిందులోకి వస్తారు. అంటే దేశంలో వ్యాపించివున్న గుజరాతి షావుకార్లకు లాభం. కోటిరూపాయలకు పెట్టుబడి అంటే చిన్న, సన్నకారు పరిశ్రమలకు పద్దగా లాభం వుండదు.
2. వీధిలో దుకాణాలు నడుపుకునే వారికి రూ.10,000 అప్పు దానికి 5,000 కోట్లు, కలకత్తా వంటి నగరాల్లో 5 లక్షల మంది, ఢిల్లిలో 25 లక్షలు, విశాఖ, విజయవాడ, హైదరాబాద్ నగరాల్లో వున్న లక్షలాది మంది తోపుడు బళ్లు, అరుగు మీద కొట్లున్న వారికి ఎంత అప్పుపుడుతుందో చూడండి. మన దేశంలో 71.1 శాతం మంది అసంఘటీత కార్మికులకు రాతపూర్వక ఉద్యోగం వుండదు. వాళ్ళకి ఇందులో ఏమిలేదు.
3. మత్స్యకారులకు 11,000 కోట్లు కోల్డు స్టోరేజి, రోడ్లు తదితర నిర్మాణాలకు
4. వలస కార్మికులు ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చు ఒక దేశం ఒక కార్డు
5. రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రం ఆదాయంలో 5 శాతం వరకు అప్పులు తీసుకోవచ్చు.
6. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు 25-100 కోట్ల వరకు అప్పు గ్యారంటీ
7. ఇపిఎఫ్ చెల్లించే 12% - 12% మేరకు ప్రభుత్వం చెల్లిస్తుంది. అది 12% నుండి 10 శాతానికి తగ్గించి తన యజమాని 3 నెలల వరకు చెల్లించవచ్చు.
8. లక్షరూపాయల విలువ గల దివాళాకేసు కోటి రూపాయలకు పెంచారు.
9. 2.5 కోట్ల రైతులు అప్పుకోసం 2 లక్షల కోట్లు, నాబార్డ్‌కు (NABARD) 90,000 కోట్లు
10. ఇక నుండి వ్యవసాయ ఉత్పత్తులు ఎక్కడైనా అమ్ముకోవచ్చు. నిబంధనలు లేవు.

పెట్టుబడిదార్లకు, పరిశ్రమలకు ప్రకటించన కోట్ల రూపాయలు

అప్పులు, రాయితీలు

1. పబ్లిక్ రంగ సంస్థలన్నీ ప్రైవేట్ చేస్తారు. ఒక్కో రంగం (సెక్టార్)కో ఒక్క ప్రభుత్వ రంగ పరిశ్రమే వుంటుంది. స్టీల్ విశాఖ వుంటే, మిగతావి ప్రైవేట్, మిగతా చోట్ల వుంటే విశాఖ ప్రైవేట్ అలాగే HPCL వుంటే ఇండియన్ ఆయిల్ తదితరం ప్రైవేట్ అన్నమాట.
2. ఇంతవరకు విదేశీ పెట్టుబడులు 49 శాతం వరకే పబ్లిక్ సంస్థతో పెట్టాలి నిబంధన సడలించి, 75 శాతానికే పెంచి, ఉత్పత్తులు అంటే ఎలా ఆయుధాలు ప్రైవేట్ రంగంలో ఉత్పత్తి చేస్తారో చెప్పేస్తారు.
3. 200 కోట్లు దాటిన ఏ కాంట్రాక్టులో విదేశీ కాంట్రక్టర్లకు అవకాశం వుండదు.
4. కంపెనీ చట్టంలో క్రిమినల్ క్లాజులు తొలగించి ఉదారవిధానం ప్రవేశపెట్టారు.
5. ఎలక్ట్రసిటీ డిస్కమ్ కంపెనీలకు 90,000 కోట్లు, బొగ్గుకు 50,000 కోట్లు తో సదుపాయాలు, 50 బ్లాకులు బొగ్గు వేలం.
6. రియల్ ఎస్టేట్ రంగంలో 70,000 కోట్లు పెట్టుబడి, 6 నెలల తరువాత అప్పులు తిరిగి చెల్లించే వెసులుబాటు, వాయిదాలు 3 నెలల వరకు పొడిగింపు.
7. హౌసింగ్ రంగంలో వున్న ఫైనాన్స్ కంపెనీలకు 30,000 కోట్ల అప్పు.
8. నష్టాల్లో వున్న NPA లకు 20,000 కోట్ల అప్పు
9. RBI తన CRRను తగ్గించి 1,37,000 కోట్లు అదనంగా మార్కెట్‌లో విడుదల, మరో 1,50,500 కోట్లు టార్గెట్ లాంగ్ టెర్మ్ బాండ్సుకు వెసుఉబాటు.
10. MSMEలలో ఫిబ్రవరి 2020 నాటికి ఉన్న అప్పులో 20 శాతం మళ్లీ అప్పుగా పొందవచ్చు. 10,000 కోట్ల నుండి 50,000 కోట్లకు కార్పస్ ఫండ్.
11. విదేశాల్లో భారతీయ కంపెనీలు పెట్టుబడులకు అనుమతి.
12. విమానాశ్రయాల నిర్మాణానికి అహ్మదాబాద్, లక్నో, మంగుళూరు ప్రైవేట్ కంపెనీలకు అనుమతి.
13. టెక్నాలజీ ఆధారంగా విద్యావ్యవస్తను నవీకరించి దేశీ విద్యాసంస్థలకు ప్రోత్సాహం, నూతన విద్యావిధానం ప్రవేశపెట్టడం.

పైన చెప్పిన 20 లక్షల కోట్ల ప్యాకేజీ చాలా వరకు అప్పులు ఎలా, ఎక్కడ ఇవ్వాలో చెప్పారు. RBI మరో 8 లక్షల కోట్లు అప్పుయిస్తుంది. అంటే ఇటీవల రైల్వేలు, ఎయిర్ యిండియా, ఆయిల్ కంపెనీలు వంటివి ప్రైవేట్ పరం చేస్తున్నపుడు పాపం వాళ్ల దగ్గర డబ్బు లేకపోతే ఏదోలా సర్దుబాటు చేసి బ్యాంకుల్లో అప్పులు తీసుకొని రైలు బళ్లు, విమానాలు, విమానాశ్రయాలు, టిక్ టాక్‌లు, మొబైల్ కంపెనీలు పెట్టుకోవటానికి వెసులుబాటుంది. భారత మాతాకీ జిందాబాద్ అనే మన సోదరులు రక్షణ రంగాన్నే కాదు, ఆయుధాలను సైతం విదేశీ కంపెనీలు తయారుచేస్తే ఏమంటారో? లోపాయికారికగా ఏమంటారంటే ఎర్రజెండావాళ్లు పబ్లిక్ కంపెనీలు మూతపడేటట్లు చేస్తున్నారు అందుకే ప్రైవేట్‌కు యిచ్చేసి దేశాన్ని కాపాడుతున్నా అని ఆత్మ ద్రోహం చేసుకుంటున్నారు. ప్రజలారా! గమనించండి కోవిడ్ తగ్గి మనం సాదరణ జీవితంలోకి వచ్చేసరికి మన నోట్లో జై శ్రీరాం, అంబాని, అదాని, టాటాల చేతుల్లో పరిశ్రమలు మిగులుతాయి. మన దేశాన్ని, మన సంపదను కాపాడుకుందాం. ఈ ప్రభుత్వాన్ని నిలదీద్దాం! మన దేశమాతకి జిందాబాద్!


❖❖❖❖❖❖❖

జడ్జీల ఎంపికపై ఆలోచించాలి

న్యాయమూర్తులను లాయర్ల నుంచి ఎంపిక చేస్తున్నారు తప్ప ప్రతిభ ఆధారంగా జరగడం లేదు. చట్టం, రాజ్యాంగం పట్ల అవగాహన లేని వారు కూడా జడ్జీలు అవుతుండటం దురదృష్టకరం. పార్టీ కోసం పని చేశాడని ప్రాక్టీస్ లేని వాళ్లకు సైతం పోస్టులు ఇస్తున్న పరిస్థితి. మన వాళ్లే జడ్జీలుగా ఉండాలనుకునే పరిస్థితి. ఈ పరిస్థితి మారాలంటే ఐఏఎస్, ఐపీఎస్ లాగే ఐజేఎస్ రావాలి.

– జయప్రకాష్ నారాయణ,

మాజీ ఐ.ఎ.ఎస్



విశ్వనరుడు, కళాత్మక మేధావి గుర్రం జాషువా



ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు,
ప్రొఫెసర్, తెలుగు శాఖ,
సెంట్రల్ యూనిర్సిటి,
హైదరాబాద్,
ఫోను: 9182685231

"ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయించుగాని దుః
ఖితమతులైన పేదల ఫకీరుల శూన్యములైన పాత్రలన్
మెదుకు విదల్పదీ భరత మేదిని ముప్పది మూడుకోట్లదే
వత లెగబడ్డ దేశమున భాగ్యవిహీతుల క్షుత్తులారునే"


అని ప్రతిధ్వనించి పీడితులు, దళితుల పక్షాన నిలబడి రచనలు చేసిన ఒక గొప్ప కళాత్మక మేధావి మహాకవి గుర్రం జాషువా. దళితుల కోసం అహర్నిశలు కృషిచేసిన వాళ్ళలో మహాత్మా జ్యోతీ బాపులే, డా॥ బి. ఆర్. అంబేద్కర్, పెరియార్ రామస్వామి తదితరులు ప్రపంచం గర్వించదగిన గొప్ప మేధావులు. వారు దళిత తాత్త్వికతను సామాజిక, రాజకీయ సిద్ధాంతాల్ని రూపొందించిన మహానుభావులు. ఆ సిద్ధాంతాల్ని కళాత్మక అభివ్యక్తితో తెలుగులో సాహిత్యంగా అందించిన మహాకవి గుర్రం జాషువా!

దళితుల సమస్యల్ని గుర్తించడం, వాటి పరిష్కారాలను అన్వేషించడమే ప్రధానమనుకొనే వాళ్ళు ప్రత్యక్షంగా అంబేద్కర్, జ్యోతీ బాపూలే వంటి మేథావుల రచనల్నే చదువుకోవచ్చు.అలా కాకుండా ఆ విషయంతో పాటు, ఆనాటి సమాజాన్ని కూడా "రసభరితం" గా అవగాహన చేసుకోవాలనుకున్నప్పుడు కచ్చితంగా జాషువా రచనల్ని చదవాలి. మతం, కులం, వివక్షలు ఏ దేశంలో అయితే ఉంటాయో ఆ దేశంలోను, ఆ కాలంలోనూ గుర్రం జాషువా సాహిత్యం ఒక ప్రశ్నగా కనపబడుతూనే ఉంటుంది. అది జాషువా సాహిత్యానికి ఉన్న ప్రాసంగికత. అటువంటి జాషువా ఆధునిక ప్రసిద్ధ తెలుగుకవుల్లో ఒకరు. ఆయన అసలు పేరు "జాషవ" అయినప్పటికీ, ఉచ్చారణా సౌలభ్యం కోసం "జాషువా" అని పిలుస్తుంటారు. ఆయన తన పేరుని "జాషవ" అనే రాసుకునేవాడు.

జీవితం – తల్లిదండ్రుల వారసత్వం

గుర్రం వీరయ్య, లింగమాంబలకు 1895 సెప్టెంబరు 28వతేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా వినుకొండలో జాషువా జన్మించాడు. ఆయన పుట్టిన తేదీ విషయంలో సాహితీవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. జాషువా అక్టోబరు 28వతేదీన జన్మించారని కొంతమంది, సెప్టెంబరు 28 అని మరికొంతమంది అభిప్రాయపడ్డారు. చర్చి రికార్డులు, ఇతర ఆధారాలతో ఎండ్లూరి సుధాకర్ జాషువా స్వీయకథ "నాకథ" పై చేసిన పరిశోధనలో జాషువా పుట్టిన నెల అక్టోబరు కాదనీ, సెప్టెంబరు అవుతుందనీ నిర్ణయించారు.

జాషువా తల్లి మాదిగ కులానికి చెందినామె. ఈ కులస్థుల కంటే కొంచెం అగ్రవర్ణంగా భావించే యాదవకులానికి చెందినవాడు తండ్రి వీరయ్య. వీరి కులంతో పాటు మతాలు కూడా వేర్వేరు. తల్లి క్రైస్తవురాలు, తండ్రి హిందువుడు. విచిత్రమేమిటంటే నాటి మాదిగల కుల కట్టుబాట్లు వల్ల గానీ, పెళ్ళిచేసుకొని వదిలేయకుండా సామాజిక భద్రతకోసం గానీ వీరయ్యను క్రైస్తవమతాచారాల ప్రకారమే లింగమాంబను వివాహం చేసుకోవాలని కులపెద్దలు పట్టుబట్టారు. లింగమాంబపై గల ప్రేమానురాగాల వల్ల హిందూసమాజం నుండి బయటపడి, క్రైస్తవుడిగా బాప్తిజం పొంది ఆమెను క్రైస్తవాచారాల ప్రకారమే వివాహం చేసుకున్నాడు.



సమాజంలో క్రైస్తవమతప్రభావం

జాషువా తండ్రి హిందువైనప్పటికీ, నాటి సమాజం ఆయన్ని కుల బాహ్యుడిగానే పరిగణించింది. భారతదేశంలో అప్పుడప్పుడే విస్తరిస్తున్న క్రైస్తవమతం

ముందుగా బ్రాహ్మణకుటుంబాల వారినే క్రైస్తవులుగా చేసినప్పటికీ తక్కువకులాలుగా భావించే వారినే క్రైస్తవం అత్యధికంగా ఆకర్షించింది. తమని మనుషులుగా గుర్తించి, ప్రేమాభిమానాలతో ఆదరించిందని భావించిన చాలామంది మాల, మాదిగ తదితర కిందికులాలుగా పరిగణింపబడేవాళ్ళంతా క్రైస్తవులుగా మారిపోయారు తొలినాళ్ళలో క్రైస్తవ మత ప్రార్థనలు అత్యధికంగా నిమ్నజాతుల వారి మధ్యే జరిగేవని డా.గుజ్జర్లమూడి కృపాచారి తన సిద్ధాంత గ్రంథం "తెలుగు సాహిత్యానికి క్రైస్తవులసేవ" లో వివరించారు.

కింది కులస్థులు, పేదవాళ్ళే అత్యధికంగా క్రైస్తవులుగా మారేవారనడానికి గల కారణాలు ఎమ్మారొషాంబు క్లౌ 1899లో రాసిన while sewing Sandals or Tales of A Telugu Pariah Tribe పేరుతో రాసిన గ్రంథం లో మరింత వివరంగా కనిపిస్తున్నాయి. ఆంధ్రప్రాంతంలో తీవ్రమైన కరువు కాటకాల్లో ప్రజలు జీవిస్తున్నారు. మాదిగ, మాలలు మరింత దయనీయమైన స్థితిలో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో బకింగ్‌హామ్ కాల్వ నిర్మాణాన్ని ఒంగోలు క్రైస్తవ మిషనరీ కాంట్రాక్ట్ చేపట్టింది. ఆపనులు చేయడానికి వారికి అవకాశం కల్పించి ఆకలి తీర్చడంతో పాటు మానవత్వంతో ఆదరించింది. ఈ ప్రభావాలన్నింటి వల్ల 1878 జూలై 3 తారీఖున 2,222 మంది ఒకేరోజు క్రైస్తవులుగా బాప్తిజం పొందారని ఆగ్రంథంలో ఎమ్మారొషాంబు క్లౌ పేర్కొన్నారు.

జాషువా స్వీయకథా కావ్యం "నా కథ"

స్వీయకథ 'నాకథ'లో జాషువా తన జీవితఘట్టాలను "నాకథ" పేరుతో మూడు భాగాలుగా ఛందోబద్ధపద్యాల్లో వర్ణించుకున్నప్పటికీ, దాన్నొక కావ్యంగా తీర్చిదిద్దారు. ఆయన జీవించిన కాలంలోనే ఆ మూడు భాగాలు వరుసగా1950, 1962, 1966 సంవత్సరాల్లో ప్రచురితమైయ్యాయి. జాషువా రాసుకున్న 'నాకథ'ను పరిశీలిస్తే ఆయన బాల్యమంతా కులవివక్షకు గురైనట్లు తెలుస్తుంది. విద్యార్థిజీవితం కూడా అస్తవ్యస్థంగానే కొనసాగినట్లు, చదువుకంటే ప్రకృతితో మమేకమై పశుపక్ష్యాదులతో ఆడిపాడాలనే కుతూహలం తనకు ఎక్కువగా ఉన్నట్లు ఆయనే వర్ణించుకున్నాడు. జాషువా తన బాల్య స్నేహితులతో ఆడిపాడాలనే కుతూహలంతో పశువుల్ని కాయడానికి కూడా ఏదొకనెపంతో వెళ్ళి ఆడుకొనేవాడని ఈ పద్యం వల్ల స్పష్టమవుతుంది. తనని మరచినా, తాను వినుకొండను మరిచిపోలేనని "నాకథ" తొలి పద్యంలోనే చెప్పుకున్న కవి, నేటికీ ఇంకా ఆ కులప్రభావం కొనసాగుతూ మాల, మాదిగలను అంటరానివాళ్ళుగానే చూస్తున్నా, వాళ్ళు అలాగే దయనీయంగా జీవిస్తున్నారా? నాటికీ నేటికీ మార్పులేమైనా ఒచ్చాయో, లేదో.. అనే వేదన కొన్నాళ్ళ తర్వాత రాసుకున్న కింది పద్యంలో కనిపిస్తుంది.

"మాదిగ, మాలలని మర్యాదల కాస్పదములేని యభిదలతో సం
బోధింప బలుకు దీనులు
పేదలు సుఖమున్నవారె? వినుకొండపురీ"(జాషువ, నాకథ – ప్రథమ భాగం)

వినుకొండలోని మిషన్ పాఠశాలలో జాషువా ప్రాథమిక విద్యను పూర్తిచేశాడు. 1906–1909 మధ్యకాలంలో జాషువా ఉన్నత విద్యను అభ్యసించాడు. తర్వాత బాపట్లలోని అమెరికన్ బాప్టిస్టు మిషన్ హయ్యర్ గ్రేడు టీచరు ట్రైనింగ్ పాఠశాల్లో ఉపాధ్యాయశిక్షణ పొందాడు. ఆ తర్వాత ఉభయభాషాప్రవీణుడై బడిపంతులుగా ఉద్యోగం చేశాడు. నాటి సమాజంలో క్రైస్తవమతబోధనలు వేగవంతంగా జరుగుతున్నక్రమంలో వాళ్ళ యాజమాన్యంలోనే అనేకపాఠశాలలు నిర్వహణ కూడా జరిగేది. ఆ పాఠశాల్లో హిందూమతగ్రంథాలు లేదా ఆ సాహిత్యాన్నీ ఎవరూ చదవకూడదనే నిబంధనలు కూడా ఉండేవి. ఆ పాఠశాల్లో ఉద్యోగం చేస్తున్న జాషువా హిందూమత ప్రభావ సాహిత్యాన్ని చదువుతున్నాడని తెలిసింది. జాషువా ప్రణయకలాపాలు చేస్తున్నాడనే నెపంపెట్టి యాజమాన్యం ఆ బడిపంతులు ఉద్యోగం నుండి తొలగించిందని ఆయన కుమార్తె 'మానాన్నగారు' గ్రంథంలో పేర్కొన్నారు.

ఆ తర్వాత ఆయన బతకడం కోసం రకరకాల ఉద్యోగాలు చేయాల్సి వచ్చింది. మూకీ సినిమాలకు వ్యాఖ్యాతగా పనిచేశాడు. యాజమాన్యం ఇస్తానన్న జీతం కూడా ఇవ్వకపోవడంతో ఆ ఉద్యోగాన్ని మానేసి, రాజమండ్రిలోనే బడిపంతులు ఉద్యోగంలో చేరాడు. ఆ సందర్భంలో తోలేటి వేంకటసుబ్బారావుతో పరిచయం ఏర్పడ్డం, ఆ పరిచయంతోనే రాజమండ్రిలోని చింతామణి నాటకమండలి యజమాని సత్యవోలు గున్నేశ్వరరావుని కలుసుకున్నాడు జాషువా. జాషువాలోని సాహిత్యాభిలాషను, ప్రతిభను గమనించిన గున్నేశ్వరరావు తన నాటకమండలిలో రచయితగా చేర్చుకున్నారు.జాషువా రాజమండ్రిలో 1916 నుండి 1919 వరకు ఉన్న కాలంలో 'శ్రీరుక్మిణీపరిణయం' నాటకం రాసినా, తర్వాత గుంటూరు వెళ్ళిపోయి లూథరన్ టీచర్ ట్రైనింగ్ పాఠశాల్లో తెలుగు పండితునిగా ఉద్యోగంలో చేరాడు. అప్పుడు మళ్ళీ ఆ నాటకానికి మెరుగులు దిద్ది ముద్రణవేసినట్లు జాషువా రాసుకున్నాడు. ఆ విధంగా పుట్టిపెరిగిన వినుకొండ దగ్గర్లోని గుంటూరుకే మళ్ళీ వచ్చినా తన ఉద్యోగాన్వేషణలో తిరిగిన ప్రాంతాలు, పరిచయాలు ఆయన జీవితంలో కొత్త ఆలోచనలను కలిగించగలిగాయని "నాకథ"లో వర్ణించుకున్నాడు.పద్యం అంటే జాషువాకి ఎంతో అభిమానం. ఛందోబద్ధంగా రాయగలగడమే నిజమైన కవిత్వం అని నమ్మిన కవి.

జాషువ రచనలు :

జాషువా రచనలలో పద్యకావ్యాలు, నాటకాలు, నవలలు, పద్యఖండికలుగా విభజించుకునే అవకాశం ఉంది. స్వప్నకథ–అనాథ (1930–31), పిరదౌసి (1932), గబ్బిలం (1941, 1946), కాందిశీకుడు (1943), ముంటాజమహలు (1944), ఖండకావ్యం–1 (1945), ఖండకావ్యం–2 (1945), ఖండకావ్యం–3 (1945), నేతాజీ, చిన్నానాయకుడు(1948), బాపూజీ (1948), స్వయంవరం (1950) ఖండకావ్యం–4 (1952), ఖండకావ్యం–5 (1953), రాష్ట్రపూజ (1953), కొత్తలోకం (1957), ఖండకావ్యం–6 (1962), నాకథ మూడుభాగాలు (1950, 1962, 1966), ముసాఫరులు (1963), క్రీస్తుచరిత్ర (1963), ఖండకావ్యం–7 (1966), నాగార్జునసాగర్ (1966). ఇవన్నీ ప్రధానంగా ఛందోబద్ధ పద్యాలతో కూడిన ఖండకావ్యాలు. ఆయన రాసిన నాటకాల్లో రుక్మిణీ కల్యాణం (1923), చిదానంద ప్రభాతం (1921), ధ్రువవిజయం (1925), వీరాబాయి (1947), తెరచాటు (1946) ప్రచురితం కాగా, హిమధామార్కధర పరిణయం (1914–1916), కన్యకా పరమేశ్వరి (1914 –16), మదాలస (1919), దావీదుచరిత్ర (1920) మొదలైన

రచనలు చేశాడు. 'స్వప్నకథ–అనాథ (1930–31' లను విశాలాంధ్ర వారు స్వప్నకథను ఒక ఆశ్వాసంగాను, రెండవ ఆశ్వాసం అనాథగాను ప్రచురించారు. తల్లిదండ్రులను పోగొట్టుకున్న ఒక పేద రెడ్డి కూతురు కథ ఈ కావ్యంలో వర్ణించాడు కవి. ఈమెను సాలెస్త్రీ పెంచుతుంది. లోకంలో అనేక కష్టనష్టాలకు గురై విషాదంతో స్వర్గానికి చేరుకుంటుంది. అస్పృశ్యత, దారిద్ర్యాల వల్ల ఒక మాలెత వీధులపాలైన కథ అనాథ.

పిరదౌసి (1932):

పిరదౌసి కావ్యం జాషువాని సాహితీలోకం గుర్తించేటట్లు చేసిందని విమర్శకులు అభిప్రాయపడ్డారు గజనీమహమ్మదు భారతదేశంపై 17 సార్లు దండయాత్రలు చేశాడని చరిత్రకారులు కూడా చెప్తుంటారు. (గజనీమహమ్మదు నవంబరు 2, 971లో పుట్టి, ఏప్రిల్30, 1030 న మరణించాడు. ఇప్పుడు ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్ అని పిలుస్తున్న ప్రాంతాల్లో గజనీ అన నగరం ఉంది. గజనీమహ్మద్ కి అరబిక్, సంస్కృతం వచ్చు.) ఆ దండయాత్రలను విజయయాత్రలుగా వర్ణిస్తూ తమ రాజవంశీయుల చరిత్రను రాయమని గజనీమహమ్మదు, ప్రసిద్ధపారశీక కవి పిరదౌసిని అడుగుతాడు. ఒక్కొక్కపద్యానికీ ఒక్కొక్క బంగారు నాణాలు ఇస్తానని నమ్మబలుకుతాడు. రాజ్ఞాను అనుసరించి పిరదౌసి ముప్పదియేండ్లు శ్రమించి మంచిమంచి శబ్దార్థాలతో 'షానామా' కావ్యాన్ని 60వేల పద్యాలతో పూర్తిచేస్తాడు. దాన్ని చదివిన రాజు, ఆస్థానంలోని పండితుల సూచనలకు ప్రభావితుడై బంగారు నాణాలకు బదులు వెండినాణాలిస్తాడు. రాజు ఆడిన మాట తప్పినందుకు పిరదౌసి ఆ వెండినాణాలను తిరస్కరిస్తూ లేఖ రాస్తాడు. అది చదివి రాజు ఉగ్రుడౌతాడు. పిరదౌసిని పట్టి చంపమని ఆజ్ఞాపిస్తాడు. అది తెలిసిన కవి రాజ్యం వదిలి పారిపోతాడు. తనజీవితంలో ఇంక సంతోషమనేదే లేదని భావిస్తాడు. మార్గ మధ్యలో అనేక కష్టనష్టాలకు గురవుతాడు. కొన్నాళ్ళ తర్వాత మసీదుపై పిరదౌసి రాసిన పద్యాన్ని రాజు చదువుతాడు. తన తప్పు తెలుసుకున్న రాజు చివరికి మళ్ళీ బంగారు నాణాలను పిరదౌసి ఇంటికి పంపిస్తాడు. కానీ, కవి కూతురు వాటిని తీసుకోదు. ఎన్నాళ్ళో బతకాల్సిన తన తండ్రిని చంపిన బంగారం తనకొద్దని తిరస్కరిస్తుంది. ఈ కావ్యం పిరదౌసి వేదనతో జాషువా వేదనను పోల్చవచ్చునని విమర్శకులు భావిస్తున్నారు. పిరదౌసి కావ్యంలో కవి– కవిత్వం రాసేటప్పుడు ఎలాంటి వేదనకు గురౌతుంటాడనే విషయాలను హృద్యంగా వర్ణించారు. కావ్యశాస్త్రవిషయాలను ఎన్నింటినో ఈ కావ్యంలో గ్రహించేవీలుంది. ఈ కావ్యంలో ఆణిముత్యాల వంటి పద్యాలెన్నో ఉన్నాయి. గజనీమహ్మదు నోటితో కవిగొప్పతనాన్ని జాషువా ఇలా వర్ణించాడు.

"కవిని కన్నతల్లి గర్భంబు ధన్యంబు
కృతిని జెందువాడు మృతుడు గాడు
పెరుగు దోట కూర విఖ్యాత పురుషులు
కవిని వ్యర్ణజీవిగా దలంత్రు. (పిరదౌసి– జాషువా)

పిరదౌసి తన శ్రమనంతా ధారపోసి కావ్యం రాస్తే, అది తననే తినేసే బెబ్బులిలా మారిందంటా మసీదుపై ఒక పద్యాన్ని రాసినట్లు జాషువా వర్ణించిన పద్యం పిరదౌసి కావ్యహృదయాన్ని అంతటినీ వివరించేలా ఉంది.

" ముత్యములకిక్కయైన సముద్రమునను
బెక్కుమాఱులు మున్కలు వేసినాడబీ
భాగ్యహీనుడ ముత్యమ్ము వడయనయితి
వనధిబీ నను మ్రింగనోరు విచ్చినది తుదకు." (పిరదౌసి– జాషువా)

పిరదౌసి కావ్యం జాషువా సృజనశీలతనీ, పాండిత్యాన్నీ, సహృదయతనూ ముప్పేటలా ఆవిష్కరించగలిగే ఉత్తమకావ్యం. జాషువా రాసిన రచనలన్నింటిలోను తనజీవితంతో ముడిపడిన అనేకసంఘటలు ముడిపడి ఉన్నాయనడం సమంజసంగా ఉంటుంది. ఆయన పద్యాల్ని చదువుతున్న పాఠకులకు, వింటున్న ప్రేక్షకులకు ఆ పద్యాల్లో తీయని బాధ ఏదో హృదయాన్ని మెలిపెడుతుంది. అపారమైన భావుకతతో పాటు అంతర్లీనంగా కవి జీవనవేదనేదో పలుకుతుంది. ముంటాజమహలు (1944): భారతదేశానికి మరింతకీర్తితెచ్చిన వాటిలో ముంతాజుమహలు ఒకటి. దీన్ని దర్శించిన తర్వాత జాషువా తన అనుభూతిని రంగరించి రాసిన కావ్యం. ఇది కేవలం షాజహాను–ముంతాజులు మధ్య ఉండే ప్రేమానురాగాలే కాదు, ప్రతీ భార్యా భర్తా మధ్య ఉండవలసిన అనురాగబంధం తెలిసేలా వర్ణించాడు. బాపూజీ(1948):సమాజం శాంతియుతంగా ఉండాలనీ, శాంతి అహింసలను నమ్మిన జాషువా ఆ సిద్ధాంతాలను ప్రచారం చేసిన గాంధీజీ పట్ల అచెంచల మైన అభిమానాన్ని ప్రదర్శించాడు. గాంధీజీని 'మహర్షి' అని సంబోధిస్తూ ఈ కావ్యాన్ని 'బాపూజీ' అనే పేరుతో పొట్టిశ్రీరాములు, టంగుటూరి ప్రకాశం పంతులు మొదలైన నాయకుల సేవలను ప్రస్తుతించారు. ఆంధ్రాభిమానం కనిపిస్తుంది. 'కొత్తలోకము'లో కవి అంత: బహిసంఘర్షణ కనిపిస్తుంది. జాషువాని చాలామంది హేతువాదిగా, నాస్తికునిగా వర్ణించినా ఈ కావ్యాన్ని బట్టి ఆస్తికుడుగానే గుర్తించగలుగుతాం.

"ఉన్నావో లేవోయని
తన్నుకొనుట కన్న నభ్రతలమున నెందో
యున్నావనుకొనుటే నా
కన్నిట శుభమని తలంతు నద్భుత చరితా"(కొత్తలోకము–జాషువా)

'ముసాఫరులు' తాత్త్వికభావాలకు సంబంధించిన కావ్యం. 'ముసాఫిర్' అనే ఉర్దూ భాషాపదానికి 'ప్రయాణికుడు' అని అర్థం. మానవపరిణామ సారాంశాన్ని ఈ కావ్యంలో వర్ణించాడు కవి.

జాషువాకు పేరు ప్రఖ్యాతులు తెచ్చిన వాటిలో 'భరతమాత' 'గిజిగాడు', 'సాలీడు', రాజరాజు, శ్మశానవాటిక, శిశువు, తెలుగు తల్లి, భారతవీరుడు, లైకా, వీరచానమ్మ మొదలైన ఖండికలు చెప్పుకోదగినవి.

గబ్బిలం (1941, 1946) :

జాషువా రాసిన మరో గొప్పకావ్యం గబ్బిలం. గుంటూరు జిల్లా బోర్డుప్రెసిడెంటు కల్లూరి చంద్రమౌళి చౌదరిగారికి అంకితం ఇచ్చారు. గబ్బిలం రచనకు జాషువా బాల్య జీవిత నేపథ్యం కూడా ఉపకరించిందని పరిశోధకులు వ్యాఖ్యానించారు. దళితుడైన అరుంధతీసుతుడ్ని కావ్యనాయకుడిగా చేసుకున్నాడు కవి.

హిందూమతం వల్ల దళితులు పడుతున్న జీవనవేదననంతా పలికిస్తూనే, తన దేశభక్తిని కూడా ప్రటించిన కావ్యమిది. "గబ్బిలం" రెండు భాగాలు రాశారు. మొదటి భాగంలో సుమారు 117 పద్యాలు, రెండవ భాగంలో 142 – మొత్తం 259 పద్యాలున్న గబ్బిలాన్ని లఘుప్రబంధమనీ, ప్రతీక కావ్యమ ప్రముఖ విమర్శకుడు కరెవరపు వెంకట్రామయ్య అభిప్రాయపడ్డారు. గబ్బిలం మొదటి భాగాన్ని 1941 లోను, రెండవ భాగాన్ని 1946 లోను ప్రచురించారు. కాళిదాసు మేఘసందేశంలో ఒక భగ్నప్రేమికుడి ఇతివృత్తాంతాన్ని వర్ణిస్తూ, భారతదేశ ఔన్నత్యాన్ని వివరించాడు. జాషువా గబ్బిలం కావ్యంలో ఒక అరుంధతీసుతుని అశ్రు సందేశాన్ని ఈశ్వరునికి నివేదించే నెపంతో భారతదేశ ఔన్నత్యాన్ని వర్ణిస్తూనే, దళితుల బాధలను వినిపించాడు.

"చిక్కిన కాసుచేదనివి జెందునమాయకుడెల్ల కష్టముల్
బొక్కెడు బువ్వతో మరచిపోవు క్షుధానల దగ్ధమూర్తి న
ల్దిక్కులుగల్గు లోకమున దిక్కరియున్న యరుంధతీ సుతుం
డొక్కడు జన్మమెత్తె భరతోర్వరకుం గడగొట్టు బిడ్డడై" (గబ్బిలం) అని ఒక అరుంధతీసుతుని జీవితగాథను కేంద్రంగా చేసుకొని ఈ కావ్యాన్ని వర్ణించాడు కవి. దళితుని జీవితగాథను శివునికి నివేదించడానికి గబ్బిలాన్ని సందేశహారిణిగా ఎన్నుకున్నాడు కవి. తన ఇంటికి ఒక అర్ధరాత్రి వచ్చిన గబ్బిలంతో అరుంధతీసుతుడు మాట్లాడుతూ " సమస్త దేవతా సన్నిధిని" ప్రసాదాన్ని ఆరగించగలిగే పుణ్యాత్మురాలువై ఉండి కూడా అంటరానివాడు నివసించే "నిషిద్ధగేహా"నికి వచ్చావేమిటని అడుగుతాడు. గబ్బిలం– పక్షికాదు, జంతువూ కాదు. అయినప్పటికీ అది ఎక్కడికైనా తిరగగలిగే అవకాశం ఉంది. కానీ, మానవుడైన దళితుడికి అనేక నిర్బంధాలు, నిషేధాలు ఉన్నాయని స్ఫురింపజేయడం జాషువా లక్ష్యం ఆ వర్ణనలో కనిపిస్తుంది. అతడిని సమాజం ఎలా చూస్తుందో వివరిస్తూ...

"ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి
యినుపగజ్జల తల్లి జీవనము సేయు
గసరి బుసకొట్టు నాతని గాలిసోక
నాల్గు పడగల హైందవ నాగరాజు" (గబ్బిలం) అని వర్ణించాడు కవి. చాతుర్వర్ణ్య వ్యవస్థ కులంగా పరిణమించిన తర్వాత పంచమవర్ణం సృష్టించబడింది. ఈ పంచములే అంటరానివాళ్ళయ్యారు. హిందూసమాజంలో నాలుగు వర్ణాలను నాలుగు పడగలతో పోలుస్తూ దళితుడిపై విషం కక్కుతున్న స్థితిని వర్ణించాడు. కర్మసిద్ధాంతంతో దళితుని నోరు కట్టేస్తున్నారనీ, పూజారులు లేనిసమయం చూపి తన కథను శివునికి వినిపించమని కోరుతాడు. రఘునాథనాయకుడు, కృష్ణదేవరాయులు, చేమకూర వేంకటకవి, ముద్దుపళని, క్షేత్రయ్య ల సాహితీ కృషిని గుర్తుచేస్తాడు. తంజావూరులోని సరస్వతీమహలుని దర్శించమంటాడు. మహాభారతాన్ని తెలుగు చేసిన తిక్కన నివాసమైన నెల్లూరుని చూసి పొమ్మంటాడు. అలాగే పల్నాటి పౌరుషానికి ప్రతీకగా చెప్పుకొనే కారంపూడినీ, అనేక కృతులు అందుకొన్న స్థలం కొండవీటినీ, ఆశు ధారగా పద్యాలు చెప్పిన వేమననూ గుర్తుచేస్తాడు. విద్వత్సభారంజితమైన రాజమహేంద్రవరాన్నీ, నన్నయనూ, సారంగధరుణ్ణీ గుర్తుచేస్తాడు. అలాగే తెలుగులో గొప్పకవులుగా విరాజిల్లిన శ్రీనాథుడు మరికొంతమంది కవులను తలచుకుంటాడు. తర్వాత ఉత్తరభారతదేశంలో కాశీపురాన్నీ, ఢిల్లీ తదితరప్రాంతాలను ప్రశంసిస్తాడు. రెండవభాగంలో గాంధీజీని ప్రశంసించాడు కవి.

" నిమ్న జాతుల కన్నీటి నీరదములు
పిడుగులై దేశమును గాల్చి వేయుననుచు
రాట్నమును దుద్దుగణ్ణకరాన బూని
దెసల దోతెంచె గుజరాతు ముసలిసెట్టి" (గబ్బిలం, రెండవభాగం) అలాగే అంబేద్కర్ ని కూడా వర్ణించాడు కవి.

"కలడంబేద్కరు నా సహోదరుడు మాకై యష్ట కష్టాలకుం
బలియై సీమకు వోయి క్రమ్మరిన విద్వాంసుండు వైస్రాయి మే
ల్కొలువందంగల దొడ్డవాడతడు నీకున్ స్వాగతంబిచ్చి పూ
వుల పూజల్ వొనరించెనే యతని మెప్పుల్ నీ జయారంభముల్ (గబ్బిలం, రెండవభాగం) ఇక్కడ జాషువానెలా అర్థం చేసుకోవాలనే విషయంలో కొంత సందిగ్ధత ఉంటుంది. ఎందుకంటే, గాంధీజీ స్వాతంత్ర్యరథసారథిగా అన్ని వర్గాలను కలుపుకుపోయేదిశగా కాంగ్రెసుపార్టీకి నాయకత్వం వహించాడు. అంబేద్కర్ దళితుల సమస్యలు పరిష్కారం కావడం ప్రథమకర్తవ్యంగా భావించాడు. గాంధీజీ – అంబేద్కర్ ఇద్దరూ భారతదేశానికి స్వాతంత్ర్యం రావడంలో మార్గాలు వేరైనా లక్ష్యాలు ఒకటే. ఇరువురూ దేశభక్తులే. అందుకే గాంధీజీ ప్రతిపాదించి సంస్కరణోద్యమాన్ని ఆహ్వానిస్తూనే, తమ సమస్యల్ని గుర్తించిపోరాడిన అంబేద్కర్ నీ జాషువా ప్రశంసించాడు. అయినంత మాత్రం చేత ఒకరిని నిరాదరించాల్సిన పనిలేదుకదా. అందుకే ఇరువురినీ గౌరవించాడు కవి. గబ్బిలం కావ్యం వస్తుపరంగాను, కావ్యనాయకుడి తీసుకోవడంలోను, దాన్ని వర్ణించడంలోను ఉత్తమప్రమాణాలే కాకుండా కావ్యప్రపంచంలో కొత్తమార్గానికి దారులు తీసిన కావ్యంగా గుర్తింపుపొందింది.

కాందిశీకుడు(1943):

జాషువా రాసిన మరొక ఖండకావ్యం కాందిశీకుడు(1943). కథ కల్పితం. దీన్ని కవి ఇలా సమర్థించుకున్నారు. " కేవల కల్పనా కథలు కృత్రిమరత్నములు అని భట్టుమూర్తి సిద్ధాంతము కాని, కాలపరిణామము ననుసరించి కవి నావేశించిన సత్యమును వ్యక్తీకరించుటకతడెన్నియో పథకములను సృష్టించుకొనును అవి హృదయంగములై రసోత్పత్తిని గల్గింపజాలినచో, కల్పితాకల్పిత కథా వివక్షకు తావులదని నా యభిప్రాయము" ఒక బర్మా కాందిశీకుడు ప్రాణభీతితో పరుగెట్టుకొచ్చి నల్లమల అడవుల్లో సంచరిస్తుంటాడు. ఆ సమయంలో కాలుకి ఒక మానవపుర్రె తగులుతుంది. కాందిశీకుడుతో ఆ పుర్రె సంభాషిస్తుంది. కొంతమంది వల్ల నిరపరాధులైన సామాన్యమానవులు యుద్ధం వల్ల చనిపోవడం మంచిదికాదని శాంతి, అహింసల గొప్పతనాన్ని విశదీకరించే దిశగా ఈ కావ్యాన్ని వర్ణించాడు కవి. మతవైషమ్యాలను పోగొట్టి, బుద్ధుడు నడయాడిన శాంతినీ, ధర్మాన్నీ పాటించాలనే సందేశాన్ని అందిస్తుందీ కావ్యం. ఈ కావ్యంలో రెండవ ప్రపంచయుద్ధంకాలం నాటి ప్రజల ఆలోచనలను ప్రతిబింబించేలా వర్ణించాడు కవి. సమకాలీన విషయాలను తీసుకొని

కల్పిత కావ్యంగా రాయడం కూడా అవసరమనే ఆలోచన కవిలో కలగడానికి కవికి సామాజిక స్పృహ ఉండాలనే ఆలోచన జాషువాలో కూడా ఉందని కాందిశీకుడు కావ్యం నిదర్శనంగా నిలుస్తుంది.

స్వయంవరం (1950):

తాను నమ్మిన గాంధేయవాదం తన కళ్ళముందే ఆచరణలో వైఫల్యం చెందడాన్ని గమనించిన జాషువా రాసిన కావ్యం 'స్వయంవరం'. దీనిలో వదువు 'స్వరాజ్యం', పెండ్లికొడుకులు ప్రజలు. గాంధీజీ సత్యాగ్రహం అనే యజ్ఞంలో స్వరాజ్య బాల జన్మించి, పెండ్లికెదుగుతుంది. పెళ్ళిచేసుకొనే వరుల కోసం స్వయంవరం ప్రకటిస్తారు. నీతిమంతులు, అవినీతిమంతులు అంతా స్వయంవరానికి హాజరవుతారు. వాళ్ళని చూసి స్వరాజ్య కన్యయేడుస్తూ పారిపోతుంది. అనుకూలమైన వరుడుకోసం అన్వేషిస్తూ దేశాటన చేస్తూ, చివరికి మంచుకొండల దగ్గరకి చేరుతుంది. ఒకపల్లెలో నివసిస్తుంది. కలలో మహాత్ముడు కనిపించి ఉపదేశం చేస్తాడు. ఒక యువకుణ్ని వివాహమాడి స్వరాజ్యం రాజ్యమేలుకుంటుంది. దేశంలో శాంతి నెలకొని, స్వరాజ్యం యొక్క నిజమైన ఫలితాలను ప్రజలు అనుభవిస్తారు. ఈ కావ్యాన్ని కవి బాల్యం, స్వయంవరం, దేశాటనం, హిమగిరియాత్ర అనే నాలుగు విభాగాలుగా వర్ణించాడు. గాంధీజీ కలలు కన్న రామరాజ్యాన్ని స్వయంవరంలో కవి దర్శించాడు. భారతదేశం అలా సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించాడు. జాషువా జీవితంలో అనేక కుల, మత పరమైన సంఘర్షణలు ఎదురైనప్పటికీ, వాటిని దాటుకుంటూ విశ్వమానవుడిగా ఎదిగడమెలాగో ఆయన జీవితం, సాహిత్యం ప్రతిబింబంగా నిలుస్తుంది. జాషువా 1971 జూలై 24వ తేదీన మరణించారు. ఆయన్ని మొదట వ్యతిరేకించినా, చివరికి క్రైస్తవమతాచారం ప్రకారమే సమాధి చేశారని అమూల్యశ్రీ పేర్కొన్నారు. కానీ, జాషువా మరణించినప్పుడు ప్రత్యక్షంగా చూసిన వాళ్ళ కథనం భిన్నంగా ఉంది. క్రైస్తవ మతాచారాల ప్రకారమే సమాధి చేశారని ఆ సన్నివేశాలను చూసిన ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి వివరించారు. హిందూ పురాణేతి హాసాల్లోని వస్తువుల్ని తీసుకొని రచనలు చేస్తున్నందుకు క్రైస్తవ వర్గానికి చెందిన వారి నుండి సంఘర్షణలు ఎదుర్కోవలసి వచ్చింది.ఆ విషయాన్ని ఆయనే ఇలా వర్ణించారు.

"అందరము పుట్టుపాపులమని యహేతు
కమ్ముగా భయభీజములు నాటి కలత బెట్టి
బ్రతుకు మతబోధకుల యనుగ్రహము తప్పి
సంఘ బాహ్యుండనైతి క్రైస్తవుల యందు"ఆయనే మరో సందర్భంలో

"మత పిచ్చిగాని, వర్ణో
న్నతిగాని స్వార్థ చింతనము గాని నా
కృతులందుండదు" అని చెప్పుకున్నాడు. కనుక, ఆయన కులాన్నీ, మతాన్నీ వెనకేసుకొచ్చేరచనలు చేశారనుకోలేం.

"ఎంత కోయిల పాట వృథయయ్యెనో కదా
చిక్కు చీకటి వనసీమలందు
ఎన్ని వెన్నెల వాగు లింకిపోయెనొ కదా
కటిక కొండలమీద మిటకరించి
ఎన్ని కస్తురి జింకలీడేరెనో కదా
మురికి తెన్నెల మీద పరిమళించి
ఎన్ని ముత్తెపురాలు భిన్నమయ్యెనొ కదా
పండిన వెదురు జొంపములలోన
ఎంత గంధవహనమెంత తంగేటి జున్ను
యెంత రత్నకాంతి యెంత శాంతి
ప్రకృతి గర్భమందు భగ్నమైపోయెనో కదా
పుట్టరానిచోట పుట్టుకతన" (గుర్రం జాషువ, గబ్బిలం)

అని ఒకప్పుడు వాపోయిన జాషువాని నేడు ప్రతివాళ్ళూ తమవాడుగా చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. జాషువాలో క్రైస్తవం మానవతావాదాన్ని, జీవితానుభవాలు హేతువాదభావాల్ని, కుటుంబజీవనం సహనాన్ని, దేశపరిస్థితులు దేశభక్తినీ పలికించగలిగాయి. తన మూలాల్ని మరచిపోకుండానే తన జాతిబాధల్ని, గాథల్ని వర్ణిస్తూనే వాటిలో రావలసిన సంస్కరణల్ని కోరుకోవడం వల్లనే గాంధీజీని ప్రేమించగలిగాడు. వాస్తవికసామాజిక జీవితానుభవాలతో అంబేద్కర్‌ని హృదయానికి హత్తుకోగలిగాడు. మొదటి భాగంలో స్వాతంత్ర్యానికి పూర్వమున్న దళితుని పరిస్థితి విన్నవించేదిశగా వర్ణిస్తే, రెండవభాగంలో రెండు ప్రపంచయుద్ధాల తర్వాత, స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీపాత్రను ప్రశంసించినా, సమాజంలో ప్రభలిపోయిన కుల, మతాల పరిస్థితికి ఆందోళన చెందటం కనిపిస్తుంది.

జాషువా జీవితం వడగాల్పులనీ, వెన్నెలనీ చూడగలిగింది. తన రచనలకు మొదట్లో తగిన గుర్తింపరాకపోయినా, కవిత్వం చదివేటప్పుడు కులం వల్ల అవమానాల పాలైనా, తర్వాత కాలంలో కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారంతో పాటు, విధానమండలి సభ్యుడిగా కూడా గౌరవింపబడ్డాడు. జాషువా జీవించిన కాలంతో పాటు, అనంతరకాలంలోను ఆయన రచనలకు విశేషమైన ఖ్యాతి లభిస్తూనే ఉంది. దీనంతటికీ కవిత్వంలో బిగి ఉండటం, సామాజికవాస్తవిక అనుభవాల్ని కళాత్మకంగా వర్ణించడం, సమాజాన్ని సకారాత్మక దృష్టితో చూడగలగడం వంటి అనేకకారణాల్ని చెప్పుకోవచ్చు. సంప్రదాయబద్ధమైన ఛందోబద్ధరీతిలో పద్యరచన కొనసాగించినా భాష సరళంగా ఉంటుంది. తీసుకొనే ఇతివృత్తం సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తుంది. సంప్రదాయ – ఆధునిక సాహిత్యానికి వారధిగా కనిపిస్తాడు. భావంలో, భాషలో, భావుకతలో, దాన్ని కావ్యంగా తీర్చిదిద్దడంలో ఆధునిక తెలుగు కవిత్వాన్ని నవ్యమార్గం వైపు పయనించినందుకుగాను జాషువాను నవయుగకవిచక్రవర్తిగా అభివర్ణించడం అతిశయోక్తికాబోదు.

"రాజుమరణించెనొకతార రాలిపోయె
కవియు మరణించె నొకతార గగనమేగె
రాజు జీవించు ఱాతి విగ్రహములందు
సుకవి జీవించు ప్రజల నాలుకల యుందు" అని జాషువా గారే ఒకచోట వర్ణించినట్లు ప్రజల నాలుకలపై ఆయన పద్యాలు నాట్యం చేస్తున్నాయి. అందువల్ల ఆయన గురించి ఎంత చెప్పినా ఇంకా తక్కువే అనిపిస్తుంటుంది.

❖❖❖❖❖

నూతన విద్యా విధానం, 2020 : ఉన్నత విద్యలో రాబోవు పరిణామాలు



- ఆచార్య కె.పి.సుబ్బారావు
Emeritus Fellow (UGC),
Dept of Education, Andhra University

నూతన విద్యా విధానం, 2020 ఉన్నత విద్య (Higher Education) కు సంబంధించి నాల్గు అంశాలపై కొన్ని సిఫార్సులు చేసింది. అవి : ప్రవేశం (Access) సర్వసమానత (Equity) అందుబాటు (Affordability) జవాబు దారీ తనం (Accountability) దేశమంతా ఒకే ఉన్నత విద్యావ్యవస్థను (Unified Education System) అందిస్తుందనీ, అది భారతీయత (Nation-oriented) కూడిన విచలితమైన, నాణ్యమైన, చైతన్యమైన జ్ఞానాన్ని అందించడమే నూతన విధాన లక్ష్యమని కూడా చెబుతూంది. ఉన్నత విద్యలో 2035 సంవత్సరానికల్లా స్థూలనమోదు రేటు (GER) 50 శాతం వరకూ పెంచాలని నూతన విద్యా విధానం సూచించింది. ప్రస్తుతం అది 20.8 శాతమున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించినా 15 శాతానికి మించి ఉండదనేది వాస్తవం. ఉన్నత విద్య అంటే నియత, దూర / సార్వత్రిక విద్యతో బాటు ఈ మధ్య ప్రారంభమైన మాస్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సులు (MOOCs) లతో కలిపి స్థూల నమోదురేటును లెక్కిస్తారట. కేంద్ర, రాష్ట్ర విద్యాసంస్థలలో సగటు ప్రవేశాలు పెరుగుతాయని చెబుతూనే మరో ప్రక్క ప్రయివేట్ సంస్థలను ప్రోత్సాహిస్తుందట. పేరుకు వ్యాపారీకరణను అదుపులో ఉంచుతానంటుందిగాని ప్రయివేటీకరణను రద్దుచేస్తున్నట్లు ఎక్కడా ప్రకటించలేదు.

ఉన్నత విద్యకు సంబంధించి విశ్వవిద్యాలయాలను A.B.C అనే మూడు రకాలుగా విభజించింది. అవి. A – బోధన – పరిశోదనల కేంద్రంగా పని జేసే విశ్వవిద్యాలయాలు, B – కేవలం పరిశోదనకే పరిమితమైన విశ్వవిద్యాలయాలు ఇక C – స్వయంప్రత్తిగల కళాశాలలు, ఆయా రాష్ట్రాలు వారికి కావలసిన ఏ రకమైన విశ్వవిద్యాలయాలను గాని, కళాశాలలను గాని ఎంచుకొనే స్వేచ్ఛ ఉంది. అలాగే 2030 సంవత్సరం తర్వాత అనుబంధ కళాశాలు (Affiliated Colleges) ఉండకూడదు. అంతే గాదు స్వయంప్రత్తి కళాశాలలన్నీ ఉత్తరోత్తర విశ్వవిద్యాలయాలుగా మారిపోవాలి. లేదా గుంపు (Cluster) కళాశాలలుగా పనిజేయాలి. కళాశాలలు మూడు రకాల యాజమాన్యాలలో నడుపుకొన వచ్చు. ఒకటి ప్రభుత్వ క్రింద పనిజేసే కళాశాలలు, రెండు ప్రయివేట్ యాజమాన్య క్రింద పనిజేసే కళాశాలలు, మూడు దాతృత్వ సంస్థలు నడిపే కళాశాలలు. మరొక ప్రత్యేక రకం ప్రభుత్వ – ప్రయివేట్ మేళవింపు Public - Private - Participation, (PPP). ఆఖరిది ఉదారవాద ఆర్థిక విధానానికి పుట్టిన బిడ్డ. ఇందులో ప్రభుత్వ వాటా తక్కువగాను ప్రైవేట్ షేరు (49:51) గాను ఉంటుందట. దీనర్థం రాను రాను ఉన్నత విద్యను ప్రయివేటీకరించడమే నూతన విద్యా విధానం లక్ష్యం.

సర్వ సమానత తీసుకొని రావడానికి ప్రస్తుతం నడుస్తున్న 800 విశ్వవిద్యాలయాలు 40,000 కళాశాలలను గంప గుత్తుగా 1500 అత్యుత్తమ విద్యా సంస్థలుగా రూపాంతరంచెందుతాయట వీటిలో బహుళ విభాగాలు (Multi-disciplinary) లెక్కలేనన్ని కోర్సులను గుణాత్మక విద్యను అందిస్తాయట. మిషన్ నలందా, మిషన్ తక్షశిల పేరిట కొన్ని ప్రత్యేక విశ్వవిద్యాలయాలను స్థాపించి ఇతర దేశాలను విద్యార్థులను ఆకర్షించడం ద్వారా భారతదేశ విద్యను అంతర్జాతీయ విద్య (Internationalization)గా మార్చుతుందట. దీనికోసం ప్రతీ విశ్వవిద్యాలయంలో 'సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్‌ను ప్రారంభించాలని ముసాయిదా సిఫార్సు చేసింది. అంతేగాదు ఆయా సంస్థలలో విద్యార్థి – ఉపాధ్యాయ నిష్పత్తి 30:1గా ఉంటుందట. ఇక అధ్యాపకులను కాంట్రాక్టు పద్ధతిలో పనిజేసే విధానాన్ని రద్దు చేస్తూందని కూడా ప్రకటించింది. ఆ పనిజేస్తే మంచిదే. శాశ్వత కాల పద్దతిలో అధ్యాపకులను నియమించడమనేది విద్యలో నాణ్యతను పెంచడానికొక ముఖ్యమైన కారకమౌతుంది. కనీవినీ ఎరుగని దొకటుంది. అదే విశ్వవిద్యాలయాల విరాళాల సంస్థ (UGC) ని విశ్వవిద్యాలయాలు కౌన్సిల్‌గా పేరుమార్చి ఆ కౌన్సిల్‌లో విద్యావేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులతోబాటు రాజకీయ నాయకుల కూడా చోటుంటుంది. దీని పరమార్థం అధికారంలో ఉన్న బి.జె.పి పార్టీకి చెందిన వారు అంటే ఆర్.యస్.యస్ సంఘపరివార్ నేపథ్యమున్నవారే ఉంటారు. వీరు ఉన్నత విద్యలో కాషాయీకరణకు అడ్డంకులు లేకుండా చేస్తారన్నమాట.

ఇక ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావడమంటే అది డిగ్రీ విద్యతోనే మొదలవ్వాలి. అందుకు గాను ఇక డిగ్రీ (Under graduate) కోర్సు నాల్గు సంవత్సరాలు చదవాల్సి ఉంటుంది. మరొక సంవత్సరం అదనంగా చదవితే ఆనర్స్ (honours) డిగ్రీ వస్తుంది. దీనినే సరళీకృత (Intagrated) డిగ్రీగా నామకరణం చేయబడుతుంది. మరొక విషయమేమిటంటే ఆ నాల్గు సంవత్సరాల డిగ్రీని రెండు రకాలుగా విభజించింది. ఒకటి Bachelor of College Arts, రెండు, Bachelor of Liberal Education. ఇందులో మరొక సదుపాయముంది. డిగ్రీ కోర్సులో మల్టీ ఎంట్రి, మల్టీ ఎగ్జిట్ ఉంటాయి. విద్యార్థి ఎప్పుడైనా తనకిష్టమొచ్చినప్పుడు చదువు ఆపివేయవచ్చు లేదా కొనసాగించవచ్చు మరో సదుపాయం దీని వలన కలిగేది ఒక సంవత్సరం చదివి మానివేస్తే డిప్లొమా, రెండు సంవత్సరాలు చదివితే ఎడ్వాన్స్‌డ్ డిప్లొమాగా పరిగణించబడుతుంది. డిగ్రీ కోర్సును ఐదు సంవత్సరాలు కొనసాగిస్తే మాస్టర్ డిగ్రీ వస్తుంది. అయితే డిగ్రీ ఆనర్స్ కోర్సుతో స్నాతకోత్సవ డిగ్రీ అంటే పి.హెచ్.డిలో చేరవచ్చు. ఈ విధంగా బహుళసార్థక ప్రాజెక్టులా డిగ్రీ కోర్సును చిన్నాభిన్నం చేయడం జరుగుతుంది. ఇప్పటి వరకు వున్న 10+2+3 పద్ధతి (Pattern) స్థానంలో 5+3+3+4గా మార్చుతుంది. ఈ కొత్త డిజైన్ వలన 2010లో వచ్చిన విద్యహక్కు చట్టాన్ని 18 సంవత్సరాలు నిండిన బాల బాలికకు పొడిగించడం హర్షదాయకం. అదే

సందర్భంలో వ్యాపారీకరణకు, ఆత్మ హత్యలకు నిలవాలమైన "ఇంటర్మీడియట్" విద్య రద్దుచేసే సూచన కూడా సరియైనదే. విద్యా చట్టాన్ని సవరణ జేసి పాఠశాల విద్యానంతరం వరకు ఆర్థిక వెసులు బాటు యిస్తే చాలామంది వెనుకబడిన కులాల, వర్గాల విద్యార్థులకు తదనంతర ఉన్నత విద్య అందుబాటులోకి వస్తుంది.

వ్యవస్థాగతంగా చూస్తే కేంద్రప్రభుత్వం విద్యను కేంద్రీకరించాలని చూస్తూంది. దీనికి సాక్ష్యం కేంద్రనాయకత్వంలో ప్రారంభించే 'రాష్ట్రీయ శిక్షా అయోగ్', ఇది ప్రధానమంత్రి నేతృత్వంలో నడుస్తుంది. ప్రధాన మంత్రి చైర్మన్‌గా, వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు సభ్యులుగా ఉంటారు. భారతదేశ విద్యా వ్యవస్థను రాష్ట్రీయ శిక్షా అయోగ్ నడిపిస్తుంది. పేరుకుమాత్రం కేంద్ర విద్యాశాఖ, దానికో మంత్రిత్వశాఖ ఉన్నప్పటికి రాష్ట్రీయ శిక్షా అయోగ్ కనుసన్నలలో అవి పనిజేయాల్సి ఉంటుందని ముసాయిదా చెబుతూంది. ఇది రెండు రకాల అనర్థాలకు దారి తీస్తుంది. ఒకటి, దేశ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం రెండవది, విద్య భారత రాజ్యాంగంలో "ఉభయ (Concurrent) జాబితాలో ఉంచడం వలన రాష్ట్రాలకు కొంత సానుకూలత ఉంటుంది. అదికాస్తా అపహరింపబడుతుంది. ఇక పై రాష్ట్రాలు కేంద్ర చెప్పుచేతల్లోకి వెళ్లిపోతాయి. దానివలన రాజ్యాంగంలో పొందుపరచబడిన అనేక నిబంధనలు వాటి ద్వారా ఎంతో కొంత సామాజిక న్యాయం పొందుతున్న దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, పేద వర్గాలు, స్త్రీలు వాటికి దూరమైపోతారు. విచిత్రమేమిటంటే ఈ విధానంలో సామాజిక న్యాయం గురించి గాని, రిజిర్వేషన్ల గురించి గాని, స్త్రీ విద్య గురించి గాని ఒక మాట కూడా మాట్లాడలేదు. జాతీయత పేరుతో రాష్ట్రాల హక్కులను హరించి వేసే ప్రమాదముంది.

ఈ విద్యా విధానం ఎక్కువగా 'వృత్తి విద్య' గురించి నొక్కిచెబుతుంది. పాఠశాల విద్య నుండి విశ్వవిద్యాలయాలవరకూ వృత్తి విద్యను ప్రోత్సహించాలని సిఫార్సు చేసింది, కొఠారి కమిషన్ విద్యను వృత్తి పరం చేయమంది గాని వృత్తినే విద్యగా మార్చ మనలేదు. మనదేశంలో వృత్తి విద్య అంటే కుల వృత్తులే గుర్తుకు వస్తాయి. ఎందుకంటే మన సమాజం ప్రాథమికంగా కుల సమాజమే. గాంధీ, కృష్ణమాచారి ప్రవేశపెట్టిన విద్యా విధానాలు ఘోరంగా విఫలమయ్యాయి. ఉన్నత కుటుంబాల నుండి వచ్చిన పిల్లలు కంప్యూటర్, మేనేజ్‌మెంట్, టెక్నాలజీ, రోబోసైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ నానోటెక్నాలజీ లాంటి కోర్సులు చదువుతుంటే దిగువ కులాల వారి పిల్లలు టీచింగ్, గుమస్తా, కొంచెం మెరుగైన గ్రూప్ – I,II కోర్సులతో సరిపెట్టుకుంటున్నారు. ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం లేనిదే పెళ్ళి పెటాకులు లేకుండాబోతున్నాయి. దీనికి ప్రభుత్వం చూపే పరిష్కారం ఉద్యోగ వయసుపరిమితిని (46 సం။లు)కు పెంచడమే. నిరుద్యోగంపై సరియైన విధానాన్ని అటు రాష్ట్ర ప్రభుత్వాలుగాని, కేంద్రప్రభుత్వంగాని తయారు చేయడం లేదు. లక్షలాది అర్హతగల విద్యా వంతులను గాలికి వదిలేస్తుంది. అభివృద్ధి పేరిట కంపెనీలు పెడుతున్నాం, విదేశీ పెట్టుబడులు ముమ్మరంగా దేశానికొస్తాయనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని ఆశజూపుతున్నారు. ఇది బండికి ముందు పచ్చగడ్డి కట్టి గుఱ్ఱాన్ని దౌడు తీయించడంలాంటిది.

విద్యావిధానాన్ని, ఆర్థిక విధానంతో ముడి పెట్టకపోతే వచ్చే సంక్షోభమిది. విద్యను ఉత్పత్తికి లంకెవేయకుండా గాలిలో వేలాడే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై ఆదారపడాలని చూస్తున్నారు. "పని –విద్య (Work and Education) సమ్మేళనమే చదువుగా కొనసాగాలి. పనిలేని విద్య నిరార్థకమన్నాడు" అంబేడ్కర్. భౌతిక ఉత్పత్తి ప్రక్రియకు అనుసంధానంగా విద్యవిధానముండాలి.

21వ శతాబ్దం వైజ్ఞానికంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందుతుందనేది వాస్తం. అంతరిక్షంలోకి లెక్కలేనన్ని ఉపగ్రహాలు పంపించడమూ నిజమే కాని మానవుడి ఆలోచనలు మూఢనమ్మకాలు, కులం, మతం బావాలతో మధ్య యుగాలలోకి జారుకుంటున్నాడు. మానవ విలువలు కంటే మార్కెట్టు పై ఆధారపడే ఆర్థిక విధానాలున్నంతవరకూ విద్యవిధానం ఎంతగొప్పదైనా నిరర్థకమే.

రాబోయే నూతన విద్యావిధానం కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాల మధ్య గీతను చెరిపే ప్రయత్నం చేస్తుంది. విద్యా రంగంలో రాష్ట్రాల నిర్ణయాలకు ఏవిధమైన విలువుండదు. ఇది మోడీ మార్కు విద్యావిధాన మౌతుంది. ఒకే దేశం, ఒకే జాతి, ఒకే భాషంటూ 'హిందీ'ని అన్ని రాష్ట్రాలపై రుద్ధాలని ప్రయత్నంచేసింది ముసాయిదా. తమిళనాట వ్యతిరేకం వచ్చిన వెంటనే రాజకీయంగా సవరణకు ఒప్పుకుంది. మరో ప్రక్క రాజ్యాంగం గుర్తించిన 22 భాషలను అభివృద్ధి చేస్తానంటూ దొడ్డిదారిని హిందీ లేక సంస్కృతాన్ని రాష్ట్రాలపై రుద్దాలని చూస్తుంది. దీని వ్యతిరేకంగా దక్షిణ ప్రాంత రాష్ట్రాలు పోరాడాలి. దక్షిణ ప్రాంతాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యావిధానంలో తగిన మార్పులు చేయాని డిమాండ్ చేయాలి. అలాచేయకపోతే ఉత్తర భారతదేశమే అధికారం చెలాయిస్తుంది. దక్షిణ భారతదేశం బానిసగా మిగిలిపోతుంది. ప్రాంతీయ జ్ఞానానికి చోటుంటుందని ముసాయిదా చెప్పినా దాన్ని 'Local wisdom'గా కుండా 'Lok vidya'గా మార్చివేస్తుంది. ఇది సంఘ పరివార్ కుట్ర. విద్యా కాషాయీకరణంలో భాగం. బి.జె.పి ప్రభుత్వం తీసుకు వస్తున్న నూతన విద్యా విధానంలో నూతనత్వమంటూ ఏమీ లేదు సరిగదా హిందూ ధర్మం పేరిట మరోసారి వర్ణాశ్రమ సిద్ధాంతానికి ప్రాణం పోస్తుంది. విద్య పదునైన ఆయుధం. అది రెండు వైపుల పదునున్న కత్తి లాంటిది. అది ఎవరిచేతిలో ఉంటే వారే పైపైకి ఎగబాకగలరు. అందుకే డా.అంబేడ్కర్ ఉన్నత విద్యకు అత్యంత విలువనిచ్చాడు. "నీవు భౌతిక అవసరాలను వదులుకోవచ్చు. నాగరికత గురించి ఆలోచన చేయకపోవచ్చు, గాని ఉన్నత విద్యను పొందే హక్కు నీ కుందని మర్చిపోకు. ఉన్నత విద్యావంతులే ఈ దేశాన్ని మార్చగలరు. వారి ఉన్నత విద్య సమాజ అభివృద్ధికి తోడ్పడాలి అన్నాడు. ఆంటోనీ గ్రాంసీ (ఇటలీకమ్యూనిస్టు, సిద్ధాంత కర్త, నాయకుడు)ని అరెస్టు చేసిన తర్వాత తీర్పు చెబుతూ "అతని మెదడును కనీసం 20 సంవత్సరాలు ఆలోచించకుండా చేయండని మెజిస్ట్రేట్ తీర్పునిచ్చిందట. ఆలోచనలు అంత బలమైనవి విద్యవలన కలిగే భావజాలం అంత శక్తివంతమైంది. అలాంటి విద్యను కాషాయీకరణచేయడం ద్వారా శతాబ్దాల తరబడి అట్టడుగు కులాలకు, వర్గాలకు అందకుండా చేస్తుంది. రాబోయే నూతన విద్యావిధానం, తస్మాత్ జాగ్రత్త!

❖ ❖ ❖ ❖ ❖

దొరకునా ఇటువంటి బాలు!

మధుసూదన్



పనీపాట లేకుండా పాట పుట్టదు. పనితోపాటే పాట పుట్టింది. పనిని మరిచిపోవడానికి పాట పుట్టింది. పనిలో శ్రమను తగ్గించడానికి పాట పుట్టింది. పనిని గుర్తుచేయడానికి పాట పుట్టింది. మాట మాట్లాడలేక మౌనమైనప్పుడు పాట పెదవి విప్పింది. గుండె గొంతుకలో వేదన సుడులు తిరిగితే మౌన రోదనగా పాట పుట్టింది. ఆనందం అర్ణవమైతే మనసుకు రెక్కలొచ్చి పాట పుట్టింది. పుడితే ఉయ్యాల పాటనుండి పోతే మొయ్యాల్సిన పాటదాకా బతుకంతా పాటే.

ఆదికవి వాల్మీకి మహర్షి రామాయణాన్ని తంత్రీవాద్య సమన్వితంగా పాడుకోవడానికి వీలుగా రాసినట్లు స్వయంగా ఆయనే చెప్పుకున్నాడు. ఎలా పాడాలో ఆశ్రమంలో మొదట లవకుశులకే నేర్పాడు. ఆ రామగీతాన్ని తొలిశ్రోతగా తానే విని పరవశించి, తృప్తిగా లవకుశుల ముఖతః లోకానికి వినిపించాడు. వచనం ఎంత గొప్పదయినా గుర్తుపెట్టుకోవడం అంత సులభం కాదు. వచనాన్ని రాగంతో పాడటం చాలా కష్టం. శ్లోకం, పద్యం, పాటలో నియతి ఉంటుంది. రాగం ఉంటుంది. యతిప్రాసలు ఉంటాయి. ఛందో అలంకారాలు ఉంటాయి. రాగం తోడయిన పదం అనురాగమై వెంటపడుతుంది. ఒక తూగులో, లయలో ఆ సాహిత్యం వచనం కంటే పదికాలాలపాటు గుర్తుంటుంది. వచనం కంటే సాంద్రమై నెమరువేతకు సులభమవుతుంది. పాట శ్లోకం, పద్యంగా పరిణమించింది. పాటంటే తెలుగులో సినిమా పాటలే అన్నంతగా వ్యాప్తి పొందింది. ఆ పాటల పూదోటలకు ఘంటసాల ఒక తోటమాలి. శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం మరొక తోటమాలి.

బాలు జీవితకాలం డబ్బు నాలుగేండ్లు. ఇరవై ఏండ్ల వయసులో పాడటం మొదలుపెట్టి నలభై వేల పాటలు పాడాడు. నలభై వేలను యాభైనాలుగేండ్లతో భాగిస్తే సంవత్సరానికి ఏడు వందల నలభై పాటలు. అంటే నెలకు అరవై రెండు పాటలు. సగటున రోజుకు రెండు పాటలు పాడినట్లు. ఒక మనిషికి ఇది సాధ్యమేనా? బాలుకు మాత్రమే సాధ్యం.

అతిపరిచయం వల్ల చెప్పడానికి ఏమీ మిగిలి ఉండదు. అలా బాలసుబ్రహ్మణ్యం గురించి, ఆయన పాటల గురించి తెలియనిదెవరికి? ఇప్పుడు కొత్తగా చెప్పాల్సింది ఏముంది? గొప్పగా పాడాడు. కష్టమయినవి పాడాడు. సులభంగా పాడాడు. సున్నితంగా పాడాడు. సంప్రదాయం ఒడిసిపట్టుకుని పాడాడు. స్పష్టంగా పాడాడు. తెలుగును తెలుగులా పలికాడు. అక్షరాన్ని మింగేయకుండా పాడాడు. ఊపిరి బిగబట్టి పాడాడు.

దిక్కరీన్ద్ర జిత హిమగిరీన్ద్ర సిత
కంధరా నీలకంధరా
క్షుద్రులెరుగని రుద్రవీణ
నిర్నిద్రగానమిది అవధరించరా
విని తరించరా! అన్నాడు.
ఏ దివిలో విరిసిన పారిజాతమో
ఏ కవిలో మెరిసిన ప్రేమ గీతమో
నా మదిలో నీవై నిండిపోయెనే! అన్నాడు.
పారేసుకోవాలనారేసుకున్నావు..
నీ ఎత్తు తెలిపింది కొండగాలీ.. అన్నాడు.

ఎక్కడ మొదలుపెట్టి ఎక్కడ ముగిస్తే బాలు పాటల చరిత్ర పూర్తవుతుంది? తెలుగుపాట అప్పుడు ఘంటసాలను కోరుకుంది. ఆయన పోతూ పోతూ ఆ పాటను బాలు చేతిలో పెట్టి వెళ్లాడు. బాలు పోతూ పోతూ ఆ పాటను ఎవరిచేతిలో పెట్టాలో తెలియక వెళ్లిపోయాడు. అయినా.. 'పిల్లి పిల్లకు పెల్లి చేసి, పెల్లీడు పిల్లకు పెల్లి' చేసే నేటితరం గాయకులకు, శ ష స అన్నవి దేనికవిగా విడి విడి అక్షరాలని తెలియని గాయకులకు, ఉండిపోరాదే అని అనలేక ఉండిప్పోరాదే - గుండెనీదేలే, గుండె కేనన్నే ... అని భాషోచ్చారణ తెలియని పరభాషా పరవశ గాయకులకు తెలుగు చెప్పడం హత్యానేరంతో సమానం.

పాటంటే నిజానికి ఒక పల్లవి. రెండు చరణాలే. కానీ మాటలు చెప్పలేని భావమేదో పాటలు చెప్పాలి. పాటలో ఒక్కొక్క మాట వేనవేల మాటలుగా ప్రతిధ్వనించాలి. ప్రతిపదం భావార్థంగా ప్రతిఫలించాలి. బతుకంతా పాటలతో ప్రతిధ్వనించి, పాటగా ప్రతిఫలించిన బాలు గురించి మాటల్లో చెప్పడం కష్టం. ఆయన పాటలు వినడం సులభం. మనకు పాటల కర్ణామృతాన్ని పంచడానికి ఆయన ఎంత గరళం గొంతులో దాచుకున్నాడో? నిండలేనిదే బొందిపోదు. కరోనా వచ్చింది. భయపడకండి. కోలుకుని వస్తాను- అని వీడియో పెట్టి ఆసుపత్రి మంచం మీద పడుకున్నాడు. ఇక లేవలేదు. లేచాడన్నారు. సైగలు చేశాడన్నారు. పాటలకు

తరువాయి 18వ పేజీలో...

బంగారు బాలు



పండిత పామరుల హృదయాలను రంజింపచేసిన స్వర చక్రవర్తి.. సంగీత ప్రపంచంలో స్వర తరంగం.. సుశ్రుతి శిఖరం.. రూపుకట్టిన స్వరామృతం... 16 భాషలకు ప్రాణమయ్యాడు... నిదురలో కూడా మరవలేని మధురమైన గానమయ్యాడు. 50 వసంతాలుగా అమృతాన్ని పంచుతున్న అతని స్వరపేటిక అక్షరాల అస్వర భారతి కొలువుదీరిన రత్నపీఠిక. ప్రపంచ సంగీతానికే ఆయన స్వరం ఓ వరం. అతనే తెలుగు వారి ఆరాధ్య స్వరం.. వేల పాటలు పాడిన మధుర గాయకుడు బాలు అని పిలవబడే శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం.

సంగీతమే ఊపిరిగా జీవించిన గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం (74) కన్నుమూశాడు. త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో వస్తాడనుకున్న అభిమానులను శోకసంద్రంలో ముంచేసి తిరిగిరాని లోకాలకు బాలు వెళ్లిపోయాడు. ఆయనకు కరోనా పాజిటివ్ అని తేలడంతో ఆగస్టు 5న చెన్నైలోని ఎంజీఎం ఆస్పత్రిలో చేరారు. 50రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్స తీసుకుంటున్న బాలు మృతి చెందాడు. ప్రపంచ సంగీత చరిత్రలో ఇదొక చీకటి రోజు. బాలు మృతితో ఒక శకం ముగిసిపోయింది. ఘంటసాల తర్వాత అంతటి గాయకుడు మళ్లీ బాలునే. బాలు స్థాయిని భర్తీ చేయాలంటే అంత సులువు కాదు. భారతదేశ చలనచిత్ర రంగంలో కేవలం తన గాత్రంతోనే కాకుండా నటనలోనూ ఎనలేని ముద్ర వేసిన బాలు మరణంతో భారతీయ చలనచిత్ర రంగం తన ముద్దు బిడ్డను కోల్పోయింది.

1946 జూన్ 4న నెల్లూరులోని కోనేటమ్మపేట గ్రామంలో జన్మించాడు. ఈయన సాంబమూర్తి, శకుంతలమ్మ దంపతుల రెండో సంతానం. ఇంజనీర్ కావాలని కలలుకని గాయకుడయ్యాడు. తండ్రి హరికథా కళాకారుడు కావడంతో బాలుకు చిన్నప్పటి నుంచే సంగీతం మీద ఆసక్తి ఏర్పడింది. ఎవరి దగ్గరా సంగీతం నేర్చుకోకపోయినా రాగ తాళ జ్ఞానం పుష్కలంగా ఉండడంతో అనేక పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. ఒక ఆర్కెస్ట్రా బృందాన్ని ఏర్పాటు చేసుకుని మిత్రులతో కలిసి ప్రదర్శనలు ఇచ్చేవాడు. మరోవైపు చదువులోనూ చురుగ్గా ఉండేవాడు. తండ్రి కోరిక మేరకు మద్రాసులో ఇంజనీరింగ్ కోర్సులో చేరినా, ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ఉండగానే బాలుకు పాట పాడే అవకాశం వచ్చింది. 1964లో మద్రాస్ సోషల్ అండ్ కల్చరల్ క్లబ్ నిర్వహించిన

లలిత సంగీత పోటీల్లో బాలు ప్రథమ బహుమతి గెలుచు కున్నారు. బాలు పాటను సంగీత దర్శకుడు కోదండపాణి కూడా విన్నారు. బాలు పాడిన విధానాన్ని మెచ్చుకుని సినిమాల్లో పాడే అవకాశం కల్పిస్తానని మాటిచ్చారు. అన్నట్టుగానే అవకాశం ఇచ్చారు.

1966లో పద్మనాభం నిర్మించిన శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న చిత్రంతో నేపథ్య గాయకుడిగా బాలు ప్రస్థానం ప్రారంభమైంది. మొదట్లో ఎక్కువగా తెలుగు, తమిళ చిత్రాల్లో పాటలు పాడే అవకాశాలు వచ్చాయి. చాలా మంది నటులకు వారి హావభావాలకు, నటనా శైలికి అనుగుణంగా పాటలు పాడేవారు. తనకు సినీ గాయకునిగా జీవితాన్ని ప్రసాదించిన కోదండపాణిపై అభిమానంతో తాను నిర్మించిన ఆడియో ల్యాబ్‌కు "కోదండపాణి ఆడియో ల్యాబ్స్" అని అతని పేరే పెట్టుకున్నాడు బాలు. పదాల మాధుర్యాన్ని గమనించి అతను చేసే ఉచ్చారణ అతని పాటను పండిత పామరులకి చేరువచేసింది. శంకరాభరణం, సాగర సంగమం లాంటి తెలుగు చిత్రాలే కాకుండా 'ఏక్ దుజే కేలియే' లాంటి హిందీ చిత్రాలకు బాలు పాడిన పాటలు దేశమంతా ఉర్రూత లూగించాయి. తెలుగు, తమిళమే కాకుండా కన్నడంలోనూ ఆయన పాడిన పాటలకు ఎన్నో జాతీయ పురస్కారాలు లభించాయి. కమల్‌హాసన్‌కు చేతిలో సినిమాలు లేని సమయంలో ఆయన మీద వున్న ప్రేమతో బాలు నిర్మాతగా మారారు. అలా తీసిని 'శుభ సంకల్పం' ఎన్నో అవార్డులను తెచ్చిపెట్టింది. గాన మాధుర్యంతోనే కాదు, నటనతోనూ బాలు ప్రేక్షకులను కట్టిపడేశారు. ఐదు దశాబ్దాలకు పైగా, 16 భాషల్లో 40 వేలకు పైగా పాటలు పాడి గిన్నిస్ రికార్డును సాధించారు. గాయకుడిగా, నటుడిగా, 40సినిమాలకు సంగీత దర్శకుడిగా, నిర్మాతగా, డబ్బింగ్ కళాకారుడిగా బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించాడు.

బాలుకు సావిత్రితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. పల్లవి, ఎస్.పి. చరణ్. కొడుకు ఎస్.పి. చరణ్ కొన్ని సినిమాల్లో పాటలు పాడి, తర్వాత సినీ నిర్మాతగా కూడా మారాడు. బాలు సోదరి ఎస్.పి. శైలజ, ఎస్.పి. వసంత ఇద్దరు కూడా సినీ నేపథ్య గాయనిలే. శైలజ సోదరునితో కలిసి పలు చిత్రాల్లో పాటలు పాడింది. ఈమె నటుడు శుభలేఖ సుధాకర్‌ను వివాహమాడింది.

బాలు డబ్బింగ్ ఆర్టిస్టుగా అనేకమంది కళాకారులకు గాత్రదానం చేశాడు. కె. బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన తమిళ అనువాద చిత్రం మన్మథలీలతో బాలు అనుకోకుండా డబ్బింగ్ ఆర్టిస్టుగా మారి 100కు పైగా సినిమాలకు డబ్బింగ్ చెప్పారు. కమల్‌హాసన్, రజనీకాంత్, సుమన్, సల్మాన్ ఖాన్, విష్ణువర్ధన్, జెమిని గణేశన్, గిరీష్ కర్నాడ్, అర్జున్, నగేశ్, రఘువరన్ లాంటి వాళ్ళకి గాత్రదానం చేసాడు.

1969లో 'పెళ్ళంటే నూరేళ్ళ పంట' అనే చిత్రంలో మొదటిసారి నటుడిగా కనిపించారు. తమిళ 'కేలడి కన్మణి'లో కథానాయకుడి పాత్ర పోషించారు. ఈ సినిమా తెలుగులో 'ఓ పాప లాలీ' పేరుతో అనువాదం అయింది. తర్వాత ప్రేమ, ప్రేమికుడు, పవిత్రబంధం, ఆరోప్రాణం, దేవుళ్లు, దేవదాస్, రక్షకుడు, ధీర్ఘ సుమంగళీభవ వంటి సినిమాల్లో ప్రాధాన్యత కలిగిన సహాయ పాత్రల్లో నటించాడు. 2012లో తనికెళ్ళ భరణి దర్శకత్వంలో వచ్చిన మిథునం సినిమాలో కథానాయకుడిగా కనిపించాడు బాలు. ఇందులో లక్ష్మి నాయికగా నటించింది. ఈ సినిమాకు నంది ప్రత్యేక పురస్కారం లభించింది.

సినిమాల్లోనే కాక టీవీ రంగంలో ఆయన 'పాడుతా తీయగా' 'పాడాలని ఉంది' లాంటి కార్యక్రమాలను నిర్వహించి ఎంతోమంది నూతన గాయనీ గాయకులను పరిచయం చేశారు. ఇవి కాకుండా ఈటీవీలో ప్రసారమైన స్వరాభిషేకం లాంటి కార్యక్రమాల్లో తన గానాన్ని వినిపించాడీ గాన గాంధర్వుడు.

బాలు భారత ప్రభుత్వం నుంచి 2001లో పద్మశ్రీ పురస్కారాన్ని, 2011లో పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకున్నాడు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి 29సార్లు వివిధ విభాగాల్లో నంది పురస్కారం అందుకున్నాడు. ఇంకా తమిళనాడు, కర్నాటక రాష్ట్రప్రభుత్వాల నుంచి కూడా పలు పురస్కారాలు అందుకున్నాడు. 2016 నవంబరులో గోవాలో జరిగిన 47వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలలో అతనికి శతవసంత భారతీయ చలనచిత్ర మూర్తిమత్వ పురస్కారాన్ని (సెంటినరీ అవార్డ్ ఫర్ ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్) ప్రదానం చేసారు. 1999లో పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్ గవర్నరు రంగరాజన్ చేతులమీదుగా డాక్టరేట్ అందచేసింది.

పద్మభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మరణ వార్త ఆయన అభిమానులను తీవ్రంగా కలచివేసింది. సామాన్య జనానికి పాటని చేరువ చేసిన అమృత కంఠం మూగబోయినందుకు విలపిస్తోంది. ఆయన మాట్లాడినా, పాట పాడిన తెలుగు భాష, తెలుగుజాతి సగర్వంగా చెప్పుకునే ఎస్పీ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన చిత్రసీమలో ఆయన కృషి, సంపాదించిన కీర్తి కళాభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు.

.. 16వ పేజీ తరువాయి

ప్రతిస్పందిస్తున్నాడన్నారు. ఏ పాటలను పలవరిస్తూ పాటల ఒడిలో సేదతీరుతున్నాడో?

నేనున్నది నీలోనే ఆ నేను నీవేలే.. నాదన్నది ఏమున్నది నాలో
నీవేనాడో మలిచావు ఈ రాతిని.. నేనీనాడు పలకాలి నీ గీతిని
ఇదే నాకు తపమనీ
ఇదే నాకు వరమనీ

చెప్పాలని ఉంది గుండె విప్పాలని ఉంది.. అంటూ బాలు మన గొంతులో పల్లవిస్తూనే ఉంటాడు. మన పాటకు పల్లవిగా పలుకుతూనే ఉంటాడు.


నీ పాటలు వింటూ ఉండటం తప్ప- ఏమిచ్చి నీ రుణం తీర్చుకోగలం?
అనగల రాగమై తొలుత వీనులలరించి
అనలేని రాగమై మరలా వినిపించీ..
మరులే కురిపించీ
జీవన రాగమై.. బృందావన గీతమై
కన్నెల కన్నుల కలువల వెన్నెల దోచిన మురళి
ఇదేనా.. ఇదేనా ఆ మురళీ?

అవును- అదే బాలు మురళి. అవును- అదే బాలు పాటల రవళి. నీ పద రాజీవముల చేరు నిర్వాణ సోపాన మధిరోహణము సేయు గీతాలు దొరకునా ఇటువంటి సేవ? దొరకునా ఇటువంటి బాలు?

మిస్టరీగా ప్రధాని మరణం!

- శంకర్

అక్టోబర్, 2 లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా



లాల్ బహుదూర్ శాస్త్రి.. శాంతికోసమైనా, సవాల్ కోసమైనా... తను రంగంలోకి దిగితే మ్యాటర్ క్లోజ్.! మచ్చలేని ప్రధానిగా, దేశాభివృద్ధే ధ్యేయంగా పనిచేసిన ప్రధానుల్లో మొదటి వరుస పేరు శాస్త్రిగారిది. అలాంటి ప్రధాని మరణం ఇప్పటికీ ఓ పెద్ద మిస్టరీగానే మిగిలింది.

విదేశాల్లో చనిపోయిన మొదటి భారత ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి. 1965 భారత్ –పాక్‌ల మధ్య యుద్ధం జరుగుతోంది. అప్పటికే భారత్ విజయం చివరి దశలో ఉంది. ఐక్యరాజ్యసమితి కాల్పుల విరమణ ఒప్పందానికి ఆహ్వానించడంతో తాష్కెంట్ (అప్పట్లో రష్యా ఆధీనంలోని ప్రాంతం)కు వెళ్లారు శాస్త్రి..అక్కడ పాక్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్‌తో ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు. ఆ సంతకం చేసిన మరునాడే ఆయన చనిపోయారు.

ఆయన శరీరంపైగాట్లున్నాయి., శరీరమంతా నీలం రంగులోకి మారింది. నాభర్తపై విషప్రయోగం చేశారని లాల్ బహుదూర్ శాస్త్రి భార్య లలితా ఆరోపించారు. లాల్ బహుదూర్ శాస్త్రి మరణంపై నియమించిన రాజ్‌నారాయణ్ కమిటి నివేదిక ఇప్పటి వరకు రాలేదు.

కూతురితో ఫోన్ :

గుండెపోటుతో మరణించే ముందు చివరి సారిగా శాస్త్రిగారు కుమార్తె సుమన్‌తో మాట్లాడాడు. ఫోన్‌లో మాట్లాడుతూ పాలుతాగి పడుకుంటానని చెప్పాడు. ఈలోగా ఫోన్‌లైన్ డిస్కనెక్ట్ అయింది. తర్వాత దాదాపు 15నిమిషాలకు పైగా సుమన్ లైన్ కోసం ప్రయత్నించింది. ఆ తర్వాత లైన్ దొరికింది కానీ శాస్త్రి ఎత్తలేదు. సోవియట్‌కు చెందిన ఓ అధికారి ఫోన్ ఎత్తాడు. మీ తండ్రిగారు ఇప్పుడే మరణించారని చెప్పాడు. ఆరోగ్యంగా ఉన్న మనిషికి ఒక్కసారిగా గుండెపోటు వచ్చి చనిపోయారని చెప్పడంపై అనేక అనుమానాలున్నాయి.

పర్సనల్ డాక్టర్ మరణం:

లాల్ బహుదూర్ శాస్త్రి వెంట అతని వ్యక్తిగత వైద్యుడు RN చుగ్ కూడా తాష్కంట్ వెళ్ళాడు. అతనూ పక్కగదిలోనే ఉన్నాడు. కనీసం శాస్త్రికి గుండెపోటు వచ్చిందన్న విషయాన్ని ఆయనకు కూడా సోవియట్ అధికారులు చెప్పలేదు. మరణించిన తర్వాతే ఆ విషయాన్ని చెప్పారు. 1977లో లాల్ బహుదూర్ శాస్త్రి మరణంపై దర్యాప్తుకు నియమించిన కమిటీ ముందు వాంగ్మూలం ఇచ్చేందుకు కారులో ఢిల్లీకి బయలుదేరిన RN చుగ్‌ను ఎదురుగా ఓ లారీ వచ్చి ఢీ కొట్టింది. చుగ్ అక్కడికక్కడే మరణించాడు.

P.A కి యాక్సిడెంట్:

శాస్త్రి వ్యక్తిగత సేవకుడు (P.A) రామ్‌నాధ్ కూడా ఆయనతో పాటు తాష్కంట్ వెళ్ళాడు. అతనిని కూడా కమిటీ వాంగ్మూలం ఇచ్చేందుకు తన ఇంటి నుండి ఒక్కడుగు బయటకేయగానే ఎదురుగా ఓ వాహనం వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రామ్‌నాధ్ రెండుకాళ్ళూ నుజ్జునుజ్జు అయ్యాయి. తలకు బలమైనగాయాలయ్యాయి. ఆయన గతాన్ని మర్చిపోయాడు.

1977లో శాస్త్రి మరణంపై దర్యాప్తుకు నియమించిన రాజ్‌నారాయణ్ కమిటి నివేదిక ఇప్పటి వరకు రాలేదు. దేశ ప్రధాని మరణం ఇప్పటికీ మిస్టరీగానే మిగిలిపోయింది. తర్వాత గుల్జారీలాల్ నంద అపద్దర్మ ప్రధానిగా, ఇందిరాగాంధీ పూర్తికాల ప్రధానిగా దేశ అధికార బాధ్యతలు చేపట్టారు.!

గురజాడ తెలుగు అడుగుజాడ..

డా॥సుందరరావు, లెక్చరర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సబ్బవరం



దేశమంటే మట్టి కాదోయ్ ! మనుషులోయ్ ! అన్నాడు గురజాడ. ఈ నాలుగు పదాలు చాలు గురజాడను మహాకవి, అనడానికి. ఇలా చాలా అన్నాడు. చాలా రాశాడు. కన్యాశుల్కం అనే సంప్రదాయం ఇప్పుడు లేకపోయినా, అది పోయి చాలా ఏళ్ళైనా, గురజాడ రాసిన "కన్యాశుల్కం" నాటకం సజీవంగా ఇప్పటికీ తళుకులీనుతోంది. ఉత్తరాంధ్ర, విజయనగరం మాండలీకంలో ఈ రచన సాగినా, అన్ని మాండలీకాలవారు దీన్ని అర్థం చేసుకున్నారు. అర్థం చేసుకోవడమే కాదు, అక్కున చేర్చుకున్నారు, అక్కున చేర్చుకోవడమే కాదు, సాంఘిక నాటకాలలో అగ్రస్థానం ఇచ్చారు. ఇది కొత్తగా వచ్చిన సినిమా కాదు. ఎప్పుడో 65ఏళ్ళ క్రితం (1955) సినిమాగానూ వచ్చిన కథారాజం. వందలసార్లు వేదికలపై ప్రదర్శనలు జరుపుకున్న నవ్య నాటకరాజం. సమాజంలో ఇప్పటికీ గిరీశంలు అడుగడుగునా తగులుతారు. లుబ్ధావధానుల వంటి లుబ్ధులు మాటిమాటికీ ఎదురుపడుతుంటారు. అంతటి మధురవాణిలు దొరకక పోయినా.. ఆ వాణి, ఆ వాణిజ్యం తెలిసిన మధురవాణిలు తారసపడుతుంటారు. ఇంతటి నాటకీయ సృష్టి గురజాడకే చెల్లు.

భారతీయ సాహిత్యంలో మృచ్ఛకటికం తర్వాత, అంతటి గొప్ప నాటకం కన్యాశుల్కం, అని మరో మహాకవి శ్రీశ్రీ కితాబు ఇచ్చాడు. శ్రీశ్రీ దృష్టిలో ఆధునిక యుగంలో గురజాడ ఒక్కడే మహాకవి. బహుశా! గురజాడ సాహిత్యంలో శ్రీశ్రీ ధ్వనిదర్శనం చేసుకొని ఉంటాడు. ఎవడి పలుకులో, కవిత్వంలో ధ్వని ఉందో? వాడే మహాకవి అన్నాడు శ్రీ శ్రీ. ధ్వని సిద్ధాంతాన్ని పుష్కలంగా పండించినవాడు తిక్కన మహాకవి, అని శ్రీశ్రీ సిద్ధాంతీకరించాడు. ధ్వనితత్త్వం గురజాడలో కూడా ఆయనకు కనిపించి ఉంటుంది. అందుకే ఆయన్నూ మహాకవిగా అభివర్ణించాడు. 1915 లో గురజాడ చనిపోయాడు. గురజాడ చనిపోలేదు, అప్పటి నుండే జీవించడం ప్రారంభించాడని ఇంకో మహాకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి అన్నాడు. ప్రజల భాషలో రాయాలి, కవిత్వం చెప్పాలి, సాహిత్య సృష్టి జరగాలి, అని బలంగా నమ్మి, అంతకంటే బలంగా ఆచరణలో పెట్టినవాడు గురజాడ. గురజాడకు తోడునీడగా గిడుగు కూడా నిల్చున్నాడు. వీరిద్దరూ ఒకప్పుడు సహాధ్యాయులు, సమభావాలు ఉన్నవారు. వీరిద్దరూ కలిసి ఆధునిక భాషను అద్భుతంగా నడిపించారు. ఇప్పుడు మనం చదివే, రాసే భాషంతా వీరి చలువే. మాటను శక్తిమంతంగా, అందంగా చెప్పడం బాగా తెలిసిన ఆధునిక మహాకవులకు అడుగుజాడగా నడిచినవాడు గురజాడ. ఆయనేమీ


150ఏళ్ళు జీవించలేదు. 53ఏళ్లకే వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయి కూడా, 100ఏళ్ళు దాటింది (1915), అయినా, ఆయన్ను తలచుకుంటున్నాం, కొలుచుకుంటున్నాం. గురజాడ ఎవడికీ చుట్టం కాదు. అతను చేసిన భాషాసేవ మనల్నందరినీ అతని చుట్టూ తిప్పుకుంటోంది. "ఎవడు బతికాడు నూట యాభై ఏళ్ళు" అని ఉత్తరాంధ్రలో ఒక సామెత వుంది. కానీ, గురజాడ బతికాడు, శ్రీశ్రీ బతికాడు. ఉత్తరాంధ్రలోనే కాదు, మన మాటల్లో, రాతల్లో యావత్తు తెలుగు సాహిత్యలోకంలో, భాషా సామాజిక ప్రాంతాల్లో అక్షరాలా జీవించి వున్నారు. వుంటారు. తిండి కలిగితే కండ కలదోయ్: కండకలవాడే మనిషోయ్ అనే మాటలు... మనం నిత్యం చదివే వార్తాపత్రికల్లో వస్తూనే ఉంటాయి. ఇలాంటి పదబంధాలు మనల్ని ఎన్నటికీ వీడవు. ఇవి వీడి పత్రికలు ముందుకు సాగలేవు. ఇంతలా అక్షరాల్లో చొచ్చుకుపోయినవారు ఒకరు శ్రీశ్రీ, ఇంకొకరు గురజాడ. అప్పటి సామాజిక దురాచారాలను కథావస్తువులుగా తీసుకొని, జనంభాషలో రాసి జేజేలు కొట్టించుకున్న జగజ్జట్టి గురజాడ. తను రాసిన "పుత్తడి బొమ్మా పూర్ణమ్మా" గేయంలో పండించిన కవిత్వం గుండెనిండా కన్నీళ్లు నింపుతాయి. కన్నుల కాంతులు కలువల చేరెను... మేలిమి చేరెను మేని పసల్... హంసలు చేరెను నడకల బెడుగులు..దుర్గను చేరెను పూర్ణమ్మా.. అన్నాడు. ఈ పంక్తులు చాలు ఇతనిలోని కవిత్వాన్ని కొలవడానికి. కవిత్వమొక ఆల్కెమీ అయితే, ఆ రహస్యం గురజాడకు కూడా తెలుసు. తెలియకపోతే, ఇనుము వంటి పదాలను బంగారంగా మార్చే కవిత్వ శక్తి ఎక్కడ నుండి వస్తుంది? ఆ పదాలు పట్టుకొని రాయివంటి కసాయిలతోనూ కన్నీళ్లు ఎలా పెట్టిస్తాడు? నవ్వుల పువ్వులు ఎలా పూయిస్తాడు? ఆలోచనామృతాలు ఎలా కురిపిస్తాడు? కృష్ణాతీరంలోని గురజాడ నుండి ఉత్తరాంధ్రలోని విజయనగరంకు వలస వెళ్లిన ఈ కుటుంబం గురజాడ, అనే గొప్ప కానుకను తెలుగుభాషకు ఇచ్చింది. అద్భుతమైన నాటకీయత, పరమ రామణీయమైన పదసంపద, కల్పనా శక్తి, వర్ణనా నిపుణత కలిగిన కవి విలుకాడు గురజాడ. కండపుష్టి కలిగిన కవిత్వం రాశాడు. షేక్స్పియర్, మిల్టన్ కు ఏమాత్రం తక్కువకాని ఆధునిక కవిరాయడు మన అప్పరాయడు (అప్పారావు). రాజు, రాయ శబ్దాల నుండే రావు అనే శబ్దం కూడా వచ్చింది. "రావు" మన పదం కాదు, మరాఠీ నుండి మనం తెచ్చుకున్నది. అలా, అప్పరాయడు అప్పారావు అయ్యాడు. ప్రారంభంలో, గురజాడ ఇంగ్లీష్ లో కవిత్వం రాయడం మొదలు పెట్టాడు. సొంత భాషలో రాస్తే, ఇంకా శక్తిమంతంగా ఉంటుందని శంభుచంద్ర ముఖర్జీ వంటి కొందరు పెద్దలు గురజాడకు సూచించారు. అప్పటి నుండీ అప్పారావు అమ్మభాషలో, వాడుకభాషలో రాయడం మొదలు పెట్టి మనకు వేడుక చేశాడు. ఎప్పటికీ, మన గుండెల్లో గురజాడ అప్పారావు సందడి చేస్తూనే ఉంటాడు. దేశమును ప్రేమించుమన్నా... అన్నాడు. దేశంతో పాటు భాషను కూడా ప్రేమిద్దాం. సెప్టెంబర్ 21 వ తేదీ ఈ మహనీయుడి పుట్టిన పుణ్యదినం.

కరోనా కాలంలోనూ కాంతులు

- ప్రజామీడియా సౌజన్యంతో

కరోనా సృష్టించిన ప్రకంపనలకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు కంపించిపోతున్నాయి. అతికొద్ది సంస్థలు మాత్రమే వృద్ధిని నమోదు చేస్తున్నాయి. ముఖ్యంగా ఆరోగ్య రంగంలో ఉన్న సంస్థల్లో ఈ వృద్ధిరేటు కనిపిస్తోంది. కానీ, ఓ సంస్థ మాత్రం ఈ రంగంలో లేకపోయినా కళ్లు చెదిరే మార్కెట్ విలువను సాధించింది. అమెరికా దిగ్గజం జెఫ్ బెజోస్ వలే కరోనా కాలంలో స్టాక్ మార్కెట్లలో ఆకర్షణీయమైన షేరుగా నిలిచింది. అదే భారత్‌లో పెట్రోలియం, టెలికాం రంగ దిగ్గజం రిలయన్స్ . ఆ సంస్థ మార్కెట్ విలువ ఇప్పుడు భారత్‌లోని ఏ కంపెనీకి అందని స్థాయికి చేరింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ 200 బిలియన్ డాలర్లను దాటేసింది. అంటే అక్షరాలా రూ. 14.79 లక్షల కోట్ల పైచిలుకు అన్నమాట. రెండో స్థానంలో ఉన్న టీసీఎస్ విలువ రూ. 9.34 లక్షల కోట్లు. అంటే రెండో స్థానంలో ఉన్న కంపెనీకి రిలయన్స్ కు మధ్య తేడానే రూ. 5 లక్షల కోట్లు. ఎప్పుడు తగ్గాలో.. ఎప్పుడు నెగ్గాలో రిలయన్స్ యాజమాన్యానికి బాగా తెలుసు. దేశంలో కరోనా వ్యాప్తి మొదలు కావడంతో రిలయన్స్ షేర్లు భారీగా పడిపోయాయి. దీంతో మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ ఒక దశలో రూ. 5.2లక్షల కోట్లకు పతనమైంది. అప్పట్లో ఇది టీసీఎస్ కంటే దాదాపు 16శాతం తక్కువ. రిలయన్స్ వ్యాపార పునాదులు చాలా బలంగా ఉన్నాయి. ఆ సంస్థ కేవలం పెట్రోలియం రంగంలోనే కాకుండా.. రిటైల్ , టెలికాం రంగంలో చాలా బలంగా ఉంది. దీంతో షేరు ధర తగ్గడంతో వాటాల విక్రయానికి తెరతీసింది. ఒక్క మంచి ఇన్వెస్టర్ పెట్టుబడి పెడితే షేరు ధర ఆకాశాన్నంటుతుంది. ఫేస్ బుక్ తో సంప్రదింపులు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఫేస్ బుక్ వంటి దిగ్గజంతో జియో ప్లాట్ ఫామ్స్ డీల్ ను ప్రకటించింది. అంతే షేరు ధరకు వెయ్యేనుగుల బలం వచ్చింది. కొన్ని నెలల్లో మార్కెట్ విలువ రూ. 14.79 లక్షల కోట్లకు చేరింది. ఇప్పుడు ఆ షేరు రెండో స్థానంలో ఉన్న టీసీఎస్ కంటే 60శాతం ఎక్కువ విలువ సాధించింది. ముఖ్యంగా రిలయన్స్ జియో, రిటైల్ సంస్థలు ఐపీవోకు వెళితే ఈ షేరు ధర మరింత పెరుగుతుందున్న నమ్మకంతో ఇన్వెస్టర్లు క్యూకట్టారు. దీంతోపాటు జియోమార్ట్ , సూపర్ యాప్ గా మార్పు వంటి ప్రణాళికలు ఉన్నాయి. టెన్సెంట్ కు చెందిన వుయ్ చాట్ ను తలపించే స్థాయిలో దీనిని సిద్ధం చేయనున్నారు. భవిష్యత్తులో జియోమార్ట్ , జియో డిజిటల్ వ్యాపారాల విలువే 60 బిలియన్ డాలర్లకు చేరుతుందని జేపీ మోర్గాన్ తన నివేదకలో పేర్కొంది.

జీడీపీ పతనం మాంద్యం దిశగా ఆర్థిక వ్యవస్థ



- కె.వి.రమణ, ఎం.ఎ. బి.ఇడి

భారత దేశ స్థూల జాతీయ ఉత్పత్తి(జీడీపీ) 23.9శాతం తిరోగమనవద్ధి (నెగటివ్ గ్రోత్) కనబరుస్తున్నదని నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ ప్రకటించింది. ఇంత పెద్దమొత్తంలో నెగటివ్ గ్రోత్ కనిపించడం గత నలభైఏండ్ల తర్వాత ఇదే మొదటిసారి అని చరిత్ర చెబుతున్నది. అయితే 40ఏండ్ల క్రితం అనగా, 1979-80ల్లో కేవలం 5.2శాతం మాత్రమే నెగటివ్ గ్రోత్ కనబరిచింది. దానికి ప్రధాన కారణాలు ప్రపంచ చమురు ధరలు ఒక్కసారిగా రెట్టింపు కావడం, ఇరాన్ సంక్షోభం, ప్రపంచ కరెన్సీగా డాలర్ ఎదుర్కొన్న సవాళ్ళు వంటివి. జూన్ 30, 2020 నాటికి భారత జీడీపీలో 23.9శాతం నెగటివ్ గ్రోత్ కనబరిచేంతలా పడిపోవటం ప్రమాదకరం. ఎందుకంటే, ప్రపంచమంతా కరోనా వ్యాపించినా, ఆసియా దేశాలలోనే కాక జీ-20 దేశాల్లో కూడా ఏ దేశమూ ఇంత ప్రభావానికి గురవ్వలేదు. కొన్ని ప్రధాన దేశాల స్థూల జాతీయ ఉత్పత్తులు మనం చూస్తే అమెరికా 9.5శాతం, ఇంగ్లాండ్ 20.7శాతం, ఇటలీ 17.3శాతం, జపాన్ 10శాతం పతనమవగా చైనా మాత్రం 3.2శాతం వృద్ధి నమోదు చేసింది. చైనా కూడా 2.4శాతం పతనమవుతుందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. అయినప్పటికీ అది నిలదొక్కుకున్నదంటే దాని ఆర్థిక మూలాలు పరిశీలించదగ్గవే. భారత ఆర్థికవృద్ధి పతనం రంగాలవారీగా చూసినప్పుడు నిర్మాణ (కన్స్ట్రక్షన్) రంగం 50శాతం, వాణిజ్య(ట్రేడ్) రంగం 47శాతం మ్యానుఫ్యాక్చరింగ్ రంగం 39శాతం, మైనింగ్ 22శాతం, సర్వీస్ సెక్టార్ 20శాతం పతనమయ్యాయి. కేవలం వ్యవసాయ రంగం మాత్రం 3.4శాతం వృద్ధి నమోదు చేసింది. ప్రభుత్వ వ్యయం(స్పెండింగ్), ప్రయివేట్ వ్యయం, ఎగుమతులు, కన్జ్యూమర్ స్పెండింగ్- ఈ నాలుగింటినీ ఆర్థిక వ్యవస్థ గ్రోత్ ఇంజిన్ అంటారు. ఇందులో అన్నీ సమృద్ధిగా ముందుకెళితేనే సాధ్యం. కానీ ఈ త్రైమాసిక కాలంలో ప్రైవేట్ స్పెండింగ్ 27శాతం, మూలధన సమీకరణ 47శాతం పడిపోయాయి. గవర్నమెంట్ స్పెండింగ్ 26.8శాతం పడిపోయింది. ఎగుమతులు దాదాపు స్తంభించి పోయాయి. కొన్ని మినహాయింపులతో నిత్యావసర వస్తువులు తప్పా మరేవీ అమ్మకాలు జరగక పోవడంతో కన్స్యూమర్ వ్యయం కూడా తగ్గిపోయింది. ఇలాంటి పరిస్థితిలో జీడీపీ పడిపోడం అనివార్యం. అయితే ఈ పతనానికి కరోనా మహమ్మారి మాత్రమే కారణం అనే సంకేతాలు పాలకులు ఇవ్వటం తప్పు. ఎందుకంటే గడిచిన ఐదేండ్ల నుంచీ ఏటా ఒక్క శాతం చొప్పిన మన జీడీపీ పడిపోతూనే ఉన్నది. 2014లో 8.6శాతం వృద్ధి కనబరిచిన జీడీపీ గత మార్చి త్రై మాసికానికి 3.5కు పడిపోయింది. దీనికి ప్రధాన కారణం నోట్లరద్దు. పాలకలు ఒప్పుకోవడానికి ఇష్టపడని సత్యం ఇది. ఆ మూలంగా ఉపాధి ఏ స్థాయిలో స్తంభించిందో ఆ స్థాయిలో కోలుకోలేదు.

కోవిడ్ ప్రభావం వలన అభివద్ధి చెందిన దేశాలలో 7శాతం నెగిటివ్ గ్రోత్ ఉంటుందని ప్రపంచ బాంక్ అంచనా వేసింది. భారత్‌లో 2.5శాతం వరకు మైనస్ గ్రోత్ ఉంటుందని కూడా చెప్పారు. ఇదే కారణంగా దక్షిణాసియా దేశాలలో 2.7శాతం వద్ధి పడిపోవచ్చని హెచ్చరిక చేశారు. ప్రపంచ బ్యాంకు జూన్ మాసాంతానికి ఇచ్చిన రిపోర్టు ప్రకారం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 5.2 నుంచి 8శాతం వరకు తగ్గుదల ఉంటుందని అంచనా వేసింది. 2019 లెక్కల ప్రకారం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 86.6లక్షల కోట్ల డాలర్లుగా (ట్రిలియన్స్) నమోదైంది. అనగా ఐదుశాతం తగ్గితే దాదాపు 5ట్రిలియన్ డాలర్ల సంపద తగ్గిపోయే ప్రమాదం ఉంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఏర్పడిన ఈ పతనం "మహా మాంద్యం" దిశగా ఇప్పుడు పయనించే ప్రమాదముంది. దీనిని సరిగ్గా అంచనా వేసి అడ్డుకట్ట వేయకపోతే కోటానుకోట్ల మంది పేదరికంలోకి నెట్టబడతారు. ఇప్పటికే ప్రపంచ జనాభాలో 27శాతం(దాదాపు రెండు వందల కోట్లు) కడు పేదలున్నారు. ప్రజలకు పని కల్పించడంలో ప్రత్యామ్నాయ పద్ధతులను అన్ని దేశాలూ కనుగొనకపోతే అభివద్ధి కోసం ఏర్పరచుకున్న ప్రణాళికలన్నీ కోలుకోలేనంతగా తిరగబడతాయి. ఈ సంక్షోభం ద్వారా అత్యంత ప్రమాదానికి గురయ్యేటువంటి సెక్షన్ "అసంఘటిత రంగం". ఎందుకంటే కరోనా మహమ్మారి వల్ల పనులు పూర్తిగా పోయి ఆదాయాలు జీరోస్థాయికి చేరినది అసంఘటిత రంగంలోనే ఎక్కువ. మొత్తం స్థూల జాతీయ ఉత్పత్తిలో అసంఘటిత రంగం మూడవ వంతు ఉంటుంది. అయితే ఈ మూడవ వంతును మాత్రమే సమకూర్చే ఈ రంగంలో 70శాతం మంది ఉపాధి పొందుతున్నారు. అనగా డెబ్బై మంది ఆదాయం ముప్పై మూడు రూపాయలైతే ముప్పై మంది ఆదాయం

అరవై ఏడు రూపాయాలు. ఈ అసమాన "పని-ఆదాయం" పంపిణీని అరికట్టే మార్గమే లేదా? ఆర్థిక నిపుణుల దగ్గర సామాధానాలున్నా రాజకీయ సంకల్ప లేమి వల్ల ఈ అసమానతలు అన్ని దేశాల్లోనూ కొనసాగుతూ ఉన్నాయి. 1870 తర్వాత అసంఘటిత రంగంలో ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అత్యంత తీవ్రమైన సంక్షోభం ఇదే. అందుకే కనీసం ఇంటికి నెలకు ఏడు వేల రూపాయల సహాయాన్ని అందించడం ద్వారా వ్యవస్థను కాపాడగలరని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. పునర్నిర్మించే వరకు ప్రజలకు పని కలిపించలేకపోయినా పొట్ట నింపడం వ్యవస్థకే అత్యవసరం.

రాష్ట్రాలకు చెల్లించ వలసిన జీఎస్టీ పరిహారాన్ని, కేంద్రం చెల్లించలేక పోవటానికి వసూళ్ళు తక్కువగా ఉండటమని, ఇలాంటి ఆర్థిక మందగమనానికి దేవుణ్ణి సాకుగా చూపుతూ "అక్ట్ ఆఫ్ గాడ్" అని దేశ ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ చెప్పుకున్నారు. అయితే కోపం వచ్చిన నెటిజన్లు "ఇది అక్ట్ ఆఫ్ మోడీ"- నిర్మల సీతారామన్‌కి మోడీ దేవుడిలా కనిపిస్తున్నాడా లేక మోడీని ఏమీ అనలేక దేవుణ్ణి అంటున్నారా" అంటూ విమర్శలు చేశారు. కరోనా మహమ్మారి వలన ఆర్థిక వ్యవస్థ పతనం అయిందా? లేక దానిని ఎదుర్కోవడంలో విఫలమైన చర్యల ద్వారా ఆర్థిక వ్యవస్థ పతనం అయిందా? స్థూల జాతీయ ఉత్పత్తి తగ్గిపోయింది - మనుషులకు పని లేకపోవడంతో ఆ ఉత్పత్తి ఆగిపోయింది. మనుషులను పనికి వెళ్ళవద్దని చెప్పిన వాళ్ళు ఎవరు? ప్రభుత్వం కాదా? పోనీ కరోనా మహమ్మారి వ్యాప్తిని నివారించడం కోసమే పనికి వెళ్ళ వద్దనీ, ఇంటి పట్టునే ఉండండని చెప్పారనుకుందాం, మరి కరోనా మహమ్మారి వ్యాప్తి నివారించబడిందా? కరోనా మహమ్మారి వ్యాప్తిని నిరోధించలేక దానితో సహజీవనం చేయవలసిందే అంటూ మే నెలాఖరులోనే తేల్చేసి, విడతల వారిగా లాక్‌డౌన్ ఎత్తేస్తూ వస్తున్నారు. మరి లాక్‌డౌన్ సడలించిన తర్వాత జూన్, జూలై, ఆగస్టు- మూడు నెలల కాలంలో పనులను పునరుద్ధరించేందుకు నిర్దిష్టమైన ఏ చర్యలు తీసుకున్నారు? కనీసం అలాంటి ప్రయత్నాలు ఏమేమి చేశారు? ఇరవై లక్షల ప్యాకేజీ అంటూ గొప్పగా ప్రకటించినా అది ఫలితాలు ఎందుకివ్వలేక పోయింది? సదరు ప్యాకేజీ ప్రకటించగానే "ఇది ఉత్తుత్తిదే, కేవలం పెట్టుబడి దారులకు రాయితీలు కల్పించేదే తప్ప మార్కెట్లో డిమాండును కొనసాగించలేదని, దీనికి బదులు సాధారణ ప్రజానీకం యొక్క కొనుగోలు శక్తిని పెంచే చర్యలు చేపట్టకపోతే వృధా" అని పలికిన వారందరి మాటలు నిజం చేస్తూ జీడీపీ అసలు స్వరూపం బయటపడింది. కరోనా ప్రభావం వల్ల బహిర్గతమైన వాస్తవం ఏమంటే విపత్తును ఎదుర్కోవడంలో ప్రభుత్వానికి పర్యావసానాలను పసిగట్టే ముందస్తు తెలివితేటలు లేవు. చప్పట్లు కొట్టి దీపాలు వెలిగించే దైవాధీనపు అశాస్త్రీయ ఆలోచనతో ఎలాగూ కరోనాను నియంత్రించలేక పోయారు కనీసం పనులను పునరుద్ధరించే దిద్దుబాటు చర్యలకూ పూనుకోవటం లేదు. ఈ అలక్ష్యం చాలా ప్రమాదం.

ప్రభుత్వం ప్రకటించిన నగదు ప్రోత్సాహక ప్యాకేజ్ సఫలం కాలేదు. ఆర్‌బీఐ రెపో రేట్ల తగ్గింపు వల్ల, బ్యాంకు రుణాలపై మారిటోరియం (రుణ బకాయిలను తాత్కాలికంగా వాయిదా వేయడం) విధించడం వల్ల ప్రజల, పెట్టుబడి దారుల చేతుల్లో నగదులభ్యత పెరుగుతుంది, తద్వారా ఆర్థిక వ్యవహారాల్లో అంతరాయం ఉండదు అని అంచనా. కానీ ఈ చర్యలు తీసుకున్నప్పటికీ ఫలితం రాలేదని, చితికిపోయిన నిర్మాణ, తయారీ రంగాల గణాంకాలు తెలుపుతున్నాయి. వర్క్ ఫ్రం హోమ్ కాన్సెప్ట్ బాగా అభివృద్ధిలోకి వచ్చింది కాబట్టి సర్వీస్ సెక్టార్ దెబ్బ తినదులే, అనుకున్నప్పటికీ 20శాతం క్షీణించింది. నిజానికి ముప్పై ఐదుశాతం ఉద్యోగాలు పోయాయని సాఫ్ట్‌వేర్ రంగ సంఘాలు చెబుతున్నప్పుడు 20శాతమే నెగెటివ్ గ్రోత్ ఎందుకున్నదంటే, వర్క్ ఫ్రం హోమ్ ద్వారా తక్కువ వర్కర్ల ద్వారా ఎక్కువ పనిగంటలతో మరింత దోపిడీ(ఎక్స్‌ప్లాయిటేషన్) జరుగుతున్నది. ఇది మానవ వనరు దీర్ఘాయుష్షుపై ప్రభావం చూపుతుంది. ఆర్థిక వ్యవస్థ ఇంతలా పతనమవుతుంటే దిద్దుబాటు చర్యలకు పూనుకోకుండా దేశమంతా బొమ్మలు తయారు చేయాలని, బొమ్మల ఎగుమతిలో ప్రపంచ ఖ్యాతి గడించాలని ప్రధాని మన్ కీ బాత్‌లో చెప్పారు. దీనిపై సోషల్ మీడియాలో విపరీతమైన వ్యతిరేకత మునుపెన్నడూ లేనంతగా వస్తే వెంటనే సదరు పోస్టులను తొలగించే పనుల్లో పడ్డారు. ఉపాధి లేమి వల్లనే వృద్ధి క్షీణించిందని తెలిసి కూడా మరిన్ని ఉపాధులపై కత్తి వేయజూస్తున్నారు. ముప్పై ఏండ్ల సర్వీసు లేదా యాభై ఐదేండ్ల వయసు కలిగిన వారి నైపుణ్యాన్ని పరీక్షించి ఉద్యోగంలో ఉంచాలా సాగనంపాలా నిర్ణయిస్తామని కేంద్రం ఆఫీస్ మెమోరాండమ్ జారీ చేసింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కూడా వీఆర్ఎస్ ప్రకటించారు. ఈ సదుపాయం ప్రతియేటా డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకు మూడు నెలల పాటు అమలులో ఉంటుందని ప్రకటించారు. ఇప్పటికీ బ్యాంకింగ్ రంగం చేరవలసిన ప్రాంతాలు, అభివృద్ధి పరచ వలసిన సేవలు ఎన్నో ఉన్నవి, బ్యాంకింగ్ సర్వీసులకు నోచుకోని జనాబా కూడా ఎక్కువే. వీటికి సమాధానం బ్యాంకుల విస్తరణే. విస్తరించడం ద్వారా మరిన్ని ఉద్యోగాలు కల్పించవచ్చు. అలాంటి నిర్మాణాత్మక ఆలోచన చేయకుండా ఉద్యోగులను తగ్గించడం ద్వారా కంపెనీకి లాభం అనే సంకుచిత ఆలోచన చేస్తున్నారు.

జీడీపీలో ఇప్పుడు ఏర్పడిన నెగటివ్ గ్రోత్ మరింత పెరిగే ప్రమాదం ఉన్నది. ఎందుకంటే నిలిచి పోయిన వ్యవహారాల పునరుద్ధరణకు ఇప్పటివరకు ఏ ఒక్క ప్రణాళికా వేయలేదు. నిత్యావసర వస్తువుల వ్యాపారాలు తప్పా మిగతావన్నీ దాదాపు మూతబడ్డవి. నోట్లరద్దు సృష్టించిన భయాందోళనల వల్ల డిజిటల్ చెల్లింపులు పెరిగి ఉండవచ్చు, కానీ బ్యాంకులు నగదు విత్‌డ్రాలపై ఆంక్షలు పెట్టడం వంటివి జరిగాక పట్టణ ప్రాంతపు సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి (MSME) రంగాల్లో మునుపటి స్థాయిల్లో వ్యవహారాలు లేవన్నది వాస్తవం. నోట్లరద్దు అనంతర పరిణామాలను ఎదుర్కొనే ఆలోచన ఇప్పుడు కూడా ప్రభుత్వం చేయడం లేదు. నోట్లరద్దు తరువాత లావాదేవీల్లో ఏర్పడ్డ ఇబ్బందులు ఇప్పటికీ ఉన్నాయని ముందుగా ప్రభుత్వం అంగీకరించాలి. ఈ రోజు జీఎస్టీ పంపకాల్లో జుట్లు పట్టుకుని "మీరు అప్పు తెచ్చుకొండని" కేంద్రం రాష్ట్రాలకు చెబుతుంటే, "కేంద్రమే అప్పు చేసి మా వాటా మాకివ్వాలని" రాష్ట్రాలు తెగేసి చెబుతున్నాయి. వెరసి, "ఒకే దేశం ఒకే పన్ను" కేంద్ర రాష్ట్రాల వివాదాలకు దన్నుగా నిలుస్తుందన్న నిపుణుల మాట నిజమైంది. లాక్‌డౌన్ వలన ఆర్థిక వ్యవస్థ లాక్ అయిపోయి కార్మికులు చెల్లాచెదురయ్యారు. వీరిని తక్షణమే తిరిగి పేర్చడమెలా అనే విషయంపై అన్ని మంత్రిత్వశాఖల్లోనూ ప్రత్యేక విభాగాలను ఏర్పరిచి మానిటర్ చేస్తే గాని ఉపాధి పునరుద్దరణ ఓ కొలిక్కి వచ్చే అవకాశం లేదు. ఉపాధి గాడిన పడకుంటే జీడీపీతో పాటు జీవితాలే సంక్షోభంలో పడిపోతాయి.

ఓర్నీ ఇంగ్లీషు దుంపదెగా!

- సంపత్ కుమార్ శ్రీవత్స, మొబైల్ : 9346435123

మా నగరం ఎటు చూసినా "ఇంగ్లీష్ స్కూల్స్" "ఇంగ్లీష్ హాస్పిటల్స్"తో ధగధ్ధగాయమానంగా వెలిగిపోతున్నదంటే నమ్మండి.

తెలుగనేది పారిపోతున్నది లేక "టింగ్లీష్"గా రూపం మార్చుకుంటున్నది.

ఇంత పెద్ద నగరంలో అమ్మనాన్నలు లేరు కాక, చిన్నాయిలు కాలం చేశారు. అత్తయ్య, మామయ్యలు అదృష్యమైనారు. అక్కయ్య, అన్నయ్యలు పాపం అంతర్ధానమైపోయారు ఇక మిగిలిందేమిటి?

మామ్... డాడ్.... ఆంటీ... అంకుల్... బ్రో... సిస్.. గ్రాండ్‌పా.. గ్రాండ్‌మా ... వంటి కొత్త పాత్రలు రంగస్థల ప్రవేశం చేశాయి.

పాతతరం నిష్క్రమించాలా లేక సర్దుకుపోవాలా? సర్దుకు పోవటమే బెటర్.

ఒక పెద్ద ? కాన్వెంట్ స్కూల్ పరిసరాలలో దినమంతా గడిపి, నేటి 'లైఫ్‌స్టైల్' తెల్సుకుందామని నేను, నామిత్రుడు సాంబయ్య నిశ్చయించుకున్నాం. వెంటనే అన్వేషణ ప్రారంభించినాము - అనగనగా ఒక ఇంగ్లీష్ మీడియం స్కూల్ దానిపేరు ఎందుకులెండి. ప్రవేశించాము.

గుడ్ మార్నింగ్ ! వెల్‌కమ్. మీరు విజిటర్సా?

ఓహ్ స్టూడెంట్స్ నాట్ దేర్. కనుక వాడ్డూయింగ్ అని డౌట్ పడ్తున్నారా?

టైమ్ వెయిట్ థర్టీ నో ! ఆల్ ప్రేయర్ రీడింగ్ అదీ సంగతి. సమయం ఎనిమిదిన్నర కదా! అందరూ ప్రార్ధన చదువుతున్నారు.

టెన్ మినట్స్ అఫ్టర్ క్లాసెస్ గోయింగ్ రతన్, చార్లెస్, సుమన్, ఇలియాస్ వెరీగుడ్ సాల్స్ టెన్త్ క్లాస్.

రతన్ "రేయ్ చార్లెస్! ఫస్ట్ పీరియడ్ హు?"

"అవర్ క్లాస్ టీచర్ మంకీ మహేష్ రే."

"బ్రెయిన్ ఈటర్ కదారా భయ్ ఇలియాస్ ఒక వాస్తవాన్ని చెలిపాడు"

ఇంతలో "హాయ్!" అంటూ ఆంగ్లీష్ టీచర్ రానే వచ్చాడు.

స్టూడెంట్స్ లేచి నిల్చొని, లేనిపోని వినయ విధేయతల్ని నటిస్తూ "గుడ్ మాణింగ్ సర్" అంటూ పళ్ళికిలించారు.

"మాణింగ్ గైస్ అండ్ గల్స్! అటెండెన్స్ ప్లీజ్" రోల్ నెంబర్ వన్.. ఎస్సార్! టూ... ప్రెజెంట్సార్... త్రీ... త్రీ... నాట్ కమ్ సర్... ఫోర్.. నైన్ దేర్. ఉపాధ్యాయుడు కోపంగా గుడ్లురిమి చూసేసరికి "సారీ సర్" స్టూడెంట్సంతా కలిసి కోరస్‌లా అన్నారు.

ఎలాగోలా అటెండెన్స్ తంతు పూర్తయిందనిపించారు.

"ఓకె... వాట్ లెసన్ స్టూడెంట్స్

"సర్! ఎస్టర్‌డే 'ఆటిట్యూడ్' లెసన్ టోల్డ్. బిట్స్ నాట్ గేవ్ సర్!"

ఇంగ్లీష్ మాస్టారు ప్రారంభించబోయే సరికి బెల్ మోగింది.

అందరూ "బై సర్.. టిల్ టుమారో" అని అరిచారు. ఇంగ్లీష్ గైడ్, రిజిస్టర్‌లను ధరించి నిష్క్రమించాడు.

❖❖❖

తర్వాత రెండో పీరియడ్ గణితం. అదే "మ్యాక్స్" అయిపోయింది థర్డ్ పీరియడ్ గేమ్స్ సార్ కమింగ్

స్టూడెంట్స్ హాపీగా గ్రౌండ్‌లో పరుగెత్తారు. "టుడే యోగా, కమాన్" అన్నాడు దిలీప్ సర్. బాగా స్ట్రిక్ట్ సార్. మంచిగా నేర్పిస్తాడు కూడా.

బాయ్స్ ఉత్సాహంగా "చక్రాసన్ దూమీన్స్‌దూ సర్"! అని అడిగారు. గర్ల్ స్టూడెంట్సేమో" ప్రాణాయామాదూసర్"! అంటున్నారు.

దిలీప్ సర్‌కు నవ్వాగడం లేదు. వాళ్ళడిగింది "చక్రాసనం చెయ్యమంటారా? ప్రాణాయామం చేస్తాం సర్" అన్నమాట.

ముందుగా పద్మాసన్, మత్స్యాసన్, మకరాసన్ చేయించాడు. తర్వాత కొద్ది మందితో వ్యాఘ్రాసన్, శీర్షాసన్ సాదన చేయించాడు.

ప్రిన్సిపాల్ నుండి కాల్ వచ్చింది.

"గుడ్ మార్నింగ్ సర్"

"ఆ మార్నింగ్, సాలరీ టీకా దిలీప్?"

"నో సర్ టేక్ నా"

"వన్ పేరెంట్ కేమ్ అండ్ ఆస్కింగ్ మీ "హోమ్‌వర్క్ ఇస్తు లేదా? ఇంట్లో చిల్డ్రన్ ఏం రాస్తులేరు" ఫోన్‌లో మాట్లాడుతున్నాడు ప్రిన్సిపాల్.

"టెల్ సమ్‌థింగ్, పిల్లలను రాయిమనుండ్రి పేరెంట్స్ షుడ్‌నాట్ కమ్ టు మి. ఎందుకంటే పేరెంట్స్ వచ్చి వైనాట్ మార్క్స్ కమ్ మై డాటర్ అంటే యుహాన్ టు గివ్ ఎక్స్‌ప్లనేషన్ నేనుకాదు.

❖❖❖

అటూ ఇటూ చూస్తూండగానే మార్నింగ్ సెషన్ అయిపోయింది.

పగటి పూట్ల తెలుగుతో మొదలైంది. మంచి ధోవతి కట్టి. స్వచ్ఛమైన రామ్ రాజ్ కాటన్ షర్ట్ వేసుకొని, పైన కండువాతో తెలుగు మాస్టారు ప్రవేశం.

"గుడ్ ఆఫ్టర్‌నూన్ బి.ఎస్.సర్! "భలే ఆహ్వానం

"ఒరేయ్! ఏమంటున్నార్రా"

కొందరబ్బాయిలు "బిత్తిరి సత్తి! బిత్తిరి సత్తి" అని గుసగుసల్లా అరుస్తున్నారు అమ్మాయిలు మాత్రం" భోగోతుల సత్యన్నారాయణసార్ నమస్తే" అంటున్నారు.

నిన్న పాఠం ఎంతవరకు అయిందో కనుక్కుంటున్నారు మాస్టారు.

సార్! మంకీగాడ్ కేమ్ డెనున్స్ సెట్‌ఫైర్ టేయిల్, జంపింగ్ జంపింగ్... లంకా బర్నింగ్" అని జవాబిచ్చారు.

"వెధనల్లారా! అదేంట్రా తిట్టుతున్నారా?

"కాద్సార్ ఆంజనేయుని తోకకు మంటపెట్రిండు, ఆ కోతి దూకుడుకు లంకంతా కాలిపోయింది వివరించాడు రామశర్మ

"ఓర్నీ దుంపెదెగ లంకాదహనం పూర్తయిందన్న మాట. ఆ తదుపరి ఆంజనేయుడు..." అంటూ తన్మయత్వంలో పాఠాన్ని కొనసాగిస్తున్నాడు.

విద్యార్థులంతా ఎవరివారి సెల్ ఫోన్లు నొక్కటంలో నిమగ్నమైనారు. సెల్‌ఫోన్ లేని బుద్ధిమంతులు మాత్రం "వాట్ మువీ గోయింగ్‌రే?" ఇడియట్" "తిట్టుడింగ్‌రే" "నోరేమువీ".. రంగస్థలం నైస్ దేర్ యు గోయింగా? ఈ విధమైన చిత్రమైన ముచ్చట్లు శ్రద్ధగా మాట్లాడుతునన్నారు.

మాస్టారు తన పాఠాన్ని చక్కగా వివరించి ఇకనైన కొన్ని ప్రశ్నలు అడుగుతాను. సమాధానాలు చెప్పండి. అంటూ

"లంకాదహనం చేసిందెవరు"? అన్నాడు

"రామ్ చరణ్ సర్!"

"కాదురా సన్యాసి! హనుమంతుడు తెల్సిందా"?

"సరేగని సర్! మీకు తెల్వదాసర్? మమ్ముల్నడు గుడెంది సర్!"

"బడుద్దాయి వెధవలారా? మీకు పాఠం చెప్పటం నా మొదటి తప్పు. ప్రశ్నలడగం మరింత తప్పు"

గబగబా వెళ్ళిపోయాడు మాస్టారు.

"గో.. గో... గోయింగ్ రే!

తెల్కు పీడ మనకు పీకింగ్ రే!

క్లాసంతా గోల గోల కిష్కింధలో కోతుల్లాగ ఒకటే గంతులు

ఇంగిష్‌లో మాట్లాడుకోవటాలు

ఇంగ్లీష్‌లో పోట్లాడుకోవటాలు

ఎటుచూసినా ఇంగ్లీష్ విలయ తాండవం చేస్తున్నది. మాకూ పిచ్చిలేసి పోతుందెమో! జుట్టు పీక్కుని, షర్ట్ చించుకొని చెవులూ నోరూ మూసుకుని పాఠశాల ఆవరణ దాటి ఒకటే పరుగు.

"ఇక ముందెన్నడూ స్కూల్ దరిదాపుల్లోకి రామంటే రాము. సారీ! తల్లిదండ్రులారా జాగ్రత్త.. మీ పిల్లల్ని వారి చదువులేవో వార్ని చదువుకోనివ్వండి.

అది వారి ప్రారబ్ధం.. నేటి పిల్లలే రేపటి" నెటిజన్స్" అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లలో దున్నేసే మహాశ్రామికు వీరే... కాని ఒకటి మాత్రం వాస్తవమైన ఆశ్చర్యకరమైన, అద్భుతం.

టెన్త్ రిజల్ట్ వచ్చాయి. నలభైమందికి 10 జి.పి. ఐదుగురికి మాత్రం 9.6 జి.పి..

విశాఖలో విషాదము

- సంపత్ కుమార్ శ్రీవత్స, మొబైల్ : 9346435123

పల్లవి:

అందమైన పట్టణమే విశాఖ
దుఃఖ సముద్రమే పొగిలిందీ యెలాగా ॥2॥
గ్యాసే పెట్రేగింది విషమై విరజిమ్మింది
గుండెల్ని అదిమేసి ప్రాణాలే తీసింది
ఎందుకింత విలయం విధి శిక్షయా
ఏమిటింత ప్రళయం నిర్లక్ష్యమా ॥అందమైన॥

చరణం:

ఆదమరచి నిద్రిస్తే బ్రతుకు మిగలదే
విష నాగై కాటేస్తే చావు తప్పదే ॥2॥
బుస్సుమంటు లీకైన విషస్టైలిన్ వాయువదీ
ఐదుఊర్లనలుముకున్న కాలకూట జ్వాలలవీ
నలువైపుల కమ్మేసి...
గొంతులనీ నొక్కేసీ...॥2॥
ఊరు వల్లకాడుజేసి చావు నాట్యమాడింది ॥అందమైన॥

చరణం:

లెక్కలేని ప్రాణాలు ఎగిరిపోయెనో
పసిపిల్లల ఊపిరులే ఆగిపోయెనో ॥2॥
జీవాలకు ఏం తెలుసు వికృతపు నొసటిరాత
మరణానికి తెలియదోయి తల్లిదండ్రుల కడుపుకోత
ఆవులనీ..గేదెలని
నోరులేని పక్షులనీ ॥2॥
మింగివేసినా గాని నీ ఆకలి తీరలేదా??

అందమైన పట్టణమే విశాఖ
దుఃఖ సముద్రమే పొగిలిందీ యెలాగా ॥2॥
గ్యాసే పెట్రేగింది విషమై విరజిమ్మింది
గుండెల్ని అదిమేసి ప్రాణాలే తీసింది
ఎందుకింత విలయం విధి శిక్షయా
ఏమిటింత ప్రళయం నిర్లక్ష్యమా

గురజాడ 158వ జయంతి సందర్భంగా

డామిట్! కథ అడ్డం తిరిగింది!

పి.లక్ష్మణ్ రావ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, సహకార శాఖ, విజయనగరం. 9441215989

ఓ మహా కవీ ! కవితోజ్వల రవీ !
నీ ఆశల రాజ్యం కుప్ప కూలింది
నీ ఆశయాల సామ్రాజ్యం కలగానే మిగిలింది !

ఇప్పుడు కథలన్నీ అడ్డంగానే తిరుగుతున్నాయి చలనచిత్రాలలో ధారావాహికల్లో
కుట్రలూ, కుతంత్రాలూ నేర్పి
మనిషిని జంతువుగా మారుస్తున్నాయి !

తోకచుక్క ఇప్పటికీ మాకు అరిష్టమే
గ్రాఫిక్స్ లో చూపి మరింత భయపెడుతున్నాం !
దెయ్యాలూ కొరివి దెయ్యాలూ సీరియల్సులో సినిమాల్లో
పట్టపగలే తిరుగుతున్నాయి !

ఆడపిల్లల్ని కొనడం మానేసి , అమ్మేస్తున్నాం
భూమ్మీద పుట్టనివ్వకుండానే చంపేస్తున్నాం !
మగువంటే ఎప్పటికీ మాకు లోకువే
నేస్తమయ్యే రోజుని కలలోకూడా రానివ్వం !

దుష్ట రాజుల స్థానాన్ని
నేర చరితులు ఆక్రమించారు
ఘోరాలతోనే రోజూ అఘోరిస్తున్నాం !

రాయి రప్పలనే మొక్కుతున్నాం డబ్బు ఇబ్బడిముబ్బడిగా
పోగేసుకుంటున్నాం
అనాథలు ఆకలితో అలమటిస్తూనే ఉన్నారు
ఘన నాథుల పొట్టలు పెరుగుతూనే వున్నాయి !

ప్రజల భాషను పరాయి భాష తినేస్తుంది
అమ్మా నాన్నలు మమ్మీ డమ్మీలయ్యారు
దేశభక్తి స్థానంలో వ్యక్తి భక్తి వచ్చింది
భజన చేయడంలో మాకు మేమే సాటి !

దేశమంటే మాకు రియలెస్టేట్
మనుషులంటే లోను ఎడ్జస్టుమెంట్ !
ఇప్పుడు మేమంతా ఒట్టి మాటలు చెప్పేవాళ్ళం
గట్టి మేలు తలపెట్టాలని
గట్టుమీదే ఉండేటోళ్ళం
గిరీశం బాటలో నడిచేవాళ్ళం !

వస్తుస్వామ్యం గుప్పిటలో చిక్కుకున్నాం
విదేశీ సరుకులు వాడుతున్నాం
ఈసురోమనే బతుకుతున్నాం !

కొంచమైనా ఉండేది మంచి గతంలో
మచ్చుకైనా లేదు వర్తమానంలో !
ముందడుగు వేస్తే వెనుకకు లాగేస్తాం
వెనకడుగు వేస్తే పళ్లూడేటట్లు
ముందుకు తోసేస్తాం
ఏ అడుగూ వేయని మడుగులం మేము !

పరుల కలిమి పైనే మా బలం
మేలు చేసేవారిపైనే మా జులుం
సొంత లాభమే మాకు ధ్యేయం
పొరుగువారికి ఎంగిలైనా ఇవ్వం !

కులమతాల్ని నెత్తినేసుకుని
చెట్టపెట్టాల్ తిరుగుతుంటాం

దేశంలో మా చెడ్డ వృక్షం
ఈర్ష్యా ద్వేషాల్ని పూస్తుంటది
శ్రమ జీవుల చెమటను తడిసి
పెట్టుబడిదారియై పెరుగుతుంటది

కవిత్వం వ్యాపారమైపోయి
అణగిమణగి ఉంటది
చిత్రసీమలో బూతు పాటయై
శృగారవీధిలో తిరుగుతుంటది !

మతాలన్నీ వెలిగిపోతున్నాయి
జ్ఞానం అజ్ఞానమై మలిగిపోతున్నది

ఒక్కటేమిటి మహాకవి
అన్నింటా నీ ఆశయాల్ని
అడ్డంగా తిప్పేశాం

మహాత్మా! పరమాత్మా !
క్షమిస్తావో ! శపిస్తావో !
నీ ఇష్టం !

రైల్వేల ప్రైవేటీకరణ దేశానికి హానికరం

– శంకరరావు చోడవరపు, SCRMU ప్రధాన కార్యదర్శి

ప్రియమైన భారతీయులారా, రైల్వేల ప్రైవేటీకరణ ద్వారా – బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కేవలం కార్పొరేట్ సంస్థల ప్రభుత్వం అని, సాధారణ, పేద ప్రజల కోసంఎంతమాత్రమూ కాదని ఋజువయ్యింది. రైల్వే ప్రైవేటీకరణ అనేది ఈ దేశంలోని మధ్య మరియు పేద ప్రజలపై ఒక గొడ్డలి వేటు.. భారతీయ రైల్వే మన దేశానికి జీవనాడి. ఈ దేశంలోని సామాన్య ప్రజలకు తక్కువ ధరకు రవాణా సౌకర్యాన్ని అందిస్తున్న మహా పరిశ్రమ ఇది. ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద రైల్వే నెట్‌వర్క్ మన భారతీయ రైల్వే. ప్రతిరోజూ 2 కోట్లకు పైగా భారత ప్రజలు రైల్వేను వినియోగించుకుంటున్నారు. ఇది భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వ రైల్వే పరిశ్రమ. పేద మరియు మధ్యతరగతి ప్రజలకు చౌకగా రవాణా సౌకర్యాన్ని అందిస్తూ, భారత ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోంది మన భారతీయ రైల్వే. ఈ బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం మన ఈ రైల్వే లోని రైల్వే స్టేషన్లు, ప్రొడక్షన్ యూనిట్లు, ప్యాసింజర్ రైళ్లు, డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు, కాంకోర్, ఐఆర్‌సిటిసి, ఖాళీగా ఉన్న రైల్వే భూములతో సహా ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని నిర్ణయించింది. గత మూడు దశాబ్దాలనుండి మనలను ఏలుతూ వస్తోన్న మన ప్రజా ప్రభుత్వాలు, లాభదాయకమైన ప్రభుత్వ రంగసంస్థలను ప్రైవేటు చేతులకు అప్పగిస్తూ వస్తున్నాయి,అందుకు తగ్గ విధానాలు రూపొందిస్తూ వస్తున్నాయి.. ఇప్పుడు ఈ బిజెపి ప్రభుత్వం మన భారతీయ రైల్వేను అన్యులకు అప్పగించాలని నిర్ణయించింది. ఈ ప్రైవేటీకరణ ప్రక్రియ బిజెపి నేతృత్వపు ఈ రెండవ పదవీకాలంలో అడ్డూ అదుపూ లేని స్థాయికి చేరుకుంది.

తమ మొదటి పదవీకాలం, 2014 లోనే, బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం, NITI అయోగ్ సభ్యుడు ఐన బిబెక్ డెబ్రాయ్ నేతృత్వంలో 'హై లెవల్ కమిటీ'ని ఏర్పాటు చేసి, రైల్వేను, ఆధునికీకరించడానికి, వరల్డ్ క్లాస్ స్థాయికి తేవడానికి అనే నెపంతో, మన భారతీయ రైల్వేను ప్రైవేటీకరించడానికి రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేయించింది.. వేదాలను, భగవత్‌గీతలను అనువదించిన ఘనుడు బిబెక్ డెబ్రాయ్, రైల్వేను ముక్కలుగా చేసి విభజించి కార్పొరేట్‌లకు అప్పగించాలని సిఫారసు చేశాడు. భారతీయ రైల్వేలు చేసే అన్ని కార్యకలాపాలలో అంటే.. నిర్మాణం, ఆపరేషన్స్., నిర్వహణ, రోలింగ్ స్టాక్, డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్, రైలు బండ్లు వీటిలోకి 100% FDI లకు అనుమతిని ప్రభుత్వం ప్రకటించింది.

2019లో, రెండవసారి అధికారంలోకి వచ్చిన అతి కొద్ది రోజుల్లోనే, కార్మిక ప్రయోజనాలను పరిరక్షించే ట్రేడ్ యూనియన్ల చట్టాన్ని బలహీన పరచడానికి సవరణలను ప్రకటించింది. ప్రభుత్వ యాజమాన్యంలోని లాభదాయక పరిశ్రమలన్నింటినీ భారతీయ, విదేశీ ప్రైవేటు కంపెనీలకు విక్రయించాలన్న తన ఉద్దేశాన్ని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రొడక్షన్ యూనిట్ల కార్పొరేటైజేషన్, ప్రైవేట్ రైళ్లను నడిపే ఉత్తర్వులతో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక వెలువరించింది. . రైల్వే స్టేషన్ల ప్రైవేటీకరణ తమ మొదటి పదవీకాలంలోనే ప్రారంభించేశారు.

యూనియన్లు మరియు ప్రజలచే పెద్ద ఎత్తున వ్యతిరేక ఆందోళనలు జరిగేందుకు అవకాశం లేని ఈ కరోనా లాక్‌డౌన్ కాలాన్ని, తమ ప్రైవేటీకరణ ప్రతిపాదనలన్నింటినీ వేగంగా అమలు చేయడానికి బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం పూనుకుంది. తద్వారా. లాక్‌డౌన్ కారణంగా కోట్ల మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారు. యువకులు తమ అస్పష్టమైన భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నారు. కోవిడ్ 19కి ముందు అప్పటికేతిరోగమనంలో ఉన్న ఎకానమీ ఇప్పుడు పూర్తిగా పడిపోవడమే కాదు, రుణాత్మకతను పొందింది. కోవిడ్ కారణంగా పెద్ద సంఖ్యలో ప్రజలు బాధల్లో ఉన్నారు మరియు ఉద్యోగాలు లేకుండా ఉన్నారు. ఈ క్లిష్ట సమయాన్ని, తన కార్పొరేట్ స్నేహితులకు రైల్వేలను విక్రయించడానికి స్వర్ణ సమయంగా బిజెపి ప్రభుత్వం ఎంచుకుంది . బిజెపి నేతృత్వంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రయివేట్ యజమానులకు అనుకూలంగా ఉండేట్లుగా కార్మిక చట్టాలను మార్చాలని, కార్మికులను బానిసలుగా మార్చడానికి చట్ట సవరణలు చేయాలని ఆదేశించింది, వెనువెంటనే అమలు చేయించింది. భారత రైల్వే ట్రాక్‌ల మీదుగా 109 మార్గాలలో, బెంగళూరు, చండీఘర్, జైపూర్, ఢిల్లీ,, ముంబై, పాట్నా, ప్రయాగరాజ్, సికింద్రాబాద్, విజయవాడ, హౌరా, చెన్నై, త్రివేండ్రం సహా 12 క్లస్టర్లలో 151 ప్రైవేట్ రైళ్లను నడపడానికి, 'రిక్వెస్ట్ ఫర్ క్వాలిఫికేషన్ బిడ్ (RFQ)ను ప్రభుత్వం ఆహ్వానించింది.

రైల్వేలను ప్రైవేటీకరించడానికే, ఉద్దేశపూర్వకంగా... ఉత్పత్తి, నియంత్రణ, ఆపరేషన్‌లను ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా వేరు చేయాలని బిబెక్ డెబ్రాయ్ కమిటీ సిఫార్సు చేసింది. ఆ సిఫారసులను అత్యంత ఆసక్తి, అంకితభావాలతో ఈ ప్రభుత్వం అమలు చేయడం ప్రారంభించింది.

ప్రత్యేకముగా రైల్వేను గురించి మాట్లాడి, చర్చించడానికి అవకాశమే లేకుండా రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్‌లో కలిపి వేశారు,.

రైల్వే బోర్డు నియంత్రణలోనికి రానివిధంగా, స్వతంత్ర, స్వయంప్రతిపత్త సంస్థలుగా డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, ఇండియన్ రైల్వే స్టేషన్స్ డెవలప్మెంట్ ఆథారిటీలను ప్రారంభించారు. ఇప్పటికే ప్రతి ఒక్క ఉత్పత్తి యూనిట్‌నూ ప్రైవేటీకరణకు వీలుగా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అనేక దేశాలలో ప్రైవేటీకరణ ఘోరంగా విఫలమైంది. కానీ, ప్రైవేటు, కార్పొరేట్ ప్రయోజనాలకు కట్టుబడి ఉన్న ఈ ప్రభుత్వం, ప్రైవేటీకరణలో ఇబ్బందులను, నష్టాలను పక్కనపెట్టి, ప్రయాణీకుల భద్రతకు హాని కలిగించేలా , రైళ్లను ప్రైవేటీకరించాలని నిర్ణయించింది. ప్రయివేటీకరణ వల్ల , ప్రయాణానికి పేద ప్రజలపై పడబోయే భారాన్ని పూర్తిగా విస్మరించింది. తమ ఈప్రయివేటీకరణ, అమ్మకపు వికృత చేష్టలకు అనుకూలంగాప్రభుత్వం చెబుతున్నా వాదన ఏమిటంటే,

ప్రయివేటీకరణ వల్ల ప్రపంచ స్థాయి ప్రయాణ అనుభవం, సామర్థ్యం, తక్కువ ప్రయాణ సమయం, అధిక ప్రమాణాలతో కూడిన సేవలు సాధ్యమవుతాయి, అదనంగా, ప్రైవేటీకరణ వల్ల ఉపాధి లభిస్తుందని, లావాదేవీల ఛార్జీలు, ఇంధన ఛార్జీల ద్వారా ప్రభుత్వం ఆదాయాన్ని పొందగలదని ప్రభుత్వం చెబుతోంది.. ఇవి తప్పుడు వాదనలు.

అనేక ప్రైవేట్ సంస్థలలో ప్రైవేట్ యజమానుల యొక్క నిర్లక్ష్యం కారణంగా జరిగిన పారిశ్రామిక ప్రమాదాలు, లెక్కకు మిక్కిలి జరిగిన మరణాలు, ఆపై జరిగిన విస్మరణలు మనం చూశాం.. భోపాల్‌లోని ప్రైవేట్ పరిశ్రమ ...యూనియన్ కార్బైడ్ పురుగుమందుల పరిశ్రమలో విష వాయువు లీక్ కావడం వల్ల 20,000 మంది ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు, మరియు వేలాది మంది తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగి దశాబ్దాలుగా బాధపడుతున్నారు.. విశాఖపట్నం సమీపంలో, దక్షిణ కొరియా ఎల్జీ పాలిమర్స్ కెమికల్ ప్లాంట్ యాజమాన్యంలోని పరిశ్రమలో గ్యాస్ లీకేజీ కారణంగా సమీప గ్రామాల్లో 12 మంది మరణించారు మరియు 1000 మందికి పైగా అనారోగ్యానికి గురయ్యారు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలాంటి అనేక ఉదాహరణలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నాయి . మన దేశంలో ప్రతి సంవత్సరం వందలాది పారిశ్రామిక ప్రమాదాలు జరుగుతున్నాయి, లాభాల అత్యాశగల ప్రైవేట్ యజమానులు, డబ్బును సంపాదించుకొనే ప్రయత్నంలో కార్మిక, ప్రజా భద్రతను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తారు..అది వీరి నైజం. ప్రైవేటు యాజమాన్యం కింద రైల్వేలలో భద్రత ఉంటుందని చెప్పడం ప్రజలను మోసగించడం, క్రూరమైన జోక్ తప్ప మరొకటి కాదు.

పంక్చువాలిటీ, ఎఫ్ఫిసియేన్సీలను సాధించడం ఎవరి ఆధిపత్యంలో రైల్వే నడుస్తున్నది అన్న దాని మీద ఆధారపడదు, వీటి సాధనకు ట్రాక్‌ల సమర్థవంతమైన నిర్వహణ, మెరుగైన సిగ్నలింగ్ వ్యవస్థ, రోలింగ్ స్టాక్ మొదలైన వాటితో పాటు తగిన సంఖ్యలో నైపుణ్యం గల సిబ్బందిని నియమించడం, రైల్వే యొక్క వివిధ విధుల మధ్య సమర్థవంతమైన సమయోజక సంబంధాలు ఉండాలి. ప్రభుత్వాలు వీటన్నిటినీ నిర్లక్ష్యం చేశాయి. 2017 నాటి “టాస్క్‌ఫోర్స్ ఆన్ సేఫ్టీ” లేదా 2015 రైల్వే మంత్రిత్వ శాఖ యొక్క 'వైట్ పేపర్' సిఫారసులను ఏ ప్రభుత్వమూ అమలు చేయలేదు. ప్రతి సంవత్సరం 4500 కిలోమీటర్ల పాత ట్రాక్‌ను మార్చాల్సిన అవసరం ఉందని అంచనా వేశారు. కానీ ఆర్థిక వనరుల కొరత అనే సాకుతో అది సాకారం కాలేదు. ఫలితంగా బ్యాక్‌లాగ్ పెరుగుతూనే ఉంది. అయినప్పటికీ భద్రతపై మంచి ట్రాక్ రికార్డ్‌ను మన రైల్వే కలిగి ఉంది. ఉత్పత్తి యూనిట్లు అనేవి 'భారతీయ రైల్వే రత్నాలు'. భారతీయ రైల్వే యొక్క 6 ఉత్పత్తి యూనిట్లు , 600 డీజిల్ మరియు ఎలక్ట్రిక్ లోకోలు మరియు 3000కి పైగా బోగీలను తయారు చేస్తాయి. అయినప్పటికీన్నీ ఈ రత్నాలన్నింటినీ అమ్మే విధంగా, వాటిని కార్పొరేషన్‌లుగా మార్చడానికి ఈ ప్రభుత్వం సిద్ధమవుతోంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లోని రైల్వే ప్రింటింగ్ ప్రెస్‌లను మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. బహుశా ఇది కూడా ప్రైవేటు రంగంలోని ప్రైవేట్ ప్రింటింగ్ ప్రెస్‌లకు ప్రయోజనం చేకూర్చేలానే ఉంటుంది. ప్రస్తుతం, ప్రయాణీకులపై ఛార్జీలు 53% ఖర్చుతో 47% సబ్సిడీతో ఇవ్వబడ్డాయి. ప్రైవేట్ పరం ఐతే ఈ రాయితీ చెల్లిపోవటమే కాదు ఛార్జీలు దాదాపు రెట్టింపు అవుతాయి. భారతీయ రైల్వే, ఇప్పటి వరకు పేదలు మరియు శ్రమించే ప్రజలకు సరసమైన రవాణా విధానం., ఇకపై అలా ఉండదు. కార్పొరేట్‌లు లాభాలను ఆర్జించడానికి వీలుగా భారతీయ రైల్వేలో ప్రయాణీకుల ఛార్జీలు పెంచబడతాయి. సామాన్య ప్రజల అవసరాలకు భరోసా ఇచ్చే బాధ్యతను వదలి, ప్రైవేటు కార్పొరేట్‌లకు లాభాలభరోసాను ఇవ్వడానికి ప్రభుత్వం పరమఆసక్తి చూపుతోంది.

ప్రభుత్వం ఇప్పటికే అమలు చేయడం ప్రారంభించిన బిబెక్ డెబ్రాయ్ కమిటీ సిఫారసులు మొత్తం భారతీయ రైల్వేను ప్రైవేటీకరణ చేయడం వైపునే ఉంది. ఈ సిఫార్సులు రైల్వేను ప్రజా సేవగా కాక వ్యాపార సంస్థగా మార్చుతాయి. వీరి ఈ పద్ధతి రైల్వేలో పనిచేస్తున్న 12 లక్షల మంది రైల్వే కార్మికులతో పాటు రైళ్ళలో రోజుకు ప్రయాణించే 2 లక్షల మంది సాధారణ ప్రజలను కష్టాలపాలు చేస్తుంది. గత ఇరవై ఐదు సంవత్సరాలలో రైల్వే ఉద్యోగుల సంఖ్యను తగ్గించడాన్ని ఒక విధానంగా అమలుచేస్తూ , 18 లక్షలుగా ఉండిన కార్మికుల సంఖ్యను 12 లక్షలకు తగ్గించారు, కానీ రైళ్లు 100% పెంచారు. ఇది ప్రస్తుతం ఉన్న ఉద్యోగులపై పనిభారాన్ని పెంచింది. కాంట్రాక్ట్ కార్మికులు, అవుట్సోర్స్ కార్మికుల సంఖ్య భారీగా పెరిగింది. ఇంతకుముందు రైల్వే ఇస్తూ ఉండిన పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఇప్పుడు కాంట్రాక్టర్లకు అవుట్ సోర్స్ చేయబడ్డాయి. కాంట్రాక్ట్ కార్మికులు అత్యంత అమానుష దోపిడీకి గురవుతున్నారు. వారికి సాధారణ కార్మికులకు చెల్లించే వేతనంలో మూడవ వంతు లేదా నాలుగవ వంతు మాత్రమే చెల్లిస్తారు. వారికి ఎటువంటి సామాజిక భద్రతా ప్రయోజనాలు అందించబడవు. సేవ చేయడం అనేది ప్రైవేటు రంగం యొక్క నినాదం కానేకాదు. ఇది ఇతరులకు సాయం, దాతృత్వం కోసం పెట్టుబడి పెట్టదు. ప్రైవేట్ రంగం లాభాల కోసం పెట్టుబడి పెడుతుంది. ఎక్కడ ఎక్కువ లాభాలు వస్తాయో, ఆ రంగాలనే అది ఎంచుకుంటుంది. ప్రైవేట్ రంగం తాను ఊహించిన లాభాలను పొందకపోతే తన దుకాణాన్నిఉన్నఫళంగా మూసివేస్తుంది మరియు ఆ సంస్థ నుండి వైదొలగుతుంది. ఇది ప్రజలకు కలిగే ఇబ్బందులు లేదా కార్మికులకు పోయే ఉద్యోగాల గురించి ఇసుమంత కూడా బాధపడదు. ప్రపంచవ్యాప్తంగా మరియు వివిధ రంగాలలో జరిగిన అనుభవం అది. రైల్వేలను ప్రైవేటీకరించి నాశనం అయిన గ్రేట్ బ్రిటన్ లాంటి దేశాల అనుభవాల నుండి పాఠాలు నేర్చుకోవటానికి మన ప్రభుత్వం ఇష్టపడకపోవడం విచారకరం.. వీళ్ళు చేపడుతున్న చర్యలు.. తీవ్రమైన జాతీయ వ్యతిరేక మరియు విధ్వంసక విధానాలు. దేశంలోని ప్రతిష్టాత్మక సంస్థ అయిన భారతీయ రైల్వేలను ప్రైవేటీకరించడం మరియు బయటి వారికి అప్పగించడం భారతీయులుగా, భారతీయ రైల్వే కార్మికులుగా మేము సహించమని బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వానికి బలమైన హెచ్చరిక పంపుదాం. తన ప్రమాదకరమైన ప్రణాళికతో దేశాన్ని అపాయంలోకి నేడుతుంటే, కార్మికుల ఐక్య గొంతులను మరియు శ్రమించే ప్రజలందరి మనోభావాలను విస్మరిస్తే, కార్మికవర్గం నిరవధిక దేశవ్యాప్త సమ్మెకు సిద్ధమవ్వడం తథ్యం అని హెచ్చరిస్తున్నాం.

తిరిగొస్తున్నారు..

- పి.సుకుమార్

హైదరాబాద్‌లో ఆరు నెలల తర్వాత సిటీ రోడ్లపై మళ్లీ ట్రాఫిక్ పెరుగుతోంది. లాక్‌డౌన్ టైమ్‌లో ఇక్కడ ఉపాధి లేకపోవడం, కరోనా కేసులు పెరుగుతుండటంతో లక్షల మంది సొంతూళ్లకు వెళ్లిపోయారు. ప్రస్తుతం గ్రామాల్లోనూ కరోనా కేసులు వస్తుండగా, అన్‌లాక్ తర్వాత సిటీలో ఆఫీసులు, వ్యాపార సంస్థలు మళ్లీ ఓపెన్ అవుతుండగా తిరిగొస్తున్నారు. అలా వస్తున్న వారిలో ఉద్యోగులు, చిరు వ్యాపారులు ఎక్కువగా ఉన్నారు. కొందరు ఫ్యామిలీస్‌ని ఊళ్లలోనే ఉంచి సింగిల్‌గా వస్తుంటే, మరికొందరు ఫ్యామిలీతో వస్తున్నారు. దాంతో క్రమంగా ట్రాఫిక్ పెరుగుతోంది. అన్‌లాక్-1లో సిటీలో 10కిలో మీటర్లు ప్రయాణించాలంటే 20 నిమిషాలు పట్టింది. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ఖైరతాబాద్, ప్యారడైస్, అఫ్జల్‌గంజ్ , ఎల్‌బీనగర్, హయత్‌నగర్, ఉప్పల్, చాదర్‌ఘాట్, కోఠి, దిల్‌సుఖ్‌నగర్, కర్మాన్‌ఘాట్, బేగంపేట్, పంజాగుట్ట, సికింద్రాబాద్ వంటి ఏరియాల్లో జర్నీకి ఇప్పుడు మామూలు రోజుల్లాగే టైమ్ పడుతోంది. లాక్‌డౌన్‌కు ముందు పరిస్థితులు కనిపిస్తున్నాయి. మరో ఐదు రోజుల్లో మెట్రో సేవలు కూడా ప్రారంభం కానుండగా ట్రాఫిక్ మరింత పెరగనుంది. జీహెచ్‌ఎంసీ పరిధిలో కరోనా వ్యాప్తి తగ్గుతోందని అధికారులు ప్రకటిస్తుండటంతో సిటీకి తిరిగొస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. వారం రోజులుగా టీ స్టాల్స్, ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ సెంటర్లతో పాటు వీధి వ్యాపారాలు మళ్లీ ప్రారంభమవుతున్నాయి. దాదాపు 40 శాతం తెరుచుకున్నాయి. రోడ్లపైకి జనం వస్తుండటంతో బిజినెస్‌లు బాగానే సాగుతున్నాయి. పలు ప్రైవేట్ సంస్థలు కూడా ఓపెన్ అవుతున్నాయి. అవసరానికి అనుగుణంగా ఉద్యోగులను మళ్లీ డ్యూటీలోకి తీసుకుంటున్నాయి. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్? లేక జనాల్లో ఓన్ వెహికల్స్ యూసేజ్ పెరిగింది. కరోనా భయంతో ఆటోలు, క్యాబ్‌ల్లో తిరిగేందుకు కూడా ఎక్కువ మంది ఇంట్రెస్ట్ చూపడం లేదు. సొంత వెహికల్స్ తోనే రోడ్లపైకి వస్తుండడంతో రద్దీ పెరిగింది. లేనివారు కొత్తవి కొనుగోలు చేస్తున్నారు. అన్‌లాక్ ప్రారంభమైనప్పటి నుంచి కార్ల వాడకం ఎక్కువైంది. సిటీ రోడ్లు, బిజినెస్ ఏరియాల్లో రద్దీ పెరుగుతుండగా జనం మాత్రం కనీస జాగ్రత్తలు పాటించడంలేదు. చాలామంది మాస్కులు పెట్టుకోవడంలేదు. ఫిజికల్ డిస్టెన్స్ మాట మర్చిపోతున్నారు. పెద్ద మార్కెట్ల నుంచి కాలనీల్లో దుకాణాల వరకూ పరిస్థితి ఇలాగే ఉంది. టీ స్టాళ్లు, టిఫిన్ సెంటర్లు, వైన్స్ లాంటి చోట్ల జనం గుమిగుడుతున్నారు. వెహికల్స్ పై తిరిగేప్పుడు మాస్క్ లేకుంటే పోలీసులు ఫైన్ వేస్తున్నా పెద్దగా మార్పు కనబడటం లేదు.



ఖైదీలు కూడా వారే...

జి.చిన్నబ్బాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి, UTF విశాఖపట్నం జిల్లా.



ముస్లింలు, దళితులు, ఆదివాసీలు దేశ జనాభాలో 39శాతం మాత్రమే ఉన్నప్పటికీ... దేశంలోని జైళ్లల్లో మగ్గుతున్న ఖైదీల్లో వీరు 51శాతానికి పైగా ఉన్నారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నివేదిక జైళ్లలో ఖైదీల గణాంకాలను బట్టబయలు చేసింది. 2011 జనాభా లెక్కల ప్రకారం ముస్లింలు, దళితులు, ఆదివాసీలు సంఖ్య దేశ జనాభాలో 39.4శాతం. ఈ మూడు సామాజిక వర్గాలు దేశంలో ఆర్థికంగా, సామాజికంగా అత్యంత వెనకబడిన వర్గాలు. వీరిలో అక్షరాస్యత శాతం కూడా తక్కువే. ఇక పాఠశాల, ఉన్నతవిద్య స్థాయి చాలా పరిమితంగా ఉంటుంది. అయితే వీరిలో పేదరికం, నిరుద్యోగం శాతం మాత్రం అత్యధికం. సమాజంలో ఇతర సామాజిక వర్గాలతో పోలిస్తే భూమి కలిగి ఉన్నవారి సంఖ్య వీరిలో చాలా స్వల్పం. ఇవి కాకుండా వీరిపై ఉన్నత వర్గాలుగా పిలవబడేవారి సామాజిక అణిచివేత, హింస, వివక్ష కొనసాగుతూనే ఉంటుంది. దళితులు, ఆదివాసీలు శతాబ్దాల వారసత్వంగా సామాజిక అణిచివేతకు గురవుతుంటే, ముస్లింలపై ఇటీవల కాలంలో సంఘపరివార్ అనుబంధ శక్తులు దాడులు, అణిచివేతకు తెరతీశాయి. వీరిపై కేంద్రం, వివిధ రాష్ట్రాల్లో బీజేపీ నేతత్వంలోని ప్రభుత్వాలు, వివిధ సంస్థలు కలిసి దుర్మార్గం, ద్వేషపూరిత హింసలో కొత్త చరిత్రకు తెరతీశాయి. దేశంలోని జైళ్ల పరిస్థితి అమెరికా లోని జైళ్ల పరిస్థితి గుర్తు చేస్తుంది. అమెరికా ప్రభుత్వ వివరాల ప్రకారమే జనాభాలో నల్లజాతీయులు (ఆఫ్రికన్-అమెరికన్) కేవలం 13 శాతం కాగా, అక్కడి జైళ్లలో మాత్రం వీరి సంఖ్య 40 శాతానికి పైగా ఉంది.

ఇక భారత్‌లో నిందితులు, విచారణలో ఉన్న వారితో సహా మొత్తం ఖైదీల్లో ముస్లింల సంఖ్య 18.1శాతం. అయితే 2011 లెక్కల ప్రకారం దేశ జనాభాలో ముస్లింలు 14.2శాతం మాత్రమే ఉన్నారు. అలాగే జనాభాలో 16.6శాతం ఉన్న దళిత ఖైదీల విషయంలో మాత్రం 21.2శాతం. ఆదివాసీల విషయంలోనూ ఈ వ్యత్యాసం ఇదే విధంగా ఉంది. జనాభాలో 8.6శాతం మాత్రమే ఉన్న ఆదివాసీలు, జైళ్లలో మాత్రం 11.5శాతంగా ఉన్నారు. దాదాపు ప్రతీ రాష్ట్రంలోనూ పరిస్థితి ఇదే విధంగా ఉన్నా.. ఉత్తరప్రదేశ్, గుజరాత్, అసోంల్లో మాత్రం చాలా తీవ్రంగా ఉంది. గుజరాత్‌లో ముస్లింల జనాభా కేవలం 10శాతం... అయితే ఇక్కడ జైళ్లల్లో మాత్రం వీరి సంఖ్య 27శాతం. దేశంలోనే ఇది దారుణం. తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తుంది. ఉత్తరప్రదేశ్ జనాభాలో 20శాతం ఉన్న ముస్లింలు, ఖైదీల్లో 27శాతం ఉన్నారు. దేశంలో ముస్లింలు ఎక్కువగా ఉన్న రాష్ట్రం అసోంలో ముస్లింల సంఖ్య 34శాతమైతే, జైళ్లలో ఉన్న వారిలో వీరి సంఖ్య 45శాతం (జమ్ము కాశ్మీర్, లక్షద్వీప్‌ల్లో ముస్లింలు సంఖ్య ఎక్కువగా ఉన్నా అవి కేంద్ర పాలిత ప్రాంతాలు). పైన పేర్కొన్న మూడు రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు ఉన్న విషయం ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పనిలేదు. గుజరాత్‌లో 25ఏండ్ల నుంచి బీజేపీ అధికారంలో ఉంది. అలాగే ముస్లింలు గురించి గొప్పగా చెప్పుకునే మమతా బెనర్జీ ముఖ్యమంత్రిగా ఉన్న పశ్చిమబెంగాల్‌లోనూ ఇదే పరిస్థితి. ఇక్కడ ముస్లింల సంఖ్య జనాభాలో 27శాతం కాగా, ఖైదీల్లో మాత్రం వీరి సంఖ్య 37శాతానికి పైనే. ముస్లింలపై పైపై మాటలకే మమతా ప్రభుత్వం పరిమితం అవుతుందని ఇది నిరూపిస్తోంది. వివిధ రాష్ట్రాల్లో దళితులు, ఆదివాసీల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. ముస్లింలు, దళితులు, ఆదివాసీల్లో ఎక్కువ మంది ప్రజాస్వామ్య డిమాండ్లతో నిరసనలు చేసినందుకే నిర్బంధించబడి ఉన్నారు. అటవీ భూమి స్వాధీనం చేసుకోవడం, వనరుల దోపిడీ, కుల, మత దురాగతాలను వ్యతిరేకించడం వంటి ఆందోళనల్లో వీరు కేసులు ఎదుర్కొంటున్నారు.

పేదరికం కారణంగా వీరంతా పోలీసు దర్యాప్తు నుంచి కోర్టుల్లో విచారణ వరకూ సరైన న్యాయ సలహాలను పొందలేకపోతున్నారు. వీరు తమ వెనకబాటుతనంతో పోలీసులు, కోర్టుల నుంచి డాక్యుమెంట్ కాపీలు పొందలేకపోతున్నారు. సరైన సమాచారం లేకపోవడంతో తద్వారా చట్టపరమైన ప్రాథమిక హక్కులను కూడా ఉపయోగించుకోలేక పోతున్నారు. పేదలు కావడంతో బెయిల్, పెరోల్, ఉన్నత కోర్టులకు పిటిషన్ వేయడం వంటి వాటికి నిపుణులైన న్యాయవాదుల సేవలను పొందలేక పోతున్నారు. అలాగే పేదరికమే వీరికి ప్రధానమైన అడ్డంకి కాదు. ముస్లింలు, దళితులు, ఆదివాసీలుపై పోలీసులు, కోర్టుల వివక్ష, ఉన్నత కులాలపై ప్రదర్శించే పక్షపాతం కూడా ఒక కారణం.

2019 జాతీయ క్రైమ్ బ్యూరో రికార్డులు ప్రకారమే భారత జైళ్లలో 30శాతం మంది మాత్రమే దోషులుగా నిర్ధారించబడిన ఖైదీలు. 69 శాతం మంది నిందితులు, విచారణలో ఉన్నావారు. మిగిలిన 1శాతం నిర్బంధించిన వారు లేదా ఇతర ఖైదీలు. విచారణలో ఉన్న వారిలో పైమూడు వర్గాలకు చెందిన వారే అధికంగా ఉన్నారు. ఎందుకంటే సరైన వనరులు లేక వీరంతా బెయిల్ పొందలేకపోతున్నారు. ముఖ్యంగా పైన చెప్పుకున్నట్టు పేదరికమే ప్రధాన కారణంగానే వీరు జైళ్లలో మగ్గిపోతున్నారు. ఖైదీల్లో ముస్లింలు, దళితులు, ఆదివాసీల సంఖ్యను నిరోధించడానికి ప్రభుత్వాలు ఎలాంటి ప్రయత్నం చేయడం లేదు. అలాగే ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన చట్టపరమైన, జైలు సంస్కరణల కమిషన్‌లు కూడా ఈ విషయాన్ని పక్కన పెట్టాయి. ఈ పరిస్థితిని మార్చడానికి తమ హక్కులు, రక్షణ కోసం ముస్లింలు, దళితులు, ఆదివాసీలు మరింత పోరాటం చేయాలి. ముఖ్యంగా తిరోగమన, అస్పష్టమైన ప్రభుత్వం ఉన్న ప్రస్తుత సమయంలో వీరంతా తమ పోరాటాన్ని మరింత విస్తృతం చేయాలి. అప్పుడే ఈ పరిస్థితి మారే అవకాశం ఉంది.

ఆ చూపులు నేరుగా

గుండెను చీలుస్తున్నాయి!

పిల్లలకు తిండిపెట్టలేకపోతున్నాననే
నిస్సహాయత

ఆ చూపులు ప్రశ్నిస్తున్నట్టున్నాయి!

కరోనా సృష్టించిన భీభత్సం

అభాగ్యుల జీవితాలను ఛిద్రం చేశాక

నడిరోడ్డే నట్టిల్లయ్యింది!

ఏ అయ్యో కనికరించకపోతాడా

ఈ పిల్లలకు ఒక ముద్ద పెట్టకపోతానా

కళ్ళు దివిటీలు చేసుకుని చూస్తోంది!

ఓ నా దేశమా!

లక్షల కోట్ల పథకాలు వీళ్ళకెందుకు?

చచ్చాక ఇచ్చే డబ్బులు లెందుకు?


కాంచెం బువ్వంటే వీళ్ళకి పెట్టండయ్యా చాలు!!

డా.గూటం స్వామి,
(9441092870)



64 విద్యలు(కళలు)అంటే ఏవి?

– పి.సుమతి, అధ్యాపకురాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, విశాఖపట్నం



మనకు తెలుసు మన భారతీయ సంస్కృతిలో 64 కళలు లేక విద్యలు ఉన్నాయి. మొదట 64 విద్యలను తెలియజేసే శ్లోకం.

వేద వేదాంగేతిహాసాగమ, న్యాయకావ్యాలంకార, నాటక, గాన కవిత్వ కామశాస్త్ర శకున, సాముద్రికారత్న పరీక్షాస్వర్ణపరీక్షా శ్వలక్షణ, గజలక్షణ, మల్లవిద్యా, పాకకర్మ దోహళ గంధవాద ధాతువాద ఖనీవాద, రసవాదాగ్నిస్తంభజలస్తంభ వాయుస్తంభ ఖడ్గస్తంష, వశ్యాకర్షణ మోహన విద్వేషణోచ్చాటన మారణ కాలవంచన వాణిజ్య, పాశుపాల్య కృష్యా సవకర్మలావుక యుద్ధమృగయా, రతికౌశలా దృశ్యకరణీద్యూతకరణీ చిత్రలోహ పాషాణ మృద్దారు వేణు చర్మాంబరక్రియా చౌర్యౌషధసిద్ధి స్వరవంచనా దృష్టివంచనాంజన, జలప్లవన వాక్సిద్ధి, ఘటికాసిద్ధి, ఇంద్రజాల మహేంద్రజాలాఖ్య చతుష్షష్టివిద్యా నిషద్యాయమాన నిరవద్య విద్వజ్ఞాన విద్యోతితే.

అర్థము:

1. వేదములు (ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము అధర్వణవేదము అను నాల్గు)
2. వేదాంగములు– వేదములకు సంబంధించిన ఆరుశాస్త్రములు (1.శిక్షలు 2. వ్యాకరణము 3. ఛందస్సు 4. జ్యోతిషము 5. నిరుక్తము 6. కల్పములు అని వేదాంగములు. ఆరు శాస్త్రములు)
3. ఇతిహాసములు – రామాయణ,మహాభారత, భాగవతం పురాణాదులు
4. ఆగమశాస్త్రములు– 1. శైవాగమము 2 పాంచరాత్రాగమము 3 వైఖానసాగమము 4 స్మార్తాగమము అని ఆగమములు నాల్గు.
5. న్యాయము: తర్కశాస్త్రమునకు పేరు
6. కావ్యాలంకారములు : సాహిత్యశాస్త్రము
7. నాటకములు
8. గానము (సంగీతం)
9. కవిత్వము ఛందోబద్ధముగ పద్యమునుగాని శ్లోకమునుగాని రచించడము
10. కామశాస్త్రము
11. ద్యూతము (జూదమాడడము): జూదమునకు సంబంధించిన సూక్తములు ఋగ్వేదములో కొన్ని ఉన్నాయి. వీనికే అక్షసూక్తమనియునందురు. కార్తిక శుద్ధ పాఢ్యమినాడు జూదమాడవలయుననియు శాస్త్రవచనములుగలవు. ఇదియు నొకకళ,
12. దేశభాషాజ్ఞానం
13. లిపికర్మ దేశభాషలకు సంబంధించిన అక్షరములు నేర్పుగ వ్రాయు విధానము.
14. వాచకము ఏగ్రంధమైననూ తప్పులేకుండ శ్రావ్యముగ నర్థవంతముగ చదువు నేర్పు
15. సమస్తావధానములు: అష్టావధాన, శతావధాన, నేత్రావధానాది, అవధానములలో నైపుణ్యము
16. స్వరశాస్త్రము ఉచ్ఛ్వాస నిశ్వాసములకు సంబంధించినదై ఇడా పింగళా సుషుమ్న నాడులకు చేరినదై చెప్పబడు శుభాశుభ ఫలబోధకమైన శాస్త్రము,
17. శకునము ప్రయాణ కాలమున, పక్షులు జంతువులు మానవులు, ఎదురురావడం గూర్చి గాని, ప్రక్కలకు వెళ్ళడం గూర్చి భాషించు భాషణములను గూర్చి, గమనించి తన కార్యము యొక్క శుభాశుభముల నెరుంగునట్టి శాస్త్రము
18. సాముద్రికము హస్తరేఖలు, బిందువులు, వగైరాలను గుర్తించి శుభాశుభముల నెరుంగజేయు శాస్త్రము
19. రత్నపరీక్షో నవరత్నాల గురించి వాటి ప్రభావం, వాటి నాణ్యత మొదలగు గుణాల సంపూర్ణజ్ఞానం
20. స్వర్ణపరీక్ష బంగారమును గుర్తించు జ్ఞానము
21. అశ్వలక్షణము గుఱ్ఱములకు సంబంధించిన జ్ఞానము
22. గజలక్షణము ఏనుగులకు సంబంధించిన జ్ఞానము
23. మల్లవిద్య కుస్తీలు పట్టు విధానము
24. పాకకర్మ వంటలు
25. దోహళము వృక్షశాస్త్రము
26. గంధవాదము వివిధములైన సువాసన వస్తువులు అత్తరు పన్నీరు వంటివి తయారుచేయు నేర్పు
27. ధాతువాదము రసాయన వస్తువులు నెరుంగు విద్య
28. ఖనీవాద– గనులు వాటి శాస్త్రం .
29. రసవాదము – పాదరసము మొదలైన వానితో బంగారు

మొదలైనవి చేయు నేర్పు.

30. అగ్నిస్తంభన – అగ్నిలో కాలకుండ తిరుగాడు రీతి.
31. జలస్తంభన – నీళ్ళను గడ్డగట్టించి, నందులో మెలంగుట.
32. వాయుస్తంభన – గాలిలో తేలియాడు విద్య
33. ఖడ్గస్తంభన – శత్రువుల ఖడ్గాదులను నిలుపుదల జేయు విద్య
34. వశ్యము – పరులను, లోబచుకొను విద్య
35. ఆకర్షణము – పరులను, చేర్చుకొను విద్య,
36. మోహనము – పరులను మోహింపజేయు తెరంగు.
37. విద్వేషణము – పరులకు విరోదము కల్పించడము,
38. ఉచ్చాటనము – పరులను ఉన్నచోటునుంచి వెళ్ళగొట్టడము,
39. మారణము – పరులకు ప్రాణహాని గల్గించడము.
40. కాలవంచనము – కాలముగాని కాలమున పరిస్థితులు మార్పు గలిగించడము.
41. వాణిజ్యము – వ్యాపారాదులు.
42. పాశుపాల్యము – పశువులను పెంచడములో నేర్పు.
43. కృషి – వ్యవసాయ నేర్పు.
44. ఆసవకర్మ – ఆసవములను, మందులను చేయు రీతి
45. లాపుకర్మ – పశుపక్ష్యాదులను స్వాధీనబరచుకొను రీతి.
46. యుద్ధము – యుద్ధముచేయు నేర్పు.
47. మృగయా – వేటాడు నేర్పు
48. రతికళాకౌశలము – శృంగార కార్యములలో నేర్పు.
49. అదృశ్యకరణీ – పరులకు కానరాని రితిని మెలంగడము.
50. ద్యూతకరణీ – రాయబార కార్యములలో నేర్పు.
51. చిత్ర – చిత్రకళ
52. లోహా – పాత్రలు చేయి నేర్పు
53. పాషాణ – రాళ్ళు చెక్కడము (శిల్పకళ)
54. మృత్ – మట్టితొ చేయు పనులలో నేర్పు
55. దారు – చెక్క పని
56. వేళు – వెదరుతో చేయు పనులు
57. చర్మ – తోళ్ళపరిశ్రమ.
58. అంబర – వస్త్ర పరిశ్రమ
59. చౌర్య – దొంగతనము చేయుటలో నేర్పు
60. ఓషధసిద్ధి – మూలికలద్వారా కార్యసాధనావిధానము
61. మంత్రసిద్ధి – మంత్రములద్వారా కార్యసాధనము
62. స్వరవంచనా – కంఠధ్వనివల్ల ఆకర్షణము
63. దృష్టివంచన – అంజనవంచన – చూపులతో ఆకర్షణము
64. పాదుకాసిద్ధి – ఇంద్రజాల మహేంద్రజాలములు తలచినచోటికి ఇంద్రజాలములనెదు గారడీ విద్య.

సంసారమంటే నీళ్ళమీద నడక కదా!!?

దుగ్గినపల్లి ఎజ్రాశాస్త్రి

దేహం బదా, బదలైంది
సూదిలేని మాసికలేస్తున్నా
ప్రతీ మాసిక వెనకాల ఓ మర్మం ఉంది !

పాత చర్మానికి కొత్త చర్మం అతకదుగా
అతికినా అది అతుకు, అతుకే కదా !?
గతుకుల బతుకే కదా?

ఒకసారి దేశంలాంటి దేహంలోకి
తొంగిచూడు
అనేక గదులున్నాయి, గది ,గదికి
ఓ మర్మముంది ! రా చూద్దువుగాని !
దేహంలో ప్రవేశించాలంటే పాస్పోర్ట్
అక్కర్లేదు
పవిత్రత ఉండాలి ! మరి చూస్తావా ?

నూరేళ్ళంత జీవితం కలిసి నడవాలి
నడుస్తావా ? ఇడుస్తావా ?
ప్రపంచంలో పాదానికో చరిత్ర ఉంది
మనిషికి ప్రాణం కంటే పాదం గొప్పది
ఆ పాదాలకు నమస్కరించాలి! నడుస్తావా !

అయినా మాసికను తడిమిచూడు
రసికారుతున్న గాయాలున్నాయి
గాయాల వెనకాల గాధలున్నాయి
అనేక బాధలున్నాయి!

అయ్యోపాపం నిట్టూర్పులు
ఒట్టి మాటల మూటలు వద్దు
సూరు కింద నిలబడితే సూర్యుడు
ఎదురొస్తాడు ! నట్టింట్లో నిలబడితే
నిలువెల్లా తడుస్తావు...రా చూడు

నా దేహాంతరలో పయనిస్తావా
పేదిరిక ఆనవాళ్ళను పరిశోదిస్తావా

పస్తులు ఉంటావా ? ఉపవాసాలు కాదు
ఉత్తినీళ్ళుతాగిన కాళీకడుపు చెప్పే
కథలు వినాలి, దేహానికి మానని
మాసికలేసుకోవాలి బతుకంటే ఇదే

కాళీ గిన్నెలకు మాసికలాంటి
మాట్లేసుకోవాలి
చిల్లులు బడ్డా దేహాన్ని
మోసుకు తిరుగుతుండాలి

నాలుగు గింజలు చల్లితే రెక్కలార్చుకుంటు
పక్షులు వాలొచ్చు, బియ్యపుగింజలతో
సంసారాలు సాగవు, సంసారమంటే
సాగరం కదా ? నీళ్ళమీద నడవాలి!

అమ్మకు సాయం చేయండి

రామ గౌతమ్



ఆ కాలంలో అంటే మా తాతలకాలంలో బామ్మ, అమ్మమ్మ, తాతమ్మ తరంలో మనిషోకో రకం ఐటమ్ వండటం అనేది లేదు.

ఒక కూర, పప్పు, పచ్చడిల, రసము లేదా పులుసు (పెరుగు లేదా మజ్జిగ సిద్ధం చేసి) ఒకేసారి వండేసి, దేవతార్చన చేసుకుని, వాళ్ళ వరకు విడిగా మడిగా తీసుకుని వంట గదిలో నుండి బయటకు వచ్చేసేవారు.

రాత్రికి అల్పాహారము ఏ ఉప్పు పిండో, దిబ్బరొట్టో వేసుకుని తినేసేవారు. ఎవరైనా రాత్రి భోజనము చేసేవారుంటే, వారే వేడిగా ఏ కూర ముక్కో వేయించుకుని , పొద్దున తినగా మిగిలిన పదార్థాలు వేసుకుని వాటితో తినేసేవారు. మరి ఈ కాలంలో మనిషికో రకం. భర్త తినేది పిల్లలు తినరు. అత్త గారు తినేది భర్త తినడు. పిల్లలు తినేది భర్త, అత్తగారు వేలేసి ముట్టుకోరు. వంట చేయడమంటే ఈ రోజుల్లో అంటే మహా యజ్ఞం చేసినట్లే. ముఖ్యంగా పిల్లలు చాలామంది ఇళ్ళల్లో భోజనము చేయడానికి చాలా పేచీ పెడుతున్నారు చచ్చి చెడీ మనిషోకో రకం చేసినా, తీరా భోజన సమయానికి పీజాలు, పానీ పూరీలు, కుర్ కురేలు లాంటి జంక్ ఫుడ్స్ బయట తినేసి ఇంటికి వస్తారు.

అమ్మ భోజనం చేయ మానగానే, నాకాకలిగా లేదు. అన్నం వద్దని మారాం చేస్తారు. ఈ మారానికి ఆడ మగ తేడా అనేదే లేదు.

పిల్లలంటే ఏ పదేళ్ళ లోపు వారంటే మీరు పప్పులో కాలేసినట్లే.

ఇంజనీరింగ్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుకునే యువతీ యువకులు కూడా ఇందులో ఏమీ మినహాయింపు కాదు.

వాళ్ళమ్మలకు తిండి దగ్గర ఎంత వరకు నరకం చూపించాలో అంత వరకు చూపిస్తారు రాత్రి 11 దాటినా అన్నం తినరు వండిన కూరలు అన్నం చూసుకుని తల్లి దిగులుపడి తినమని బ్రతిమలాడితే అమ్మ మీద దయ తలచి "అయితే మాకు ముద్దలు కలిపి పెట్టు. అలా పెడితేనే తింటాం " అని అమ్మకు కండిషన్ పెడతారు.

పగలల్లా గొడ్డులా ఇంటి చాకిరీ సమస్తం చేసి, అర్ధరాత్రి దస్సిపోయి నిద్ర కళ్ళతో తూగుతూ అమ్మ ఈ పిల్లలకు ముద్దలు కలిపి నోట్లో పెట్టాలి

ఈ ముద్దలు కలిపే ప్రహసనం రాత్రే కాదు ఉదయం కూడా . ఒక డిష్‌లో కలిపిన అన్నం తీసుకుని, అమ్మ పిల్లల వెనక పిల్లలు స్కూల్‌కు, కాలేజీకి బయల్దేరే దాకా వారి వెనకాల పరిగెత్తుతూనే ఉంటుంది.

ఉద్యోగాలుచేసే మాతృమూర్తులకు మరిన్ని సమస్యలు అదనం వాస్తవానికి భోజనము చేయడానికి ఎంత సేపు పదుతుంది చాలా విశ్రాంతిగా తిన్నా 20 నిముషాలు మించి పట్టదు.

రోజు మొత్తములోని 24 గంటలలో 20 నిముషాలు భోజనము చేయడానికి సమయం పిల్లలకు దొరకదా వారు ఆ 20 నిముషాల సమయాన్ని కూడా తమంతట తాము తినడానికి కేటాయించ లేరా ?

సమయం దొరకక పోవడానికి ప్రధాన కారణం, రాత్రి పది లోపు పడుకుని ఉదయం 5 గంటలకు లేవ వలసిన పిల్లలు, రాత్రి ఒంటి గంట దాకా టీవిలో నానా చెత్త ప్రోగ్రాంలు చూసి అప్పుడు పడుకుని ఉదయం 9,10 గంటలు దాటాక లేచి, ఉరుకులు పరుగులు పెదుతూ "టిఫిన్ వద్దు, భోజనము వద్దు, లంచ్ బాక్స్ వద్దు టైం లేదు "అని నానా హడావుడి చేసి అమ్మను నానా హైరాన పెట్టేస్తారు తర్వాత వీళ్ళకు పెళ్ళిళ్లై, ఉద్యోగాలకు పరిగెత్తుతూ, పిల్లల్ని కని అమ్మ నెత్తిన పడేసి, తమ సంతానానికి కూడా చాకిరీ చేసే ఆయాగా అమ్మను చేసేస్తారు.

మళ్ళీ అమ్మ కష్టాల కథ ప్రారంభం ..

అప్పటికే ఆ తల్లులకు 60 దాటి పోయి వయస్సు పై బడి, శరీరంలో ఓపిక నశించి, కాళ్ళ నెప్పులు, కీళ్ళ నెప్పులు, బి .పి . , షుగర్, ఆయాసం, నీరసం, గుండె దడ వంటి వ్యాధులతో పీడించబడి బాధపడుతూ చాకిరీ చేయలేక, చేయడానికి ఓపిక లేదని ఎవరికీ చెప్పుకోలేక తమ లో తామే నా జీవితం ఇంతేనా ఈ చాకిరీకి అంతం లేదా ? దేవుడా !! ఏం పాపం చేసాను అని శోకించిన తల్లుల గురించి కూడా నాకు తెలుసు. అలాంటి వారిని నేను ప్రత్యక్షంగా చూసాను. వాళ్ళు మాత్రం ఎన్నాళ్ళని చాకిరీ చేస్తారు.

ఈ బాధలు చాలవన్నట్లు, భర్త ఆఫీసు నుంచి లేటుగా విసుగ్గా వచ్చి అడుగుతాడు భార్యను " పిల్లలు భోంచేసారా "అని. "ఇంకా తినలేదండీ "అనగానే కారణం దొరికింది కనుక "పిల్లలకు అన్నాలు కూడా పెట్టకుండా ఇంతవరకు నువ్వు వెలగబెదుతున్న రాచకార్యమేమిటి ?" అని భార్య మీద ఇంతెత్తున ఎగిరి పడతాడు. ఆ సమయానికి ఆ ఇల్లాలు అప్పుడే తీరుబడై ఏ టీవి నో చూస్తూ కూచుని ఉందనుకోండి, ఇక ఆయన ఉగ్ర నరసింహావతారం దాలుస్తాడు.

అంటే వేళకి భోజనము చేయని పిల్లల వల్ల మాటలు పడుతోంది మీ అమ్మ గారు. గ్రహించారా ?

మరి దీనికి పరిష్కారం? -

తన తల్లి పడుతున్న కష్టాన్ని సంతానమైన అబ్బాయి కాని అమ్మాయి కాని గ్రహించాలి. అర్ధం చేసుకోవాలి ..

తల్లికి సాయంచేసే విషయంలో ప్రతి బిడ్డా భాగం పంచుకోవాలి, వంటలో సాయం చేసే మాట దేవునికి ఎరుక. కనీసం మీ తిండి అయినా మీరు తినక పోతే ఎలా ?

25 ఏళ్ళు వచ్చినా డిగ్రీలు పూర్తయాక కూడా అమ్మ అన్నం ముద్దలు కలిపి మీ నోట్లో పెట్టాలంటే ఆమెకు ఒంట్లో ఓపిక ఉండవద్దా ?

ఈ విషయాలు కూడా చదువుకున్న వారికి మరొకరు చెప్పాలా..?

మాకన్నా ఉన్నతమైన చదువులు చదువుతున్న వారు మీరు,

మీ అంతట మీరే ఆలోచించుకోండి ...

అమ్మ కనిపించే దేవత, ఆమె కంట నీరొలకనివ్వకండి. పువ్వుల్లో పెట్టి చూడండి. నవమాసాలూమోసి, కని, దాసీగా మనలను సాకుతున్న దేవతామూర్తికి మనం ఏమిచ్చినా తక్కువే. ప్రతీ మాతృమూర్తికీ పాదాభివందనం.

ఆపండెహే మిండనాయాళ్లారా!??

డా.గూటం స్వామి

మీవి రథాలే కాలుతున్నాయ్
మావి గుడిసెలు
గుడిసెలతోపాటు మనుషులు
కాలుతున్నారు!
మా గుడిసెలు కాలుతున్నప్పుడు
ఎవడూ ధర్నాలు చేయలేదు
రోడ్డెక్కి చిందులెయ్యలేదు
బడాయి పత్రికలు ఎలాంటి రాతలు
రాయలేదు

మీ గుడులు మీకెంతో
మా గుడిసెలు మాకంత!
మీ గుడులు మీకు పవిత్రమైతే
మా గుడిసెలు మాకు పవిత్రం!
ఎవడో అనామకుడు మీవేవో తగలబెట్టారని
రగిలిపోతున్నారు
మరి మా గుడిసెలు తెలిసినవారే
తగలబెడుతుంటే మాకెంతమండాలి?

ఉన్నాడో లేడో తెలియని దేవుడు కోసం
రథాలు సిద్ధం చేస్తారుగాని
ఇక్కడ ప్రాణమున్నవాడికి మాత్రం ఇల్లే
ఉండదు!
మీకు అన్యాయం జరిగితే సిబిఐ లు
మాకు అన్యాయం జరిగితే ఏమీలేవు!

పసలేని ఆందోళనలు ఆపండి!
మీ ఓటుబ్యాంక్ రాజకీయాలకు స్వస్థి
పలకండి!
రథాలు ఎవరు తగలబెడుతున్నారో
విగ్రహాలు ఎవరు ధ్వంసం చేస్తున్నారో
మీ అంతరాత్మకు తెలుసు
ఆపండెహే మీ శిఖండి వేషాలు!

నాకింక లోకంతో పని ఏ ముంది??

- కొడుకుల శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్



మూడు దశాబ్దాల కిందట ఇదే రోజు తెలుగు సినిమా మనసు మూగబోయింది. పాటకు మనసు తడిని అద్దిన కవి ఆత్రేయ. మనోలోతుల్ని అక్షరాల్లో రంగరించి ప్రతి గుండెకు పాటల రూపంలో అందించిన మనస్వి. నాటకాలతో ప్రజాచైతన్యానికి బాటలు వేసిన అభ్యుదయవాది. అలతి పదాల్లో అనల్పార్థాన్ని నింపిన భావకుడు. తెలుగుతెర వెండి పాటల్లో చందమామలా ప్రకాశించే సూర్యుడు ఆత్రేయ." ఆత్రేయ అసలు పేరు కిళాంబి వేంకట నరసింహాచార్యులు. నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట తాలూకా మంగళంపాడులో మే7, 1921ల జన్మించాడు. చిన్ననాడే తల్లి మరణించింది. వీరిది ఆత్రేయ గోత్రం. అందుకే పేరును గోత్రంతో కలిపి ఆచార్య ఆత్రేయ అని పేరు పెట్టుకున్నాడు. సంతోషానికి, దుఃఖానికి స్పందించని హృదయం ఉండదు. స్పందనకి పసితనము, ముది తనములతో నిమిత్తము లేదు. అందుకే నేమో వారి పాటలకీ, మాటలకీ అందరూ మంత్ర ముగ్ధులవుతారు.

ఆత్రేయ గురించి ఏమన్నా చెప్పాలి అంటే, తెలుగులో వేరే మాటలు, పదాలు లేవు, వారు వాడిన పదాలతోనే, వారి మాటలతోనే, వారి పాటలతోనే వారి గురించి చెప్పాలి. వేరే మార్గం లేదు.

"ముద్ద బంతి పూవులో, మూగ కళ్ళ ఊసులూ,... బాసలూ" చెప్పాలన్నా? "ఈనాడే ఏదో అయ్యింది... అందాల లోకం రమ్మంది" అని ప్రేయసీ ప్రియులని ఉక్కిరిబిక్కిరి చెయాలన్నా? "మూగ మనసు" యొక్క భాష చెప్పాలన్నా? "మంచు కురిసే వేళలో మల్లె విరిసే దెందుకో" ఆలోచన చేయాలన్నా?

"మధ్యతరగతి జీవుల బతుకు బండి" గూర్చి చెప్పాలన్నా "విశ్వజనీన సమస్యలు" వెలికి తీయలన్నా అది కేవలం ఆత్రేయకు మాత్రమే సాధ్యమైనది.

"రాక రాక వొచ్చావు చందమామ" అంటూ చల్లని తేనెలూరు తెలుగు పాటని చిత్ర రంగానికి పరిచయం చేసి. "తేట తేట తెలుగులా తెల్లవారి వెలుగులా" అంటూ తెలుగు పాటల్లోని, తెలుగు దనాన్ని తెలుగు వారికి అందించి, "ఆడుతూ పడుతూ పనిచేస్తుంటే అలుపు సొలుపేమున్నది" అంటూ పాటలు పాడుతూ పనిచేస్తూ ఉంటే ఆ మధురిమ ఎలా ఉంటుందో వివరించారు. అలాగే "శిలలపై శిల్పాలు చేక్కినారు మనవారు సృష్టికే అందాలు తెచ్చినారు" అంటూ తెలుగు చలన చిత్ర ప్రపంచానికే తలమాణికమైన అత్యద్భుతమైన పాటలను అందించారు. ఊటీ వెళ్ళాలని

ఎందరికో

అనిపించినా వెళ్ళగలిగేది కొందరే... వెళ్ళలేని వాళ్ళు ప్రేమించిన వ్యక్తి ఎదుట ఉంటే "వేరే నందనవనాలు ఎందుకో" అని సరిపెట్టుకోవడమూ కద్దు. ప్రేమ "తో" ప్రేమ "లో" విహరించటానికి ఎక్కడకు వెళ్ళాలి? అంటే ఈ సమాధానం చూడండి. "సూరీ చంద్రులతోటి, చుక్కలతోటి ఆటాడుకుందాము. ఆడనే ఉందాము" ఇక్కడ అక్కడా కాదు.... ఏకంగా చుక్కలతో ఆడుకొని ఆడనే ఉందాం అనే భావం ఓ అద్భుతం కాదా? ఎక్కడకీ వెళ్ళడానికి వీలు లేదా? అయితే "జగతిని ఉన్నది మనమిద్దరమే అనుకొని హత్తుకుపోతూ" ఉంటే సరిపోతుందట, ఇటువంటి "భావోద్వేగం ఒక్క కిళంబి వేంకట నరసింహాచార్లుకే చెల్లింది. ఎవరా కిళంబి? ఇలా అసలు పేరు చెబితే చాలా మందికి తెలియకపోవచ్చు. కానీ... 'మనసుకవి' అంటే ఆత్రేయని తెలియని వారుండరు.

ప్రియమైన వారితో ఎలా ఎక్కడ గడపాలో వారినే అడిగి తెలుసుకోవాలి. కాకతాళీయం కాకపోతే టైటానిక్ సినిమాలో గుర్రపుబండి దృశ్యం గుర్తుందా? డ్రైవర్ సీట్లో కూర్చొన్న హీరో వెనక నున్న హీరోయిన్‌తో 'ఎక్కడకు తీసుకెళ్ళాలి మేడమ్ అని అడిగితే ఆ "అందం" ఆనందంగా "చుక్కల దగ్గరకే పోనీ" అంటుంది.

సంగీతానికున్న శక్తి ఎంతటిదో కొత్తగా చెప్పనక్కర్లేదు. "మనసునే మురిపించు" గానం, సంగతీ చెప్పనక్కర్లేదు ఆ సరాగాలకు చక్కటి సాహిత్యం తోడయితే ఇంకేం చెప్పక్కర్లేదు. అయితే సాహిత్యం అంటే "పాండిత్యం" అనుకుంటారు. కానీ పాండిత్యం పండితులకే పరిమితం. సామాన్యుడికి చేరలేదు. పాట ముఖ్యంగా సినిమా పాట ఎలా ఉండాలి? యతులు, గుతులు, ప్రాసలు... కొండొకచో సంస్కృత సమాసాలతో రాసిన తెలుగుపాటలు ఎన్నో ఉన్నాయి.

అయితే ఆత్రేయ రాసిన పాటలలో అద్భుతమైన పద ప్రయోగాలు గానీ యతిప్రాసలు గానీ సాధారణంగా ఉండవు. "కవిత సౌరభం" అంటారే అటువంటి వ్యాఖ్యానాల జోలికి పోనవసరం ఉండదు. చాలా

తేలికగా ఉంటాయి పదాలు. అందుకే అన్నారు. ఆత్రేయ వ్రాసిన దానికి బాణీ కడితే పాట అవుతుంది. లేదంటే 'మాటలు'గా తీసేసుకోవచ్చును. అసలు మరి ఆత్రేయ గొప్పదనం ఎక్కడుంది. ఆయన వాడే పదాలు తేలికయినవే కానీ భావమెంతో ఘనమైనది.

"మనసు మూగదే కానీ బాసున్నది దానికి, చెవులుంటే మనసుకే వినిపిస్తుంది ఇది" "ముద్దబంతీ పువ్వులో (మూగమనసులు) పాటలోని పై చరణాలలోని భావం కట్టిన రాగం కట్టిపడేస్తాయి.. కాస్త గట్టిగా ఆలోచిస్తే పై భావాన్ని మరింత గ్రాంధికంగా చెప్పొచ్చు.... కాని ఉపయోగం... ఫలితం... శూన్యం.... అర్ధంకాని గ్రంథాలెందుకు?

"బాస... మూగది... చెవులు..." వాటిని మార్చలేం.ప్రత్యామ్నాయాలను సూచించటం కష్టం.

ఎందుకంటే అవి తిన్నగా మనసును తాకాయి మరి. మనసు కదలాలి అంటే ముందుగా "అర్ధం" కావాలి కాదా.

ఒక చెడువార్తని అర్ధంకాని బాషలో నవ్వుతూ చెబితే ఎలా ఉంటుంది.? బాధ కలగదుగా. ఏడుస్తూ చెబితే కనీసం ఏదో నష్టం జరిగిందనుకోవచ్చు. ఏ భావమైనా మనసును తాకితేనే అది పండుతుంది.

మరి "మనసుకు' సంబంధించిన విషయం "మనసుకు" తాకాలంటే... ఆత్రేయలాగే చెప్పాలి.

కొన్నింటిని "ప్రామాణికాలు"గా ఎన్నికచేసి భద్రపరుస్తూ ఉంటారు. ఉదాహరణకి "దర్శకత్వం" శాఖకుగాను "దొంగరాముడు" సినిమాను పూనే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ వాళ్లు భద్రపరిచారు.

"కొందరి జీవితాలను ఆదర్శప్రాయంగా పరిగణించి పాఠ్యపుస్తకాలలో కూడా చేరుస్తుంటారు. ఆ విధంగా చూస్తే మనసుకు సంబంధించిన సినీ సాహిత్యంలో పేటెంట్ రైట్స్ ఆత్రేయవే.

"మనసు మూగది... మాటలు రానిది, మమత ఒకటే అది నేర్చినది" (ఏ తీగపూవ్వులో... మరో చరిత్ర).. అలాంటి మనసు మీద "మౌనమే నీ భాష ఓ మూగమనసా" (గుప్పెడు మనసు) పాట ఓ సిద్ధాంత గ్రంధం వంటిది.

"ఊహల ఉయ్యాలవే.. మాయల దెయ్యానివే..." ఈచరణం చాలు కదా!

ఇంకా సరిపోకపోతే...

"ఒక పొరబాటుకు యుగములు పోగిలేవు"

ఈ చరణం చాలు కదా! "ఒక పొరబాటుకు యుగములు పోగిలేవు" ఈ చరణాన్ని అర్ధం చేసుకొని నడుచుకొటే "నేటి మానసిక సమస్యలన్నీ" తీరిపోతాయి. "మనసున్న మనుషులే మనకు దేవుళ్లు. మనసూ కలిసిననాడే మనకు తిరనాళ్లు" "గుండె మంటలారిపే చన్నీళ్ళు కన్నీళ్ళు ఉండమన్న ఉండవమ్మ చాన్నాళ్ళు..." మూగమనసులు చిత్రం మనసుకవికి పరాకాష్ట. సమస్యలకి మూలం... అర్థం చేసుకోవటం చేసుకోకపోవటం... సరిగ్గా అర్థం చేసుకొంటే రెట్టింపు అవుతుంది. మనసును అర్థం చేసుకోవడం ఎలా? కొంతమంది అర్థం అయినట్లే ఉంటారు కాని అర్థం కారు.

ఎందుకంటే...

"కళ్లల్లో ఉన్నదేదో కన్నులకే తెలుసు. రాళ్లల్లో ఉన్నదేదో కళ్లకెలా తెలుసు.. నాలో ఉన్న, మనసు నాకు గాక ఇంకెవరికి తెలుసు' అంటూ 'అంతులేని కథ'లో పాడినట్టు అంతా తెలుసుకోవటం సరికాదు.

నిజానికి ఎవరికి వారే అవతల వారిది 'తప్పు' తమదే 'ఒప్పు' అనుకొంటూ సమస్యలు పెంచుకొంటారు. ఏమీ తెలియదనుకొంటే ఎంతో ఉత్తమం.

మనసుకు కావలసిందేమిటో చెప్పటం. కావలసింది అసలు దొరకక పోయినా, దొరికింది చేజారిపోయినా, మనసు పడే వేదనని చెప్పటం, అది మనసు కదిలేలా చెప్పటం ఆత్రేయ ప్రత్యేకత. 'నీ జతలో చల్లదనం... నీ ఒడిలో వెచ్చదనం'

ధనవంతుల జాబితాలో ఉండాల్సింది. బిల్‌గేట్స్ లేదా ఓ అజీమ్ ప్రేమ్‌జీ కాదు.... పై రెండు "దనాలు" కల్గిన వాడే అసలైన ధనవంతుడు. ఈ చరణాలను విశ్లేషిస్తే ఎంతో అర్థం ఉంది. అసలు.... సంసారం అంటే "కనులు కనులతో కలబడితే" (సుమంగళి) కలలొస్తాయిట.. ఆ కలలో ఎవరైనా కలబడితే కారణం మరులట.... ఈ మరులు మనువుకు దారి తీస్తాయట... ఆ మనుగడ పేరే సంసారమట.... సరే మనసు పడినది దొరికితే బాగానే ఉంటుంది. దొరకకపోతే "ఆత్రేయ విశ్వరూపం" కనబడుతుంది. "ఆ ఆశ్రమ వాసిది కరగని హృదయం" అయితే ఈ "ప్రేమ పిపాసిది తీరని దాహం" మరి (ఇంద్రధనస్సు) "అగ్గివంటి వలపంటించి హాయిగా" ఉందామనుకొంటున్న ఆ హృదయంలేని ప్రియురాలని (కన్నెమనసులు) చిరుజల్లులా చిలికి పెనువెల్లువలా ఉరికి సుడిగుండంలా ఎందుకు వెలిసావు? అసలు ఎందుకు కలిసావంటూ ప్రశ్నించి తన గాయం ఆమెకు తీరని తాపం కావాలను కొంటాడు.

"ప్రేమభిక్ష పెట్టి పేద హృదయాన్ని" పగులుకొట్టడమే కాకుండా "పాత్ర కూడా లేచి బిచ్చగాడిని" చేసి పోతే "ఎవరికోసం" (ప్రేమనగర్) బతకాలనుకొంటాడు? అయితే ఆమెను పసిపాపలా చూసుకొన్న ఆమెకోసం గుండెను గుడి చేసినా, వదిలి వెళ్ళిపోతే ఆమె మాత్రం. "ఎక్కడ ఉన్నా ఏమైనా" మురళీకృష్ణ) సుఖంగానే ఉండాలని కోరుకుంటాడు. "ప్రేమ ఎంత మధురమైనా ప్రియురాలు కఠినం (అభినందన)గా ఉంటే ఏం చేస్తాడు పాపం. వలపువలె తీయగా (సుమంగళి) నిండుగా వచ్చినా మెరుపులా మెరిసి పోతుంది మరి. "గుండెలో పల్లవించమంటాడు తన పాటకు పల్లవి కమ్మంటాడు." (కోకిలమ్మ) వినకపోతే.... "నీ విరహంలో బ్రతికాను.... "ఈ విషంతో మరణిస్తాను" అంటాడు పాపం....

ఎన్నో విధాలుగా "మనసున్న మనిషికి సుఖము లేదంతే" (ప్రేమనగర్) అని నిర్ధారించారు. కోర్టు గుమాస్తాగా జీవితం ప్రారంభించినా క్విట్ ఇండియా ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొని జైలుజీవితం కూడా చవి చూశారు. 1951లో దీక్ష సినిమాతో సినీరంగ ప్రవేశం చేయడానికి ముందు రంగస్థలానికి ఆయన ఎనలేని సేవనొనర్చారు. సినీరంగంలో కథా రచన, మాటలు, పాటల విభాగాలలో పాలు పంచుకొంటూ "తోడికోడళ్ళు, మాంగల్యబలం, వెలుగునీడలు, మూగమనసులు, జయభేరి, పెళ్లికానుక వంటి ఎన్నో చిత్రరాజాల విజయాలలో ప్రముఖ పాత్రను వహించారు. 'వాగ్దానం' చిత్రానికి దర్శకతం కూడా నెరపారు. తొలితెలుగు వానపాట

"చిటపట చినుకులు" (ఆత్మబలం) ఆయనదే.. వాన పాటలలో అదే ఎప్పటికీ మొదటి స్థానంలో ఉంటుంది. "చిటపట"ని చిటాపటా" అని సాగదీసి "చిటాపటా చినుకులతో కురిసింది వాన... మెరిసింది జాణ" (అక్కాచెళ్ళెళ్లు) అంటే రాసిన మరో వానపాట కూడా ప్రజాదరణ పొందింది. హార్ట్ స్పెషలిస్ట్ కాబట్టి కన్నెపిల్ల గుండెను శోధించి ఆమె ఆశలను వెలికి తీసిన పాట "చందమామా"... "తేనే మనసులు" అనేపాట. "పెళ్ళిచూపులకు వారొచ్చారు.. చూడాలనినే ఒరగ చూసా...." పాటలో అన్నీ "కన్నెపిల్ల" వంటి సున్నిత భావాలే... భక్తి పాటలు రాయడం తక్కువే అయినా రాసినవి ఆణిముత్యాలు. "శేషశైలా వాసా శ్రీశ్రీనివాసా..." "ఎన్నాళ్ళని నా కన్నులు కాయగ ఎదురు చూతురా గోపాలా... (వెంకటేశ్వర మహాత్యం). కారులో పోయే అందాలనెన్నింటోనో చూస్తుంటాం కానీ ఆయన మనసు కవి కాబట్టి "కారులో షికారు కెళ్లే (తోడికోడళ్ళు) పాల బుగ్గల చిన్నదానికా ఎరుపు ఎలా వచ్చిందో చెబుతాడు. "నిన్ను మించిన కన్నెలెందరో మండుటెండలో మాడిపోతే అనేసరికి ఎందరికో శ్రీశ్రీ కనిపించాడు. ఆత్రేయలో... అయితే ఆత్రేయని "బూత్రేయగా" విమర్శించిన సందర్భాలు కూడా ఉన్నాయి కొన్ని చరణాలు కాస్త మొరటుగా చెప్పిన మాట నిజమే కాని మనసులో పుట్టిన భావాన్ని యధాతథంగా చెప్పడం ఆయన నైజం మరి. "ఎట్టాగో ఉన్నాది ఓలమ్మి ఏటేటో అవుతోంది చిన్నమ్మి (దసరాబుళ్ళోడు) కత్తిలాంటి పిల్ల తగిలితే అలాగే ఉంటుంది మరి....

"చెంగావి చీర కట్టుకున్న చిన్నదాన్ని" (బంగారు బాబు) చూస్తే దిమ్మతిరిగి పోదామరి! పడుచు గుండె బిగువులు సడలిపోనివ్వనని, దుడుకుగ ఉరికిన పరువానికి ఒడుపు తగ్గిపోదనీ.... చేతిలోచేయ్యేసి (దసరాబుల్లోడు) చెప్పమన్నాడంటే సమంజసమే కదా! "పిక్కల పై దాకా చుక్కల చీరకట్టి పిడికెడంత నడుము చుట్టు పైట చెంగు బిగకట్టిన చిన్నది వస్తానంటే పడిచస్తా కాళ్ళకాడ (కడవెత్తుకొచ్చింది...'ప్రేమనగర్') అని అనుమానం కలగదా? మరి పైకి చెప్పక పోయినా గుండెలోతుల్లో భావాలిలాగే ఉంటాయి. ఆయన బయటకు చెప్పేసాడు అంతే.

"విధి చేయు వింతలన్నీ (మరోచరిత్ర) మతిలేని చేష్టలేననీ" అనుకొని వేగిపోకుండా, "అనుకొన్నామని జరగవు అన్నీ... అనుకోలేదని ఆగవు కొన్ని... జరిగేవన్నీ మంచికని... అనుకోవడమే మనిషి పని..." (మురళీ కృష్ణ) అని పాడించినా... పూలదండలో, పాలగుండెలలో ఏమున్నదో తెలిసిన ఆత్రేయ.

ప్రియుడి చేత "ప్రియతమా నా హృదయమా" అంటూ ప్రేయసే ప్రియుడి హృదయమనిపించినా, "ఎదుటా నీవె ఎదలోనా నీవె" అంటూ ప్రేయసి తన గుండెలోతుల్లోనే ఉందనిపించినా, "సిరి మల్లె పువ్వల్లె నవ్వు చిన్నారి పాపల్లె నవ్వు" అని ప్రియురాలి ఆనందాన్ని కోరుకున్నా, ఆనంద పారవశ్యంతో ఉన్న అదే ప్రియుడి చేత "ప్రేమ ఎంత మధురం ప్రియురాలు ఎంత కఠినం" ప్రియురాలి కఠినత్వాన్ని ఎత్తిచూపినా, "ప్రేమ లేదని ప్రేమించ రాదనీ" అని భగ్న ప్రేమను చూపినా, అది కేవలం ఆత్రేయకే చెల్లుతుంది. మనసెరిగిన "మన'సు'కవి" కే చెల్లుతుంది.

అలాగే, "సాపాటు ఎటు లేదు పాటైనా పాడు బ్రదర్" అంటూ పొట్ట చేత పట్టుకొని నగరాలకు వొచ్చిన నిరుద్యోగ యువతకు చేయూతనిస్తూ "పోరా బాబు పోరా, ఎలుకోరా నీ గమ్యం చేరుకోరా" వారిని ప్రోత్సహించారు.

మరోచోట, "ముద్ద బంతి పువ్వులో" దాగి ఉన్న ఊహల్ని వెలికి తీసి, "నువ్వు లేక వీణ పలుకలేనన్నది" అంటూ తెలుగు సినీ ప్రపంచాన్ని ఉహలోకంలో విహరింప చేశారు.

అంతే కాదు, "నీ సుఖమే నే కోరు కున్నా" అంటూ తెలుగు సాహితీ ప్రియుల సుఖాన్ని కాంక్షించారు. "తెల్ల చీర కట్టు కున్నది ఎవరి కోసము" అంటూ కొంటె ప్రశ్న వేసి, అప్పటి కుర్రకారును ఉర్రూతలూగించి, "కుర్రాళ్ళోయ్ కుర్రాళ్ళు వెర్రెక్కి ఉన్నోళ్ళు" అని అంటూ, "వేళా పాళ లేదు ఈ కుర్రాళ్ళాటకు" అంటూ చమత్కరించారు.

అంతే కాక, "కన్నులు కన్నులతో కలబడితే" ఏమౌతుంది అని సూటి ప్రశ్న సంధించి "కళ్ళలో ఉన్నదేదో కన్నులకే తెలుసు" అంటూ "నా మాటే నీ మాటై చదవాలి" అని అంటూ "పల్లవించవా నా గొంతులో పల్లవి కావా నా పాటలో" మాట లేక పోతేనేమి "మౌనమే నీ భాష ఓ మూగ మనసా" అన్నారు ఈ విధంగా మనసులో పలికే మాటలు మనసెరిగిన "మన 'సు' కవి" కి తప్ప మరెవ్వరికి కుదురుతుంది?

అంతే కాక, "మనసు గతి ఇంతే మనిషి బ్రతుకింతే" అంటూ మనసు మనిషికి మధ్య జరిగే ఘర్షణను ఈ మనోహరమైన కావ్యంద్వారా వెలిబుచ్చారు.

"భారత మాతకు జేజేలు" అంటూ దేశ భక్తిని కూడా చాటి చెప్పారు.

"ఉన్నావా అసలున్నావా? ఉంటే! కళ్ళు మూసుకున్నావా?" అంటూ దైవాన్ని నిలదీసిన ఘనత ఆత్రేయదే? మరి ఇంతలోనే ఆ స్వామి సాక్షాత్కారము లభించిందేమో "శేషశైల వాస శ్రీ వేంకటేశ" అంటూ తన దైవ భక్తి తత్పరతఃను చాటి చెప్పారు.

ఆత్రేయ తమ రచనల ద్వారా, పాటల ద్వారా, కవితల ద్వారా తెలుగు వారి గుండెల్లో సుస్థిర స్థానాన్ని ఏర్పరుచుకొని, సెప్టంబర్ 13 1989న సినీ ప్రేమికుల నుంచి, సాహితీ ప్రియుల నుంచి శాస్వితంగా సెలవు తీసుకున్నారు. బహుశా తన నిష్క్రమణం ముందుగా ఉహించారో ఏమో? వారి మరణానికి కొంచెం ముందు తన చరమగీతాన్ని తానే ఈ క్రింది తేటగీతి పద్యంలో వారే వ్రాసుకున్నారు.

చలన చిత్ర నిర్మాతలు సంతసిల్ల

సురకవి వరుండిది విని యచ్చెరువు పొంద

గురువు మల్లాది, శ్రీశ్రీయు సరస నుండ

తరలె నాత్రేయ పరమపదమ్ము చేర! రాయక నిర్మాతలనీ... రాసి ప్రేక్షకులనీ ఏడిపించి...

మనకెన్నో తీపిగురుతులను మిగిల్చి.... పోయిన మంచోడు!

'పోయినోళ్లు అందరూ మంచోళ్ళు' అని మనమంతా నిట్టూరుస్తూ పాడుకోవడం తప్ప ఏం చేయగలం??



ఓ రాజకీయ ఫ్లాప్ "షో"

- వాసుశ్రీ, సీనియర్ జర్నలిస్ట్

రాజ్యాంగమెంత మంచిదైనా పాలకులు మంచి వారు కాక పోతే అది చెడుగా మారుతుంది. ఎంత చెడు రాజ్యాంగమైనా పాలకులు మంచి వారైతే మంచిది గా మారుతుంది." అని డా.అంబేద్కర్ ఆనాడే చెప్పారు. బహుశా ఇలాంటి వాళ్ళుని ఉద్దేశించి ఏమో. అతను జన్మతః దళితుడు. క్రైస్తవ మతం పుచ్చుకున్నాడు, ఆ మత ప్రచారకుడిగా ఏకంగా ఫాస్టర్‌గా కూడా పనిచేసారు. ప్రభుత్వ ఉద్యోగం వచ్చాక క్రైస్తవ మతం అవసరం తీరిపోయింది. అవినీతి పనులతో బాగా కూడబెట్టి రాజకీయాలలో ప్రవేశించారు. తారా జువ్వలా పైకి వెళ్ళి కిందకి రాలిపోయారు. పార్టీ మార్చారు పెద్దగా లాభించలేదు దీంతో ఆయన మతమే మార్చాసారు పంచెకట్టి బొట్టుపెట్టి పెద్ద హిందూ స్వామి అవతారం ఎత్తారు. ఆయనే మన మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు. మతాలు మార్చిన ఈ ప్రబుద్ధుడి రాజకీయ ఫ్లాప్ "షో" ఇప్పుడు మరింత వెలవెల.

రాజకీయాలు ఎంత చిత్రంగా వుంటాయో ఈ మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబుని చూసి అంచనా వేయొచ్చు. తాడికొండ మండలం రావెలలో 1959 మార్చి 11న జన్మించిన కిశోర్‌బాబు 1973లో అమరావతి ఎస్ఆర్‌కె ఉన్నత పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసాన్ని పూర్తిచేసారు. గుంటూరు ఏసి కళాశాలలో ఇంటర్, అమరావతి ఆర్‌వివిఎస్ కళాశాలలో డిగ్రీ, ఆంధ్రాయూనివర్సిటీలో ఎం.ఎ, నాగార్జునవిశ్వవిద్యాలయంలో ఎంఫిల్ చేశారు. తొలుత ప్రకాశం జిల్లా ఒంగోలులోని ఎబిఎం డిగ్రీ కళాశాలలో ఆర్థికశాఖ అధ్యాపకుడిగా చేరిన ఆయన అనంతరం ఎస్‌బిఐలో ప్రొబెషనరీ అధికారిగా గుజరాత్‌లో పనిచేసారు. 1987లో సివిల్స్ (UPSC) రాసి ఐఆర్‌టిఎస్‌కు ఎంపికయ్యారు. 1989లో దక్షిణ మధ్య రైల్వేలో ఉన్నతోద్యోగం పొంది వివిధ శాఖల్లో సీనియర్ లెవెల్ అధికారిగా విధులు నిర్వహించారు. 2000-2002 మధ్య ఢిల్లీలో దివంగత లోక్‌సభ స్పీకర్ జి.ఎం.సి.బాలయోగి వద్ద ఆంతరంగిక కార్యదర్శిగా పనిచేసారు. తర్వాత 2004 వరకు కాన్షిరాం ఫౌండేషన్ జాతీయ డైరెక్టర్‌గా, తరువాత దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డెప్యూటీ కమర్షియల్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2009 నుంచి 2012 వరకు కులీకుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ హైదరాబాద్‌లో అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేసారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో అధికారిగా బాధ్యతలు నిర్వహించిన కిశోర్‌బాబు 2014 ఏప్రిల్ 15న తన ఉద్యోగానికి రాజీనామా చేసి సార్వత్రిక ఎన్నికల్లో ప్రత్తిపాడు నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా వైసిపి అభ్యర్థిని మేకతోటి సుచరితపై విజయం సాధించారు. నాలుగేళ్ల కిందట ఆయన ఓ ప్రభుత్వ ఉద్యోగి. మూడేళ్ళకి ముందు హఠాత్తుగా టీడీపీ ఎమ్మెల్యే టికెట్ సాధించారు. అది కూడా సాక్షాత్తు బీజేపీ అగ్రనేత అద్వానీ సిఫార్సుతో. మూడేళ్లప్పుడు తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొన్నారు, గెలిచారు, మంత్రి కూడా అయ్యారు. నాలుగు నెలల కిందట ఆ మంత్రి పదవి కోల్పోయారు. రాజకీయాల్లో ఇంత వేగంగా ఎదిగి అంతే వేగంగా కిందకు పడిపోయిన వ్యక్తి గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే రావెల కిశోర్‌బాబు.

పదవిలో వున్న మూడేళ్లపాటు రావెల మీద ఎన్నో వివాదాలు. కేంద్ర రాష్ట్ర సంబంధాలు అంతంత మాత్రంగా వున్న తరుణంలో బీజేపీతో పొత్తు గురించి తిరిగి ఆలోచిస్తామని చెప్పి సీఎం చంద్రబాబు చేతిలో చీవాట్లు తిన్నారు. ఇక రావెల కొడుకు హైదరాబాద్‌లో ఓ వివాహితని వేధించిన కేసు విషయం అందరికీ తెలిసిందే. ఆ ట్రెండ్ కంటిన్యూ చేస్తూ ఆయన పుత్రరత్నం గుంటూరులో ఓ మహిళా హాస్టల్ ముందు చేసిన రచ్చ ఇంకా జనం మర్చిపోలేదు. ఇక తన భద్రత కోసం వున్న సెక్యూరిటీ సిబ్బంది కళ్లుగప్పి కొన్ని గంటలపాటు మాయమైపోయిన రావెల అప్పట్లో ఓ సెన్సేషన్. ఇక ఆయన మమ్మల్ని పట్టించుకోవడం లేదని నియోజకవర్గ ప్రజలు ఫిర్యాదులు చేశారు. ఇక ఓ మైనారిటీ మహిళా నాయకురాలు (అప్పటి జిల్లాపరిషత్ చైర్మన్) మంత్రిగా వున్నప్పుడే రావెల మీద మీడియాకి ఎక్కి తన గోడు వెళ్లబోసుకుంది. ఇన్ని జరిగినా రావెల రూట్ మారలేదు. మంత్రి పదవి ఊడుతుందని తెలిసాక తెగింపు ఎక్కువయ్యింది.

చంద్రబాబు సర్కార్‌ని టార్గెట్ చేసిన మందకృష్ణమాదిగకి ఏపీలో అన్ని విధాలుగా రావెల అండదండగా వున్నారని లోకం కోడై కూసినా, సాక్షాత్తు బాబు ఆ విషయం లేవనెత్తినా ఆయన ట్రాక్ మార్చుకోలేదు. పైగా ఓ వైపు మందకృష్ణకి షెల్టర్ ఇచ్చి అదే టైంలో సీఎంతో సమావేశం అయిన ఘన చరిత్ర ఆయనది. ముచ్చటగా మూడు పార్టీలు... రావెల కిశోర్‌బాబు రాజకీయ అరంగేట్రం చేసిన అనతికాలంలోనే మూడు పార్టీలను మార్చారు. ఇది ఆయన నిలకడలేని మనస్తత్వానికి నిదర్శనం. రాజకీయాల్లో ఓర్పు సహనం అవసరం. ఈ విషయం గత ఎన్నికల ఫలితాలే నిరూపించాయి. అధికారం కోసం, ఎమ్మెల్యే కావడం కోసం, మంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం కోసం ఎందరో ఏళ్ల తరబడి నిరీక్షించారు. పార్టీలు మారిన వారు ఉన్నప్పటికీ సమయస్ఫూర్తితో అప్పటికప్పుడు ప్రజానాడిని పట్టుకున్న నేతలు కూడా పదవులను పొందగలిగారు.

కాని రావెల కిశోర్ బాబుకు రాజకీయ వ్యూహాలేమీ తెలియవని దాదాపుగా అర్థమయిపోయింది. రావెల కిశోర్‌బాబు 2014 ఎన్నికల్లోనే రాజకీయ అరంగేట్రం

తరువాయి 42,43పేజీలలో



తీగల వంతెన

ప్రకృతి ఒడిలో హరివిల్లు విరిసిందా అన్నట్లు.. ఎన్నెన్నో వర్ణాలు.. అన్నింటా అందాలతో మురిసి.. మెరుస్తున్నది దుర్గం వారధి. ప్రగతికి చిరునామగా నిలిచి.. భాగ్యనగర సౌభాగ్యాన్ని ఇనుమడింపజేస్తున్నది. ఏండ్ల తరబడి పరాయి పాలనలో వెనుకబడిన చారిత్రక నగరం.. స్వరాష్ట్రంలో విశ్వనగర కాంతులద్దుకొని.. దేదీప్యమానంగా వెలిగిపోతుంటే.. అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నదీ అపురూప కట్టడం. అద్భుత ఛాయాచిత్రంగా ఆవిష్కృతమై.. చూపరుల మనసు కట్టిపడేస్తున్నదది. దుర్గం చెరువు తీగల వంతెన నిర్మాణ పనులు ఈ ఏడాది అక్టోబర్ చివరికల్లా పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్ తెలిపారు. పనులు ఎటువంటి ప్రమాదాలకు తావులేకుండా అత్యంత సురక్షితంగా, నాణ్యంగా, వేగంగా కొనసాగుతున్నాయన్నారు. దుర్గం చెరువు తీగల వంతెన పనులను ప్రభుత్వ మున్సిపల్ వ్యవహారాల శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ లోకేష్ కుమార్ మాట్లాడుతూ, మూడులేన్ల వాహనాల రహదారితోపాటు ఇరువైపులా వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్‌ను కూడా ప్రత్యేకంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు.

అంతేకాకుండా సుమారు రూ. 10కోట్ల వ్యయంతో అత్యంత ఆకర్షణీయమైన ఇంటిగ్రేటెడ్ లైటింగ్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్ట్రీట్‌లైట్లు, ట్రాఫిక్ సిగ్నల్ లైటింగ్ మొత్తం బ్రిడ్జి పిల్లర్లలోనే అమర్చనున్నట్లు చెప్పారు. అలాగే, బ్రిడ్జికి ఇరువైపులా స్టీల్ రేలింగ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

మాదాపూర్, జూబ్లీహిల్స్ మధ్య దూరం గణనీయంగా తగ్గుతుందని, అలాగే జూబ్లీహిల్స్‌నుంచి మైండ్‌స్పేస్, గచ్చిబౌలిలకు వెళ్లేవారికి సుమారు రెండు కిలోమీటర్ల దూరం తగ్గుతుందని వివరించారు. రూ. 180 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ఫ్లైఓవర్ పనులు పూర్తయితే నగరానికి సరికొత్త ఆకర్షణ ఉండడంతో పాటు పర్యాటకరంగంలో మరో ఐకానిక్ రూపొందుతుందని అధికారులు తెలిపారు. దుర్గం చెరువు పనులు ప్రారంభం అయినప్పటి నుంచి ఇప్పటివరకు రెండు మిలియన్ల పనిగంటలు పూర్తిచేసినట్లు పేర్కొన్నారు.



40, 41

CS

తీగల వంతెన



39 తరువాయి

చేశారు. ఐఆర్‌టీఎస్ అధికారిగా ఉన్న రావెలను పిలిచి మరీ తెలుగుదేశం పార్టీ టిక్కెట్ ఇచ్చింది. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన రావెల ఆ ఎన్నికల్లో గెలుపొందారు. తొలిసారి గెలిచినా సామాజిక వర్గాల సమీకరణల్లో భాగంగా చంద్రబాబునాయుడు ఆయనకు మంత్రి పదవి ఇచ్చారు.

మంత్రి పదవిని కోల్పోయి.. అనంతరం రావెల ఆ పదవిని కూడా నిలుపుకోలేకపోయారు. పార్టీ పెద్దలతోనే ఆయన కయ్యానికి దిగారు. స్థానిక నేతల పొడ కూడా ఆయనకు గిట్ట లేదు. దీంతో స్థానికంగా పార్టీలోనూ ఆయనకు పొగ పెట్టడం ప్రారంభమయింది. ఫలితంగా మంత్రి పదవి ఊడిపోయింది. మంత్రి పదవి పోయినా రావెల రాజీ పడలేదు. ఎన్నికలకు కొన్ని రోజుల ముందు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. పవన్ కల్యాణ్ సారథ్యంలోని జనసేన పార్టీలో చేరారు. జనసేన టిక్కెట్ పై ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి పోటీ చేసి దారుణంగా ఓటమిపాలయ్యారు.

మూడో పార్టీలోకి. అయితే రావెల కిశోర్ బాబు మరోసారి పార్టీ మారుతున్నారు. జనసేనకు గుడ్ బై చెప్పిన రావెల భారతీయ జనతా పార్టీలో చేరారు. తొలుత వైసీపీలో చేరాలని ఎన్నికలకు ముందే భావించినప్పటికీ కొన్ని కారణాల రీత్యా టిక్కెట్ ఇవ్వలేమని చెప్పడంతో జనసేనలో చేరారు. ప్రధాని మోదీ సమక్షంలో తిరుపతిలో రావెల కండువా కప్పుకున్నారు. రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ఎదుగుతుందని రావెల భావించారా? లేక కేంద్రంలో అధికారంలో ఉంది కదా? అని చేరుతున్నారో కాని రావెల నిలకడలేని మనస్తత్వంపై ఆయన అనుచరులే విమర్శలు చేస్తుండటం విశేషం. మొత్తం మీద రావెల మూడో పార్టీలోకి ముచ్చటగా ఎంట్రీ ఇస్తున్నారు. మరి ఇక్కడ ఎంతకాలం ఉంటారో చూడాలి. "సన్ " స్ట్రోక్ ... తగిలి...ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్న చందాన కిశోర్‌కి తగ్గ కొడుకనిపించాడు సుశీల్. హైదరాబాద్ బంజారాహిల్స్ లో పట్ట పగలు మహిళా టీచర్‌ను వేధించి, చెర పట్టేందుకు ప్రయత్నించి మంత్రి రావెల కిశోర్ బాబు కుమారుడు సుశీల్ దొరికిపోయాడు. స్థానికులు పట్టుకొని పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. తీరా అక్కడ నుంచి పోలీసుల్ని బెదిరించి జారుకొన్న సుశీల్ కూడా కుక్క కథే వినిపించారు. కుక్క అడ్డువచ్చిందని, దాన్ని కాపాడేందుకు కారు దిగానని చెప్పారు. కొడుకు సుశీల్ చాలా మంచివాడని, అతడ్ని ఇరికించేందుకు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ కుట్ర పన్నారని మంత్రి రావెల కిశోర్ అడ్డగోలుగా చెలరేగిపోయాడు.ఈ విషయంలో రావెల కిశోర్ కుమారుడు సుశీల్‌పై నిర్భయ చట్టం కింద కేసు నమోదైంది. ఫాతిమా బేగం అనే మహిళ తనను వేధించారంటూ గురువారం ఫిర్యాదు చేయగా విచారణ జరిపిన పోలీసులు సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలించారు.

సుశీల్ తన కారు డ్రైవర్ అప్పారావు అలియాస్ రమేష్‌తో పాటు బంజారాహిల్స్ రోడ్ నెం.13లో ఫాతిమాను కారులో వెంబడించినట్లు నిర్ధారణ అయింది.

రావెల కొడుకు ఆ రోజు సాయంత్రం, డ్రైవర్ అప్పారావు మంత్రుల క్వార్టర్సు నుంచి కారులో బయటకు వచ్చారు. అదే సమయంలో ఫాతిమాబేగం పాఠశాల నుంచి ఇంటికి వెళ్తోంది. వారు కిలోమీటరు దూరం వరకు ఆమెను వెంబడించినట్లు సీసీ కెమెరాల్లో నమోదైన

దృశ్యాల ద్వారా వెల్లడైంది.

రావెల కొడుకు కొద్దిదూరం వెళ్లగానే సుశీల్ ఆమె చెయ్యి పట్టుకోడానికి ప్రయత్నించాడు. రోడ్డుపక్కగా ఆమె నడిచి వెళ్తున్న ఆమెకు మరీ దగ్గరగా కారును తీసుకెళ్లారు. అంతలో ఫాతిమా తాము ఉంటున్న బస్తీ సమీపించడంతో ధైర్యం తెచ్చుకుని గట్టిగా అరిచింది. దీంతో చుట్టుపక్కలవారు, ఆమె భర్త అక్కడకు చేరుకుని కారులో ఉన్నవారిని బయటకు లాగి చితకబాదారు.

రావెల కొడుకు అదే సమయంలో అక్కడకు చేరుకున్న కానిస్టేబుల్ వారిని పోలీస్ స్టేషనుకు తీసుకువెళ్తానంటూ స్థానికులకు సర్ది చెప్పడంతో వారు వదిలి పెట్టారు. కాని అతడు వారిని ఠాణాకు కాకుండా దెబ్బలు తిన్న డ్రైవరు అప్పారావును ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. ఇదే అదనుగా సుశీల్ అక్కడి నుంచి తప్పుకున్నాడు.

రావెల కొడుకు కారులో ఉన్న డ్రైవర్ అప్పారావు మద్యం తాగి ఉన్నారని స్థానికులు, బాధితురాలి భర్త అప్పుడే పోలీసులకు చెప్పారు. సుశీల్, అప్పారావులు తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారంటూ ఫాతిమా బేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన చేయిపట్టి లాగిన వ్యక్తి చేతికి టాటూ కూడా ఉందని ఆనవాళ్లు తెలిపింది.

రావెల కొడుకు అదే రోజు రాత్రి 10 గంటలకు డ్రైవరు అప్పారావు పోలీసు స్టేషనుకు వచ్చి తన యజమాని కుమారుడైన సుశీల్‌పై దాదాపు 10, 12 మంది దాడికి పాల్పడ్డారంటూ మరో ఫిర్యాదుచేయడం గమనార్హం. పోలీసులు రెండు ఫిర్యాదుల మేరకు రెండు కేసులు నమోదు చేశారు..... వ్యక్తుల నేపథ్యాలూ ఏమైనప్పటికీ ప్రభుత్వంలో కీలక పాత్ర వహిస్తున్నప్పుడు బాధ్యతగా వ్యవహరించాలి. గతంలో వున్న చాలా ప్రమాణాలు ఇప్పుడు మటుమాయమైనా ఇప్పటికీ ప్రజలూ, సమాజం, మంత్రులు, ఉన్నతాధికారులు పార్టీల అధినేతల నుంచి చవకబారు మాటలు వస్తే జీర్ణించుకోలేరు. కొన్నిసార్లు మాటలతోనే పదవులు పోయిన ఉదంతాలున్నాయి. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు నోట వెలువడిన ఆణిముత్యాలు ఇప్పుడు అధికార పార్టీని అలాగే ఇబ్బంది పెడుతున్నాయి. ఆ పార్టీ ప్రముఖులు దళిత వర్గానికి చెందిన వారు కూడా సమర్థించలేని సహించరాని పరిస్థితిని తెచ్చిపెట్టారాయన. మొదట్లో రావెల తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ పైన టిఆర్ఎస్ పైన రాజకీయంగా దాడి చేస్తుండేవారు. అదే వూపులో జగన్‌ను కూడా చీల్చిచెండాడే వారు. ప్రత్యర్థులపై దాడి చేస్తూ తనను కీర్తించేవారిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రోత్సహిస్తుంటారు. పైగా మీరెందుకు మాట్లాడ్డంలేదని ఇతరులకు ఆదర్శంగా చూపిస్తుంటారని ఆ పార్టీలో సీనియర్లు ఆలోచనాపరులు వాపోతుంటారు. ఎందుకంటే బయిటివారిని బాగా తిట్టిన వారే ఇప్పుడు ఇతర పార్టీలలో చేరి అంతకన్నా తీవ్రంగా ఆయనపై దాడి చేస్తున్నారు. ఇక రావెల విషయానికి వస్తే.. రాజధానిలో భూములు నా భార్య కొంటే తప్పేమిటని ఆయన ఎదురు దాడి చేశారు. అసైన్డు భూములు కొంటే తప్పేంటి అని కూడా అనుచిత సవాళ్లు విసిరారు. తన కుమారుడు సుశీల్ కుమార్ అనుచిత ప్రవర్తన విషయంలోనూ జాగ్రత్తగా మాట్లాడవలసింది పోయి జగన్‌కు అంటగట్టేందుకు ప్రయత్నించి అభాసుపాలైనారు. ఈ సమయంలో ఆపార్టీలో ముఖ్య నాయకుడు ఫోన్ చేస్తే మంత్రిగారు బదులిచ్చిన తీరుకు ఆయనే విస్తుపోతున్నారు. మరీ ఇంత దారుణంగా ఎలా మాట్లాడతారు? అని ఆగ్రహించారు.. ఇదండీ రావెల కి"షో" ర్ కథ.



మహిళా సాధికారత నేతిబీరకాయేనా??

- (శారద)



ఎక్కడ స్త్రీలు పూజలందుకుంటారో అక్కడ దేవతలు కొలువై ఉంటారు (యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవత) అని ఆర్యోక్తి. సృష్టికి మూలం స్త్రీ. దేవుడికి ప్రతిరూపం తల్లి. అలాంటి తల్లి తల్లడిల్లి కన్నీరు కారిస్తే అది మనకు మంచిదా? కాదు. సమాజ నిర్మాణంలో సగభాగమైన స్త్రీ సమానత్వమే మన ప్రగతికి మూలం. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హింస, వేధింపులు చూస్తుంటే మనం పూర్తిగా తిరోగమిస్తున్నామనిపిస్తోంది. సమాజ నిర్మాణంలో సగభాగమైన స్త్రీ మాతృమూర్తిని వేధించి మనం బాగుకున్నదేంటి? వ్యాపారాలు, రాజకీయాలు, క్రీడలు, బ్యాంకింగ్, అంతరిక్షం, టెక్నాలజీ వంటి పలు రంగాల్లో మహిళలు రాణిస్తున్నప్పటికీ వివక్షకు గురవుతూనే ఉన్నారు. మహిళా సాధికారత కోసం ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ఉద్యమాలు తలెత్తినా, ఎందరో నినదించినా ఫలితం లేకుండా పోయింది. మహిళల చదువు ఏ సమాజానికైనా వెలుగునిస్తుంది. వారిలో చైతన్యం ప్రపంచాన్ని నడిపిస్తుంది. మహిళల్లో ఆర్థిక, రాజకీయ, సామాజిక చైతన్యం రావాలి. ఆయా రంగాల్లో రాణించిన, రాణిస్తున్న వారిని స్ఫూర్తిగా తీసుకోవాలి. వీరికి తగిన ప్రోత్సాహం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి పౌరునిది.

సమానత్వం సాధించాలంటే మహిళలు కదం తొక్కి ముందుకు కదలాలి. వేళ్లూనుకున్న వివక్షా పూరిత భావజాలాన్ని కూకటి వేళ్లతో పెకలించాలి. తమ హక్కుల కోసం పోరాడాలి. మేము మానవులమనే అని, మాకు హక్కులుంటాయని వెలుగెత్తి చాటాలి. వివేకానందుడు చెప్పినట్టు ఏ పక్షి ఒక రెక్కతో ఎగరలేదు. స్త్రీ సమానత్వం సాధిస్తే తప్ప మన సమాజం అభివృద్ధి చెందదు. ఈ మధ్య కుటుంబం ఆస్తిలో కొడుకులతో బాటు, కూతుళ్లకు సమానం హక్కు ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షించదగ్గ విషయం. హిందూ వారసత్వ సవరణ చట్టం 2005కు ముందు తండ్రి మరణించిన కూడా కూతురికి ఆ హక్కులు దక్కుతాయని స్పష్టం చేసింది. పాకిస్థాన్‌లో విద్య కోసం పోరాటం చేసిన గొప్ప వ్యక్తి, నోబెల్ బహుమతి గ్రహీత, న్యాయవాది, మలాలయూసఫ్ ఝా మాటల్లో ప్రపంచం మొత్తం నిశ్శబ్దంగా ఉన్నప్పుడు ఒక స్వరం కూడా శక్తివంతమవుతుందని అన్నారు. అందుకే సమాజం నుంచి స్త్రీ పురుషుల వివక్షత లేకుండా చూసినప్పుడే మహిళా సాధికారత సాధ్యం అవుతుంది. ఆ దిశగా ప్రభుత్వాలు వారికి అవకాశాలు ఇవ్వాలి. అన్ని రంగాల్లో భాగస్వాములను చేసినప్పుడే మహిళా సమానత్వ దినోత్సవానికి సార్థకత అని చెప్పవచ్చు. మహిళలకు ఓటు హక్కు ఇచ్చే ప్రకటనపై యునైటెడ్ స్టేట్స్ అఫ్ అమెరికా 1920 సంవత్సరంలో రాజ్యాంగంలోని 19వ సవరణ ద్వారా తీర్మానం చేసింది. అప్పటి అమెరికా విదేశాంగ కార్యదర్శి అయిన బై బ్రిడ్జ్ కోల్టి అమెరికా మహిళలకు రాజ్యాంగపరమైన ఓటు హక్కును ఇచ్చే ప్రకటనపై సంతకం చేసిన రోజు జ్ఞాపకార్థంగా ఆగస్టు 26న మహిళా సమానత్వ దినోత్సవంగా తీసుకున్నారు. 1973లో మహిళల సమాన హక్కులు, సమస్యలపై పోరాటాలు కొనసాగుతున్న సందర్భంలో న్యూయార్క్‌కు చెందిన కాంగ్రెస్ మహిళ బెల్లా అబ్జుగ్ అనే మహిళ సమానత్వ దినోత్సవం జరుపుకొనుటకు తీర్మానం ప్రవేశపెట్టగా అప్పటి అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ ప్రకటన విడుదల చేశాడు. అలా 1973లో అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలిపిన తర్వాత మొట్టమొదటి సారిగా సమానత్వ దినాన్ని జరుపుకున్నారు. భారతదేశంలో మొట్టమొదటిసారిగా మద్రాస్ రాష్ట్రం మహిళలకు ఎన్నికల్లో ఓటు హక్కును మంజూరు చేసింది. స్వాతంత్ర్యానంతరం మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 326లో ప్రస్తావించబడిన విధంగా 1952లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల్లో మహిళలకు ఓటు హక్కు కల్పించబడింది. అయినప్పటికీ ప్రపంచంలో జరిగిన కొన్ని సర్వేల ఆధారంగా చూస్తే రాజకీయాల్లో నేటికీ మహిళల ప్రాధాన్యత తక్కువగానే ఉంది. పార్లమెంట్‌లో మహిళా ప్రాతినిధ్యం విషయంలో భారతదేశం ప్రపంచంలో 20వ స్థానంలో ఉంది. రాజకీయాలతో పాటు మహిళలకు అన్ని రంగాల్లో అవకాశం కల్పిస్తేనే దేశం పురోగమిస్తుంది. వివక్షతలేని సమాజాన్ని నిర్మించాలి. చట్టసభల్లో మహిళలకు తగిన రిజర్వేషన్లు కల్పించాలనే ఆలోచన, ప్రతిపాదనపై అన్ని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయానికి రావాల్సిన అవసరం ఉంది. మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన బిల్లుకు 2014లోనే రాజ్యసభ ఆమోదం తెలిపినా, లోక్‌సభ ఆమోదం పొందలేదు. దేశ జనాభాలో 50శాతం ఉన్న మహిళలకు రిజర్వేషన్లు కల్పించడంలో మన నేతలు ఇంకా మీనమేషాలు లెక్కస్తున్నారు. స్వతంత్ర్యం వచ్చి 74 సంవత్సరాలు అవుతున్నా మహిళలు ఇంకా వెనుకబడే ఉన్నారు. సమాజంలో కుమార్తె కన్నా, కుమారునికి ప్రాధాన్యం ఇచ్చే పద్ధతులు మార్చుకోవాల్సిన అవసరం ఉంది. శిశు హత్యలు, భ్రూణ హత్యలు, అత్యాచారాలు, వరకట్న వేధింపులు లాంటి దురాచారాలు రూపు మాపినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుంది. లేకుంటే నేతిబీరకాయలో నెయ్యే!!!

పౌష్టికాహారం

– డి.ఉదయ్ భాస్కర్, ఎమ్మెస్, బి.ఇడి



రోగ నిరోధకశక్తి, రోగ నిరోధకశక్తి. కొత్త కరోనా జబ్బు మొదలైనప్పట్నుంచీ అందరి నోటా ఇదే మాట. దీన్ని పెంపొందించుకోవటానికి ఏం తినాలి? అందరి మనసులోనూ ఇదే ప్రశ్న. నిజమే. నిరోధక శక్తిని బలోపేతం చేయటంలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. కరోనా బారినపడి కోలుకున్న తర్వాతా పెద్ద దిక్కుగానూ మారుతోంది. కొవిడ్ –19 బారినపడ్డవారిలో ఐరన్, మెగ్నీషియం, జింక్, క్యాల్షియం, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12, ప్రొటీన్ల వంటి కీలక పోషకాల లోపం తలెత్తుతోంది మరి. ఇది ముమ్ముందు మరిన్ని సమస్యలకు దారితీయకుండా ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టటం తప్పనిసరి. ఆహారం అనగానే అందరికీ ఆయా పదార్థాలే గుర్తుకొస్తాయి. సమయాన్ని పట్టించుకోరు. నిజానికిది చాలా ముఖ్యం. పోషణ విషయంలో భోజన వేళలకు చాలా ప్రాధాన్యమే ఉంది. జీర్ణక్రియ చురుకుగా ఉండే సమయంలో భోజనం చేస్తే బాగా ఒంట పడుతుంది. మన ఒంట్లో ఆయా సమయాల్లో కఫ, పిత్త, వాత దోషాలు బలంగా ఉంటాయని ప్రాచీన ఆయుర్వేదం చెబుతుంది. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు కఫం.. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పిత్తం.. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వాతం ప్రబలంగా ఉంటాయి. సాయంత్రం 6 నుంచి తిరిగి ఇదే క్రమం మొదలవుతుంది. పిత్త కాలంలో భోజనం చేస్తే బాగా జీర్ణమవుతుంది. పోషకాలు బాగా వంట పడతాయి. రోగనిరోధక శక్తి బలోపేతం అవుతుంది. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఇదేలా సాధ్య పడుతుందని కొట్టి పారెయ్యకండి. మనసుంటే మార్గం దొరక్కపోదు. ఒకే వేళకు భోజనం చేయటం అలవాటు చేసుకున్నా చాలు. ఉదయం 6 గంటలకు ముందే నిద్ర లేవటం అలవాటు చేసుకోవటం ఉత్తమం. దీంతో 8 గంటల కన్నా అల్పాహారం చేయటానికి వీలవుతుంది. రోజువారీ ఆహారాన్ని ద్రవాలతో ఆరంభిస్తే మంచిది. ఉదయం లేవగానే టీ, కాఫీల కోసం ఎదురుచూసేవారు ఎందరో. వీటి కన్నా వెన్న తీసిన పాలు 200 మి.లీ. తాగటం మేలు. పాలలో అన్ని పోషకాలు సమతుల్యంగా ఉంటాయి. అల్పాహారంగా పిండి పదార్థాలతో పాటు ప్రొటీన్లతో కూడిన పదార్థాలూ తీసుకోవాలి. ఉదాహరణకు– ఇడ్లీ తింటున్నారనుకోండి. పప్పుతో చేసే సాంబారు, పల్లీలతో చేసే చట్నీ కలిపి తీసుకుంటే పిండి పదార్థాలు, ప్రొటీన్లు రెండూ లభిస్తాయి. ఉదయం 10 నుంచి 11 గంటల మధ్యలో పోషకాలతో నిండిన ద్రవాహారం తీసుకోవచ్చు బార్లీ జావ, నిమ్మరసం వంటివి తీసుకోవచ్చు బార్లీ బియ్యాన్ని వేయించి, పొడి చేసుకొని వాడుకుంటే ఇంకా మంచిది. బార్లీ పిండిని నీటిలో మరిగించి.. ఇందులో కాస్త అల్లం, నిమ్మ రసం, ఉప్పు, మిరియాల పొడి కలుపుకోవచ్చు మధుమేహం లేకపోతే చక్కెర కూడా వేసుకోవచ్చు గోధుమ గడ్డి రసం తీసుకోవాలని అనుకుంటే ఇందులోనే కలుపుకోవచ్చు, సూర్యుడి నడి నెత్తిమీదికి వచ్చే 12 గంటల సమయంలో హార్మోన్లు, ఎంజైమ్‌లు, జీవ గడియారం.. అన్నీ చురుకుగా పనిచేస్తుంటాయి. అప్పుడు మధ్యాహ్న భోజనం చేస్తే బాగా జీర్ణమవుతుంది. జీవగడియారానికి అనుగుణంగా భోజనం చేయాలనే విషయాన్ని ఇప్పుడెవరూ పట్టించుకోవటం లేదు. మధ్యాహ్నం 2,3 గంటలకు.. కొందరైతే 4 గంటలకూ భోజనం చేస్తుంటారు. దీంతో ఒకే రోజున శరీరాన్ని పోషణ లోపం, అతి పోషణలోకి నెట్టినట్టు అవుతుంది. అవసరమైనప్పుడు తగినన్ని పోషకాలు అందక శరీరం సతమతమైపోతుంది. అనంతరం తిన్నా అరిగించుకోలేని స్థితిలోకి వెళ్తుంది. సాయంత్రం 4 గంటలకు తేనీరు వంటి ద్రవాలు తీసుకోవచ్చు ఈ సమయంలోనే పండ్లు తీసుకుంటే మంచిది. వేరుశనగ వంటి గింజపప్పులనూ జత చేసుకుంటే ఉపాహారం తీసుకున్నట్టూ అవుతుంది. పండ్లతో చేసే మిల్క్ షేక్ లైనా మంచివే. రాత్రి 7 గంటల కల్లా రాత్రి భోజనం చేయటం ఉత్తమం. తేలికగా జీర్ణమయ్యే పదార్థాలు తీసుకుంటే ఇంకా ఉత్తమం. రాత్రి 9–10 గంటల సమయంలో నిద్రకు ఉపక్రమించెయ్యాలి. ఆయుర్వేదం ప్రకారం– రాత్రి 10 గంటల తర్వాత పిత్తకాలంలోనూ తినొచ్చు కదా అనే సందేహం రావొచ్చు రాత్రిపూట పనులేమీ చేయం కాబట్టి తిన్న ఆహారాన్ని శరీరం వినియోగించుకోలేదు. ఇది కొవ్వుగా మారి బొజ్జ, ఊబకాయం తలెత్తుతుంది. ఊబకాయులకు కొవిడ్ –19 తీవ్రంగా పరిణమిస్తున్న సంగతి తెలిసిందే.

మాంసం ఒక్కటే అన్ని పోషకాలను అందించలేదు. పైగా చాలామంది కారం, మసాలాలు దట్టించి పలుచగా వండుకుంటారు. రోజంతా దాంతోనే సరిపెట్టుకుంటారు. దీంతో కడుపు నిండొచ్చేమో గానీ పోషకాలు అందవు. మాంసంతో పాటు పప్పు, కూరగాయల వంటివీ తినాలి.రోగనిరోధకశక్తి పెంపొందటంలో కూరగాయలు, ఆకుకూరల పాత్ర చాలా కీలకం. వీటిని 450 గ్రాముల వరకు తీసుకోవాల్సి ఉంటుంది. అమ్మో.. అంతనా అదెలా కుదురుతుంది అని సందేహించాల్సిన పనిలేదు. ఆకుకూరలు, కూరగాయలు, దుంపలు, గడ్డల వారీగా విభజించుకుంటే ఇంతేనా అనీ అనిపిస్తుంది. ఉదాహరణకు- 100 గ్రాముల ఆకుకూరలను ఉడికించారనుకోండి. చిన్న గరిటెడైనా కాదు. వీటిని ఉడికించి గానీ పచ్చడిగా గానీ తీసుకోవచ్చు దుంపల విషయానికొస్తే క్యారెట్, ముల్లంగి, ఉల్లిగడ్డ, బీట్ రూట్లలో ఏదో ఒకటి 100 గ్రాములు తీసుకోవచ్చు చిన్న క్యారెటయినా 100 గ్రాములుంటుంది కదా. బంగాళా దుంప, చామగడ్డ, కందగడ్డల వంటివి ఓ 50 గ్రాములు ఎంచుకోవచ్చు చిన్నపాటి బంగాళాదుంప ఒక్కటే 50 గ్రాముల కన్నా ఎక్కువ బరువు తూగుతుంది. నీటితో కూడిన సొరకాయ, బీరకాయ, టమోటా, దోసకాయల వంటివి ఓ 200 గ్రాములు తీసుకోవటం పెద్ద సమస్యే కాదు. వీటితోనే 450 గ్రాములు పూర్తవుతాయి. వీటికి చిక్కుళ్లు, బెండకాయ వంటి ఇతర కూరగాయలను 75 గ్రాములు జోడిస్తే మొత్తం 525 గ్రాములకు చేరుకుంటుంది. మనసు పెట్టి ఆలోచిస్తే ఇదేం పెద్ద పని కాదు. ఇలా క్రమం తప్పకుండా తగినన్ని కూరగాయలు, ఆకుకూరలు తీసుకుంటే కీలకమైన 13 రకాల విటమిన్లు, 26 ఖనిజాలు, ముఖ్యమైన వృక్ష రసాయనాలన్నీ లభించేలా చూసుకోవచ్చు వృక్ష రసాయనాలను ఒక రకంగా చెట్ల రోగనిరోధక శక్తి అనే అనుకోవచ్చు కూరగాయలతో ఇవి నేరుగా మన శరీరానికి అందుతాయి.ఆహారాన్ని ఇంద్రధనుస్సులా కళకళలాడేలా మార్చటంలో పండ్ల ప్రత్యేకతే వేరు. రంగు రంగుల పండ్లతో రకరకాల పోషకాలు, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు దండిగా లభిస్తాయి. వీటిని 4 రకాలుగా విభజించుకోవచ్చు ఒకటి- మామిడి, బొప్పాయి, అరటి వంటి పసుపు, లేత ఎరుపు పండ్లు. వీటిల్లో విటమిన్ ఎ ఎక్కువగా ఉంటుంది. ఇది రోగనిరోధకశక్తిని బలోపేతం చేస్తుంది. రెండోది- పుల్లటి పండ్లు. బత్తాయి వంటి పుల్లటి పండ్ల పేరెత్తగానే చాలామంది జలుబు చేస్తుందని వెనకాడుతుంటారు. ఇది పెద్ద తప్పు వీటితో విటమిన్ సి బాగా లభిస్తుంది. ఇటీవల విటమిన్ సి మాత్రలకు ఎంత ప్రాధాన్యం పెరిగిందో చూస్తూనే ఉన్నాం. నిజానికి మాత్రల కన్నా పండ్లే ఎక్కువ మేలు చేస్తాయి. వీటిల్లోని విటమిన్ సి శరీరం తేలికగా గ్రహిస్తుంది. మూడోది- దానిమ్మ, సపోటా, జామ వంటి ఇతర పండ్లు. నాలుగోది- ఖర్జూరం, కిస్ మిస్ వంటి ఎండు పండ్లు. వీటిల్లో కేలరీలు ఎక్కువ. ఉదాహరణకు- 100 గ్రాముల తాజా ద్రాక్ష పండ్లతో 36 కేలరీల శక్తి లభిస్తే.. అదే కిస్ మిస్ తో 530 కేలరీలు అందుతాయి. అందువల్ల ఎండు పండ్లను మితంగానే తీసుకోవాలి. తాజా పండ్లకు ఇవి ప్రత్యామ్నాయం కావని తెలుసుకోవాలి.కొవిడ్ బారినపడ్డవారిలో క్యాల్షియం, మెగ్నీషియం, జింక్, విటమిన్ బి12, ఫోలిక్ యాసిడ్, ప్రొటీన్ల వంటి పోషకాలు తగ్గిపోతున్నాయి. అందుకే కొవిడ్ నుంచి బయటపడ్డాక మరో 2 నెలల వరకు మరింత జాగ్రత్తగా ఉండాలి. ఇలాంటి వారికి కూరగాయల గుజ్జు బాగా ఉపయోగపడుతుంది. ఆకు కూరలు, దుంపలు, గడ్డలు, కూరగాయలతో దీన్ని చేసుకోవచ్చు కొత్తిమీర, పుదీనా, క్యారెట్, ఉల్లిగడ్డ, వంకాయ వంటి కూరగాయలను కుక్కర్ లో వేసి తక్కువ నీటితో ఉడికించుకోవాలి. అనంతరం వీటికి సొరకాయ, దోసకాయ, టమోటా వంటివి జతచేసి మిక్సీలో మెత్తగా రుబ్బుకోవాలి. కావాలంటే రుచి కోసం కాస్త ఉప్పు కలుపుకోవచ్చు ఈ గుజ్జు పోషకాల భర్తీకి బాగా ఉపయోగపడుతుంది.

ప్రశాంత మందిరం

పి.లక్ష్మణ్ రావ్, అసిస్టెంట్ రిజిష్ట్రార్, సహకార శాఖ, విజయనగరం, 9441215989



వాలు కుర్చీలో కూర్చొని
నిశిరాత్రిలో నక్షత్రాలను
కంటి రెప్పలతో
లెక్కబెడుతుంటాను

గతానుగత
జ్ఞాపకాల దొంతరలను
ఒక్కొక్కటిని
కన్నీటి సాక్షిగా విప్పుతుంటాను

గుండె పొరల్లో దాక్కున్న
నిట్టూర్పుల ఉచ్ఛ్వాసలను
దుఃఖ భారంతో
నిశ్వాసిస్తుంటాను

కంటిరెప్పల మాటున
నిలిచిపోయిన
దుఃఖాశ్రువులను
ఓదార్పు గీతికలుగా మలుస్తుంటాను

వీలు కుదరనప్పుడల్లా
వాలు కుర్చీయే
నాకు విశ్రాంతినిస్తుంది
వీగిపోయినప్పుడల్లా
వాలు కుర్చీయే
నాకు మనశ్శాంతవుతుంది!

జమిలి ఎన్నికలు సాధ్యమేనా?

జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే.. రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకోవాలి. దానిని పార్లమెంటుకు సమర్పించి చర్చించాలి. ఇదో పెద్ద తతంగం. పైగా చాలా రాష్ట్రాల్లో బీజేపీనే సంకీర్ణ సర్కారులను నిర్వహిస్తోంది. ఒంటరిగా బరిలో నిలిచి నెగ్గే సత్తా కూడా ఆపార్టీకి లేదు. ఈ నేపథ్యంలో జమిలి అంటూ..ఉన్న పదవీ సమయాన్ని కుదించుకునే ప్రయత్నం చేస్తుందనేది ఒట్టి అపోహేనని నిపుణులు కొట్టిపారేస్తున్నారు. జగన్ ప్రభుత్వాన్ని ఏదో ఒక రకంగా టీడీపీ మానసికంగా ఇబ్బంది పెట్టే యోచనే తప్ప.. దీనిలో విషయంలేదనేది వాస్తవం అంటున్నారు. బాబు మైండ్ గేమ్‌లో ఇదీ ఒక భాగమని చెబుతున్నారు. కాబట్టి జమిలి అనేది ఒక చర్చ మాత్రమే! నిజానికి మోడీ అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి జమిలి ఎన్నికల చర్చ జరుగుతోంది. దీపం ఉండగానే యిల్లు చక్కబెట్టుకోవాలనే సామెతలా తన ప్రభ వెలుగుతూండగానే దేశమంతా బిజెపియే ఏలేయాలనే ఊహతో దీన్ని ముందుకు నెడుతూ వచ్చారు. ఒకేసారి ఎన్నికలైతే ఖర్చు తగ్గుతుందనే వాదన ఒక్కటే దాని పక్షాన ఉంది. ఫిరాయింపుల చేతనో, అసంతృప్తి చేతనో, పాలకపక్షం బలం తగ్గి మధ్యమధ్యలో మారే రాష్ట్ర ప్రభుత్వాలు ఉంటూ ఉంటాయి కదా, వాటి పదవీకాలం ఐదేళ్లు ఉండేట్లా చూడడం ఎలా అనే ప్రశ్నకు బిజెపి ఎన్నడూ సమాధానం చెప్పలేదు. బహుశా తక్కిన పదవీకాలమంతా రాష్ట్రపతి పాలన విధిస్తాం అనే ఆలోచన కాబోలు, అది బయటపెట్టలేదు. రాష్ట్రాలనే ఏమిటి, 2019 పార్లమెంటు ఎన్నికలలో బిజెపికి అన్ని సీట్లు రాక, ఎన్‌డిఏలో తక్కిన పార్టీల మద్దతు తీసుకున్నా, మూడో కూటమికి బొటాబొటీ మెజారిటీ వచ్చినా కేంద్ర ప్రభుత్వం కూడా గద్దె మీద కాకుండా స్టూలు మీద కూర్చున్నట్లే అయేది. గతంలో జనతా పార్టీ, నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్, ఎన్‌డిఏ ప్రభుత్వాలు పదవీకాలం పూర్తి చేసుకోలేక పోయిన విషయాన్నీ చూశాం. కేంద్రమే కుప్పకూలితే పరిస్థితి ఏమిటి?

వీటికి సమాధానాలు చెప్పకుండానే 2019 పార్లమెంటు ఎన్నికలు వచ్చాయి. మోదీకి బలం మరింత బలం పెరగడంతో జమిలి ఎన్నికల గురించి ధాటీగా మాట్లాడుతున్నారు. రాజ్యసభలో కూడా ఎదురు లేకుండా, తమకు చిత్తం వచ్చిన బిల్లులన్నీ పాస్ చేయించుకుంటున్నారు కాబట్టి, యిదీ రేపో, ఎల్లుండో అయిపోవచ్చు అనుకునే పరిస్థితి వచ్చింది. నిజానికి ఆరెస్సెస్ సిద్ధాంతకర్తలకు భారత్‌లో ఉన్న ఫెడరల్ తరహా ప్రభుత్వంపై నమ్మకం లేదు. గతకాలంలో చక్రవర్తుల వలె యూనిటరీ ప్రభుత్వమే ఉండాలని, ఢిల్లీ పాలకులు అనుకున్న విధానాన్ని దేశమంతా ఒకే రీతిలో అమలు చేయాలనీ వాళ్లు వాదిస్తారు. భారతజాతిలో ఉన్న బహుళత్వాన్ని అంగీకరించరు. రాష్ట్రాలకు నామమాత్రపు అధికారాలు యిచ్చి, నిర్ణయాలన్నీ కేంద్రస్థాయిలో తీసుకోవాలని వారి అభిప్రాయం. ఈ మధ్య జరిగిన పలు ఉపఎన్నికలలో మోడీ, షాల వ్యూహాలు ఫలించలేదు. బిజెపికి బుద్ధి చెప్పాలనుకున్న గ్రామీణ ప్రజలు చచ్చుపుచ్చు పార్టీలకైనా ఓటేశారు. కౌరవసేన చూసి పారిపోయిన ఉత్తర కుమారుడిని బృహన్నల మళ్లీ యుద్ధక్షేత్రానికి లాక్కుని వచ్చినట్లు కోమాలో ఉన్న కాంగ్రెసును లేపి, కూర్చోబెట్టి ఊపిరి పోశారు. ఇది అర్థమైనప్పుడు జమిలి ఎన్నికల పట్ల బిజెపికి గల ఉత్సాహం నీరుకారుతుందనేది వాస్తవం. అధికారం కోల్పోయిన బాబులకు ఆశాదీపంలా జమిలి వెలుగులేని దీపం మాత్రమే.

కరోనా రోగులకు సేవలందించడం డాక్టరుగా నా కర్తవ్యం

ఈవిడ మన మాజీ ప్రధాని మన జాతి నాయకుడు, శ్రీ పి.వి.నరసింహారావు గారి చిన్న కూతురు... డా.విజయ సోమరాజు, MD,MPH,FACP, తండ్రి ఆ నాడు శత్రువుల మధ్య, వైరుధ్య పరిస్థితులమధ్య ఉండి కూడా, తన ఆర్థిక సంస్కరణలతో, దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి బైట పడేసారు ....

కూతురు ఈనాడు, ఆపదలో ఉన్నవారి కోసం, తన ప్రాణాలకు తెగించి మరీ వైద్య సేవలను అందిస్తున్నారు... ప్రపంచ వ్యాప్తంగా సేవలందిస్తున్న భారతీయవైద్యులు..

భారత సంతతికి చెందిన ప్రముఖ వైద్యురాలు డా.విజయ సోమరాజు,MD,MPH,FACP,.మెడికల్ డైరెక్టర్ ఇన్ఫెక్షన్ డిసీజెస్ మెడికల్ డైరెక్టరుగా భిలాయిట్, విస్కాన్ సిటీ అమెరికాలో కరోనా బాధితులకు సేవలందిస్తోంది.



యూనివర్శిటీ ఆఫ్ Illinois లోప క్లినికల్ ప్రొఫెసర్‌గా వివిధ శాఖలలో సేవలందిస్తున్న డా.విజయ సోమరాజు యుఐసి యూనివర్సిటీలో out standing teaching అవార్డు గ్రహీత.

విస్కాన్ సిటి బెలాయిట్ హెల్త్ సిస్టమ్‌లో మెడికల్ డైరెక్టరుగా ప్రస్తుతం సేవలందిస్తున్న డా.విజయ సోమరాజు. రోజుకు పన్నెండు నుండి పద్నాలుగు గంటల వరకు పిపిఈ సూట్ ధరించి (పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్మెంట్) కరోనా రోగులకు సేవలందించడం డాక్టరుగా తన కర్తవ్యం అని తెలిపారు.

ఇప్పుడున్న పరిస్తితులలో కరోనా కోవిడ్-19ను జయించడానికి సాంఘిక దూరం పాటించడమే శ్రేయస్కరం అని అభిప్రాయం వ్యక్తం చేశారు డా.విజయ సోమరాజు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య

- ఎస్.సిహెచ్. వెంకటేష్, ఎం.ఎ., ఎంఫిల్ - బెంగళూరు

భారతరత్నం మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఒక గొప్ప ఇంజినీర్. ఆయన పుట్టినరోజైన సెప్టెంబర్ 15ను భారత్‌లో 'ఇంజినీర్స్ డే' గా జరుపుకొంటారు.



మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1861 సెప్టెంబర్ 15న ప్రస్తుత కర్ణాటక రాష్ట్రంలోని ముద్దనహళ్లిలో జన్మించారు. ముద్దనహళ్లి అప్పటికి మైసూర్ సంస్థానంలో భాగంగా ఉండేది.

విశ్వేశ్వరయ్య తండ్రి పేరు శ్రీనివాసశాస్త్రి, తల్లి వెంకటలక్ష్మమ్మ. శ్రీనివాసశాస్త్రి ఉపాధ్యాయుడిగా పనిచేసేవారు. ఆయన సంస్కృత పండితుడు కూడా. కానీ విశ్వేశ్వరయ్యకు 12 ఏళ్లుండగా తండ్రి మరణించారు.

చిక్‌బళ్లాపూర్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం ముగిసిన తర్వాత 1881లో డిగ్రీ చదవడానికి బెంగళూరు వెళ్లారు. ఆ తర్వాత పుణేలోని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఉన్నతవిద్య అభ్యసించారు. ఆ తర్వాత ముంబయిలోని పీడబ్ల్యూడీ విభాగంలో కొద్దికాలం పనిచేశారు. అక్కడినుంచి ఇరిగేషన్ కమిషన్ ఆఫ్ ఇండియాకు వెళ్లారు.

మైసూర్ అభివృద్ధిలో కీలక పాత్ర

1912 నుంచి 1918 వరకూ విశ్వేశ్వరయ్య మైసూర్ సంస్థానానికి దివాన్‌గా పనిచేశారు. మాండ్య జిల్లాలోని కృష్ణరాజసాగర్ డ్యామ్ నిర్మాణానికి ఈయనే ముఖ్యకారణం. మైసూర్ అభివృద్ధిలో విశ్వేశ్వరయ్య పాత్ర ఎంతో కీలకం. కృష్ణరాజసాగర్ డ్యామ్, భద్రావతి ఐరన్ అండ్ స్టీల్ వర్క్స్, మైసూర్ శాండల్ ఆయిల్ అండ్ సోప్ ఫ్యాక్టరీ, యూనివర్సిటీ ఆఫ్ మైసూర్, బ్యాంక్ ఆఫ్ మైసూర్... వంటి ఎన్నో సంస్థల ఏర్పాటులో ఆయన కృషి దాగి ఉంది.

ఆయనను కర్ణాటక రాష్ట్ర భగీరథుడు అని కూడా పిలుస్తారు. సింధు నది నుంచి సుక్కూర్ పట్టణానికి నీటిని తరలించేందుకు ఆయన ఇచ్చిన ప్రణాళిక అప్పట్లోని ఇంజినీర్లందరినీ మెప్పించింది. అప్పుడు ఆయన వయసు 32. నీటిపారుదల వ్యవస్థను మరింత సమర్థంగా చేయడానికి ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటుచేసింది. ఆ కమిటీ సూచనల ఆధారంగా బ్లాకుల వ్యవస్థను అభివృద్ధి చేసింది.

స్టీల్ గేట్ల ఏర్పాటు ద్వారా డ్యామ్ నుంచి నీటి ప్రవాహాన్ని అడ్డుకోగలిగారు. బ్రిటిష్ అధికారులు కూడా విశ్వేశ్వరయ్య ఆలోచనలను అభినందించారు. హైదరాబాద్‌లో మూసీ వరదల అడ్డుకట్టకు ప్రణాళిక హైదరాబాద్ నగరాన్ని వరదల నుంచి కాపాడేందుకు ఉద్దేశించిన ప్రణాళికను కూడా విశ్వేశ్వరయ్యే

రూపొందించారు. అప్పట్లో హైదరాబాద్‌లో వరదలను నివారించేందుకు అవసరమైన ప్రణాళికలను సూచించాల్సిందిగా మోక్షగుండం విశ్వేశ్వరయ్యను నిజాం కోరారు.

మూసీతోపాటు దాని ఉపనదిగా ఉండే ఈసీపై కొన్ని జలాశయాలను నిర్మించాలని ప్రతిపాదిస్తూ విశ్వేశ్వరయ్య ఓ ప్రణాళికను సిద్ధం చేశారు. మురుగునీటి పారుదలకు అవసరమైన సూచనలు చేశారు. ఈ ప్రణాళికలు నిజాంను ఎంతగానో మెప్పించాయి. ఆ తర్వాత ఆయన మైసూర్‌కు చీఫ్ ఇంజినీర్‌గా నియమితులయ్యారు. దేశ అభివృద్ధికి పరిశ్రమలే ప్రధానమని ఆయన బలంగా నమ్మేవారు. అందుకే ఆయన జపాన్, ఇటలీ దేశాలకు చెందిన నిపుణులతో సిల్క్, శాండల్‌వుడ్, లోహ.. వంటి ఎన్నో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేశారు. బ్యాంక్ ఆఫ్ మైసూర్ పేరుతో ఓ బ్యాంకును ప్రారంభించారు. దాన్నుంచి వచ్చే ఆదాయాన్ని వ్యాపారాభివృద్ధికి ఖర్చుచేసేవారు. 1918లో దివాన్ పదవి నుంచి విరమణ పొందారు.

రైలు పట్టాలు విరిగి ఉన్నట్లు ముందే గుర్తించారు

విశ్వేశ్వరయ్యకు సంబంధించి బాగా ప్రాచుర్యంలో ఉన్న మరో విషయం ఉంది. బ్రిటిష్ కాలంలో భారత్‌లో ఓసారి ఓ రైలు వెళ్తోంది. అందులో చాలామంది బ్రిటిషర్లే ఉన్నారు. వారితో పాటు ఓ భారతీయుడు కూడా కూర్చుని ప్రయాణిస్తున్నాడు. నల్లటి చర్మరంగు కలిగి, సన్నగా ఉన్న ఆ వ్యక్తి తెల్లటి దుస్తులు ధరించి ఉన్నాడు. అతడిని చూసిన బ్రిటిషర్లు.. అతడో తెలివితక్కువవాడని, నిరక్షరాస్యుడని వేళాకోళం చేయసాగారు. కానీ అతడు అవేమీ పట్టించుకోలేదు. కానీ, ఉన్నట్లుండి లేచి నిలబడిన ఆ వ్యక్తి రైలు చైన్ లాగాడు. వేగంగా వెళ్తున్న రైలు కొద్దిసేపట్లోనే ఆగింది. అందరూ అతడి గురించే మాట్లాడుకోసాగారు. అక్కడికొచ్చిన గార్డు.. చైన్ ఎవరు లాగారని ప్రశ్నించాడు. 'నేనే' అని ఆ వ్యక్తి సమాధానమిచ్చాడు. 'ఎందుకు లాగానో చెప్పనా... కొద్ది దూరంలో రైలు పట్టాలు దెబ్బతిన్నాయని నాకనిపిస్తోంది' అని ఆ వ్యక్తి చెప్పాడు. నీకెలా తెలుసు అని గార్డు మళ్లీ ప్రశ్నించాడు. రైలు సాధారణ వేగంలో వచ్చిన మార్పు, దానితో పాటు శబ్దంలో వచ్చిన మార్పును బట్టి నాకు అలా అనిపించింది అని ఆ వ్యక్తి అన్నాడు. దీంతో కొద్ది దూరం నడిచి వెళ్లి చూసిన గార్డు అక్కడి దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. రైలు పట్టాలు రెండూ దూరందూరంగా పడి ఉన్నాయి. నట్లు, బోల్టులు దేనికవి విడిపోయి ఉన్నాయి. ఈ ఘటనలో చైన్ లాగిన వ్యక్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య.

పురస్కారాలు : 1955లో విశ్వేశ్వరయ్యకు భారత దేశ అత్యున్నత పౌరపురస్కారం భారతరత్న ప్రదానం చేసింది.

ప్రజాజీవనాన్ని మెరుగుపరిచేందుకు ఉద్దేశించే ఎన్నో కార్యకలాపాలు చేపట్టినందుకు గుర్తింపుగా బ్రిటిష్-భారత్ ప్రభుత్వానికి చెందిన కింగ్ జార్జ్ 5 'నైట్ కమాండర్' బిరుదుతో సత్కరించారు. ఇవి కాకుండా ఆయనకు మరెన్నో అవార్డులు, పురస్కారాలు లభించాయి. ఆయన పేరు మీద ఎన్నో సంస్థలు ఏర్పాటయ్యాయి.

రైతన్నా నీకోసం నేను

పి. లక్ష్మణ్ రావ్, అసిస్టెంట్ రిజిష్ట్రార్ సహకార శాఖ విజయనగరం, 9441215989

అక్షరం నిన్ను ఓదారుస్తుందంటే
ముప్పూటలా అక్షర భోజనం
నేను తినిపిస్తానన్నా
కవిత్వం నిన్ను సేదదీరుస్తుందంటే
దివారాత్రులూ కవితాసత్రం
నేను నిర్మిస్తానన్నా !
వ్యవసాయం గాలిలో దీపమై
జీవితంలో అప్పుల భారమై
ఎగతాళి చేస్తుండడం నిజమేఅయినా
చెమటనే చమురుని చేసి
బతుకుదివ్వెను వెలిగిస్తున్నోడివి
నువ్వారిపోతానంటే
నీ కుటుంబమేమైపోవాలి ?
వాళ్ళ బతుకులేమైపోవాలి ?

ఏరువాక సాగలేదని
జీవన నౌక ముంచేస్తామా !?
గిట్టుబాటు కాలేదని
కట్టెగా కాలిపోతామా !?
చితికిపోయామని
చితిని పేర్చుకుంటామా !?

సాలెపురుగుని చూడు
గూడుకట్టుకోడానికి ఎన్నిసార్లు
కిందపడుతుందో
గొంగళిపురుగుని చూడు
సీతాకోకగా ఎగరడానికి ఎంత తపస్సు
చేస్తుందో
చిన్న చీమను చూడు
పుట్టపేర్చడానికి ఎంత బరువుని మోస్తుందో

అల్పజీవులకే ఆత్మస్థైర్యం ఉన్నప్పుడు
అన్నీతెలిసిన మనం
బతుకుల్ని అంతం చేసుకుంటామా ?!

రైతన్నా
ఒక్క అడుగు వెనక్కెయ్యి
పది అడుగులు ముందుకు పడతాయి
నీ ఒక్క శ్వాస నిలిస్తే
మరో పది శ్వాసలు వెలుగుతాయి

ఈ ధైర్యవచానాలు
హితబోధ కాదు సుమా
నిన్ను రక్షించుకోడానికి
నా కవితాక్షరాలు !

తెలంగాణాలో రెవె"న్యూ"

\- కె.రాజా

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ శాఖలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టింది. 1985 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు చేపట్టిన సంస్కరణల తరువాత ఇవే అతి పెద్ద సంస్కరణలు. తెలంగాణ రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను సమూలంగా మార్చాలని, సంస్కరణలు తేవాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేస్తున్న ప్రయత్నాలు చివరి దశకు వచ్చాయి. భూ నిర్వహణలో సరళీకృత, అవినీతిరహిత, బలహీన వర్గాలకు మేలు చేసేవిధంగాకొత్తగా చట్టాలను తెలంగాణ ప్రభుత్వం రూపొందించింది. ఇందులో భాగంగా తొలుత ప్రస్తుతం ఉన్న వీఆర్వో (విలేజ్ రెవెన్యూ ఆఫీసర్)వ్యవస్థను రద్దుచేసింది.

మరోపక్క నూతన రెవెన్యూ చట్టాన్ని తీసుకొచ్చింది. మరోపక్క సమగ్ర భూసర్వేపై దృష్టిసారించింది. గత రెండేళ్లుగా పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని 21మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలుచేసిన నూతన రెవెన్యూ విధానం సత్ఫలితాలు ఇవ్వడంతో ఆ దిశగా రాష్ట్రమంతా వాటిని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే నూతన రెవెన్యూచట్టాన్ని తీసుకొచ్చింది. ప్రస్తుతం ఉన్న భూమి రికార్డులకు సంబంధించిన చట్టాల స్థానంలో ఇప్పుడు ది తెలంగాణ రైట్స్ ఇన్ ల్యాండ్ అండ్ పట్టాదార్ పాస్‌బుక్ బిల్లు, ది తెలంగాణ అబాలిషన్ ఆఫ్ ది పోస్ట్ ఆఫ్ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ బిల్, ది తెలంగాణ పంచాయితీ రాజ్ ఎమెండ్మెంట్ బిల్లు, ది తెలంగాణ మున్సిపల్ లాస్ ఎమెండ్మెంట్ బిల్‌తో పాటు, జీహెచ్ఎంసీ చట్టానికి సంబంధించిన బిల్లులను తీసుకొచ్చింది.

తెలంగాణలో మొత్తం 1 లక్షా 12 వేల చదరపు కిలోమీటర్ల భూమి అంటే సుమారు 2 కోట్ల 75 లక్షల ఎకరాల భూమి ఉంది. ఇందులో 1 కోటి 55లక్షలఎకరాలు వ్యవసాయభూమి కాగా, 66.56 లక్షల ఎకరాలు అటవీ భూములు ఉన్నాయి. మిగిలింది ప్రభుత్వ భూమి, గ్రామ కంఠాలు, పట్టణాల కింద, ప్రజా ఉమ్మడి ఆస్తుల కింద ఉన్నాయి. కొత్త చట్టం ప్రకారం ఇప్పుడు వీటి నిర్వహణలో తహశీల్దార్లే కీలకం కానున్నారు. అవినీతి, అక్రమాల ఊబిలో కూరుకుపోయిన రెవెన్యూ శాఖను ఈ సంస్కరణలు ఎంతవరకూ సంస్కరిస్తాయనేదానిపై సర్వత్రా ఆసక్తికరంగా మారింది. కొత్త రెవెన్యూ చట్టం ప్రకారం ఇప్పుడున్న అనేక వ్యవస్థలు, ఫాంలు, రికార్డు పుస్తకాల స్థానంలో ధరణి వెబ్‌సైట్‌వస్తుంది. ఇది రెండు భాగాలుగా ఉంటుంది. ఒకటి వ్యవసాయ భూములకు సంబంధించినది కాగా, రెండవది వ్యవసాయేతర భూములకు సంబంధించినది. ఈ వెబ్‌సైట్ ఎవరైనా తెరవచ్చు. చూడవచ్చు. కాపీ చేయవచ్చు. డౌన్లోడ్ కూడా చేయవచ్చు. ఇకపై తెలంగాణ భూ రికార్డులకు ఇదే ప్రధాన రికార్డు ఆయువుపట్టు అవుతుంది ఈ వెబ్‌సైట్ దెబ్బతినకుండా, అందులో ఉన్న సమాచారం పోకుండా వేర్వేరు ప్రాంతాల్లో (డాటా బ్యాకప్ మల్టిపుల్ సర్వర్స్) నిక్షిప్తం చేస్తారు. ఇకపై రెవెన్యూ అధికారుల విచక్షాధికారాలు రద్దు అవుతాయి. తహశీల్దారు నుండి జాయింట్ కలెక్టర్ వరకూ ఎవరికీ విచక్షణాధికారులుండవు. వారు రికార్డుల నిర్వహణలో అక్రమాలు



చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయి. వీలైనన్ని సేవలు ఆన్‌లైన్ అవుతాయి. నేరుగా ఆఫీసుకు వెళ్లాల్సిన అవసరం బాగాతగ్గుతుంది. ఆయా భూములపై వచ్చిన వివాదాలపై కోర్టు తీర్పులను కూడా ఆన్‌లైన్ రికార్డులలో అప్డేట్ చేస్తారు. ఇకపై భూముల రిజిస్ట్రేషన్ల తోపాటు, మ్యుటేషన్ కూడా తహశీల్దార్లే నిర్వహిస్తారు. తహశీల్దా ర్లందరికీ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ హోదా ఇస్తారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు ఇకపై సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులకు వెళ్లక్క ర్లేదు.

తహశీల్దార్ల కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి చేసి, వెంటనే అక్కడే మ్యుటేషన్ కూడా పూర్తి చేసి వాటి వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ధరణి వెబ్‌సైట్‌లో అప్డేట్ చేసి పంపిస్తారు. కాగా ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 141 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వ్యవసాయేతర భూములను మాత్రమే రిజిస్ట్రేషన్లు చేస్తారు. అంటే వ్యవసాయం కిందకు రాని ప్లాట్లు, ఇళ్లు, అపార్టుమెంట్లు, కంపెనీల స్థలాలు, గ్రామ కంఠం (ఆబాదీ) ఇవన్నీ వీరి కిందికి వస్తాయి. వాటి మ్యుటేషన్లు కూడా ఇకపై సబ్‌రిజిస్ట్రార్లే చేస్తారు. మ్యుటేషన్ కోసం వేరే ఎక్కడికీ వెళ్లక్కరలేదు. కొత్త విధానం ప్రకారం రిజిస్ట్రేషన్‌కి సమయం ఆన్‌లైన్లో బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. బుక్ చేసినసమయం బహిరంగంగా అందరికీ కనిపిస్తుంది. అదే విషయం అక్కడ లాగ్ బుక్‌లో కూడా రాయాలి. దస్త్రావేజులు సొంతంగా తయారు చేసుకోవచ్చు. లేదంటే దస్తావేజులు రాసేవారి చేత రాయించుకోవచ్చు. వారందరికీ ఇకపై లైసెన్సులు తప్పనిసరి అవుతుంది. రిజిస్ట్రేషన్ అయిన వెంటనే నిముషాలు లేదా గంటల వ్యవధిలోనే పట్టాదారు పాస్‌బుక్‌లో చేర్పులు, మార్పులు, తొలగింపులు జరుగుతాయి. రిజిస్ట్రేషన్ చేయకూడని భూములను కంప్యూటర్లో ఆటోలాక్ చేస్తారు. అంటే వాటిని ఏ అధికారి రిజిస్టర్ చేయలేరు. ప్రజల ఉమ్మడి ఆస్తులు, ప్రభుత్వ భూములను ఇలా పెడతారు. మరోపక్క వారసత్వ భూమిని వారసులకు మార్చే పద్ధతి (ఫౌతీ)ని సరళతరం చేస్తున్నారు. ఇకపై అధికారులు వచ్చి విచారణ చేసే పద్ధతి ఉండదు.

కుటుంబం అంతా సంతకాలు పెడితే వెంటనే ఇస్తారు. ఇకపై పట్టా దారు పాస్ పుస్తకాల్లో కుటుంబ సభ్యుల వివరాలన్నీ పెడతారు. దీని

వల్ల మరణం తర్వాత వారసత్వ భూమి విషయంలో సమస్యలనేవి రాకుండా ఉంటాయి. పాస్ పుస్తకాలు లేని భూములకు వాటిని జారీ చేసే అధికారం తహసీల్దార్లకే కట్టబెడతారు. వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు పూర్తయిన వెంటనే బదిలీ చేయాల్సి ఉంటుంది. రికార్డు పూర్తి చేసి కొన్నవారికి బదిలీ చేస్తారు. తప్పు చేసిన తహసీల్దార్‌పై బర్తరఫ్, క్రిమినల్ చర్యలతోపాటు, తిరిగి భూములు స్వాధీనం చేసుకుంటారు.

రికార్డుల్లో సవరణలు చేస్తే ప్రభుత్వం అధికారులపై దావా చేయకూడదు. డిజిటల్ రికార్డుల ఆధారంగానే రైతులకు వ్యవసాయ రుణాలు మంజూరు చేస్తారు. రుణాల మంజూరుకు పాస్ పుస్తకాలను బ్యాంకుల్లో పెట్టుకునే విధానానికి ఇక నుండి స్వస్తి పలుకనున్నారు. రికార్డులను అక్రమంగా దిద్దడం, మోసపూరిత ఉత్తర్వులు చేయకూడదు.

అక్రమాలకు పాల్పడితే ఉద్యోగులపై చర్యలు, సర్వీసు నుండి తొల గింపు ఉంటుంది. అలాగే జాగీరు భూములను ప్రభుత్వ భూములుగా రెవెన్యూ రికార్డుల్లో రిజిస్ట్రర్‌చేయాలి. ఇక ప్రభుత్వ విధాన పరమైన నిర్ణయాల్లో అతి పెద్దది సమగ్ర భూసర్వే. దాదాపు 150 ఏళ్ల క్రితం నిజాం రాజుల కాలంలో, బ్రిటీష్ ప్రభుత్వ సూచనతో తెలంగాణలో భూసర్వే జరిగింది.

తెలంగాణలో సాలార్‌జంగ్ హయాంలో 1853లో మొదటిసారి భూమి సర్వే జరిగింది. ఆ తర్వాత 1930– 50 మధ్య మరోసారి సర్వేజరిగింది. 1979–80లో మళ్లీ తెలంగాణలో ఆర్వోఆర్ జరిగింది. అప్పటినుండి ఇప్పటివరకూ అవే రికార్డులు ఆధారం. కానీ ఇప్పుడు మరోసారి భూ సమగ్ర సర్వేకు ప్రభుత్వం నడుంకట్టింది. అలాగే ఇప్పటివరకూ రెవెన్యూ కోర్టుల వ్యవస్థ ఉండేది. అంటే చిన్నచిన్న భూతగాదాల పరిష్కారానికి తహశీల్దార్లు, ఆర్డీవో లు,జాయింట్ కలెక్టర్లే రెవెన్యూ కోర్టులలో జడ్జిపాత్రను పోషించేవారు తమ శాఖఇచ్చే ఆదేశాలపై తామే విచారణజరిపే వ్యవస్థ ఇది. ఇప్పుడు ఆ రెవెన్యూ కోర్టులను రద్దుచేశారు. వాటిస్థానంలో ఫాస్ట్‌ట్రాక్ ట్రిబ్యునళ్ళు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ రెవెన్యూ కోర్టుల్లో ఉన్న 16,137కేసులు ఆ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులకు బదిలీ అవుతాయి. నిర్ణీత కాలవ్యవధిలో వాటిని తేలుస్తారు. ఇకపై వచ్చే వివాదాలు మాత్రం నేరుగా సివిల్ కోర్టులకు వెళ్లి తేల్చుకోవాల్సి ఉంటుంది. ఈ ట్రిబ్యునళ్లు కేవలం ఇప్పటికే ఉన్న కేసులకు మాత్రమే పరిమితం అవుతాయి. అదేవిధంగా రెవెన్యూ పరంగా ఇకపై కుల సర్టిఫికెట్లు లైఫ్ టైం ఉపయోగపడేలా ఒకేసారి ఇస్తారు. ఇక మీదట రెవెన్యూశాఖ బదులు, గ్రామ పంచాయితీ, మున్సిపాలిటీలే ఈ సర్టిఫికెట్లను ఇస్తాయి. ఇకపై ఆదాయ సర్టిఫికెట్లు మనుషులతో సంబంధం లేకుండా తెలంగాణ ప్రభుత్వం దగ్గర ఉన్న డేటా ఆధారంగా ఇస్తారు. మీకున్న ఆస్తిపాస్తుల వివరాలు ప్రభుత్వానికి తెలుసు కాబట్టి (సమగ్ర సర్వే ద్వారా) వాటి ఆధారంగా దరఖాస్తు చేసుకున్న వారికి ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ ఇస్తారు. కాగా రెవెన్యూ వ్యవస్థలోని అక్రమాలకు చెక్ పెట్టేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త రెవెన్యూ చట్టం ఇప్పటికే ప్రజల్లో పాపులారిటీ సంపాదించింది. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న ఈ కొత్త రెవెన్యూ చట్టం కింద రిజిస్ట్రేషన్ల ప్రక్రియను తహశీల్దార్లు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని 21మండలాల్లో రెండేళ్ల క్రితమే కొత్త రెవెన్యూ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తోంది. ఈ చట్టం సాధ్యాసాధ్యాలపై రాష్ట్రంలోని ఉమ్మడివరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాలోని రెండు మండ లాలతోపాటు,వివిధ జిల్లాల్లోని మరో 18 మండలాల్లో మొత్తం 21 మండలాల్లో ఈ కొత్త రెవెన్యూచట్టం పైలెట్ ప్రాజెక్టుగా అధికారులు అమలుచేస్తున్నారు.

ఈ మండలాల్లో తహశీల్దార్‌కార్యాలయాల్లోనే భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను రెండేళ్లుగా నిర్వహిస్తున్నారు. తహశీల్దార్ల వద్ద భూములకు సంబంధించిన అన్ని రికార్డులు ఉండడంతోపాటు, వారికి భూముల మీద పక్కాఅవగాహన ఉండడంవల్ల ఎలాంటి వివాదాలు లేకుండా రిజిస్ట్రేషన్లప్రక్రియను సులభంగా నిర్వహిస్తున్నారు.

భూముల క్రయ,విక్రయాల్లో పారదర్శకతతో ఉండడంవల్ల వివాదాలు తగ్గుముఖం పట్టాయి. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలలో ఈ విధానానికి ప్రజల నుండి మంచి స్పందన లభిస్తోంది. ఇప్పటి వరకూ 3,160 రిజిస్ట్రేషన్లను తహశీల్దార్లే చేశారు.

మొత్తం రూ. 3,08,11,000కోట్లమేర ఆదాయం ఖజానాకు సమకూరింది. అలాగే భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి తహశీల్దార్ కార్యాలయంలోనూ కొత్త రెవెన్యూవిధానం విజయవంతంగా అమలుచేసారు.

ఇక్కడ ఇప్పటివరకూ 1,150రిజిస్ట్రేషన్లు జరుగగా,రూ. 61.50 లక్షలమేర ఆదాయం లభించింది. గతంలో భూముల రిజిస్ట్రేషన్లకోసం రోజుల తరబడి పడిగాపులు పడ్డవారికి కొత్తచట్టంతో ఆబాధలు తప్పాయని పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న తహశీల్దార్ కార్యాలయాలపరిధిలో ప్రజలనుండి వస్తున్న స్పందన ఇది.

ఈ కొత్త చట్టంకారణంగా కేవలం రెండు మూడు గంటల్లోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తవుతోంది, ఇందువల్ల సమయం, ప్రయాణఖర్చులు వంటివి ఆదా అవుతున్నాయి. పైలెట్ ప్రాజెక్టుగా కొత్తరెవెన్యూ చట్టాన్ని అమలుచేస్తున్న ఈ 21మండలాల్లోని భూముల రిజిస్ట్రేషన్లను చేసిన తహశీల్దారు కార్యాలయా లపై రెండేళ్లనుండి ఇప్పటివరకూ ఒక్కఫిర్యాదు కూడా నమోదుకాకపోవడం విశేషం.

కొత్తచట్టం నేపథ్యంలో వీఆర్వో వ్యవస్థను రద్దుచేసారు. అలాగే వారికి ఎవర్నీ ప్రత్యామ్నాయంగా నియమించడంలేదు. వారు చేసేపనులు ఇకపై తహశీల్దార్ ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని నిర్వహిస్తారు.

వీఆర్వోలకు ఐటీ నడిపించే వెబ్‌సైటే ప్రత్యమ్నాయమవుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 5,480మంది వీఆర్వోలను వేర్వేరు శాఖల్లో ఉద్యోగులుగా సరద్దుబాటు చేస్తారు. అవసరాన్ని బట్టి కొందరిని రెవెన్యూలో కొనసాగిస్తారు. 20,292 మంది వీఆరేఏలను పూర్తిస్థాయి జీతం తీసుకునే ప్రభుత్వ ఉద్యోగులుగా మారుస్తారు. వీఆర్వోలను ఏదైనా సమానస్థాయి ఉద్యోగానికి బదిలీచేస్తారు.

వీఆర్ఎస్ లేదా స్వచ్ఛంద పదవీ విరమణకు అవకాశం కల్పించను న్నారు. అయితే ఇతరవిభాగాల్లో సర్దుబాటు చేసినా, సర్వీసు రూల్స్ విషయంలో వారిలో గందరగోళం నెలకొంది. ఏది ఏమైనా కొత్త రెవెన్యూ చట్టం మాత్రం విప్లవాత్మక నిర్ణయంగా చెప్పుకోవచ్చు.

షట్ సంపత్తులు

- శర్మ

సాధారణంగా మనం ఇతిహాస పురాణాదులలో శమదమాదులు కలవాడు అని నాయకుని వర్ణించడం చూస్తుంటాము. చాలామంది వీటిని ఏ యోగులకో, ఋషులకో లేదా పురాణపురుషులకో వుండవలసిన లక్షణాలు అనుకుంటారు. కాని ఇవి నిత్యజీవితంలో అందరూ అలవరచుకోవలసిన లక్షణాలు అని గ్రహిస్తే, మనకు భయము, పిరికితనమూ పోయి సుఖదుఖాలను సమానంగా స్వీకరించే స్థితప్రజ్ఞత వస్తుంది. ఈ దమశమములనే గుణములను "షట్ సంపత్తులు" అంటారు. అవి ఏవిటంటే...

దమము – ఇంద్రియములను నిగ్రహించడం

మనకు చికాకు కలిగినప్పుడు, మన చికాకును ఎదుటివారిపై ప్రదర్శించకుండా నిగ్రహించడం. ఉదాహరణకు, భీముడికి దుర్యోధనుడిపై ఎన్నోసార్లు కోపం వచ్చింది. కాని ఒక్కసారి ధర్మరాజు వద్దు అనగానే తన ఆవేశాన్ని అదుపుదాటనివ్వడు. ఇదే దమము. (ఇది తన మనుసులోని బాధలు, కోపాలు తన ఇంద్రియాలు చెడుపనులు చెయ్యకుండా ఆపడం) (ఇక్కడ కోపంరాకుండా మనస్సును నిగ్రహించడం లేదు) ఇది మనము సాధించవలసిన మొదటి సంపద.

శమము – మనస్సును నిగ్రహించడం. ఇది మనము సాధించవలసిన రెండవ సంపద. ఇక్కడ మనకు నచ్చని పరస్థితిని ఎదుర్కోవలసి వచ్చినప్పుడు, ప్రధానంగా మన మనసును శాంతము కోల్పోకుండా నిలపడం. ఉదాహరణకు ధర్మరాజు ఎంత చికాకులోనైనా కోపము రాకుండా శాంతమునే ప్రదర్శిస్తాడు.

తితిక్ష – ఎట్టి కష్ట పరిస్థితులలోనూ మనోనిబ్బరమును కోల్పోవకుండుట శాంతము వేరు, మనోనిబ్బరము వేరు. కష్టములు దాపురించినప్పుడు మనసును బేలకాకుండా నిలువరించి ధైర్యముతో వానిని ఎదుర్కొనుటే తితిక్ష. అకస్మాత్తుగా ఎదురైన సంఘటనలవలను చికాకుపడకుండా ఉండడం శాంతము. చాలాకాలము కష్టములను ఎదుర్కొంటూ, శాంతముగా ఉండడము నిబ్బరము. ఉదాహరణకు వనవాసకాలములో ధర్మరాజు చూపిన మనోనిబ్బరమే తితిక్ష.

ఇది మనము సంపాదించవలసిన మూడవ సంపద. శ్రద్ధ – తనకు తెలియనిదానినిగూర్చి తెలుసుకొనుటకు ఆసక్తి చూపుట జీవితంలో విజయం సాధించాలంటే, మనకు తెలియనివాటిని ఎన్నిటినో తెలుసుకోవాలి. తెలుసుకోవాలనే ఆసక్తి ఉండాలి. ఇటువంటి ఆసక్తి మనను విజయపథంవైపు మళ్ళిస్తుంది. ఈ ఆసక్తే మనము సంపాదించవలసిన నాల్గవ సంపద. ఉపరతి – తను చేయవలసిన పనిని మంచి ఉత్సాహముతో చేయుట జీవితంలో విజయం కష్టసాధ్యము. కష్టపడకుండా దేనినీ సాధించలేము. కష్టపడకుండా దేనినైనా ఒకవేళ సాధిస్తే, అది కొన్నిసార్లు అదృష్టంవలన కావొచ్చు.

కానీ అనుకున్నవన్నీ సాధించాలంటే కష్టపడక తప్పదు.

కానీ ఈ కష్టసాధ్యమైన కార్యాలను మనము ఉత్సాహంతొ చెయ్యాలి.

ఈ విషయంలో మా నాన్నగారు చెప్పిన విషయము చిరస్మరణీయము. "ఏ పని చెయ్యడానికైనా మనము కష్టపడకూడదు. ఇష్టపడాలి."

దీని భావమేమిటంటే, దేనినైతే మనము ఇష్టపడతామో, అది మనకు కష్టంగా అనిపించదు.

అప్పుడు ఆ పనిని మనము ఉత్సాహవంతముగా జయప్రదము చెయ్యగలుగుతాము.

ఈ ఉత్సాహమే 'ఉపరతి'.

ఇదే మనము సాధించవలసిన ఐదవ సంపద.

సమాధానము – తను శ్రద్ధతో, ఉత్సాహముతో చేసిన కర్మలకు, ఏ ఫలితము లభించినా సంతృప్తితో స్వీకరించుట

ఇది మనము సాధించవలసినవాటిలో అత్యంత కష్టమైనది.

మనము ఎంత శ్రద్ధతో, ఆసక్తితో పనిచేసినా, కొన్నిసార్లు మనము ఆశించిన ఫలితము మనకు దక్కకపోవచ్చు.

దీనికే కృష్ణపరమాత్మ "కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచన' అని బోధించారు.

దీని అర్థం ఒకవేళ మనకు నచ్చిన ఫలితము రాకపోతే మన ఖర్మ అనుకొని వదిలెయ్యమని మాత్రం కాదు.

ఏ కార్యములోనైనా కలిగిన జయాపజయాలను నిరాశానిస్పృహలకు లోనుకాకుండా విశ్లేషించుకొని, తన తప్పులను తెలుసుకొని, మరింత విజయాసక్తితో, ద్విగుణీకృతమైన ఉత్సాహంతో మళ్ళీ ప్రయత్నించాలి.

ఇలా ఉత్సాహంతో చెయ్యాలంటే, మునుపటి అపజయాలకు మనసుని సమాధానపరచుకొని, వాటిని నిబ్బరంగా స్వీకరిస్తేనే సాధ్యమౌతుంది.

అలా స్వీకరించలేనివారు ఆత్మహత్యలకి పాల్పడుతుంటారు.

కాబట్టి మనసుని సమాధానపరచుకొనగలిగినవాడే సాధారణమానవుని స్థాయినుండి అసాధారణ క్రియాశీలియైన ధీరునిగా ఎదుగుతాడు.

అటువంటివారినే అంతిమవిజయం వరిస్తుంది.

దమశమాదులను సాధించినవారు భగవత్కృపను కూడా పొందగలుగుతారు.

అందువలనే ఈ దమశమాదులనే షట్సంపదలను సాధించినవారు మానవాళికి ఆదర్శంగా నిలబడి చిరస్మరణీయులౌతారు.

❄❄❄❄❄

ఎవరికి ఎవరు సొంతము..? ఎంతవరకీ బంధము..?

– సి.కె.రవివర్మ



ఇంతకు ముందు మన దేశం, మన రాష్ట్రం, మన ప్రాంతం, మన కులం, మన జాతి, మన ఊరు, మన బంధుగణం, మన స్నేహితులు... ఈ అనుబంధాలు... కానీ కాలం మారుతోంది... లక్ష కారణాలు ఉండొచ్చు గాక... ఆ బంధాల ప్రాధాన్యం తగ్గిపోయింది.

చివరకు నన్ను కన్నవాళ్లు, నేను కన్నవాళ్లు, నేనూ, నన్ను కట్టుకున్నవాళు ్లు... వీళ్లు బాగుంటే చాలు అనే భావన ప్రబలంగా పెరిగింది... అదీ సడలిపోతోంది... ప్రియుల కోసం భర్తల్ని, పిల్లల్ని కడతేర్చే భార్యలు, భార్యల్ని నిలువునా తగలెట్టే భర్తలు... నాలుగు రోజులకే పెటాకులు... విపరీతంగా విడాకులు... దీనికితోడు ముసలి వాళ్లను వదుల్చుకోవడం... మరిక మిగిలింది ఎవరు..? మనం కన్నవాళ్లు... వాళ్లనూ రకరకాల కారణాలతో వదిలేస్తున్నాం, దూరం ఉంచేస్తున్నాం... మనిషి సెల్ఫ్ సెంట్రిక్ అయిపోయాడు... ఇది పరమ దరిద్రమైన దశ... ఇదిలాగే పెరిగితే... ఆ దశ గురించి ఆలోచించడమే భయానకం.

ఎందుకిదంతా అంటారా..? రోజూ బోలెడు ఉదాహరణలు, వార్తలు చదువుతున్నాం... మనిషి తనల్ని తాను కుదించుకుంటున్నాడు... వేగంగా... తనే కేంద్రకంగా ఉండే పరిధి శీఘ్రంగా తగ్గిపోతోంది... సిద్దిపేట జిల్లా... కోహెడ మండలం, శనిగరం... శంకర్నగర్... పోతు మల్లయ్య అని ఎనభయ్యేళ్ల వృద్ధుడు... ముగ్గురు కొడుకులు... తన ఒంట్లో బలం ఉన్నన్ని రోజులూ ఏదో కష్టపడ్డాడు... ఈ ఎనభయ్యేళ్ల వయస్సులో చేయడానికి ఏముంది..? ముగ్గురికీ కోటి రూపాయల చొప్పున ఆస్తి కూడా పంచి ఇచ్చాడు... ఆస్తి ఇచ్చేశాడు, ఇక పనేముంది..? కొడుకులు పట్టించుకోవడం మానేశారు.

అరె, మీ అయ్యకు కాస్త కూడు పెట్టండ్రా అని ఊళ్లో పెద్దలు పంచాయితీలు పెట్టి మరీ హితబోధ చేసినా... ఎవరూ వినిపించుకోలేదు... ఓసారి కోహెడ ఠాణాకు పిలిచి కౌన్సిలింగ్ చేసినా ఫలితం లేదు... నా ఆఖరి క్షణాల్లో నాతో ఉండేవాడికే నా ఆస్తి అన్నట్టుగా వ్యవహరించి ఉంటే బాగుండేదేమో... ఆ ఆశతోనైనా చేరదీసేవాళ్లు... అయ్యా, నా కొడుకులు ఇలా తయారయ్యారు అని మల్లయ్య ఆర్డీవోకు కలిసి మొరపెట్టుకున్నాడు... ఆయనా పిలిపించి మందలించాడు, గట్టిగా చెప్పాడు... ఊహూఊ ఎవరిలోనూ ఉలుకూ లేదు, పలుకూ లేదు.

ఇక్కడ దరిద్ర్యమైన సంగతి ఏంటంటే... ఏడాదిగా ఊరివాళ్లు ఎవరైనా అన్నం పెడితే తింటున్నాడు మల్లయ్య... కొడుకులకు 3 కోట్ల ఆస్తి పంచి ఇచ్చి, తను బికారి అయ్యాడు.

ఇలా కాదని ఎస్ఐ, కొందరు గ్రామస్థులు కలిసి, దగ్గరలోనే ఉండే అంకిరెడ్డిపల్లి అనే ఊరి దగ్గర ఉన్న ఓ వృద్ధాశ్రమంలో నెల క్రితం చేర్పించారు... నాలుగు రోజులుగా అనారోగ్యం... సిద్దిపేట ప్రభుత్వ హాస్పిటల్లో చేర్పించారు ఆశ్రమ నిర్వాహకులు... ఒరేయ్, మీ అయ్య చావుబతుకుల్లో ఉన్నాడు అని సమాచారం పంపించినా సరే ఒక్కడూ రాలేదు... కనీసం చూడటానికి కూడా.

ఎస్ఐకి చిర్రెత్తింది... వీఆర్వోను పిలిచి ఓ ఫిర్యాదు రాసివ్వు అన్నాడు... కేసు రాశాడు... ముగ్గురు కొడుకులనూ అరెస్టు చేసి, హుస్నాబాద్ కోర్టుకు పంపిస్తే, మేజిస్ట్రేట్ రిమాండుకు పంపించాడు... వాళ్లిప్పుడు జైలులో ఉన్నారు... మమ్మల్ని జైలులో వేయించాడు అనే కోపంతో... ఇక మల్లయ్య మొహం చస్తే చూడరు... సున్నితమైన ఓ దారం కూడా ఇక తెగిపోయినట్టే... ఇక్కడ చెప్పుకోవాల్సింది ఏమిటంటే..?

చట్టాలు, కేసులు శిక్షించగలవేమో గానీ... మనిషిలోని తత్వాన్ని మార్చలేవు... పైగా ఇలాంటి విషయాల్లో మనిషిని మరింత కఠోరుడిని చేస్తాయి... కొన్నేళ్ల క్రితం వరకూ గుడిలో, బడిలో కాస్త నైతికత, బాధ్యత నేర్పించేవాళ్లు... భజనల్లోనో, పాఠాల్లోనో... ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు ఒక భరోసా ఉండేది, ఎవరో ఒకరు ఆసరా... అవీ పోయాయి... మన టీవీలు, మన సినిమాలు ప్రేమలు, నేరాలు, ప్రలోభాలు, విలాసాలు, అక్రమాలు, అవలక్షణాలు నేర్పించే క్లాస్రూమ్స్ అయిపోయాయి... ఇంకా మన పయనం ఎటువైపు..? అంత ఆలోచించాల్సిన అవసరం లేదు... మరింత పతనం వైపు... అనివార్యంగా... ఎవడేమైనా గానీ, నేనొక్కడిని బాగుంటే చాలు అనే భావన మరింత బలపడేకొద్దీ... మరింత ఘోరమైన సమాజాన్ని చూడబోతున్నాం మనం... నిజం... ఎవరి మీదా ఆశలు పెంచుకోకండి... ఎవరికి ఎవరూ ఏమీ కారిక్కడ.!!

ఓ పాట గుర్తుస్తోందా..? కడుపు చించుకు పుట్టిందొకరు, కాటికి నిన్ను మోసేదొకరు, ఆపై నీతో వచ్చేదెవరూ అనే పాట... ఆపై మనతో వచ్చేది ఎవరూ ఉండరు, ఇక్కడే ఎవడూ లేకుండా పోతున్నప్పుడు... చచ్చాక ఎవడెట్లా పోతేనేం.!!

ఎల్ఐసి దీపానికి బీమా ఉందా??

- ఎవిఆర్‌కె మూర్తి

ఎల్ఐసిని ప్రైవేటు పరం చేయడమంటే చక్రాన్ని వెనక్కి తిప్పినట్లే లెక్క. అసలు ఎల్ఐసి ఆవిర్భవించినదే ప్రైవేటు బీమా సంస్థల వైఫల్యం వలన! అప్పట్లో ధనిక వ్యాపార కుటుంబాలు తమ సంస్థలకు పెట్టుబడుల కోసం బ్యాంకులను, బీమా కంపెనీలను నిర్వహిస్తూ ప్రజల నుంచి అతి తక్కువ రేట్లకు పొదుపు చేసిన సొమ్మును తీసుకునేవారు. దాన్ని తమ వ్యాపారాల్లో పెట్టుబడిగా పెట్టి మంచి లాభాలు ఆర్జించేవారు. 1953లో బీమా వ్యాపారంలో రూ.12 కోట్లు పెట్టుబడి పెట్టిన వీరు మూడేళ్లలో రూ.318 కోట్లు సంపాదించారు. ప్రజలకు ఓ పట్టాన బ్యాంకు ఋణం లభించేది కాదు. బ్యాంకుల జాతీయకరణ చేసిన తర్వాతనే వారికి బ్యాంకుల ఋణాలు అందుబాటులోకి వచ్చాయి. డిపాజిట్ల వడ్డీ రేట్లు పెరిగాయి. బ్యాంకింగ్ సేవలు విస్తరించాయి. బ్యాంకుల జాతీయకరణ కంటె 13 ఏళ్లకు ముందే బీమా వ్యాపారం జాతీయం చేయవలసిన అవసరం ఎందుకు పడిందంటే కొన్ని కంపెనీలు ప్రజలను మోసం చేశాయి, కొందరు మోసగాళ్లు కంపెనీలను మోసం చేసి ముంచేశారు. భార్య పేర బీమా చేయించడం, బొంబాయిలో ఎత్తయిన బిల్డింగుల పైకి తీసుకెళ్లి ఊరు చూపిస్తా అంటూ కిందకు తోసేయడం, ప్రమాదవశాత్తూ చనిపోయిందని బీమా క్లెయిమ్ చేయడం, యిలా కంపెనీలను దోచారు. ఇక కంపెనీలు కూడా బీమా కంపెనీల నిధులను తమ కంపెనీలకు దారి మళ్లించసాగాయి. ఇలా 25 కంపెనీలు చేశాయి.

దాల్మియా గ్రూపు వారి భారత్ ఇన్సూరెన్స్ కంపెనీ పాలసీదారులను రూ. 2 కోట్ల మేరకు దగా చేసింది. బొంబాయిలో రూ. 30 లక్షల గవర్నమెంటు సెక్యూరిటీలు గల్లంతయ్యాయి. ప్రజలకు చావు గురించి ఆలోచించడమే భయం. నీ మరణానంతరం నీ కుటుంబం కోసం బీమా చెయ్యి అంటే జనాలు వినడానికే యిష్టపడేవారు కారు. అందువన బీమా వ్యాపారం పెద్దగా జరిగేది కాదు. దాంతో కిట్టుబాటు కానంతగా కంపెనీలు ఆఫర్లు యిచ్చేవి. అలా 25 కంపెనీలు మూతపడ్డాయి. ఇవన్నీ దేశ బీమా రంగాన్ని కృంగదీశాయి.

పాలసీదారుల సొమ్ముకు రక్షణ కల్పించాలన్నా, ఉద్యోగులకు, ఏజంట్లకు భద్రత ఉండాలన్నా జాతీయకరణ ఒకటే మార్గం అనుకుని నెహ్రూ ప్రభుత్వం 1956 జనవరిలో ఆర్డినెన్సు జారీ చేసింది. అక్టోబరు 1న 245 జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలను కలుపుకుని ఎల్ఐసి ఆవిర్భవించింది. ఎల్ఐసిని ఒక ట్రస్టుగా రూపొందించారు. అప్పుడు ప్రభుత్వం మూలధనానికై యిచ్చింది కేవలం రూ. 5 కోట్లు. దాని మీద ఎల్ఐసి ఏటేటా డివిడెండ్ యిస్తూనే వచ్చింది. ఇప్పటిదాకా ప్రభుత్వానికి ఆ రూపేణా వచ్చింది రూ. 26 వేల కోట్లు! అది చాలనట్లుగా ఎల్ఐసి నిధులను చిత్తం వచ్చినట్లు వాడుకుంది. ఎక్కడ ఏ అవసరం పడినా ఎల్ఐసిని 'నువ్వు వాడికి డబ్బియ్యి, వీడికియ్యి, లాభసాటి కాకపోయినా ఇక్కడ పెట్టుబడి పెట్టు, అక్కడ పెట్టు' అంటూ ఆదేశాలిచ్చింది. ఎల్ఐసి అవన్నీ చేస్తూ పోయింది. ఎవరి డబ్బుతో? పాలసీదారుల డబ్బుతో! అలా చేసినా నిలదొక్కుకుంటూ, విస్తరిస్తూ, సమర్థవంతంగా నిర్వహించుకుంటూ వస్తోంది. గతంలో అయితే మోనోపలీ ఉండేది. కానీ రెండు దశాబ్దాలుగా ప్రయివేటు ఇన్సూరెన్సు కంపెనీలతో పోటీపడుతూ వస్తోంది. 23 ప్రయివేటు బీమా కంపెనీలున్నా, యిప్పటికీ మార్కెట్లో 73 శాతం వాటా ఎల్ఐసిదే. ఆలాటి ఎల్ఐసిని యిప్పుడు కోసుకుని తినేద్దామని ప్రభుత్వం చూస్తోంది. ఏ అధికారంతో అప్పుడెప్పుడో రూ. 5 కోట్లు యిచ్చినం దుకట! మరి అలా అయితే ఈనాడు రూ. 31 లక్షల కోట్ల విలువ చేసే ఆస్తులున్న, ఎల్ఐసిని నిర్మించిన తరతరాల పాలసీదారులకు ఎంత హక్కు ఉండాలి? ప్రస్తుత పాలసీదారులే 40 కోట్ల మంది ఉన్నారు. 12 లక్షల మంది ఏజంట్లున్నారు. ప్రభుత్వం తన నిర్ణయంతో వీళ్లందరినీ గందరగోళంలో పడేసింది.

ఈ బంగారుబాతుపై కన్నుపడడం ఇప్పుడే కాదు, ప్రభుత్వవాటాను 50 అమ్మేసి డబ్బు చేసుకోండి అని మల్హోత్రా కమిటీ 1994లో సిఫార్సు చేసింది. కానీ అప్పటి ప్రభుత్వాలకు ధైర్యం చాల్లేదు. ప్రజలు తిరగబడతారనుకుని జంకారు. ఇప్పుడు మోదీ సర్కారుకి అలాటి జంకులు లేవు. మోదీ ప్రభుత్వం ధర్మమాని యిప్పటికే బ్యాంకులపై విశ్వాసం సడలింది. ఇప్పుడు బీమా సంస్థలపై నీడలు పడడంతో పొదుపు మొత్తాలు దాచుకునే మార్గాలు మూసుకుపోతున్నాయి. భవిష్యత్తు ఎలా వుంటుందోనన్న ఆందోళన కలుగుతోంది. మోదీకి చేతనైతే తన హయాంలో ఎల్ఐసి వంటి సంస్థను సృష్టించి భావితరాలు గుర్తు పెట్టుకునేట్లు ప్రవర్తించాలి. అనునిత్యం తను తిట్టే నెహ్రూ హయాంలో వెలసిన ఎల్ఐసి వంటి సంస్థను అమ్ముకు తినడంలో ఏం ఘనత ఉంది.

తెలుగు తీవి..రావి

(కొండలరావు గారి స్మృతిలో కొన్ని విషయాలు)

KB.రమేష్, సీనియర్ జర్నలిస్ట్, హైదరాబాద్


డాక్టర్‌గా యాక్టరై... 'మిస్సమ్మ'ను తిరగరాసి రావి కొండలరావు నటనా ప్రస్థానం తెలుగు చలనచిత్ర చరిత్రలో 60 సంవత్సరాల సుదీర్ఘకాలం సినిమాల్లో నటించిన కళాకారులలో ప్రథముడు అక్కినేని నాగేశ్వరరావు. ఆ తర్వాతి స్థానం ప్రముఖ నటుడు రావి కొండలరావుదే. అంతేకాదు తన భార్య రాధాకుమారితో కలసి సుమారు 100 సినిమాలలో భార్యాభర్తలుగా నటించిన ప్రపంచ రికార్డు కూడా వీరికే దక్కుతుంది. నటుడిగానే కాకుండా, రచయితగా, దర్శకుడిగా పరిశ్రమలో తనదైన ముద్రవేశారాయన. అలాంటి బహుముఖ ప్రజ్ఞాశాలి రావి కొండలరావు. ఆయన నటనా ప్రస్థానం మీ కోసం...

మద్రాసులో తొలి అడుగులు

ఒకసారి 1954లో ఆంధ్ర నాటక పరిషత్తు వారు హైదరాబాదులో నిర్వహించిన నాటకోత్సవాలకు న్యాయనిర్ణేతగా సినీ రచయిత డి.వి.నరసరాజు హాజరయ్యారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరిగిన ఆ ఉత్సవాల్లో శ్రీకాకుళం నుంచి నటరాజ కళాసమితి ప్రదర్శించిన ప్రఖ్యాత శ్రీరామమూర్తి నాటకం 'కాళరాత్రి'లో జేవీ సోమయాజులు, జేవీ రమణమూర్తి, జోగారావుతో పాటు రావి కొండలరావు కూడా నటించారు. అప్పుడే వారికి నరసరాజుతో పరిచయమైంది. 1956లో మద్రాసు వెళ్లి 'ఆనందవాణి' పత్రికలో కొంతకాలం పనిచేశాక, వాళ్లు జీతాలు సరిగ్గా ఇవ్వకపోతుండడంతో నరసరాజు ద్వారా పొన్నలూరి బ్రదర్స్ సంస్థ వారి కథా విభాగంలో చేరారు. అంతకు ముందే కొండలరావుకి కేరళలో ఒక మలయాళ చిత్రానికి డబ్బింగు సంభాషణలు రాసిన అనుభవం ఉంది. పొన్నలూరు బ్రదర్స్ నిర్మాత వసంతకుమార రెడ్డి నిర్మించిన 'శోభ' సినిమాలో కమలాకర కామేశ్వరరావుకు సహాయకునిగా పనిచేస్తూ, అపద్ధర్మంగా ఒక అయోమయం డాక్టరు పాత్రను పోషించారు. తర్వాత ముద్దుకృష్ణ సహకారంతో కొన్ని సినిమాలకు సహాయ దర్శకునిగా పనిచేశారు. అప్పుడే బి.ఎన్.రెడ్డి దర్శకత్వం వహిస్తున్న 'పూజాఫలము' చిత్రానికి సహాయకునిగా పనిచేసే అవకాశం దక్కింది. నిర్మాతలు లక్ష్మిరాజ్యం, శ్రీధరరావు నిర్మించిన 'నర్తనశాల'లో కమలాకర కామేశ్వరరావుకు సహకార దర్శకునిగా పనిచేస్తూ, ఆ సినిమాకు 'కామెడి ట్రాక్' రాశారు. తర్వాత 'కీలుబొమ్మలు', 'ప్రేమలో ప్రమాదం', 'ముగ్గురు వీరులు' వంటి కొన్ని సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు పోషించారు.

డాక్టరుగా యాక్టరై...

హాస్యరసం సున్నితమైంది. శ్రుతి మించిన హాస్యం



అపహాస్యమౌతుంది. అందుకే కొండలరావు పాత్రల స్వభావాన్ని బట్టి డైలాగ్ మాడ్యులేషన్ మార్చుకునేవారు. ఆయన నటించిన పాత్రలు చిన్నవే అయినా ఎంతో సహజంగా వుండి ప్రేక్షకుల మనసును ఆకట్టుకునేవి. సంభాషణలకు మేనరిజం జోడించి చెప్పడం ఆయన ప్రత్యేక శైలి. ముళ్లపూడి వెంకటరమణ కథ, సంభాషణలు సమకూర్చిన 'దాగుడుమూతలు' (1964)లో కొండలరావు ధరించిన డాక్టరు పాత్ర బాగా క్లిక్ అయింది. గౌతమి పిక్చర్స్ వారు దాదామిరాసి దర్శకత్వంలో నిర్మించిన 'నిర్దోషి' (1967) సినిమాలో సంగీత ప్రియుడైన డాక్టర్ పాత్ర వేశారు. దీనికి స్ఫూర్తి మద్రాసులో తానెరిగిన ఓ డాక్టర్ మ్యానరిజమే. కూని రాగం తీస్తూ పలకరించే ఆ డాక్టర్ తీరును కొండలరావు నిర్మాత రామబ్రహ్మంకు చెప్పి ఒప్పించారు. ఆ పాత్ర వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు "రామచిలుకనొకటి పెంచి, ప్రేమమీర మాటలాడే" అంటూ పాడుతూ అభినయిస్తే, అంతా మెచ్చుకున్నారు. అలాగే తాతినేని రామారావు దర్శకత్వంలో ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారు నిర్మించిన 'బ్రహ్మచారి' (1968) సినిమాలో కూడా

కొండలరావు డాక్టరుగా నటించి మంచి మార్కులు కొట్టేశారు. ఆ సినిమాలో రావు సాహెబ్ పరంధామయ్య (నాగభూషణం) మనవణ్ణి రక్త పరీక్ష ద్వారా గుర్తించే డాక్టరు పాత్ర ధరించారు. కళ్లజోడు సవరించుకుంటూ "మీ అబ్బాయి రామకృష్ణ రక్తమున్నూ, ఆ బిడ్డ యొక్క రక్తమున్నూ, అనగా ఇద్దరి రక్తమున్నూ పరిశీలించి, పరీక్షించి, పరిశోధించి చూడగా తేటలినదేమనగా.. నౌ కమింగ్ టు పాయింట్... ఒక్కటే! ఏమియూ సందేహము లేదు" అంటూ చెప్పే విధానం నవ్వులు పూయించింది.

సైలెన్స్... పదండి పోలీస్ స్టేషన్‌కి

నిర్మాత, దర్శకుడు పి.పుల్లయ్య తీసిన 'ప్రేమించిచూడు'లో నాగేశ్వరరావు తండ్రిగా ఒక స్కూల్ మాష్టారు పాత్రలో కొండలరావు నటించారు. ఆ పాత్ర కోసం ముళ్లపూడి వెంకటరమణ సలహాపై పుల్లయ్య దగ్గరకు వెళ్లినప్పుడు 30 ఏళ్ల కుర్రాడైన కొండలరావును చూసి ఆయన తన సహజ ధోరణిలో "ఫస్ట్ గెటవుట్. నీకు బుద్ధిలేదా... ఆ రమణకి బుద్ధిలేదా.. లేకుంటే నాకు బుద్ధిలేదా.. నువ్వు నాగేశ్వరరావుకి తండ్రివా? అయామ్ నాట్ ఎ ఫూల్. ప్లీజ్ గో" అన్నారు. ఆ తర్వాత కొడవటిగంటి కుటుంబరావు, ప్రతిభాశాస్త్రి, ముళ్లపూడి వెంకటరమణ కలిసి పుల్లయ్యకు నచ్చజెప్పడంతో కొండలరావుకు ఆ వేషం దక్కింది. అందులో ఆయన పలికే "సైలెన్స్" అనే ఊత పదం అందరినీ అలరించింది. ఒక సీనులో గుమ్మడి, శాంతకుమారి గోడ మీద ఉన్న నాగేశ్వరరావు ఫొటో చూసి చుట్టరికాన్ని గురించి అడిగితే, "ఏవన్నారూ సైలెన్స్... ఎవరయ్యా నువ్వు ఎక్కడ చదివావు నువ్వు ఎవరయ్యా నీకు చదువు చెప్పింది మాట్లాడకు మరి మా అబ్బాయిని పట్టుకుని వారికీ, వీరికి చుట్టరికమేముందని అంటావేం ఇదేనా మర్యాద భూపతా... ఆకాశపతా.. వాడు మా అబ్బాయి రంగడు. బియ్యే చదివాడు. నిక్షేపంగా ఉద్యోగం చేస్తున్నాడు. మావాడి ఫోటో చూసి వాడే వీడనుకొని ఇంత రాద్ధాంతం చేస్తున్నారు. పదండి పోలీసు స్టేషనుకి మీ పని పట్టిస్తాను. కాల్ పోలీస్.. సైలెన్స్.. అబద్దాలు మాకు చేతకావు. సత్యమునే పలుకవలెను" అంటూ కొండలరావు పలికే డైలాగులు ఇప్పటికీ నవ్విస్తూనే ఉంటాయి.

మహాప్రభో.. ఘనరాజసంబుతో వర్థిల్లు

ఎన్టీఆర్ కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం నిర్వహించిన 'వరకట్నం' (1969) సినిమాలో కొండలరావు నటించడం తొలిసారి. రాజనాల వెంటవుండే భట్టుమూర్తి అనే పాత్ర అది. రాజనాల "సై సై జోడెడ్లా బండి.. షోకైన దొరల బండి" అని పాడు కుంటూ ఎడ్లబండిని నడుపుతుంటే చరణం పూర్తవగానే పొగడ్తలా "మహాప్రభో" అంటూ తల ఊపుతూ వుంటారు కొండలరావు. ఈ పాత్ర కోసం రెండు పద్యాలు కూడా పెట్టారు. ఆ తర్వాత ఎన్టీఆర్ సొంత సంస్థలో వరుసగా ఎనిమిది సినిమాల్లో కొండలరావు నటించడం జరిగింది.

మిస్సమ్మను తిరగరాసి...

విజయావారి 'మిస్సమ్మ' సినిమాలో పెళ్లికాని ఇద్దరు నిరుద్యోగ యువతీ యువకులు, ఉద్యోగ సంపాదన కొసం భార్యాభర్తలుగా నటిస్తూ చివరకు పెళ్లిచేసుకుంటారు. కొండలరావు ఈ నేపథ్యాన్ని తీసుకొని ఇద్దరు పెళ్లైన యువతీ యువకులు అనివార్యమైన పరిస్థితుల్లో అవివాహితులుగా చెప్పుకొని ఉద్యోగంలో చేరడం అనే పాయింట్‌తో కథ అల్లితే, దాన్ని బాపు, రమణలు 'పెళ్లిపుస్తకం' (1991)గా మలిచారు. సినిమాలో బాబాయి వేషంతో అందరి ప్రశంసలు పొందిన కొండలరావుకు ఉత్తమ కథారచయితగా నంది బహుమతి, ముళ్లపూడికి ఉత్తమ సంభాషణల రచయితగా నంది బహుమతి దక్కాయి.

చిన్న పాత్రలు... పెద్ద గుర్తింపు

ఒకవైపు 'విజయచిత్ర' సినిమా పత్రికకు సంపాదకునిగా వుంటూనే నటునిగా తనదైన ముద్ర వేసుకున్న కొండలరావు నటించిన సినిమాలు 600 దాకా వుంటాయి. చేసినవి చిన్న పాత్రలైనా అన్నీ గుర్తింపు తెచ్చుకున్నవే. 'గూఢాచారి 116'లో ఫోటోగ్రాఫర్ పాత్ర, 'పంతులమ్మ' సినిమాలో గిరిజకు భార్యాలోలుడైన భర్తగా కనపడిన వాళ్లందరినీ 'టైం ఎంతైంది" అనే పాత్ర 'ప్రేమకానుక'లో ఛాయాదేవికి, 'ముహూర్తబలం'లో సూర్యకాంతానికి భార్యా విధేయుడైన భర్తగాను మూడు పాత్రల్లోను వైవిధ్యం కనపరుస్తూ అలరించారు కొండలరావు. 'ఇద్దరు మొనగాళ్లు' జానపద సినిమాలో కొండలరావుది పెద్ద వేషం. రాజుగారి తమ్ముడిగా అతని నటన అద్భుతంగా వుంటుంది. అలాగే మరో జానపద చిత్రం 'మహాబలుడు'లో మాంత్రికునిగా రాణించారు. 'ఆలీబాబా 40 దొంగలు', 'వీరాభిమన్యు' సినిమాల్లో మంచి పాత్రలు కొండలరావుకు దక్కాయి. 'వేములవాడ భీమకవి' లో మేనమామగా, 'నేనంటే నేనే'లో ఎస్టేట్ మేనేజరుగా, 'వింతకాపురం'లో కృష్ణకు తండ్రిగా సీరియస్ పాత్రల్లో నటించి, తన నటనా సామర్థ్యాన్ని నిరూపించారు.

అలాగే 'పాపకోసం'లో బ్రాహ్మణుడిగా, 'గాంధిపుట్టిన దేశం'లో కార్మికునిగా, 'కులగౌరవం'లో రెండవ హీరోయిన్ తండ్రిగా, 'సత్యానికి సంకెళ్లు'లో వచ్చీరాని ఇంగ్లిషు మాట్లాడే వ్యక్తిగా, 'సి.ఐ.డి'లో విలన్‌కు సహచరునిగా, 'తిక్కశంకరయ్య'లో పిచ్చాసుపత్రిలో వేసే అంతర్నాటకంలో లక్ష్మణుడిగా, 'రాముడు-భీముడు'లో రిజిస్ట్రారుగా, 'ద్రోహి', 'ప్రేమలోప్రమాదం' చిత్రాల్లో సబ్‌ఇన్స్‌పెక్టరుగా, 'మాతృమూర్తి'లో చెవిటివానిగా, 'ప్రైవేటుమాస్టారు'లో పోస్టుమాస్టరుగా, 'కథానాయకుడు'లో పద్మనాభం మామగా, 'దొంగ కోళ్లు'లో లాయరుగా, 'అత్తగారు-కొత్తకోడలు'లో మిలటరీ అధికారిగా ఇలా చెప్పుకుపో తుంటే... ఎన్నో అనుభూతులు! 'ఆడపిల్లల తండ్రి' సినిమాలో కొండలరావు పెళ్లిళ్ల పేరయ్య వేషం వేసి సుశీలతో కలసి ఒక పాటకూడా పాడారు. బి.ఎన్.రెడ్డి నిర్మించిన 'బంగారు పంజరం'(1969) సినిమాలో శోభన్‌బాబుకు మేనమామ రామకోటిగా పెద్ద పాత్రలో నటించారు. తండ్రి లేని శోభన్ ఇంట్లో తిష్టవేసి, వారి కాపురాన్ని నాశనం చెయ్యాలని కుట్ర పన్నే విలన్‌గా నటించి రాణించిన పాత్రకు కొండలరావుకు ఉత్తమ సహాయ నటుడుగా నంది బహుమతి లభించింది.

విలన్‌గా కొత్తరూపం

హాస్య నటునిగా ముద్రపడిన కొండలరావును ఇబ్బంది పెట్టిన సినిమాలూ లేకపోలేదు. పి. గంగాధరరావు నిర్మించిన 'అర్ధరాత్రి'(1968) సినిమాలో కొండలరావుది విలన్ వేషం. హీరోని బ్లాక్ మెయిల్ చేస్తుంటాడు. సినిమా చివర్లో హీరో జగ్గయ్యతో

కాగడాలతో ఫైటుంది. ఆ సన్నివేశంలో కొండలరావు చెయ్యి కాలింది. అలాగే జగ్గయ్య మీద కూడా కిరోసిన్ చింది నిప్పులు రేగాయి. అయినా జగ్గయ్య "పాపం ఇలాంటి వేషానికి మాస్టారు కొత్త" అని నచ్చ జెప్పి ఫైటింగ్ సన్నివేశాన్ని పూర్తిచేయించారు.

సినిమాల్లో 'ఇగో'లు

సినిమా నటుల్లో 'ఇగో' (అహం) కాస్త ఎక్కువగానే కనిపిస్తూ ఉంటుంది. రాజ్యం పిక్చర్స్ వారి 'సత్యహరిశ్చంద్ర' సినిమాలోని ఒక సన్నివేశంలో హరిశ్చంద్ర పాత్రధారి అయిన యస్.వి.రంగారావును, విశ్వామిత్ర పాత్రధారి గుమ్మడి కాలితో తన్నాలి. కానీ ఆ సన్నివేశంలో నటించేందుకు రంగారావు ఒప్పుకోలేదు. డూప్‌తో షాట్ తీయాల్సి వచ్చింది. అలాగే 'ప్రేమించి చూడు' సినిమాలో రామలింగయ్య, రేలంగిని 'బావా" అని పిలవాలి. అందుకు రేలంగి ఒప్పుకోలేదు. దర్శకుడు పుల్లయ్య మందలించిన తర్వాత కానీ రేలంగి దిగిరాలేదు. 'వీరాభిమన్యు' సినిమాలో ద్రోణుడి పాత్ర ధరించిన కొండలరావుకు దుర్యోధనుడు కాళ్లు కడిగి, ఆ జలాన్ని నెత్తిన చల్లుకోవాలి. ఆ సన్నివేశంలో నటించేందుకు రాజనాల ఎంతగా ఫీలై పోయాడో చెప్పలేం. అదే 'ప్రేమించి చూడు' సినిమాలో కొండలరావు పాత్ర అక్కినేని "ఒరేయ్ గాడిదా! ఎక్కడ తిరుగుతున్నావురా?" అంటూ అడగాలి. ఆ సన్నివేశంలో నటించేందుకు కొండలరావు సందేహిస్తే అక్కినేనిని, "ఈ సన్నివేశంలో తండ్రి కొడుకును మందలింపుగా ప్రశ్నిస్తున్నాడు. అక్కినేనిని కొండలరావు గాడిదా అనడంలేదు" అంటూ భుజం తట్టి ప్రోత్సహించారు. దాంతో కొండలరావు ఆ పాత్రలో విజృంభించారు. విజయసంస్థకు కొండలరావు అత్యంత ఆప్తుడు, నమ్మకస్తుడు కూడా. అందుకే నాగిరెడ్డి సలహా మేరకు చందమామ-విజయ కంబైన్స్ నిర్మించిన 'బృందావనం', 'భైరవద్వీపం', 'శ్రీకృష్ణార్జున విజయం' సినిమాలు కొండలరావు నిర్మాణ నిర్వహణలోనే పూర్తిచేశారు..

గరీబు బిడ్డ గంగవ్వ



బి.రాము, ఎమ్మెస్సీ, బి.ఇడి, నిజామాబాద్

పాలవాస నేలనా తల్లిగారింటి పసి బిడ్డ
లంబాడిపల్లె ఊరులో అత్తగారింటి కోడలు
పెనిమిటి పావురం కరువైన ఆలి గంగవ్వ
పేగు బంధాన్ని దక్కించుకొని తల్లీ గంగవ్వ
సెమట సుక్కలే సాగే బతుకు బండి ఎప్పుడు
సెగకాగిన బతుకై సాగే సంసారం ఎల్లకాలం
సీకట్ల దీపమోలే యూట్యూబ్ ఆసారాయే
సిన్న సిన్నగ గంగవ్వ గళం లోకమంతాయే
జగిత్యాల కాపుదనం బీబీసీ నెలవాయె,
బిగ్బాసుకు చేరువై లోకమంతా వేలుగాయే
మురిపెమాయె ఎల్లపల్లెకు మున్నూరుకాపు బిడ్డ
మూగవోవు బతుకులు ముందుసూపుంటే ననే...
గంగవ్వకు పల్లె పల్లె పదివేల వందనాలు......
గమ్యం చేరేదాకా తోడుంటామని బాసలు...

యూట్యూబ్‌లో స్టార్ అవ్వాలంటే యూత్‌కి మాత్రమే సాధ్యమా? అంటే కాదనే అంటారు నెటిజన్లు. కారణం ఓ ఓల్డ్ ఈజ్ గోల్డ్ అని నిరూపించిన స్టార్. ఆమెనే గంగవ్వ. అవును గంగవ్వ కూడా బిగ్‌బాస్‌లోకి వచ్చింది. 58 ఏళ్ల గంగవ్వ యూట్యూబ్‌లో ఎంత పాపులర్ చాలామందికి తెలుసు. అంతెందుకు మీకూ తెలిసే ఉంటుంది. యూట్యూబ్‌లో తొలుత వీడియోలతో వావ్ అనిపించిన గంగవ్వ ఆ తర్వాత సినిమా స్టార్ల ఇంటర్వ్యూలతో సూపర్ వావ్ అనిపించింది. ఇప్పుడు అదే మ్యాజిక్ బిగ్‌బాస్‌లో చూపించడానికి స్పెషల్ పార్టిసిపెంట్‌గా సిద్ధమై వచ్చింది.

చైనా సరిహద్దులలో యుద్ధ విమానాలు

- డా॥గంగాధర్





భారత్‌తో ఘర్షణకు మరింత ఆజ్యం పోసేలా చైనా వ్యవహరిస్తోంది. ఒకపక్క శాంతి వచనాలు పలుకుతూనే మరోపక్క సైనిక మోహరింపులకు దిగుతోంది. భారత్ కు చేరువలోని వైమానిక స్థావరంలో అధునాతన స్టెల్త్ యుద్ధవిమానాలను రంగంలోకి దించింది. తద్వారా తన రెండు నాల్కల ధోరణిని బయటపెట్టుకుంది.రెండు దేశాల మధ్య ఉన్న వాస్తవాధీన రేఖ (ఎల్ ఏసీ)కి 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న హెూటన్ వైమానిక స్థావరంలో రెండు జె-20 స్టెల్త్ యుద్ధవిమానాలను మోహరించినట్లు ఉపగ్రహ చిత్రాల్లో వెల్లడైంది. ఇక్కడ ఇప్పటికే జె-10, జె-11 యుద్ధవిమానాలను మోహరించింది. తాజాగా జె-20కి తోడు జె-8, జె-16లనూ రంగంలోకి దించినట్లు స్పష్టమవుతోంది.భారత్ తో ఘర్షణకు దిగాల్సి వస్తే సైన్యం కన్నా వాయుసేన, క్షిపణులు, డ్రోన్లపైనే చైనా ఎక్కువగా ఆధారపడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ నేపథ్యంలో తాజా మోహరింపులకు ప్రాధాన్యం ఏర్పడింది. భారత్ కూడా తన అగ్రశ్రేణి యుద్ధవిమానాలైన సుఖోయ్ -30, మిగ్ -29కె, సి-17 రవాణా విమానాలు, పి-8ఐ నిఘా విమానం సహా చినూక్, అపాచీ హెలికాప్టర్లు, మానవ రహిత విమానాలను లేహ్ వైమానిక స్థావరంలో మోహరించింది. మొత్తం మీద రెండు దేశాలూ కలిసి సరిహద్దుల్లో లక్ష మందికిపైగా సైనికులు, భారీ ఆయుధాలను దించాయి. దీంతో ఈ సరిహద్దు వివాదం పూర్తిస్థాయి యుద్ధంగా మారే ప్రమాదం పొంచి ఉంది.హెూటన్ లో మోహరించిన జె-20 యుద్ధవిమానాలను చెంగ్డూ సంస్థ రూపొందించింది. ఇవి ఐదో తరం యుద్ధవిమానాలు. 2017 సెప్టెంబర్‌లో ఇవి పూర్తిస్థాయిలో చైనా వాయుసేనలో చేరాయి. వీటి ఉత్పత్తిని చైనా ఇటీవలే ప్రారంభించి ఉంటుందని భావిస్తున్నారు. వచ్చే 20 ఏళ్లలో ఇవి డ్రాగన్ వాయుసేనకు వెన్నెముకగా ఉంటాయి. ఐదో తరం యుద్ధవిమానాల్లో.. శత్రు రాడార్లను బోల్తా కొట్టించే స్టెల్త్ లక్షణం ఉంటుంది. దీనికితోడు అవి చాలా వేగంగా దూసుకెళతాయి. చాలా సులువుగా క్లిష్టమైన విన్యాసాలను చేయగలుగుతాయి. జె-20 యుద్ధవిమానంలో రష్యాకు చెందిన ఏఎల్ -31 ఇంజిన్లను అమర్చారు. ఒకటి రెండేళ్లలో వీటి స్థానంలో చైనీస్ డబ్ల్యూఎస్-10 తైహాంగ్ ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం చైనా వాయుసేనలో దాదాపు 30 జె-20 యుద్ధవిమానాలు ఉండొచ్చని అంచనా. అమెరికాకు చెందిన ఎఫ్-22ఎ రాప్టర్, ఎఫ్-35 యుద్ధవిమానాల తర్వాత పూర్తిస్థాయిలో సిద్ధమైన ఐదోతరం లోహ విహంగం ఇదే.మరోవైపు చైనాకు దూకుడుకు కళ్లెం వేసే ఉద్దేశంతో అమెరికా కూడా చర్యలు చేపడుతోంది. ఫలితంగా ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో స్టెల్త్ యుద్ధవిమానాల గర్జనలు పెరిగాయి. చైనాకు హెచ్చరిక సందేశం ఇచ్చేందుకు హిందూ మహాసముద్రంలో ఉన్న డీగోగార్షియా దీవిలో మూడు బి-2 స్టెల్త్ బాంబర్లను అమెరికా మోహరించింది. జపాన్, దక్షిణ కొరియాల్లోనూ ఎఫ్-35, ఎఫ్-22 విమానాలను మోహరించింది. మరోవైపు ఈ ప్రాంతంలో భారత్ సహా ఇతర మిత్ర దేశాలకు తన మద్దతు ఉందని చాటి చెప్పేందుకు వాస్తవాధీన రేఖకు చేరువలో బి-2 బాంబర్లతో గగనవిహారం, విన్యాసాలు చేపట్టే అవకాశం ఉన్నట్లు కొన్ని వార్తలు వచ్చాయి. చైనాను ఉమ్మడిగా ఎదుర్కొనేందుకు భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో కూడిన 'చతుర్భుజి కూటమి'ని బలోపేతం చేసే అంశంపైనా చర్చలు జరుగుతున్నాయి.సైనిక బలప్రయోగంతో వాస్తవాధీన రేఖ వద్ద యథాతథ స్థితిని మార్చేందుకు చైనా చేసిన ప్రయత్నాన్ని అమెరికా సెనేట్ ఖండించింది. చైనా చర్య అంతర్జాతీయ భద్రత, సుస్థిరతలకు ముప్పు కలిగిస్తోందని ఆరోపించింది. భూటాన్ భూభాగాన్ని తనదిగా చైనా చెబుతోందని, అరుణాచల్ ప్రదేశ్ పై హక్కులు కోరేందుకే ఇలా చేస్తోందని విమర్శించింది. సమస్యను దౌత్య మార్గాల్లో పరిష్కరించుకోవాలని కోరుతూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. చైనా ముప్పు నుంచి తన టెలికం మౌలిక వసతులను రక్షించుకునేందుకు భారత్ చేపట్టిన చర్యలను ప్రశంసించింది. భారత్ -పసిఫిక్ ప్రాంతంలో శాంతిని పెంపొందించడానికి 'చతుర్భుజ' కూటమి వంటి బహుళపక్ష భాగస్వామ్య వేదికలకు మద్దతు పలికింది. సెనేటర్లు జాన్ కార్నిన్, మార్క్ వార్నర్ లు ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. భారత్ - అమెరికాల మధ్య రక్షణ, ఆర్థిక బంధం మరింత బలోపేతం కావాలని వారు ఆకాంక్షించారు.చైనాతో ఉద్రిక్తతల నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా పాకిస్థాన్ వెంబడి ఉన్న సరిహద్దుల్లో తేజస్ యుద్ధవిమానాలను భారత్ మోహరించింది. ప్రస్తుతం తమిళనాడులోని సూలురులో ఉన్న ఈ లోహవిహంగాలను అక్కడికి తరలించింది. దేశీయంగా రూపొందిన ఈ యుద్ధవిమానాలను సరిహద్దుల్లో మోహరించడం.. స్వదేశీ సాంకేతిక సత్తాకు దక్కిన పెద్ద విజయమని నిపుణులు చెబుతున్నారు. ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమ, ఉత్తర సరిహద్దుల్లోని అన్ని వైమానిక స్థావరాలను వాయుసేన అప్రమత్తం చేసింది. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వీలుగా యుద్ధవిమానాలను సిద్ధంగా ఉంచింది.

పంక్తి భోజనాలు..

- బి.రాజేష్



మా వేమకోటి వారి వీధిలో ఎప్పుడూ ఏదో ఓ కార్యమే.. బ్రాహ్మనులంతా కలిసి పంక్తి భోజనాలే.

పెళ్ళిలో భోజనాలంటే ఒక పెద్ద యజ్ఞంలా వుండేది, సరదాగానూ వుండేది. భోజనాలకి పిలుపుల దగ్గరనుంచి భోజనాలు కార్యక్రమం పూర్తి కావడం ఒక పెద్ద వేడుక. ఐదురోజుల పెళ్ళిలో చెప్పేదేముంది, పూట పూటా సంబరమే.

పెద్దపెద్ద మండువా లోగిళ్ళుండేవి. మండువాలో ఒక పక్క ఆకులేస్తే ఒక పాతిక మందికి భోజనానికి సరిపడేది. ఇలా నాలుగుపక్కలవేస్తే దగ్గరగా వొక వంద మంది ఒక సారి భోజనం చేయడానికి వీలుండేది. ఇలా వీలు లేక పోతే దొడ్డిలో ఒక పెద్ద పందిరివేసి దానిని గదులుగా కట్టి గాలి వెలుతురు కోసం మనిషి పై ఎత్తు నుంచి ఖాళీగా వదిలేసే వారు. అలా కట్టిన వాటిలో నేల చదును చేసి కళ్ళాపు జల్లి అలికిన మట్టి ఇంటిలా తయారు చేసేవారు. భోజనాలకి కూచోడానికి ఈతాకుగాని, తాటాకు చాపలుగాని వేసేవారు. కిం ద కూచుని భోజనం చేసేవారు.

సాధారణంగా అరటి ఆకులు ఉపయోగించే వారు. అత్యవసర పరిస్థితులలో అడ్డాకులు వాడేవారు. ఇక్కడ కూడా ఒకసారి వంద మంది పైగా ఒక సారి భోజనాలు చేసేందుకు సావకాశం ఉండేది.

పంక్తులుగా ఆకులేసి, అందరూ కూచున్న తరవాత వడ్డన ప్రారంభించేవారు. భోజనానికి, వడ్డనకి ఒక క్రమం ఉంది. నేటి ప్రోటోకోల్ లాగా! ముందు పప్పు, కూరలు, పచ్చళ్ళు, పూరగాయ, పిండివంటలు అన్నీ అయిన తరవాత అన్నం పెట్టేవారు. వడ్డన ప్రారంభించిన వెంటనే పెట్టినవి తినెయ్యకూడదు. అందరూ ఒక సారి తినడం మొదలు పెట్టాలి. వడ్డన అంతా పూర్తి అయినతరవాత గోవిందనామ స్మరణతో భోజనం ప్రారభమయ్యేది. అసలు సిసలు వడ్డన ఆ తరవాత ప్రారంభమయ్యేది,తినడం ప్రారంభించిన తరవాత. యువకులు యువతులు వడ్డన చేసేవారు. పంచకట్టి ఆపైన తువాలు మొలకి గట్టిగా బిగించేవారు యువకులు. యువతులు పమిట పూర్తిగా వేసుకుని ఆ కొంగు మొలలో దోపుకును వడ్డనకి ఉపక్రమించే వారు.

వడ్డన సామానుల పేర్లే మరిచిపోతున్నారు,ఇప్పుడు. పులుసు వడ్డించడానికి వాడేపాత్రని గోకర్ణం అనేవారు. మొదటిది పప్పు, ఇది పట్టుకుని ఒకరు, నెయ్యి పట్టుకుని ఒకరూ బయలుదేరేవారు. పప్పు వేసే అతను పప్పండి, మీకండి, పప్పండి,పప్పండి,పప్పండి అని వడిగా అంటు కదిలేవాడు. వెనకాల వచ్చే నెయ్యి తెచ్చినతను నెయ్యండి, నెయ్యండి,నెయ్యండి అంటూ వేసుకుంటూ వెళ్ళేవాడు. ఈ మాటలు గబగబా అంటే మరొక అర్ధం స్ఫురిస్తుంది. అని చూడండి.

ఆ తరవాతది కూర. కూర తెచ్చినతను కూరండి, కూరండి, కూరండి అంటూ కావలసిన వాళ్ళకి వేసుకుంటూ వెళ్ళేవాడు. మధ్యలో అన్నం బుట్ట పట్టుకుని ఒకరు వచ్చేవారు. వేడిఅన్నం తాటాకు బుట్టలో పెట్టుకుని, బుట్ట చేతిమీద పెట్టుకుని, కాలకుండా బుట్ట కింద అరటాకు వేసుకుని ఒక హస్తంలాటి దానితో అన్నం వడ్డించేవారు. వీరు అన్నమండి తో ప్రారంభించి, మీకన్నమండి,మీకన్నమండి, మీకన్నమండి అంటూ సాగిపోయేవారు.
మీకుంఅన్నమండిొమీకన్నమండి అయిపోయింది. ఈ మాటలన్నీ వడిగా అంటేనే ఆ అందం అర్థం స్ఫురిస్తాయి. పప్పుతో పులుసు వడ్డించేవారు. ఈ పులుసుని పులుసండి నుంచి పులసండి, పులసండి అనుకుంటూ వెళ్ళేవారు. పులసండి కి అర్థం పులవమని. ఈ మాటలని కొంతమంది యువకులు ఆటపట్టించడానికి కూడా వాడే వారు, గబగబా అంటూ. పప్పుతో కాకుండా పులుసు వేరేగా కలుపుకుని తినేవారు. అప్పుడు నంజుడుకి వుండటానికి వడియాలు, అప్పడాలు వేసేవారు. ఒక కొంటె యువకుడు పంక్తిలో ఒక తాతగారి దగ్గరకెళ్ళి తాతగారు వడియాలు కావాలా అని అడిగేవాడు. ఆయన కావాలంటే ఒక పెద్ద కేక వేసేవాడు! ఒరేయ్ సుబ్బన్నా! ఇక్కడ తాతగారికి వడియాలు కావాలి పట్రా అని. అంటే తాతగారికి పడుచుపెళ్ళాం కావాలంటున్నాడురా అని ఎద్దేవా అన్న మాట. నిజంగా ఇందులో పైకి ఏ విచిత్రమూ లేదు కాని అసలు కొంటె తనం వుంది. తాతగారు కొద్ది ఘటికుడైతే మరొకలా సాగేది. కావాలని వడియాలు తెచ్చినతరవాత ఇదేమిటి ఇవితెచ్చేవూ అనేవాడు. మీరేగా వడియాలుకావలన్నారని అనేవాడు, యువకుడు.అప్పుడు తాతగారు ఒర్నీ! వడియాలంటె పడుచుపెళ్ళాన్ని తెస్తావనుకున్నారా అనేవాడు. మరోలా కూడా సాగేది. ఏమిటీ అన్నారూ అనేవాడు, ముసలాయన. వడియాలుకావాలా అని మళ్ళి అడిగేవాడు, యువకుడు. ఈ తాతగారు ఘటికుడు కనక వడియాలు నాకెందుకూ అనేవాడే కాని వద్దనేవాడు కాదు. తాతా! పెళ్ళిచేసుకుంటావా అంటే పిల్లనిచ్చేవాడెవడురా! అనేవారుకాని వద్దనేవారు కాదు!. అది ఒక సరదా.! వడియాలు నేనేమి చేసుకోనూ అనేవాడు. అంటే నమలడానికి పళ్ళు లేవనీ అర్థం, పడుచు పెళ్ళాంని నేనేమి చేసుకోనూ అని కూడా అర్థం వచ్చేది. పోనీ అప్పడాలు కావాలా అంటే, అప్పడాలు ఇప్పటిదాకా నాదగ్గరే వుండాలి, ఎక్కడుందో చూడునాయనా అనేవాడు. ఒకవేళ భార్య పక్కనుంటే అప్పడాలు పక్కనే వుందిగా అనేవాడు.


ఇప్పుడర్థమైనదనుకుంటాను, అప్పడాలు (అప్పటిం ఆలొ అప్పటాలు, అప్పటియాలు, అప్పడాలు అనగా పాత భార్య) వడియాలు అనగా (వడింఆలొ వడియాలు వడి అనగా వేగం, విసురు అని అర్థాలు, అనగా పడుచు భార్య). ఒక్క మంచినీళ్ళు పోసేవారు మాత్రమే మాట్లాడకుండా ఖాళీ గ్లాసుల్లో మంచినీళు ృపోసేవారు. ఇక చివరిది పెరుగు, పెరుగు తెచ్చినవారు పెరుగండి నుంచి పెరగండి నుంచి వడిగా అనడం లో జరగండి దాకా వెళ్ళిపోయేది. అంటే ఇక తిన్నది చాలు లేవండి అన్నట్టుగా.భోజనాల దగ్గరనుంచి అంతా ఒక సారి లేచేవారు, గోవింద నామ స్మరణ చేస్తూ. పంక్తి లో ఎవరేనా తినడంలో వెనక పడితే వారికోసం అందరూ వారి భోజనం పూర్తి అయ్యేదాకా కూచుని వుండేవారు. ఇది వారి పట్ల చూపే గౌరవం. మన వాళ్ళు భోజనాలలో కూడా ఇలాసరదా చూపేవారు. అలా సందడి సందడిగా భోజనాలు ముగిసేవి.

ఇప్పుడు ప్లేట్లు పట్టుకుని క్యూలో నుంచుని కావల్సినవి వేసుకుని/వేయించుకుని కొండొకచో ఒంటి కాలిమీద నిలబడి/ ఎక్కడో ఒకచోట కూచుని భోజనం కానిచ్చేస్తున్నాం మరి. మాధాకోళం బ్రతుకులైపోయాయని ఒక పెద్దాయన వాపోవడం విన్నాను . అందం, హాస్యం చచ్చిపోయాయి.

నడిచే సంకెళ్ళు

– మందరపు హైమవతి,
9441062732

ఆకులు కప్పుకొన్న అటవిక దశ నుండి ఆధునిక వస్త్రాల ఇంద్రధనుస్సులు శరీరాకాశంపై మెరసినా ఎడ్లబండి కాలం నుండి పొగబండికాంలో కళ్ళు తెరచినా ప్రయోజనాపేక్ష ప్రపంచంలో గాయాలు చేసేవారు గాయపడేవారు కులసా కుర్చీలో కూర్చొని రూపాయిల పంట పండించేవారు సూదులు గుచ్చే సూర్యకిరణాల తాపంలో చెమట బిందు సేద్యం చేసేవారు. ఆజ్ఞలు జారీ చేసేవాళ్ళు ఆజ్ఞలు పాలించేవాళ్ళుగా రెండు వర్గాలుగా నిలువునా చీల్చబడినపుడు పుట్టుకతోనే కులం పుట్టు మచ్చతో కళ్ళు చెరుస్తామా చీమలకు పంచదార పాములకు పాలుపోసే దయార్ద్ర హృదయులు మర్కటాన్ని వరహాన్ని దైవాలుగా పూజించే మహానుభావులు తోటి మనిషిని ఒక అంటరాని పురుగుగా చూస్తూ మానవ సహజక్రియలన్నీ నిషేధి చర్యలుగా నిర్ణయించి నోటికి ఉమ్మితొట్టిని ముడ్డికి చీపురుకట్టను తగిలించి సాటి ప్రాణిని ఒక వింత మృగంగా చిత్రీకరించినపుడు కాలానికి అంతరిక్షం రెక్కలు తొడిగితే నేమి ప్లాస్టిక్ సర్జరీ ప్రపంచాల కొత్త రూపాలు ధరిస్తేనేమి మేము మేమే అవమానాల ఇనపముళ్ళు గుచ్చుతూ అణచివేతల ఉచ్చులో అష్టదిగ్బంధం చేస్తున్నపుడు మేమింకా స్వేచ్ఛ చెరువులో నుంచి గట్టుమీద కొట్టుకొంటున్న బానిస చేపలమే ప్రశ్నల బాణాలు బయటకు రాకుండా గొంతులో లోపలికి తొక్కేసే నీచకాలం తలుపులు తెరచిన కారాగారాల బంధి తులం వందల వేల ఎకరాల భూస్వాముల కల కలలోకూడా ఫలించని కల నోట్లోకి నాలుగు మేళ్ళు వెల్లేందుకు కొంచెం భూమి దున్నకున్నందుకు చుండూరు కారంచేడు మారణకాండలో దగ్ధ జీవులం మేమే అకలిమండల చల్లార్చి వేతలో రెండు మామిడి పండ్లు రెండు విష ఫలాలై ప్రాణహరణ ఫలాలైన విషాదం చేతి ఫోను అపహరన నెపంతో శిరోమండన సత్కారంపొందిన నడిచే సంకెళ్లం మేమే.



@ 35

- వాల్మీకి, సీనియర్ జర్నలిస్ట్

బొబ్బిలిపులి (జూలై 9, 1982 , శుక్రవారం విడుదల)ఈ రోజే అన్న ఎన్టీఆర్ శ్రీకాకుళం వచ్చారు. సరిగా 35 సంవత్సరాల క్రితం విడుదలైన బొబ్బిలిపులి సినిమా విశేషాలు:-

బొబ్బిలిపులి'

'మీ అసలు పేరు'

'బొబ్బిలిపులి'

'మీ తల్లిదండ్రులు పెట్టినపేరు'

'బొబ్బిలిపులి బొబ్బిలిపులి బొబ్బిలిపులి... ఎన్నిసార్లు చెప్పమంటారు?'

జ్ఞాపకం వచ్చాయా ఆ డైలాగులు. జ్ఞాపకం వచ్చిందా ఆ కోర్టు సీను. జ్ఞాపకం వచ్చిందా కోర్టు బోనులో గర్జిస్తూ కనిపించిన ఆ పెద్దపులి.

ఎస్... బొబ్బిలిపులికి 35 ఏళ్లు వచ్చాయి.

కానీ... నేటికీ దాని పంజా గుర్తులు చెరిగిపోలేదు.

దాని గాండ్రింపుల ప్రతిధ్వని మాసిపోలేదు.

ఆ ఠీవీ.. ఆ దర్పం.. ప్రేక్షకులకు అందించిన ఆ ఎనర్జీ..

35 ఏళ్ల తర్వాత కూడా... స్టిల్... బొబ్బిలిపులి!

ఈ సినిమా నుంచి ఇప్పటికీ సినిమాలు పుడుతున్నాయి.

ఈ సినిమా నుంచి ఇండస్ట్రీ ఇప్పటికీ రీచార్జ్ అవుతోంది.

ఈ నటన చూసి కొత్తతరం ఇప్పుడూ ఓనమాలు దిద్దుకుంటోంది.

ఈ డైలాగులకు ఇప్పటికీ ఆశ్చర్యపడుతూనే ఉంది.

తెలుగు సినిమాల్లో రాయల్ బెంగాల్ టైగర్ ఇది.

పంజాతో కొడితే- అది పెద్దపులి.

డైలాగ్‌తో కొడితే- అది బొబ్బిలిపులి.

క్లయిమాక్స్ సీన్.

బొబ్బిలిపులి: నాకు ఒక్క అవకాశం ఇస్తారా యువరానర్.

జడ్జి: ఎస్.

బొబ్బిలిపులి: పైకోర్టుకు వెళ్లడానికి నాకు అవకాశం ఉందా?

జడ్జి: అవును. ఉంది.

బొబ్బిలిపులి: పైకోర్టుకు వెళితే ఏం జరుగుతుంది యువరానర్?

జడ్జి: శిక్ష తగ్గించవచ్చు లేదా అదే శిక్షను ఖాయం చేయవచ్చు

బొబ్బిలిపులి: అంటే ఈ కోర్టులో వేసిన శిక్ష పై కోర్టులో పోవచ్చు. ఆ కోర్టులో వేసిన శిక్ష ఆ పై కోర్టులో పోవచ్చు. లేదా కింద కోర్టువారు వేసిన శిక్షే పైకోర్టు వారు ఖాయం చేయవచ్చు. అంటే ఒక కోర్టుకీ ఇంకో కోర్టుకీ సంబంధం ఉండొచ్చు. ఉండకపోవచ్చు. కోర్టు కోర్టుకీ తీర్పు తీర్పుకీ ఇంత మార్పుంటే మీ న్యాయస్థానంలో న్యాయం ఉన్నట్టా యువరానర్. ఒక్కొక్క కోర్టులో ఒక్కొక్క న్యాయం ఉంటుంది కనుకనే నేరస్తుడు తాను చేసిన నేరం ఏమిటో మర్చిపోయాకకాని శిక్ష పడదు. ఓకే... ఓకే యువరానర్. ఆఖరుసారిగా ఒక్క ప్రశ్న అడుగుతున్నాను. నాకీ ఉరిశిక్ష ఎందుకు విధించారు?

జడ్జి: మనుషుల్ని చంపినందుకు.

బొబ్బిలిపులి: ఓ... మనుషుల్ని చంపితే ఉరిశిక్ష విధిస్తారు కదూ. మరి ఆనాడు యుద్ధంలో నేను ఒక్కణ్ణి సుమారు నాలుగు వందల మందిని దారుణంగా చంపాను. అంటే హత్య చేశాను. మరిదానికి నాకు ఉరిశిక్ష విధించలేదే? పైగా నేనేదో పెద్ద ఘనకార్యం చేశానని మహావీరచక్ర బిరుదునిచ్చి నన్ను సత్కరించారు. ఆ సత్కారం దేనికి యువరానర్? ఆ బిరుదు దేనికి యువరానర్? ఆరోజు యుద్ధంలో నేను చంపినవాళ్లెవరో నాకు తెలియదు. వాళ్లు మనకు సంబంధం లేనివాళ్లు. మన పొరుగువాళ్లు. మన తోటి సోదరులు. మనమెలా మన దేశాన్ని రక్షించుకోవడానికి వెళ్లామో వాళ్లు కూడా అలా వాళ్ల దేశాన్ని రక్షించుకోవడానికి వచ్చినవాళ్లు. వాళ్లని చంపితే సన్మానం. సత్కారం. మహావీర బిరుదు ప్రదానం. మరి మనవాళ్లు మన దేశాన్ని దేశ ప్రజానీకాన్ని పేద ప్రజల్ని న్యాయస్థానాల్ని న్యాయాన్ని రక్షించే

స్థావరాలని కొల్లగొడుతూ తమ స్వార్థానికి ఉపయోగించుకుంటున్న వీళ్లను చంపితే అది నేరం. దానికి బహుమానం ఉరిశిక్ష. ఆహా... యువరానర్. నాకిచ్చిన మహావీరచక్ర బిరుద ప్రదానం నా దేశాన్ని కాపాడుకోవడం కోసమే అయితే... నా దేశాన్ని పరిరక్షించుకోవడం కోసమే అయితే అది అప్పుడు కాదు యువరానర్... ఇప్పుడు... ఇప్పుడు నాకివ్వాలి. నిజంగా మన దేశాన్ని నేను ఇప్పుడు కాపాడాను. వాళ్లు మన దేశానికే శత్రువులు. వీళ్లు మన దేశాభ్యుదయానికే శత్రువులు. వాళ్లు ముందుకు వచ్చి తుపాకులతో పోరాడారు. వీళ్లు వెనక్కు వచ్చి వెన్నుపోటు పొడిచారు. వాళ్లలో నిజాయితీ ఉంది. వీళ్లలో కుట్ర. కుళ్లు. కుతంత్రం. వాళ్లను చంపితే సన్మానం. సత్కారం. వీళ్లను చంపితే ఉరిశిక్ష. భేష్... భేష్... ఇదే మీ చట్టమైతే మీకూ మీ చట్టానికి కోటి వందనాలు. ఇదే మీ న్యాయమైతే మీకూ మీ న్యాయానికి శతకోటి అభివందనాలు. ఇదే మీ ధర్మమైతే మీకూ మీ ధర్మానికి అనంతకోటి సాష్టాంగ నమస్కారాలు. దట్సాల్!

సెన్సార్‌బోర్డ్ రివైజింగ్ కమిటీ చైర్మన్ ఆఫీసులో గడియారం ముల్లు చేసే శబ్దం తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది.

చైర్మన్ సీటులో ఎల్వీ ప్రసాద్ కూచుని ఉన్నారు.

ఎదురుగా బొబ్బిలిపులి దర్శకుడు దాసరి. నిర్మాత వడ్డే రమేష్.

అంతకు ముందే మద్రాసు రీజనల్ కమిటీ బొబ్బిలిపులిని చూసింది. మూడు వేల అడుగుల కట్స్ చెప్పింది. మూడు వేల అడుగులు! అంటే సినిమా మిగలదు. ఎన్టీఆర్ మిగలడు. ఎన్టీఆర్ చెప్పే డైలాగులూ మిగలవు. డైలాగులు ఎవరికెక్కావాలి. సెంట్రల్‌లో ఇందిరాగాంధీ గవర్నమెంట్ ఉంది. ఈ డైలాగులన్నీ ఆమె పాలనను కించపరిచేలా ఉన్నాయి. ప్రభుత్వాన్ని తూర్పారబట్టేలా ఉన్నాయి. కనుక ఇవన్నీ తీసేయాలంది రీజనల్ కమిటీ. దీని మీద తేల్చుకుందామని రివైజింగ్ కమిటీకి వచ్చారు దాసరి, వడ్డే రమేష్.

ఎల్వీ ప్రసాద్ సినిమా చూశారు.

వాళ్లను పిలిచారు. ఇక తీర్పు చెప్పాలి. 'ఏం లేదు. పాత కట్స్ మర్చిపోండి. ఓన్లీ సింగిల్ కట్ ఇస్తున్నాను. క్లయిమాక్స్ మొత్తం తీసేయండి'

ఆయన చేతిలోని పేపర్ వెయిట్- పరిచిన న్యూస్‌పేపర్ మీద- నిశ్శబ్దంగా గింగిరాలు కొట్టి, మెల్లగా అతి మెల్లగా ఆగింది. కాని దాసరి, రమేష్‌ల గుండెలు మాత్రం అంతకంతకూ వేగం పుంజుకొని ధన్‌ధన్ అని కొట్టుకుంటున్నాయి.

'సార్' అన్నారు ఇద్దరూ.

'మీరున్నారన్న ధైర్యంతో వచ్చాం సార్' అన్నారు మళ్లీ.

'ఏం ధైర్యం. రేపు విమర్శలు వస్తే మీరు సమాధానం చెప్పాలా నేను చెప్పాలా? క్లయిమాక్స్ తీసేయండి. అంతే.'

వాళ్లిద్దరూ లేచి నిలబడ్డారు.

'ఏం నిర్ణయించుకున్నారు?' అడిగారు ఎల్వీ ప్రసాద్.

దాసరి ఒక్క క్షణం పాజ్ ఇచ్చారు.

అప్పటికే ఆయనకు తిక్కరేగి ఉంది.

ఎన్టీఆర్‌కు కోర్టు సీన్ చదివి వినిపించిన మాడ్యులేషన్‌లోనే ఎల్వీ ప్రసాద్‌తో చెప్పారు- 'కోర్టు కోర్టుకీ తీర్పు తీర్పుకీ ఇంత మార్పు ఉంటుంది కనుకనే మేం ఢిల్లీ ట్రిబ్యునల్‌లో తేల్చుకుంటాం యువరానర్'.

విజిపి గార్డెన్స్ అప్పటికి పూర్తిగా చల్లబడింది.

మద్రాసు నగరం మీద కాచిన ఎండ- వేడిగా ఇంకా వేడిగా జనాన్ని ఎంత మాడ్చినా సాయంత్రమయ్యేసరికి సముద్రంగాలికి తోక ముడుస్తుంది. పారిపోతోంది. ఇప్పుడు ఆ చల్లగాలి కోసం విజిపికి వచ్చారు దాసరి, రమేష్.

సాధారణంగా దాసరి మనసు బాగలేనప్పుడు, ఆయన గంభీరంగా మారిపోయినప్పుడు సన్నిహితుల సమక్షంలో ఏకాంతంగా గడుపుతారు. కాటేజ్ బుక్ అయ్యింది.

రమేష్‌ను గదిలోనే వదిలిపెట్టి స్లిప్పర్స్ ధరించి బీచ్ ఒడ్డున అలా నడక మొదలెట్టారు దాసరి.

ఆయన గుండెల్లో దుఃఖం పొంగుకొస్తుంది. బొబ్బిలిపులి తన బిడ్డ. తాను కన్నబిడ్డ. పురుడు పోసుకున్న ఈ బిడ్డ ప్రేక్షకుల ఒడికి చేరాలి. కాని చేరడం లేదు. ఇన్‌క్యుబేటర్‌లో ఉండిపోయింది. బతుకుతుందో లేదో తెలియదు. చచ్చిపోతుందో ఏమో తెలియదు. అప్పటికే షూటింగ్ పూర్తయ్యి మూడు నెలలు అయిపోయింది. జనం ఎప్పుడెప్పుడా అని సినిమా కోసం ఎదురు చూస్తున్నారు. నిర్మాత పెట్టిన పెట్టుబడి అలాగే ఉంది. పడిన కష్టమూ అలాగే ఉంది. అన్నింటికీ మించి బొబ్బిలిపులి పాత్రకు జీవం పోసి, గర్జించి, తెలుగు వెండి తెరకు మరోపులి లేదూ రాదూ అని నిరూపించిన ఎన్టీఆర్ నటనా వైదుష్యమూ అలాగే ఉండిపోయింది.

ఇదంతా ఎప్పుడు బయటపడాలి? ఎప్పుడు ప్రొజెక్టర్లకు ఎక్కాలి?

దాసరి నడక ఆపి, కెరటాలు పాదాలను ముద్దాడుతుండగా స్థిమిత పడి, స్థిరంగా ఒక నిర్ణయం తీసుకున్నారు.

'తప్పదు. సినిమా విడుదల కోసం అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తాను. నా కోసం కాదు. ఎన్టీఆర్ కోసం. ఆయనకో గొప్ప సినిమా ఇస్తానని మాట ఇచ్చాను. ఆ మాటను నిలబెట్టుకోవడం కోసమైనా సరే ఆమరణ దీక్ష చేస్తాను'.

ఆ నిర్ణయం తీసుకున్నాక దాసరికి ఎన్టీఆర్ గుర్తుకొచ్చారు.

ఊటీలో ఆ తెల్లవారుజామున ఆయనలో దర్శించిన దివ్యత్వమూ గుర్తుకొచ్చింది.

'సువిశాలాంధ్రకు విప్లవజ్యోతి సీతారామరాజు

అల్లూరి సీతారామరాజు

నవ చైతన్య నికేతన మార్గదర్శకుడు

సీతారామరాజు... మన సీతారామరాజు...'

రెండేళ్ల క్రితం 'సర్దార్ పాపారాయుడు' సినిమా కోసం బుర్రకథను షూట్ చేస్తున్నారు. ఊటీలో షూటింగ్. తెల్లవారుజామున సంధ్యావందనం కోసం వెళుతున్న సీతారామరాజు మీద తొలి షాట్.

'బ్రదర్. రేపు ఐదుగంటలకు ఉంటే సరిపోతుందా?' అడిగారు ఎన్టీఆర్.

ఆయన అప్పటికే మానసికంగా అల్లూరి సీతారామరాజుగా మారిపోయి ఉన్నారు. ముఖంలో ఒకరకమైన రుషిత్వం.

'గెటప్ చూసుకున్నారా?' అడిగారు దాసరి.

'ఆ సంగతి నాకు వదిలిపెట్టండి బ్రదర్. రేపు చూస్తారుగా' అన్నారు ఎన్టీఆర్.

ఆ ఉదయం- పొడవైన చెట్ల కాండాలను తాకి, చీలి, పొగమంచు సాగిపోతూ ఉండగా- జివ్వుమని చల్లగాలి తాకిన ప్రతి మేనుకూ గగుర్పాటును కలిగిస్తూ ఉండగా- నగారాలోని బుర్రకథకు మరొక్కసారి మన్యపు వాతావరణం ప్రతిష్ఠితం అవుతూ ఉండగా- అదిగో ఎన్టీఆర్... కాదు కాదు అల్లూరి సీతారామరాజు... ఒంటికి కాషాయ వస్త్రాలు, నుదుటిన తిలకం, చేతిలో విల్లు, భుజానికి పొది, నడుముకు బిగించి కట్టిన విప్లవవర్ణ చిహ్నం ఎర్రవస్త్రం... పులిలాంటి అడుగులు.

దాసరికి మాటరాలేదు.

ఆ వచ్చేది మానవమాత్రుడిగా గోచరించలేదు.

ఈయన రుషి. ఈయన దివ్యపురుషుడు. బహుశా ఈయన కూడా ఒక అవతార పురుషుడే.

జీవితంలో ఎప్పుడూ ఎవరికీ పాదాభివందనం చేసి ఎరగని దాసరి ఒక్కసారిగా తన్మయుడై ఒంగి పాదాభివందనం చేశారు.

ఎన్టీఆర్ కదిలిపోయారు.

'బ్రదర్... ఏమిటి ఇది' ఆయన కళ్లల్లో ఒక కళాకారుడికి మాత్రమే సాధ్యమైన స్పందన తాలూకు తడి.

'ఏమో సార్. మీ పాదాలకు నమస్కరించాలనిపించింది. చేశాను' అన్నారు దాసరి.

ఎన్టీఆర్ మౌనంగా వెళ్లి దూరంగా ఉన్న కుర్చీలో కూచున్నారు.

తర్వాత దాసరిని పిలిచారు.

'బ్రదర్. నాటి మహానుభావుల పాత్రలను తెరపై మేము చేస్తున్నాం. మా పాత్రను భవిష్యత్తులో ఎవరైనా వెండితెరపై చేస్తారా?'

చాలా చిత్రమైన ప్రశ్న.

దాసరి ఆలోచించి సమాధానం చెప్పారు.

'ఎందుకు చేయరు సార్. జనం మెచ్చే పని, వారికి సేవ చేసి చరిత్రలో మిగిలే పని చేస్తే తప్పక వేస్తారు'

ఎన్టీఆర్ తల పంకించారు.

మరికొన్నాళ్లకు ఆయన రాజకీయ రంగ ప్రవేశ ప్రకటన వెలువడింది.

మద్రాస్ బజుల్లా రోడ్డులో కార్ పార్కింగ్ ఎప్పుడూ సమస్యే.

ఆ రోడ్డులో ఉండే ఎన్టీఆర్ కోసం వచ్చే విజిటర్స్ డజనుకుపైగా బయట కార్లు పార్క్ చేసి ఉంటారు. అదే రోడ్డులో ఉండే దాసరి కోసం ఇంకో డజను.

ఇప్పుడు ఎన్టీఆర్ ఇంటి బయట ఇంకా రద్దీ పెరిగింది. ఎక్కడెక్కడి నుంచో జనాలు తండోపతండాలుగా వచ్చి ఆయనను దర్శించుకుని వెళుతున్నారు. ఆయన పార్టీ అనౌన్స్ చేయలేదు. కాని రాజకీయ రంగప్రవేశం దాదాపుగా ఖరారే అన్న వాగ్దాన ప్రకటన వచ్చింది. ఒక హీరో, రాముడు, కృష్ణుడు, పేదల కోసం పోరాడే పరాక్రమవంతుడు, నైతిక వర్తనుడు, ఆకర్షక శక్తి... తమ కోసం తమ బాగు కోసం రాజకీయాల్లోకి వస్తున్నాడంటే ప్రజలకు ఎంత వేడుక. అభిమానులకు ఎంత సంబరం.

'వారిని సంతోషపెట్టే ఆఖరు ప్రయత్నం చేద్దాం బ్రదర్' అన్నారు ఎన్టీఆర్ ఒకరోజు దాసరిని పిలిచి.

'బహుశా ఇది మా చివరి చిత్రం కావచ్చు. మీరు దానిని బ్రహ్మాండంగా తీయాలి' అని ఆఫర్ ఇచ్చారు.

దాసరి అప్పటికి యధావిధిగా బిజిగా ఉన్నారు. ఇంకా చేతిలో బోలెడన్ని సినిమాలు ఉన్నాయి.

అయినా ఇది గొప్ప చాన్స్.

దాసరి ఎన్టీఆర్‌ని పరికించిచూశారు.

తెలియని తేజస్సుతో వెలిగిపోతున్నాడాయన.

'సార్. నిన్న మొన్నటి దాకా మీరు ఇండివిడ్యుయల్. ఇవాళ మీరే ఒక అఖండ ప్రజాసమూహం. మిమ్మల్ని ఒక పాత్రలోకి అదుపు చేయడం కష్టమేమో సార్'

ఎన్టీఆర్ నవ్వారు.

'జనహితం కోసం అవసరమైతే అన్నిరకాల అదుపులనూ అడ్డంకులనూ దాటి విప్లవాత్మకంగా పోరాడే హీరోగా చూపించండి బ్రదర్'

దాసరికి ఏదో ఫ్లాష్ వెలిగినట్టయ్యింది. అది క్రమక్రమంగా మెదడు కణజాలమంతా వ్యాపించి వెలుగుతో నిండి అందులో నుంచి ఒక ఆకారం ప్రత్యక్షమై.... ఆయన పెదాలు నెమ్మదిగా ఒక మాటను ఉచ్చరించాయి.

'బొబ్బిలిపులి'

భారీ సినిమా. భారీ ప్రొడ్యూసర్ కావాలి.

వడ్డే రమేష్ నేను రెడీ అని వచ్చారు.

భారీ సినిమా. భారీ తారాగణం కావాలి.

శ్రీదేవి, సత్యనారాయణ, రావుగోపాలరావు, జగ్గయ్య, జయచిత్ర, ప్రభాకర రెడ్డి, అల్లు రామలింగయ్య మేము రెడీ అని వచ్చారు.

డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ- కె.ఎస్. మణి.

స్టంట్స్- మాధవన్

స్టెప్స్- సలీమ్.

పాటలు- దాసరికి తోడుగా వేటూరి

సంగీతం- విజయమాధవి ఆస్థాన విద్వాంసుడు జె.వి.రాఘవులు.

అంతా బాగుంది. అద్భుతంగా ఉంది. కాని కథ?

కథ కూడా భారీగా ఉండాలి. అది ఇంకా దాసరి బుర్రలో రూపు దాల్చలేదు. సమయం దగ్గర పడుతోంది. షూటింగ్ పెట్టుకోవాలి. ఏం చేయాలి? కోడైరెక్టర్ నందం హరిశ్చంద్రరావుని వెంటబెట్టుకుని వాకింగ్‌కు బయలుదేరారు.

మనదేశంలో ఎప్పుడూ కొందరు ఉత్సాహవంతులు ఒక కామెంట్ చేస్తూ ఉంటారు– మిలట్రీ రూల్ వస్తే తప్ప ఈ దేశం బాగుపడదూ అని. అది గుర్తొచ్చింది దాసరికి. మిలట్రీ దాకా వెళ్లక్కర్లేదు. ఒక సైనికుడి పాత్రను తీసుకుందాం అనుకున్నారాయన. వెంటనే త్రెడ్ దొరికింది. 'ఒక సైనికుడు దేశ శత్రువులను తుదముట్టించి మహావీర చక్ర బిరుదు పొందుతాడు. అదే సైనికుడు సమాజ శత్రువులను తుదముట్టించినందుకు ఉరిశిక్షను కానుకగా పొందుతాడు. ఇదేం న్యాయం?'

ఆ ఆలోచన వచ్చాక ఆగలేదాయన. చకచకా సన్నివేశాలు రాసుకుంటూ వెళ్లారు. ఒక సైనికుడు. సెలవులకు ఇంటికి వస్తాడు. ప్రేమలో పడతాడు. పెళ్లి చేసుకుందాం అనుకుంటాడు. ఇంతలో సమాజంలోని దుర్మార్గాలను చూస్తాడు. నేను ఉండవలసింది సరిహద్దుల్లో కాదు, ఇక్కడే అని నిశ్చయించుకుని తిరగబడతాడు.

చెబుతుంటే దాసరి రోమాలు నిక్కపొడుచుకున్నాయి.

ఎన్టీఆర్ కళ్లు విశాలమయ్యాయి.

'చాలా బాగుంది బ్రదర్. ప్రొసీడ్' అన్నారాయన.

కాని మనది సగటు ప్రేక్షకుడి సమాజం. సగటులో సగటుగా ఉండే స్త్రీ ప్రేక్షకుల సమాజం. ఇలాంటి కథలో ఆడవాళ్లకు నచ్చే పాయింట్ ఉండాలి. మొదటి పాయింట్: ప్రియుడి బాగు కోసం తన ప్రేమను త్యాగం చేసే ప్రియురాలు. రెండో పాయింట్: భర్త బతికే ఉన్నా చనిపోయాడనుకొని బొట్టు తీసేసే భార్య. చాలు అనుకున్నారు దాసరి.

ఇంకా కొంచెం పెప్ కావాలా? భార్య చనిపోతుంది. భర్త కోసం పోలీసులు కాపు కాచి ఉంటారు. హీరో కాటికాపరి వేషంలో వచ్చి కొరివి పెడతాడు. చాలు అనుకున్నారు దాసరి.

ఇంకా కొంచెం కన్నీరు కావాలా? హీరో యుద్ధంలో ఉంటాడు. తల్లి చనిపోయినట్టుగా అతడికి వర్తమానం వస్తుంది. కదలడానికి లేదు. పైగా స్థైర్యం కోల్పోయిన సైనికులను ఉత్తేజితులను చేస్తూ పాట పాడాలి.

చాలు అనుకున్నారు దాసరి. ఇంకా కొంచెం కారం కావాలా?

క్లయిమాక్స్ సీన్. మాటలు ఫిరంగులై మోగుతాయి. వాదనలు పిడుగులై ఉరుముతాయి. హీరో సమాజపు సకల అపసవ్యతలను ప్రశ్నిస్తూ గర్జిస్తాడు. చాలు. ఇంతకంటే ఎక్కువ మందుగుండు దట్టిస్తే ప్రేక్షకులు తట్టుకోలేరు.

ఎన్టీఆర్ డేట్స్ 38 రోజులు. ఎక్స్‌పోజ్ చేసిన ఫిల్మ్ 50 వేల అడుగులు. బడ్జెట్ 50 లక్షలు. నిర్మాణ సమయం 50 రోజులు. అంతా రెడీ. సెన్సార్ అయి ఇంక రిలీజ్ కావాలి ప్రతి క్రైసిస్‌లోనూ ఒక హీరో ఉంటాడు. ఈ క్రైసిస్‌లో కూడా ఉన్నాడు. నటుడు ప్రభాకర రెడ్డి.

సినిమా రిలీజ్‌కు ప్రతిబంధకాలు ఏర్పడ్డాయి అని తెలిసిన వెంటనే రమేష్ నాయకత్వంలో ప్రభాకర రెడ్డి రంగంలో దిగారు. ఎందుకంటే ఆయన వడ్డే రమేష్‌కు ఆప్తుడు. అదీగాక ఈ సినిమా చాలా మంచి సినిమా అని ఆయన నమ్మకం. దీనికి అపకారం జరగకూడదు.

వడ్డే రమేష్‌తో పాటు ఢిల్లీలో దిగిన ప్రభాకర రెడ్డి మొదట చేసిన తెలివైన పని ఏమిటంటే 'సమ్మతి తయారీ'. 'బొబ్బిలిపులి బాగుంది అనే మాట ఢిల్లీలో మారుమోగాలి' అనుకున్నాడాయన. మొదట తెలుగు తమిళ ఐఏఎస్‌లను ఒక పద్దెనిమిది మందిని పోగేశాడు. వాళ్లకు సినిమా చూపించాడు. 'బాగుంది. ఎన్టీఆర్ మహానుభావుడు. ఈ సినిమాకు కట్స్ ఎందుకు' అన్నారందరూ.

ఆ తర్వాత పి.వి.నరసింహారావు, పెండెకంటి వెంకట సుబ్బయ్య, జనరల్ కృష్ణారావు, అప్పటి డిప్యూటీ సిఎం జగన్నాథరావు వీళ్లందరినీ జత చేసి మళ్లీ షో వేశాడు. వాళ్లు చూసి 'నీకెందుకు మేం చూసుకుంటాం' అని రమేష్‌కు హామీ ఇచ్చారు.

దాదాపుగా సగం ఇబ్బంది దూరమైనట్టే. ఆ తర్వాత రమేష్, ప్రభాకర రెడ్డి కలిసి మద్రాసులో ఉన్న దాసరికి ఫోన్ చేశారు. 'మీరు వెంటనే రండి. ఇంకొక్కరికి చూపిస్తే మన సినిమా రిలీజైపోతుంది'

'ఎవరాయన?'

'మన తెలుగువాడే. నీలం సంజీవరెడ్డి. ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా'

దాసరి టక్కున ఫోన్ పెట్టేసి ఢిల్లీ బయలుదేరారు. నీలం సంజీవరెడ్డి ప్రత్యేకంగా రాష్ట్రపతి భవన్‌లో సినిమా చూశారు. రాష్ట్రపతి చూసి బాగుంది అన్నాక సెన్సార్ అధికారుల కత్తెర్లు టేబుల్ సొరుగుల్లోకి నిష్క్రమించాయి.

జూలై 9, 1982న బొబ్బిలిపులి రిలీజయ్యింది.

ఏనుగు కుంభస్థలాన్ని కొడితే–

అది పెద్దపులి.

కలెక్షన్ల కుంభస్థలాన్ని కొల్లగొడితే–

అది బొబ్బిలిపుల

చాలాచోట్ల రేయింబవళ్లు షోస్ వేశారు.

చిన్న చిన్న ఊళ్లల్లో కూడా రెండు థియేటర్లలో రిలీజ్ అయ్యింది. చాలాచోట్ల వందరోజులు నూట డెబ్బయ్ అయిదు రోజులు ఆడింది. చాలామంది ఎగ్జిబిటర్లు బొబ్బిలిపులి పుణ్యమా అంటూ ఏదో ఒక చిన్న కారో పెద్ద మేడో సంపాదించుకున్నారు.

బొబ్బిలిపులి ఎన్టీఆర్‌ని హీరో నుంచి నాయకుడిగా రీచార్జ్ చేసింది. ఎన్టీఆర్‌కు ప్రత్యామ్నాయం లేదు అని వాస్తవాన్ని ఖరారు చేసింది.

పరిత్రాణాయ సాధూనాం

వినాశాయచ దుష్కృతాం

దక్షిణాది సినీ పరిశ్రమ చెత్త సినిమాలతో నీరసించినప్పుడల్లా

భారతీయుడు, ఠాగూర్, శివాజీ వంటి సినిమాలు రావడానికి ఇన్‌స్పిరేషన్‌గా నిలచి ఏళ్ల తర్వాత కూడా రీచార్జ్ చేస్తూనే ఉంది.

జై తెలుగు సినిమా. జై జై బొబ్బిలిపులి.

రోరింగ్ రికార్డ్

నిర్మాణ వ్యయం: సుమారు 50 లక్షల రూపాయలు

నిర్మాణ ప్రాంతాలు: మద్రాసు, ఊటీ

నిర్మాణ సమయం: 50 రోజులు

రికార్డులు:

తెలుగునాట తొలిసారి 100కు పైగా థియేటర్లలో విడుదలైంది.

తొలిరోజే రూ.13 లక్షలు వసూలు చేసింది.

తొలివారంలో రూ.71 లక్షలకు పైగా వసూలు చేసింది.

రెండు వారాలకు కోటి రూపాయలు వసూలు చేసింది.

ఓవరాల్‌గా రూ.మూడు కోట్లకు పైగా వసూలు చేసింది.

39 కేంద్రాల్లో వందరోజులు ప్రదర్శితమైంది.

హైదరాబాద్‌లోని సుదర్శన్ 35 ఎం.ఎం.థియేటర్‌లో

175 రోజులాడి రికార్డ్ సృష్టించింది.

హైదరాబాద్‌లో షిఫ్టులతో ఏడాది ఆడింది.

పాతాళభైరవి, లవకుశ, అడవిరాముడు, వేటగాడు తర్వాత ఏడాది ఆడిన ఎన్టీఆర్ 5వ సినిమా.

పాతాళభైరవి, లవకుశ, అడవిరాముడు, వేటగాడు, దసరాబుల్లోడు, ప్రేమాభిషేకం, పండంటికాపురం,

అల్లూరి సీతారామరాజు, శంకరాభరణం (50 వారాలు మాత్రమే), తర్వాత ఏడాది ప్రదర్శితమైన పదో తెలుగు సినిమా.

ఆ క్రమశిక్షణ రాదు

సినిమా ఫీల్డ్‌లోకి ఎంటరైనప్పటినుంచీ ఎన్టీఆర్‌తో సినిమా తీయాలనేది నా కల. 'బొబ్బిలిపులి' ఆ కల నెరవేర్చింది. దాసరితో నాది ప్రత్యేకమైన అనుబంధం. ఆయనతో పది సినిమాలు తీశాను. ఎన్టీఆర్ లాంటి హీరోని మళ్లీ చూడలేం. దాసరి లాంటి దర్శకులు ఇక రారు. ఉదయం ఏడు గంటలకు షూటింగంటే 6 గంటల 45 నిమిషాలకే మేకప్‌తో సిద్ధంగా ఉండేవారు ఎన్టీఆర్. దాసరి కూడా క్రమశిక్షణ విషయంలో ఎన్టీఆర్‌తో పోటీపడేవారు. అలాంటి క్రమశిక్షణ వల్లే 'బొబ్బిలిపులి' లాంటి భారీ చిత్రాన్ని కూడా అవలీలగా చేయగలిగాం. ఈ సినిమా మీద నమ్మకంతో ఒక్క ఏరియా మినహా మొత్తం సొంతంగా రిలీజ్ చేసుకున్నాం.

వడ్డే రమేష్, నిర్మాత

దటీజ్ ఎన్టీఆర్

బొబ్బిలి రాజవంశానికి చెందిన తాండ్ర పాపారాయుడికి 'బొబ్బిలిపులి' అని బిరుదు ఉంది. దాన్నే టైటిల్‌గా పెట్టాను. ఈ సినిమాకు క్లైమాక్సే ప్రాణం. దాదాపు 20 నిమిషాలు కోర్టు సీన్. మద్రాసు ఏవీయమ్ స్టూడియోలో కోర్టు సెట్ వేశాం. ఎన్టీఆర్ ఉదయం 9 గంటలకు వస్తారు. నేను గంట ముందే లొకేషన్‌కు వెళ్లాను. సెట్‌లో ఓ మూల కూర్చున్నాను. ఏవేవో ఆలోచనలు. కోర్టు సీన్ మార్చి ఇంకా బాగా రాయాలనిపించింది. వెంటనే మొదలుపెట్టాను. అలా ఏకధాటిగా 35 పేజీలు రాసేశాను. టైమ్ చూస్తే 11 గంటలైంది. అప్పటికే ఎన్టీఆర్ వచ్చేశారు. నేను రాసుకోవడం చూసి డిస్టర్బ్ చేయొద్దని ఆయనే చెప్పారట. అందరికీ నేను రాసిన కొత్త డైలాగ్స్ వినిపించాను. ఎన్టీఆర్ ఆ స్క్రిప్టు తీసుకుని "మధ్యాహ్నం రెండు గంటల నుంచి షూటింగ్ చేద్దాం" అని వెళ్లిపోయారు. ఇంటికి లంచ్‌కి వెళ్లారేమోననుకున్నా. కానీ.. ఆయన మెరీనా బీచ్‌కి వెళ్లి అక్కడ ఆ డైలాగ్స్‌ని ప్రాక్టీస్ చేశారట. ఆ తర్వాత అన్నీ సింగిల్ టేక్‌లోనే చేసేశారు. దటీజ్ ఎన్టీఆర్.

– దాసరి నారాయణ

సంభవం...నీకే సంభవం

తెలుగు చలనచిత్ర చరిత్రలో రికార్డులు తిరగరాయాలన్నా...రికార్డు బ్రేక్ కలెక్షన్లు సృష్టించాలన్నా...తన రికార్డులు తానే బద్దలు కొట్టుకోవాలన్నా ఒక్క నందమూరి తారక రామారావుకే సంభవం. కేవలం ఆరువారాల గ్యాప్‌లో రెండు బ్లాక్‌బస్టర్ చిత్రాలలో నటించిన ఖ్యాతి ఒక్క నటరత్నకే సంభవం...9-7-1982న విడుదలైన 'బొబ్బిలిపులి' 35 సంవత్సరాలు పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా 'బొబ్బిలిపులి'పై ప్రత్యేక వ్యాసం...

కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలో ఎన్టీఆర్ న్యాయమూర్తిగా జీవించిన చిత్రం 'జస్టిస్ చౌదరి' విడుదలైన ఆరువారాలకే దర్శకరత్న దాసరి నారాయణరావు దర్శకత్వంలో మరో సంచలనం సృష్టించడానికి విడుదలైన చిత్రం 'బొబ్బిలి పులి'. విజయమాధవి ప్రొడక్షన్స్ పతాకంపై వడ్డే శోభనాద్రి నిర్మాతగా 1982 జులై 9న సుమారు 100కు పైగా థియేటర్లలో విడుదలైన తొలి తెలుగు చిత్రంగా ఒక రికార్డును సృష్టించిన ఈ సినిమాకి అడ్డంకులెన్నో. విడుదల కాకముందర అనేక సెన్సార్ ఇబ్బందులను ఎదుర్కొని ఆఖరుకు కేంద్ర మంత్రులు కూడా ఈ సినిమాను చూసి ఎట్టకేలకు ఎటువంటి కట్స్ లేకుండా సినిమాను విడుదల చేసుకోవచ్చనే అనుమతిని ఇచ్చారు. దీనికి మూడు నెలలకు పైగానే పట్టింది. సరిగ్గా అదే సమయానికి నటరత్న నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ పెట్టి తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీస్థాయికి రెపరెపలాడేలా చేశారు.

అప్పటి కేంద్ర ప్రభుత్వం బొబ్బిలిపులి మీద కక్షసాధింపు చర్యగా భావించి, రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ అభిమానులు 'బొబ్బిలిపులి' చిత్రం విడుదల కోరుతూ ఉద్యమాలు, ధర్నాలు నిర్వహించారు. అలా విడుదల కాకముందే ఈ చిత్రం మరో సంచలనం సృష్టించింది. ఇక విడుదలయ్యాక అప్పటిదాకా కేవలం రోజుకు 3 ఆటలు ప్రదర్శించే థియేటర్లు బొబ్బిలిపులి చిత్రం విడుదలయ్యాక జనం రద్దీని తట్టుకోవడానికి రోజుకు నాలుగు ఆటలూ బొబ్బిలిపులి చిత్రాన్నే ఆడించాల్సి వచ్చింది. ఆ రోజుల్లో 38 కేంద్రాలలో శతదినోత్సవం జరుపుకున్న తొలి చిత్రంగా మరో అరుదైన రికార్డును సొంతం చేసుకుంది బొబ్బిలిపులి. 70 ప్రింట్లతో విడుదలైన ఈ చిత్రం తొలి వారంరోజులకే రూ.71 లక్షలు వసూలు చేసింది. ఇవాళ కోట్లు వసూలు చేశాయంటున్న పెద్ద హీరోల సినిమా కలెక్షన్ల కన్నా ఎక్కువ

రెట్ల మొత్తంలో కలెక్షన్లువసూలు చేసింది బొబ్బిలిపులి. అప్పటి లక్షలు ఈ రోజుల్లో కోట్లతో సమానం. ఆ రోజుల్లో తెలుగునాట ఎక్కువ ఆటలతో శతదినోత్సవం జరుపుకున్న చిత్రాలు మూడే. అవి అడవిరాముడు, కొండవీటి సింహం, బొబ్బిలిపులి. ఈ మూడూ ఎన్‌టిఆర్‌వే కావడం విశేషం.

బొబ్బిలిమరో విశేషం ఏమిటంటే హైదరాబాద్‌లో *ripeat run* గా విడుదలై మళ్లీ 175 రోజులు ప్రదర్శించబడటం. ఇక ఈ చిత్రంలో మన న్యాయవ్యవస్థలో ఉన్న లోపాలను ఎత్తిచూపించే డైలాగులు ఉన్నాయి. ‘కోర్టు కోర్టుకు...తీర్పు తీర్పుకు ఇంత మార్పు ఉంటే...మీ న్యాయస్థానంలో న్యాయం ఉన్నట్టా యువరానర్’ అంటూ ఎన్టీఆర్ డైలాగులు చెబుతుంటే కింది క్లాస్ నుంచి పై క్లాస్ దాకా చప్పట్లతో థియేటర్లు మార్మోగిపోయాయి. ఇక దేశ సరిహద్దుల్ని కాపాడే వీరజవాన్‌గా పనిచేసిన ఎన్టీఆర్‌కు దేశం లోపల చీడపురుగుల్లాంటి కొంతమంది దేశాన్ని ఏ విధంగా దోచుకుతింటున్నారో చూసి చలించిపోయి అటువంటి వారికి తనదైన రీతిలో బుద్ధి చెబుతాడు. ఈ క్రమంలో బొబ్బిలిపులిగా మారి అవినీతి, లంచగొండితనంపై తిరుగబాటు చేస్తాడు. ఈ చిత్రం కథ స్ఫూర్తితో తర్వాత భారతీయుడు, ఠాగూర్ వంటి ఎన్నో చిత్రాలు వచ్చాయి. ఇక ఇందులోని పాటలు ఎంతో ఉద్వేగభరితంగా ఉంటాయి.

ముఖ్యంగా దర్శకరత్న దాసరి నారాయణరావు రచించిన ‘సంభవం...నీకే సంభవం’, ‘జననీ...జన్మ భూమిశ్చ’ వంటి పాటలు నభూతో నభవిష్యతి అన్న రీతిలో పదికాలాల పాటు పాడుకునే పాటలుగా నిలిచిపోయాయి. ఇక క్లైమాక్స్‌లో వచ్చే కోర్టు సీన్‌లో శ్రీదేవి లాయర్‌గా చక్రధర్ పాత్రధారి ఎన్టీఆర్‌ని అడిగే సన్నివేశంలో ఎన్టీఆర్ చెప్పే డైలాగులు విని చప్పట్లు కొట్టని తెలుగువాడు ఉండడేమో ఆ రోజుల్లో...శ్రీదేవి ‘మీరొక్కరే ఏం చేస్తారు?’ అని ఎన్టీఆర్‌ని అడుగుతుంది అప్పుడు ‘మహాత్మాగాంధీ ఒక్కడే నడుం కడితే యావత్ దేశమే ఆయన వెనక వచ్చింది’, ‘అల్లూరి సీతారామరాజు ఒక్కడే విల్లు పడితే...మన్యం మన్యమే ఆయన వెంట కదిలి వచ్చింది, భగత్ సింగ్ ఒక్కడే..యావత్ యువశక్తి ఆయన వెంట వచ్చింది’ అంటూ రామారావు చెప్పే డైలాగులు చప్పట్లు కొట్టించేలా చేశాయి. జె.వి. రాఘవులు అందించిన సంగీతం ఈ చిత్రానికి ఆక్సిజన్‌లా పనిచేసింది. వాడవాడలా రికార్డు కలెక్షన్లు సృష్టించిన చిత్రంగా నిలిచింది.

పరువు హత్య...

- ప్రజామీడియా సౌజన్యంతో



హైదరాబాద్ నగరంలో పరువు హత్య కేసు కలకలం రేపుతోన్న సంగతి తెలిసిందే. కూతురు ప్రేమించి పెళ్లి చేసుకుందనే కక్షతో.. అల్లుడిని కిరాతకంగా హత్య చేయించాడు... ఆమె తండ్రి! లక్ష్మా రెడ్డి. చందానగర్‌లో నివాసముంటున్న హేమంత్ అనే యువకుడు అదే ప్రాంతానికి చెందిన అవంతి అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీళ్లు గచ్చిబౌలిలోని టీఎన్జీఓ కాలనీలో నివాసముంటున్నారు. ఈ వివాహాన్ని అంగీకరించని యువతి తండ్రి లక్ష్మారెడ్డి అమ్మాయి మేనమామ సాయంతో నమ్మించి హేమంత్‌ను బయటికి తీసుకెళ్లారు. ఆ తర్వాత యువతి మేనమామ హేమంత్‌కు ఉరి వేసి చంపాడు. ఆ తర్వాత హేమంత్ మృతదేహాన్ని సంగారెడ్డి జిల్లా కిష్టాయగూడెం శివార్లలోకి తీసుకెళ్లి... చెట్ల పొదల్లో పడేశారు. అయితే ఈ హత్య సమాచారం తెలుసుకున్న గచ్చిబౌలి పోలీసులు... ఘటనా స్థలానికి వెళ్లి హేమంత్ మృతదేహాన్ని హైదరాబాద్‌కు తరలించారు. హేమంత్ మృతదేహం దొరికిన ప్రాంతంలో సంగారెడ్డి క్లూస్ టీమ్ ఆధారాలు సేకరిస్తోంది. ఈ కేసులో అమ్మాయి తల్లిదండ్రులతో పాటు 22 మందిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. కులాలు వేరు కావడమే హేమంత్ హత్యకు కారణమని అతడి తల్లి ఆరోపించారు. సందీప్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, యుగేందర్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డే తమ కుమారుడిని హత్య చేయించారని ఆమె కన్నీరుమున్నీరయ్యారు. ఎన్నో ఆశలు పెట్టుకొని కుమారుడిని



పెంచుకున్నామని ఇంత దారుణానికి ఒడిగడతారని అనుకోలేదని ఆవేదన వ్యక్త చేశారు. పలుమార్లు ఇంటికి సైతం వచ్చి తమను బెదిరించారని, హేళన చేసి మాట్లాడారని ఆరోపించారు. సాయంత్రం పదిమంది ఇంట్లోకి వచ్చి జంటను కారులో అపహరించారని తెలిపారు.

ఎనిమిదేండ్లు ప్రేమించుకున్నాం : అవంతి

చిన్ననాటి నుంచి హేమంత్ నేను ఒకే ప్రాంతంలో పెరిగాం. ఎనిమిదేండ్ల నుంచి ప్రేమించుకున్నాం. నాలుగు నెలల క్రితం వివాహం చేసుకున్నాం. మా ఇంట్లో వివాహం ఇష్టం లేకపోవడంతో గచ్చిబౌలిలో ఉంటున్నాం. పలుమార్లు బెదిరించడంతో ఇంట్లో నుంచి కూడా బయటకు రాలేదు. హేమంత్‌ను నన్ను మా బంధువులే బలవంతంగా లాక్కెళ్లారు. బావ, వదినలు, మావయ్యలే ఈ హత్య చేయించారు. పెళ్లిముందు మా ప్రేమ విషయం తెలిసి 7 నెలలు నన్ను ఇంటికే పరిమితం చేశారు. పెద్దవారు మాట్లాడుతున్నారని అనుకున్నా కానీ ఇంతలో దారుణం చేస్తారని ఊహించలేదు అని హేమంత్ భార్య అవంతి రెడ్డి కంటతడి పెట్టారు.



డా.జి.వి.రత్నాకర్,
మౌలానా అజాద్ నేషనల్ ఉర్దూ
యూనివర్సిటీ, హైదరాబాద్

కులం..

కులం...
అబ్బే
ఇంకా కులం
ఎక్కడుంది అనే
గాడిద పుత్రులారా
పత్తిత్తుల్లారా

చూడండి
కళ్లిప్పుకొని
చెవులు సాపుకొని వినండి

అంటరానితనం
అనుభవిస్తూనే
అచ్చరాలు

మట్టి పలక
లపై దిద్దుకొని అయివారు
అయిన
ఆయనకి జరిగిన అవమానం

నీళ్ళు
అంటనితనానికి
ఆనవాళ్ళు
తరాల యుగాల
అవమానాలు

నీళ్ళు కన్నీళ్ళు
ఆరని కడగండ్లు

గొంతెండిన యాల
నాలుగు గుటకలేయకుండానే
కలిగిన అగచాట్లు

వర్ణధర్మాన్ని మోస్తూ

అంటరానితనం కి
అసలు చిరునామాలా
నిలుస్తున్న

ఉత్తర భారతమా
మా ద్రవిడస్తాన్
మిమ్మల్ని
అసహ్యించుకుంటుంది

మీరేంటిరా
మమ్మల్ని ఎలేసేది
మేమే ఎలేస్తామిక

వేమన ధర్మన్న
భాగ్యరెడ్డివర్మ
పెరియార్ నారాయణగురు
అయ్యంకాళి ఓబవ్వ
మహాత్మా ఫూలే

మాతండ్రి
అంబేద్కరుడు
నడయాడిన నేలరా ఇది
మరవకండి

మాట కోసం
ఆత్మగౌరవంతో
కత్తుల కోలాటమాడిన
మా జాతులని రెచ్చగొట్టకండి

మనుషులుగా
మసలండి
సాటి మనుషులను
అవమానించే మీ
నీచ ప్రవృత్తిని వదలండి

కాస్త సిగ్గుపడండి
క్షమాపణలవండి..

(గుజరాత్ లోని బడిలో
ఆధిపత్య కుల నీళ్ళ కుండ
తాకిన నేరానికి బదిలీకి
గురైన అంటరాని సోదరుని
కోసం)

యాడుంది నా యాస!

– చిత్తలూరి, 8247432521

యాడుంది నా యాస!
కథలల్ల కవితలల్లనే
కొద్దో గొప్పో
ఊపిరి పోసుకుంటా వుంది

యాడుంది నా యాస
శ్రమకారుల నాలుకల మీదనే
జారుడు బండాట ఆడుతా వుంది
సామాన్య జనం నోళ్లల్లనే
నారపొట్టెలా నాంతా వుంది

యాడుంది నాయాస
బానిస బుద్ధిలింకా
లుక లుకలాడుతనే వున్నయ్
బానిస రోగం
కరోనా పురుగులెక్క
బతుకు మూలాల్ని
తొలుస్తనే వుంది

నా రాజ్యం నా చేతికొచ్చినా
నా రాజ్యం గొంతింకా
పాత పాటనే పాడుతాంది
పుస్తకాల పల్లకీ ఎక్కి
తరగతి గది వీధుల్లో
పట్ట మహిషిలా
ఊరేగాల్సిన నా యాసింకా
పరిచారికలానే
ఓ మూలన
నిలబడి పోయుంది

నా యాసను వెక్కిరించిన
నోళ్లింకా
పూర్తిగా మూతపడనే లేదు
నా యాసను
దుష్ట పాత్రలకు
స్వరంలా మార్చి
మా బతుకుల్లో దొర్లించిన
అవమానాల అపశృతులింకా
చెదిరిపోనే లేదు
అవహేళనల గాయాలింకా
మాసిపోనే లేదు

భాషేదైనా
ఎవరి యాస వారికి ప్రాణం
యాస ఒక జీవిక
యాస ఒక ఉనికి
యాస ఒక ప్రాణ దీపం
యాస ఒక తొక్కులాట
యాస ఒక బతుకు పాట
యాస ఒక సొంతు గొంతు

నా గొంతు నాది కావాలె
నా స్వరం నాది కావాలె
నా పాట నాది కావాలె
నా మాట నాది కావాలె
నా యాస నాక్కావాలె
మొత్తంగా
నా బతుకు నాది కావాలె

నా యాసే కదా నా ఊపిరి
నా యాసే కదా
నా సంస్కృతి సిరి

నా అధికారిక యాసింకా
గొంగళి దశలోనే వుంది
సీతాకోక చిలుకై
రాజ్యం పూల తోటనింకా
చుట్టేయటం లేదు

సామాన్యుని స్వరంలో పలికే
నా యాస
నా రాజ్యానికీ పూర్తి శ్వాస కావాలె
పర యాసా
బానిసతనాన్ని వీడి
నాదైన సొంత గొంతుతో
నా యాస
రాజ్యమంతా పాడుకునే
నా బతుకమ్మ పాట కావాలె
నా కాళోజీ కవిత కావాలె
నా సకల యాసా సరళికొక
ప్రామాణిక స్వరం కావాలె!

కంచెమీద పక్షిస్వరం

– నేలపూరి రత్నాజీ

కవిత్వం మీద ఒక్కొక్కరిది ఒక్కో అభిప్రాయం భిన్న నిర్వచనాలు ఆయాకవుల అభిప్రాయాలతో ఏకీభవించావొచ్చు.. విభేదించావొచ్చు.. అంతేకానీ కీచులాటతో పనిలేదు..కవిత్వంలో మార్ధవం ఉంటుంది రౌద్రం ఉంటుంది..భావకవిత్వానికి ఒక వర్గం కవులు అగ్రభాగం అనుకుంటే..సామాజికాంశాలను జోడించి ప్రజాసమస్యలపై కలం నే కత్తిగా ఝుళిపించి ప్రజాపక్షం వహించే ప్రజాకవిత్వానికి ఇంకో వర్గం కవులు ఆ కవిత్వానికి అధినాయకత్వం వహిస్తున్నారు. దీన్నిబట్టి సాహిత్యం రెండుపాయలుగా ప్రవహిస్తోందని మనం గమనంలోకి తెచ్చుకోవాలి..'నాఅక్షరాలు వెన్నెల్లో ఆడుకునే ఆడపిల్లలు' అని పోల్చుకుంటారు తిలక్ తన కవిత్వాన్ని..కదిలేది కదిలించేది పెనునిద్దర వదిలించేది కవిత్వం అనే నమ్మకాన్ని మార్క్స్ సిద్ధాంతానికి జోడించి శ్రీశ్రీ ఎర్రబాటను వేస్తే..ఆరెండు అభిప్రాయాల్లోంచి వేరుపడి కుల మత వర్గ పీడితుల పక్షాన భగ భగ మండే అగ్నికీలల్లాంటి అక్షరాల నిప్పు నెరుసుల్ని రగిలించే కవులు బహుజన సాహిత్యాన్ని సృజనచేస్తూ పోరాట కంఠాల్ని వినిపిస్తున్నారు.. ఆ కోవలో వినిపిస్తున్న పాటే ఈ "కంచెమీదపక్షిపాట" ఆ కంచె ఊరికి వాడకు మధ్య నిర్బంధాలముళ్ళు.. ఎన్ని నదుల స్నానం చేసినా వొదలని మెదడులోని కులం కుళ్లు.. ఆ కంచెని విరిచి ఆకుళ్ళుని కడిగేప్రయత్నమే పక్షిపాడే పాట..ఆ పక్షి డా"నూకతోటి రవికుమార్.

కంచెమీదపక్షిపాటలోని మొత్తం కవిత్వాన్ని సమాలోచన చేసినపుడు,కవి ఒక నిబద్ధతోకూడి చెప్పదలచిన విషయాన్ని పాఠకుడి ఆలోచనలోకి నేరుగా అలవోకగా తన అక్షరాల్ని ఒంపుతాడు. పాఠకుడికి కవిత్వానికి మధ్య రచయిత నిలబడి కవిత్వం యొక్క ఉద్దేశ్యాన్నిస్పష్టపరుస్తాడు ఇది కవిత్వంలో నూకతోటి రవికుమార్ టెక్నిక్.. కవిత్వంలో ఎక్కడా మార్మికత కనపడదు గొలుసుకట్టు అక్షర పదబంధాలతో సరళతను పొందుపర్చుకుంటు కవితను జిగిబిగిగా అల్లుకునే విధానం పాఠకుణ్ణి చదివించే ఆసక్తిని కలిగించ గలగటం నూకతోటి రవికుమార్ గారి కవిత్వంలో దాగున్న వెసులుబాటు అందుకే తనకంటూ కొంతమంది పాఠకుల్ని సంపాదించ పెట్టగలిగింది

నూకతోటి రవికుమార్ కేవలంగా కవిమాత్రమే కాదు కవిత్వాన్ని సామూహికం చేసి కవిత్వం కోసమే ఒక సృజనవేదికను నిలబెట్టిన వ్యక్తి"బహుజనరచయితలవేదిక" రాష్ట్ర కార్యదర్శిగా ఒకే భావజాలంకలిగిన వ్యక్తుల్ని దారంలో పువ్వుల్లా గుదిగుచ్చి బహుజన సాహిత్య సృష్టి కవుల్ని.. ఆ కవుల సాహిత్యాన్ని రాష్ట్రం నలుమూలలా ఊరేగించినమనిషి ఇది చర్చకు వొచ్చినప్పుడు కచ్చితంగా చర్చనీయాంశమే అవుతుంది ప్రముఖ రచయిత్రి ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి గారన్నట్టు రవికుమార్ గారు ప్రతి సమస్య సందర్భమ్మీదబాధ్యతగా రాయడం తప్ప రాసిన వాటిని ఓచోట చేర్చాలని గాని వాటిని పుస్తకంగా ఓరూపంలో చూసుకోవాలనిగాని వాటి ద్వారా ఇంకేదో పొందుకోవాలని గాని ఆశించని బొత్తిగా ధ్యాసలేని సత్తెకాలపు మనిషే..బయటా లోపటా కంచెలు విస్తరిస్తున్న వేళ ఆకంచెతీగెలమీద తడబడుతూనిల్చునైనా సరే తన స్వరాన్ని వినిపిస్తున్న కవిపక్షి పాటను వినాలంటే ముందు మనం మనుషులం కావాలి దేహానికింత మట్టిపూసుకోవాలి మానవత్వపు 'వెతుకులాటలో పచ్చనికల'కనాలి'రోడ్డుపక్క టీబంకు' దగ్గరముచ్చట్లతో అలా ఒకదేశం కోసం' ఆలోచన చేయాలి రోహింగ్యా దుకంలోకెళ్లి' మృత్యుశీతల స్పర్శ'ను తాకి ఒంటిని జలదరింపు చేసుకోవాలి ఇలా ఈ పుస్తకం లోని 'మట్టికలలతల్లుల' కన్నీళ్ల' సముద్రం తోసంభాషణ' చేయాలి ఈ పేజీ లునిండిన కవితలన్నీ 'గాయాలకొలిమే'ఎదురుపడుతుంది ఒక చేతన మనకు నడవడం నేర్పిస్తుంది ఆనడక ఈ నేల సరిహద్దులు దాటుకుని బొలీవియవిప్లవం చరిత్రను కన్నీటి చారికలతో వెదుకుతుంది'చావెజ్'కవితలో చావెజ్ మరణంతో వెనుజులాని టెర్రరిస్ట్ కేంద్రంగా మోహరిస్తున్న బాధను'చేగువేరా, ఫిడేల్ క్యాస్ట్రో, సద్దాంలు, గడాఫీలు/లేక/భూమిప్పుడు/సంకెళ్లమధ్యపిచ్చి కలల ఊహల్లో/నిర్నిద్ర దుకంలోనే/వలస గుంజాటన పడుతున్నదంటూ చావెజ్ మరణానంతర వెనుజులాని సామ్రాజ్యవాద చీకటి నోరేదో మింగుతుందని గుర్తు చేస్తాడు ఈ కవితలో స్మరించిన చేక్యాస్ట్రో, సద్దాం,గడాఫీ లాంటి నేతలు అమెరికా పెద్దన్న పాత్రను పాతిపెట్టేంత పనిజేశారు..' కంచెమీదపక్షిపాట'కవితలోని పాదాలు తడిమితే కలేకూరి సదా సద్దాంగుర్తుకొస్తాడు 'బోనుల్ని ధ్వంసంచేసి/బోనురెక్కల మీద/చిరునవ్వులసంతకాలు చేసే పక్షులుంటాయన్నప్పుడు కోర్టు బోనులో కూర్చుని మరణ దండన తీర్పును ఒక అధిక్షేపిత నవ్వుతో ఆస్వాదించిన సద్దాం..సద్దాం నవ్వుని ఉరితీసిన అమెరికాపిరికి గూఢచర్యం ఇప్పటికి కదలాడుతుంది..ఒకరి చేయిపట్టి నడిపించడము రాస్తూ రాయించడము తెలిసిన కవి రవికుమార్ రాయటమే ఒక వ్యసనంగా మార్చుకున్నాడు కాబట్టే'నడకనేర్చుకుందాం'అనే కవితలో దుక్కినిదున్నినట్టు / బీళ్లను చుట్టుముట్టినట్టు / చెట్లు చెలకలుకొట్టిఎగుడుదిగుడునేలను చదునుచేసినట్టు / రాయడం చేతనవ్వాలంటూనే ఏదో రాయటం కాదు ఆరాత జివజివలాడే ఆకటిపొద్దుల్లా పొడిసేటి సూర్యుళ్ళాఉండాలని కోరుకునే కవి.ఈ కవి నిరంతరం మనిషి ఆలోచనల చుట్టూ తిరుగుతాడు మనుషుల్ని కలవడం కోసం చేతుల్ని కలపడం కోసం తిరుగుతాడు అందుకోసం ఒక 'స్పేస్' నిజాగాను తనలో ఎప్పుడూ మిగుల్చుకుంటాడు అందుకనే స్పేస్ ని మిగుల్చుకుందాం/ఒకరినొకరం గుర్తుపెట్టుకోడానికి / ఒకరినొకరం ఎప్పుడైనా కలుసుకోడానికి అది స్నేహితులు గా కావొచ్చు కవుల సమూహంగా కావొచ్చు కుటుంబ సభ్యులుగా

ఎవరైనా కావొచ్చు ఈ ఉరుకులు పరుగుల కాలాన్ని కొంచెంసేపుఆపి కలుసుకోవడం కోసమే ఒక ఆర్తగీతమవుతాడు బహుజనోద్యమానికి బహుజన సాహిత్యానికి పిసరంత సాయం అందించినాసరే ఆవ్యక్తులపట్ల ప్రగాఢమైన ప్రేమను వ్యక్తపరిచే గుణం ఈ కవిది అందుకోసమే ఈ పుస్తకంలో త్రిశ్రీని, కలేకురిని, చెన్నయ్యను,కాసకుర్తి రామలింగంను స్ఫూర్తి గానం చేస్తున్నారు.. అంతకుమించి తాను అభిమానించి తనతో సాహిత్య ప్రయానంచేసిన రాజేశ్వరరావు మాష్టారి గురించిఅక్షరక్షరంలోనూ భారమైన హృదయంతో ద్రవించిపోతాడు తనలోకంలో ఇంద్రధనస్సుని చేసిమురిసిపోతాడు" ఎక్కడెదురవుతారుసారూఅనేప్రశ్న వేసుకుని జవాబురాబట్టుకునే ప్రయత్నం లోమాష్టారిచుట్టూజ్ఞాపకాల అపురూపాన్ని ఈతచాపలా అల్లడం చూస్తే ముచ్చటేస్తుంది"దువ్వెనని అపురూపంగా/ కాగితంలో చుట్టుకునేవాడు ఇది కవి సునిశితదృష్టి ఒకసాధారణ విషయాన్ని అసాధారణం చేసిచెప్పే ఎత్తుగడతో కవిత మొదలు పెట్టడం ఒక హాయినిస్తుంది అంతలోనే ఒంగోలంతా / ఎటుతిరిగిన / ఆయనసమాధిచుట్టూ తిరుగుతూనేవున్నాను అనే దుక్ఖభార వాస్తవాన్ని వర్తమానంలో పలికించటం ఆ వ్యక్తిపట్ల ఉన్న విశ్వసనీయతను కవితరెట్టింపుచేస్తుంది.. గోపురం మీద వాలిన పక్షులన్నింటిని తనవాళ్లుగాభావించినట్టే ఆవాసనలు విడిచిపెట్టి వెళ్లనీయవుగుడిచుట్టూ కలేకూరోడంటూ చట్టికూర రుచిలాంటి కవిత్వాన్ని వడ్డిస్తూ..ఎదురుగా'ముంజలాంటి' మనుషుల్ని నిలబెట్టి మనసు దండేలకు రంగుకాగితాలెగరేసి" భీమసక్కనిరేడా" అనే కొత్త అభివ్యక్తితో అమరుడు కాసకుర్తి రామలింగంను అక్షరాలింగనం చేసుకున్నా త్రిశ్రీని కవిత్వ జెండాగా రెప రెపలాడించినా చెన్నన్నాంటూ కవిత్వ పరామర్శ చేసినా ఆ వ్యక్తులు జాతి శక్తిగా ఎదిగిన క్రమాన్ని ఈ తరానికి అందించాలనే కవి తాపత్రయం ఆ తపనతోనే 'ఒకదేశంకావాలని' తీర్మానిస్తాడు కంచెల్లేని దేశంకావాలి/జనాన్ని విడగొట్టని దేశం/అభివృద్ధి పేరుతో/పేదల్ని గ్రామాల్లోంచి గెంటెయ్యని దేశం అంతే కాదు శాంతి పేరుతో యుద్ధం చేయనిదేశం ఇంకా చెప్పాలంటే దళితులూ, మైనార్టీల గుండెల్లో కత్తులుగుచ్చనిదేశం కావాలని చెప్పటం కవి ఎవరి పక్షమో ఎవరి విపక్షమో పాఠకుడికి అర్థమవుతుంది అవును ఈ దేశంలో కాషాయపాలనొచ్చాక జర్నలిస్టులు..హేతువాదులు..చంపబడ్డారు సంస్కృతి.. ఆహారం పేరిట దళితులు..మైనార్టీలు చంపబడ్డారు..కోర్టులు రక్షణ కల్పించలేవు.. చట్టాలు అక్కరకు రావనేవిషయాన్ని కనిపెట్టాడు కవి ఇక్కడ వినవస్తున్న శాంతిగీతంలో ఉన్మాదిని చూపిస్తూ ఒక తోడేళ్ల గుంపుకాషాయం వేసుకుని/ సన్యాసంపేరుచెప్పి సింహాసనం మీద/కాళ్ళుపుకుంటో రాజ్యాంగాన్ని పరిహసిస్తుందని గుజరాత్ నేలలో ప్రవహించిన నెత్తురు ఎవరిదో..

ఎవరు కారకులో చెబుతూ వాళ్ల కరెన్సీ డిజిటల్ పాలనలోనే వెట్టి వారసత్వమవుతుందని పర్లేదు/మనంకూడా మూతికి/ఓముంతా/ముడ్డికి ఓతాటాకు సంపాదించు కోగలుగుతాం అని జోస్యం చెబుతా'డొంకదారి'లో పాముల్ని..

పురుగుల్ని పసిగడతాడు"మీటూ"లలోగుట్టు విప్పుతూ గర్భం లోనే సంపేసిన/ఎన్ని శిశు ప్రాణాలకు మీటూ చెప్పాల్నో/కడవల కొద్దీ దుకం / సముద్రఘోషతో సమానమైనశోకాన్ని వినిపిస్తూ..ఆధునిక గిరీశాలా పిలక గుంజుతాడు కవి 'మీ'లో మనం లేకుండా'టూ'లోతనం లేకుండా అంతరాల మధ్య మాట్లాడుతున్న ఉద్యమం ఖైర్లాంజి గుండెల్లో ఎందుకు చేరలేదని మీటూలోని వంచనను నిలదీసే ప్రశ్న ఈ సమాజాన్ని నిలేస్తుంది

నిజంగానే ఇప్పుడు ఈ దేశం నేలమీద జైళ్లు విస్తరిస్తున్నాయి మేధావుల్ని కళాకారుల్ని ఉద్యమకారుల్ని అంబేద్కర్ పూలే భావజాలప్రచారకుల్ని ఇంటినే జైలు గోడలుగా మార్చినిర్బంధిస్తున్న పాలకుల విధానాన్ని చూస్తున్నాం "విస్తరిస్తున్నజైలు"నుప్రశ్నించే గొంతులకోసం సిద్ధం చేస్తూ దాన్నే శ్రేష్ట భారతంగా / మీ ప్రసారమాధ్యమాలు/జబ్బచరుచుకుని ప్రసారం చేస్తాయి అని వాపోతూ గరగపర్రులాంటి ఉద్యమాల్ని ఆ ద్రోహాల్ని ఈ సవర్ణమీడియా ఎన్నటికీ చూపదు అనే విషయాన్ని "యుద్ధం చేసేవిగ్రహం" అనే కవితలోఆగ్రహిస్తాడు.. మౌనాన్ని బద్దలుకొట్టే గ్రహాలుంటాయి/ఫ్యూడల్ పెత్తనం అంతుచూసే చూపుడు వేళ్ళుంటాయి అనే ధైర్యాన్ని బాధిత గ్రామాలకు చేరవేస్తూ న్యాయం కోసం విగ్రహం యుద్ధం చేస్తూనే ఉంటుందని అంబేడ్కర్ విగ్రహంలోని చైతన్య స్ఫూర్తితో అన్ని వంచనలకంచెల్ని తెంచి పక్షి పాటయి పాడుతున్నకవి రోహిత్ నిసర్వనామం చేసి నిష్టూరంగా మాట్లాడుతూ చిట్టితమ్ముళ్ళు.. చెల్లాయిలు/మేము బతికే ఉన్నాం/మీ కోసం బిగించని పిడికిళ్లతో/గొంతెత్తి నినదించలేని తలల్తో/మేము నడుస్తూనే ఉన్నాం / మీ శోకం/సమస్తభారతాన్నిఆక్రమించి/ నీలిపతాకలు/రెపరెపలాడేటి రోజొకటుంటుంది తప్పకుండా ఉంటుంది అని దమ్మున్న అక్షరాల్తో చెప్పగల సత్తా ఒక అంబేడ్కరీయ కవికి మాత్రమే ఉంటుంది ఆ ఆశావహదృక్పథమే బహుజనోద్యమాన్ని బతికిస్తుంది అందుకనే పెనం మీంచి పొయ్యిలో పడటం తప్ప తెలియని పల్లె బతుకుని నిప్పుల జడివానయి ఉప్పరిల్లడం నేర్పాలనుకుంటున్నాడు మనువు చెలరేగే నేలమీద ఫూలాన్ దేవిని పల్లెపడుచులగుండెల్లో సరికొత్తవ్యూహమై నిలబడే ఆయుధంగా చెక్కుతున్నాడు పల్లెల్లోని మట్టికాళ్ళ అమ్మల కోసం తంగేడుపూల పరిమళాల్ని సిద్ధం చేసాడు ఈ పుస్తకం నిండా అవమానాలపై పోరు ఉంటుంది ఆత్మగౌరవాల జెండా ఉంటుంది బహుజన రాజకీయాల ఎజెండా ఉంటుంది మహాకవి జాషువా చెప్పుకున్నట్టే కులమతాలకింద బందీ కావడం అసహ్యం నాకు అని బహుజనీకరణ చెందిన కవి నూకతోటి రవికుమార్ ..అందుకే ఆధిపత్యం ఎదుట దీనంగా చేతులుకట్టుకునిలబడటాన్ని అసహ్యించుకుంటాడు.. సాహిత్యంలో నిజమైన ప్రజాస్వామ్యం కోరుకుంటాడు,గుడిసెల్ని,కాలనీలను ప్రేమించే ఈ కవికి కొడిగట్టనికూలితల్లికల, పొడిబారని అంబేడ్కర్ వ్యూహం ఇష్టం ఆ ఇష్టం తోనే"కంచెమీదపక్షిపాట"యి బహుజన సైరన్ మోగిస్తున్నాడు ఒక సదాశయం కోసం నిత్యం సాహిత్యపెనుగులాటతో పయనిస్తున్న ఈ కవి అభినందనీయుడు...అంబేడ్కరీయుడు..

❖ ❖ ❖ ❖ ❖ ❖ ❖

జగన్.. మొండీ... జగమొండీ

-కె.శ్రీనివస్



పదుగురాడు మాట పాడియై ధరజెల్లు...అన్నారు పెద్దలు. జగన్ చేసింది ఇదే. మద్యపాన నిషేధాన్ని అంచెలంచెలుగా అమలు చేయాలనుకున్నాడు. ఆయన అందుకు చేసిన తొలిపని మద్యం దుకాణాలను సిండికేట్ల నుంచి తప్పించి, ప్రభుత్వం చేతుల్లోకి తీసుకున్నారు. ఆ తరువాత మద్యం రేట్లు సామాన్యుడికి అందకుండా చేస్తే, తాగడం తగ్గిస్తారని భావించి, విపరీతంగా పెంచారు. అదే సమయంలో ప్రభుత్వ ఆదాయాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని కొన్ని కొత్త బ్రాండ్లు తెచ్చారు.

ఇక్కడ జగన్ తాగుబోతులను, అంటే మరోలా భావించనక్కరలేదు. మద్యం తాగేవారిని వాడుకభాషలో అలాగే అనడం తెలుగునాట ఎప్పటి నుంచో వున్న పదప్రయోగం. సో, ఇలా ఎడా పెడా తాగేవాళ్లను జగన్ తక్కువ అంచనా వేసారు. పెళ్లా పుస్తెలు లాక్కుని, ఇంట్లో వున్న వస్తువులను తాకట్టు పెట్టి, అందిన కాడికి అప్పు సొప్పు చేసి మరీ తాగేస్తారు చాలా మంది. రోజువారీ సంపాదనలో సగం తాగడానికే ఖర్చు చేస్తారు దినసరి కార్మికులు చాలామంది.

మరి తాగడంలో ఇలా అస్సలు విచక్షణ చూపించని బాపతు జనాలు జగన్ ఐడియాను లేదా ముందు చూపును, లేదా ఆలోచను ఎలా పాజిటివ్‌గా స్వీకరిస్తారు. వారి దృష్టిలో జగన్ మందు రేట్లు పెంచేసి దోచేసుకుంటున్నాడు. అంతే, పైగా ఇక్కడ రాజకీయం తప్ప మరోటి వుండదు. మద్యం రేట్లు పెంచి మందు బాబుల పొట్ట కొడుతున్నాడు అని కూడా రాజకీయం చేయడం అంటే ఏమనుకోవాలి. తాగేవాడికి అంటే జగన్ ఆలోచన నచ్చకపోవచ్చు. కానీ మద్యనిషేధాన్ని దృష్టిలో వుంచుకుని జగన్ చేసిన ఆలోచనను రాజకీయ నాయకులు కూడా మెచ్చకపోవడం అంటే రాజకీయం కాక మరేమిటి?

ఇలా బ్రాండ్లు, రేట్లు, ప్రభుత్వ దుకాణాలతో జగన్ అసలు ఎందుకు మాట పడాలి? కేవలం మద్యనిషేధాన్ని సాధించాలి అనే కదా? దాని కోసం ఇన్ని తంతాలు ఎందుకు? ఒక్క జివో తో మద్యనిషేధం ఇప్పుడే అమలు చేయవచ్చు కదా? నాలుగేళ్ల తరువాత అయినా జగన్ ఆశయం అదే కదా? అదేదో ఇప్పుడే చేస్తే, ఇన్ని విమర్శలు తప్పుతాయి కదా? పైగా ఇది కూడా తప్పే అంటూ ఎవరో ఒకరు కోర్టుకు వెళ్తారు. కోర్టు దీన్ని కూడా ఆపేసింది అనుకోండి...గొడవే లేదు.

ప్రజలకు మంచి చేయడం కోసం ప్రజల ఓట్లను దూరం చేసుకోవడం అన్నది ప్రజాస్వామ్యంలో విజ్ఞత అనిపించుకోదు. రాచరికంలో అయితే నడుస్తుంది. కానీ మళ్లీ జనం ఓట్లు సాధించి అధికారం అందుకోవాలి అనుకున్నపుడు తదనుగుణంగానే వెళ్లాలి. ఇప్పటికిప్పుడు జగన్ మద్యపాన నిషేధం విధించడం అన్నది సాధ్యమయ్యే పని కాదు. ఇటు అటు పక్క రాష్ట్రాల్లో మద్యం ఏరులై పారుతుండగా , ఇక్కడ నిషేధించడం అన్నది అలవి కాని పని.

ఎంత టాస్క్‌ఫోర్స్‌లు పెట్టినా, ఎన్ని నిఘాలు పెట్టినా మద్యం అక్రమరవాణా అన్నది ఏదో మూల జరుగుతూనే వుంటుంది. ఇక అక్రమ సారా లేదా చీప్ లిక్కర్ తయారీ అన్నది గ్రామాల పొలిమేర్లలోని తోటల్లో, పొలాల్లో కుటీర పరిశ్రమగా మారిపోతుంది. ఇప్పటికే కొంత వరకు మారిపోతోంది కూడా. అధికారం వ్యవస్థ మొత్తం అత్యంత నియమ నిష్ఠలతో వుంటుందనీ అనుకోవడానికి లేదు.

అలాంటపుడు జగన్ చేస్తున్న ఈ ప్రయత్నం వృధాగా పోవడమే కాదు, ఆయన ఓటు బ్యాంకుకు కన్నం పెట్టే ప్రమాదం వుంది. అందువల్ల జగన్ ఏదో ఒకటే ఎంచుకోవాలి. మద్యం వుంచాలా వద్దా, వుంచాలి అనుకుంటే జనం ఆలోచనలకు అనుగుణంగా పోవాల్సిందే. వాళ్లకు కావాల్సిన బ్రాండ్‌లు ఇచ్చేయండి. రేట్లు వీలయినంత సరసంగా వుంచండి. ఎప్పుడయితే రేట్లు అందుబాటులోకి వచ్చాయో, అక్రమ మద్యం తయారీ ఆగిపోతుంది. ప్రభుత్వ ఆదాయం ఆ మేరకు సరిపోతుంది. జనం తమ ఆవేదనను జగన్ గుర్తించాడని హ్యాపీ ఫీలవుతారు.

వెనక్క తగ్గిన జగన్ అని ప్రతిపక్షం అనుకుంటే అనుకోనీండి. రివర్స్ టెండరింగ్ అన్నది మీ ఆలోచనే కదా. ఇది కూడా అలాంటిదే. సరియైనది కాదు కనుక రివర్స్ చేసుకున్నారు అని చెప్పుకొవచ్చు. జగన్‌కు కావాల్సింది జనం గుండెల్లో సుస్థిర స్థానం. అంతే కానీ బిల్డింగ్‌ల మీద పార్టీల రంగులు కాదు. నిన్న జరిగినవి కన్వీనియెంట్ గా మరిచిపోవడం మానవనైజం. పసుపు సంద్రంగా మారిన విజయవాడ లేదా విశాఖ అనే శీర్షికలు మరిచిపోయారు. ఊరులోని స్తంభాలు, భిల్డింగ్‌లు అన్నింటికీ పసుపు తోరణాలు కట్టిన వైనం వదిలేసారు. అన్న క్యాంటీన్లకు పసుపు రంగు పూసింది అసలు గుర్తే లేదు. కేవలం యాగీచేయడం, కోర్టుకు వెళ్లడం. మొట్టికాయలు అంటూ మురిసిపోవడం.

ప్రతి దానికీ కోర్టుకు వెళ్లడం అన్నది తెలుగుదేశం హ్యాబీగా మారిపోయింది. ఇక ఇప్పుడు జగన్ ముందు వున్నది రెండే ఆప్షన్లు.

ఒకటి ఏ నిర్ణయమూ తీసుకోకుండా జనాలకు సంక్షేమ పథకాలు అందించుకుంటూ వెళ్లిపోవడం. ఎన్నికల ముందు ఎందుకు ఇలా చేయాల్సి వచ్చిందో వివరించడం.

లేదూ అంటే అవకాశం వుంటే, రాజ్యాంగ పరంగా ప్రావిజన్ వుంటే, న్యాయవ్యవస్థ అలా చేయడానికి అనుమతి, అలా చేయడానికి ఆ వ్యవస్థలో అవకాశం వుంటే, విశాఖలో ఇలా ఇక్కడ గెస్ట్ హవుస్ కట్టాలనుకుంటున్నా, కట్టమంటారా? వద్దా? పేదవారికి సైతం ఇంగ్లీష్ విద్య నేర్పిద్దాం అనుకుంటున్నా? ఏమైనా అవకాశం వుందా? ఎలా చేయమంటారు? రాజధాని లాంటి కీలక ప్రదేశంలో సామాన్యులకు సైతం ఇళ్ల స్థలాలు బాగుండి ప్రజలు ఆదరిస్తే, అప్పుడు చూసుకోవడం.

మూడు రాజధానుల విషయంలో కూడా జగన్ ఇలాంటి ముందు చూపు లేకనే ఇబ్బంది పడుతున్నారు. అసలు కార్యాలయాలు ఎందుకు తరలించే ఆలోచన చేయాలి. ముఖ్యమంత్రిగా ఆయనకు రాష్ట్రంలో ఎక్కడయినా కూర్చుని పాలించే హక్కు వుంది. హుద్ హుద్ వచ్చినపుడు బాబుగారు విశాఖలో కూర్చుంటే ఎవరు వద్దన్నారు. కేసిఆర్ సచివాలయానికి రాకపోతే ఎవరు అడిగారు. జగన్ ఇప్పుడు నెలకు పది హేను రోజులు విశాఖలో కూర్చుంటే ఎవరు అడుగుతారు. దానిపై కూడా కోర్టుకు వెళ్తారా? జగన్ విశాఖలో కూర్చుంటే అధికారులు అంతా అక్కడికే వస్తారు. పది హేను రోజులు సిఎమ్ క్యాంప్. కాదనేది ఎవరు?

నిజానికి ఇలాంటి డొంక తిరుగుడు వ్యవహారాలు జగన్‌కు చేతకావు. మొండిగా, ముక్కుసూటిగా అనుకున్నది చేసేయడం తప్ప. కానీ ముందే చెప్పుకున్నట్లు ప్రజాస్వామ్యం మందిస్వామ్యంగా మారుతున్నపుడు, ప్రతిపక్షం తమ వ్యూహాలను అమలు చేస్తున్నపుడు భగవద్గీత వల్లిస్తే సరిపోదు బాణం కూడా పట్టాల్సిందే. పాండవుల చెంత కృష్ణుడు వుండి కూడా కర్ణుడిని, భీష్ముడిని, ధుర్యోధనుడిని, ద్రోణుడిని చిట్కా ఉపాయాలతోనే చంపాల్సి వచ్చింది. ఎందుకయ్యా అంటే వాళ్లంతా దుర్మార్గులు అయినా కాకపోయినా, దుర్మార్గులతో కలిసారు కాబట్టి అలా చేయాల్సి వచ్చింది అంటూ సర్దేశారు. జంతువును చెట్టుచాటు నుంచి చంపడం అధర్మం కాదు అని రాముడు సైతం వాలి వధను సమర్థించుకున్నారు.

అందువల్ల రాజనీతి ప్రకారం జగన్ తన ఉపాయాలు మార్చుకోవాలి. అవసరం అయితే రివర్స్ టెండరింగ్ అన్నట్లుగా నిర్ణయాలు మార్చుకోవాలి. వ్యూహానికి ప్రతి వ్యూహం పన్నుకుంటూ పోవాలి తప్ప, ప్రతీదీ ముక్కుసూటిగా పోతాను అని చెప్పి, ముక్కుకు గాయం చేసుకోవడం విజ్ఞత అనిపించుకోదు.

కరోనా నేపథ్యంలో బతుకమ్మ పాట

టి.తులసి

నగలేమో బ్యాంకుల్లో వుయ్యాలో
చీరల్లు అల్మార్లో వుయ్యాలో
ఏడికెళ్ళలేము వుయ్యాలో
ఇంట్లోనే పరిమితం వుయ్యాలో
సెల్లు ఫోన్లతోటి వుయ్యాలో
కరోనా వార్తలు వుయ్యాలో
పొద్దున లేస్తే వుయ్యాలో
చావు కబురు వినుడే వుయ్యాలో
మాఇంటికి రాకమ్మ వుయ్యాలో
మీ ఇంటికి రానమ్మ వుయ్యాలో
ఎవరింట్లో వాళ్లుంటే వుయ్యాలో
బతుకు సాగును తల్లి వుయ్యాలో
పెళ్లిళ్లు లేవాయే వుయ్యాలో
పార్టీలు లేవాయే వుయ్యాలో
పార్కులు లేవాయే వుయ్యాలో
హోటళ్ళు లేవాయే వుయ్యాలో
కొత్త చీర కట్టి వుయ్యాలో
కొత్త రైక తొడిగి వుయ్యాలో
ఎన్నాళ్ళు అయిందో వుయ్యాలో
నగలు వేసుకోక వుయ్యాలో
తుప్పుపట్టిపోయే వుయ్యాలో
చీరలన్నీ సదిరి వుయ్యాలో
ఎన్నాళ్ళు అయిందో వుయ్యాలో
పొరగాళ్లు బడికిపొక వుయ్యాలో
ఎన్నాళ్ళు అయిందో వుయ్యాలో
లొల్లి పాడుగాను వుయ్యాలో
చచ్చిపోతున్నాము వుయ్యాలో
ఎవరి ఇంటికెళ్ళక వుయ్యాలో
ఎన్నాళ్ళు అయిందో వుయ్యాలో
బతుకమ్మ వస్తుంది వుయ్యాలో
మా బతుకిట్ల ఏడిసింది వుయ్యాలో
బట్టల కొట్టులన్ని వుయ్యాలో
వెలవెల బోయ్యాయి వుయ్యాలో
ఆపర్లు పెట్టినా వుయ్యాలో
ఎవరు కొంటాలేరు వుయ్యాలో
కరోనా కగ్గిదల్గా వుయ్యాలో
మా కొంప ముంచింది వుయ్యాలో
ఇంకెన్ని రోజులో వుయ్యాలో
దీని తలపండు పలగాలి
వుయ్యాలో
వచ్చేడు బతికితే వుయ్యాలో
తీరైన పూలతో వుయ్యాలో
నిన్ను భక్తితో కొలిచేము వుయ్యాలో
మా మీద దయఉంచు వుయ్యాలో
మమ్ము ఏలు బతుకమ్మ
వుయ్యాలో..

మీరేమనుకున్నా సరే!

డా.గూటం స్వామి, (9441092870)

మీరేమనుకున్నా సరే
నేను రేపటి గురించి మాట్లాడను!
మరుక్షణం ఉంటామో లేమో
తెలియనప్పుడు
రేపటి గురించిన
మాటలవసరమా?

నా కళ్ళముందు నీటిబుడగ
భళ్ళున పగలడం చూశాక కూడా
రేపటిగురించి మాట్లాడ్డంలో
అర్థం లేదు!

కళ్ళముందు ఆత్మీయులు
పోతున్నారు!
కళ్ళముందు కావలసినవారు
ఇంటెన్సివ్ లో
కొట్టిమిట్టాడుతున్నారు!
కళ్ళముందు నా అనుకున్నవాళ్ళు
కనుమరుగౌతున్నారు!
ఉదయం చూసినవాళ్ళు
సాయంత్రానికి
ఐపులేకుండా పోతున్నారు!
ఇన్ని చూశాకకూడా రేపటి
గురించి
మాట్లాడ మంటే ఎట్లా?

ఇప్పటివరకు రొమ్ము
విరుచుకుతిరిగిన మనిషి
బూచాడిలా తిరుగుతున్నాడు!
అందరూ చందమామ కథల్లో
పాత్రలైపోయారు!

రేపు ఉంటుంది అన్నది నిజం!
రేపు నేనుంటాననుకోవడం
అబద్ధం!
మీరేమనుకున్నా సరే
రేపటిగురించి నేను మాట్లాడను!!

(ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో)

వేల కోట్ల అధిపతి నేడు బికారి..

- కె. గౌతం

రేమండ్ కంపెనీ వ్యవస్థాపకుడు విజయపథ్ సింఘానియా రేమండ్స్ చరిత్ర ప్రతి తల్లి తండ్రులకు ఒక గుణపాఠం కావాలి...

మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే' అని కార్ల్ మార్క్స్ ఏనాడో చెప్పాడు. అది నిజమేనని నేటి సమాజం నిరూపిస్తోంది పిల్లలను గుడ్డిగా ప్రేమించే తల్లిదండ్రులకు ఈయన జీవితం ఓ గుణపాఠం. మానవ సంబంధాల్లో ఆర్థికపరమైన అంశాలకే మనుషులు ప్రాధాన్యం ఇస్తున్నారు. మనీ మాయలో తోటివారినే కాదు కుటుంబసభ్యులను కూడా మర్చిపోతున్నారు.

మనిషిలో పెరుగుతున్న స్వార్థం, డబ్బుమీద పెరుగుతున్న మోజు కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయి. తల్లిదండ్రులు, అక్కాచెల్లెళ్లు, కొడుకులు, కూతుళ్లు డబ్బుకిస్తున్న ప్రాధాన్యత ప్రేమానురాగాలకు ఇవ్వకపోవడం వారి మధ్య అగాధాన్ని పెంచుతోంది. అసలు డబ్బు పిచ్చి ఏ రేంజ్‌లో ఉందంటే.. కన్నవారినే రోడ్డున పడేసే దుస్థితి వచ్చింది. ఇలాంటి ఘటనే ఇప్పుడు దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. వస్త్ర పరిశ్రమలో ఒకప్పుడు రారాజుగా వెలిగిన రేమాండ్స్ వ్యవస్థాపకుడు విజయ్‌పథ్ సింఘానియా ఇప్పుడు వీధినపడ్డారు. కొడుకు బయటకు గెంటేయడంతో బిచ్చగాడిలా మారారు.

రేమాండ్ వస్త్ర సామ్రాజ్యాన్ని స్థాపించి రెండు దశాబ్దాలకు పైగా దుస్తుల రంగంలో ఆ బ్రాండ్‌ను తిరుగులేకుండా నిలిపిన పారిశ్రామిక దిగ్గజం విజయ్‌పథ్ సింఘానియా(80). వేల కోట్ల ఆస్తులు సంపాదించిన ఈయన.. ఇప్పుడు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు.

తినడానికి తిండి లేక, ఉండటానికి ఇల్లు లేక రోడ్డున పడ్డారు. కోట్ల రూపాయల వ్యాపారంతో తులతూగిన విజయ్‌పథ్ సింఘానియాకు ఈ కష్టాన్ని తెచ్చిపెట్టింది మరెవరో కాదు ఆయన పుత్రరత్నమే.

వ్యాపారాన్నంతా కైవసం చేసుకుని తండ్రిని వీధిన పడేశాడు కొడుకు. తండ్రి కనీస అవసరాలను తీర్చేందుకు కూడా డబ్బు ఇవ్వకుండా నానా ఇబ్బందులు పెడుతున్నారట. వెయ్యి కోట్ల రేమండ్ సంస్థను, 36 అంతస్థుల భవనాన్ని విజయ్‌పథ్ సింఘానియా తన కొడుకుకు ఇచ్చారు. ఆస్తి మొత్తం రాయించుకున్న తర్వాత.. తండ్రిని ఇంట్లో నుంచి గెంటేశాడు.

చేతిలో చిల్లిగవ్వ లేక అద్దె ఇంట్లో విజయ్ సింఘానియా నానా అవస్థలు పడుతున్నారు. విధిలేని పక్షంలో కోర్టును ఆశ్రయించారు. 80ఏళ్ల వయసులో ఆయన పడుతున్న ఈ కష్టాన్ని చూసి ఇరుగుపొరుగు వారు ఆవేదన చెందుతున్నారు. తనకు రావాల్సిన ఆస్తి, డబ్బును ఇప్పించాలని రేమండ్ దిగ్గజం విజయ్‌పథ్ సింఘానియా కోర్టును వేడుకుంటునానారు.

ఎనిమిది పదుల వయసులో హాయిగా పిల్లలు, మనవళ్లు, మనువరాళ్ళతో ఆడుకోవాలి. ఆనందంగా జీవించాలి. అలాంటిది. విజయ్ సింఘానియా.. కుమారుడు గౌతమ్ సింఘానియాతో ఆస్తి



కోసం పోరాడాల్సి రావడం బాధాకరం. రూ. 1041 కోట్లను కొడుక్కు రాసిచ్చిన సింఘానియా.. ఇప్పుడు వృద్ధాప్యంలో తనను ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

వేల కోట్ల ఆస్తిని తీసుకున్న కొడుకు గౌతమ్.. ఇప్పుడు వృద్ధుడైన తండ్రికి కనీసం కారు, డ్రైవర్ లేకుండా చేసేశారని న్యాయస్థానానికి విన్నవించారు విజయ్ సంఘానియా తరపు న్యాయవాది.

తనకున్న విలువైన షేర్లు, ఇతర ఆస్తులన్నింటిని కొడుకు గౌతంకు ఇచ్చినా.. ఎందుకు పట్టించుకోవడం లేదనే చర్చ సాగుతోంది.

రేమాండ్ కంపెనీ పేరుతో 36 అంతస్థుల భవంతి ముంబైలో ఉంది. కానీ విజయ్‌పథ్ అద్దె ఇంటిలో ఉంటున్నారు.

విజయ్‌పథ్ సింఘానియాకు నెలకు రూ.7లక్షల చొప్పున కంపెనీ నుంచి రావాల్సి ఉందని ఆయన న్యాయవాదులు చెప్పారు. అంతేకాదు, కంపెనీ ఖర్చులతో ఆయనకు ప్రత్యామ్నాయ నివాస వసతి కల్పించాల్సి ఉందన్నారు. దీనిపై సమాధానాన్ని దాఖలు చేయాల్సిందిగా రేమాండ్స్ సంస్థను కోర్టు కోరింది. 22న దీనిపై తదుపరి విచారణ జరుగుతుంది.

కొడుకుల కోసం సంపాదించి పెట్టిన రేమాండ్ అధిపతి.. చివరకు అదే డబ్బు కోసం కోర్టులకు వెళ్లడం ఆశ్చర్యమే.

ఎంత కొడుకులు, కూతుళ్ల మీద ప్రేమ ఉన్నా.. ప్రాణం విడిచే వరకు కొంత మొత్తం ఉంచుకోవాలనేది రేమాండ్ అధిపతి జీవితాన్ని చూస్తే అర్థమవుతోంది.

ప్రభావశీలురు

- నేదునూరి హేమంత్ కుమార్

ప్రతిష్ఠాత్మకమైన టైమ్ మ్యాగజైన్ 2020 సంవత్సరానికి విడుదల చేసిన ప్రపంచంలో అత్యంత ప్రభావశీలురైన 100మంది వ్యక్తుల్లో ఐదుగురు భారతీయులు చోటు దక్కించుకున్నారు.సగం భారతీయ మూలాలు ఉన్న కమలా హ్యారిస్ ను కూడా కలుపుకుంటే, ఆరుగురు అవుతారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ,82ఏళ్ళ మహిళ బిల్కిస్, గూగుల్ సీఈఓ సుందర్ పిచ్చయ్య, బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా, హెచ్ఐవి వ్యాధి గ్రస్థుల సేవలో ఉన్న ప్రొఫెసర్ రవీంద్ర గుప్తా ఎంపికయ్యారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ కూడా ఉన్నారు.ఈ లిస్ట్ లో, అమెరికాలో నవంబర్ లో జరగబోయే ఎన్నికల్లో డెమోక్రాటిక్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థిగా రేసులో ఉన్న కమలా హ్యారిస్ కూడా ఉండడం విశేషం.ప్రధానమంత్రి పదవిని చేపట్టిన తర్వాత నరేంద్రమోదీ 2014,2015,2017,2020లో వరుసగా ఆరేళ్లల్లో నాలుగుసార్లు టైమ్ మ్యాగజిన్ లో స్థానం దక్కించుకొని రికార్డ్ సృష్టించారు.ఇంకొక విశేషం ఏంటంటే... 2015లో టైమ్ మ్యాగజిన్ కోసం నరేంద్రమోదీ ప్రొఫైల్ ను అమెరికా అప్పటి అధ్యక్షుడు బరాక్ ఒబామా రాశారు.ఈ కీర్తి కూడా మోదీ దక్కించుకున్నారు. అమెరికాలో ఇంకా ఎన్నికల జరుగక ముందే ప్రభావశీలగా కమలా హ్యారిస్ నిలుచోవడం, రేపటి ఎన్నికల్లో విజయం వరిస్తుందని చెప్పడానికి ఒక సంకేతంలా భావించవచ్చు. అదే సమయంలో, అనేక విమర్శలు ఎదుర్కొంటున్న డోనాల్డ్ ట్రంప్ కూడా ఇక్కడ చోటు దక్కించుకోవడం ఆశ్చర్యంగా వుంది.రేపు జరుగబోయే ఎన్నికల్లో ఈ అంశం ఎటువంటి ప్రభావం చూపిస్తుందో వేచి చూడాల్సిందే.కరోనా వైరస్ సృష్టికి మూలం చైనా అని, ప్రపంచంలోని అనేక దేశాలు అనుమానిస్తున్న సందర్భంలో, సామ్రాజ్యకాంక్ష మితిమీరి, ఆధిపత్య పోరు కోసం నానా కుట్రలకు పాల్పడుతోందని విమర్శలు ఎదుర్కొంటున్న చైనా దేశపు అధ్యక్షుడు జిన్ పింగ్ కూడా ప్రభావశీలుడుగా ఎంపికయ్యారు.ప్రపంచ ప్రజలు వీరిలోని ఏఏ కోణాలకు ఆకర్షితులవుతున్నారో, ఇంకా సమగ్రంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది.ఈ ఎంపిక ప్రక్రియను ఇంకా నిశితంగా పరిశీలించాల్సివుంది. ప్రభావశీలురుగా ఎంపికైనవారిలోని కొందరిలో ప్రతికూల అంశాలు కూడా బాగా వున్నాయి. భారతప్రధాని నరేంద్రమోదీ ఎంపికకావడం, అదే సమయంలో, పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీలో జరిగిన నిరసనల్లో కీలకంగా వ్యవహరించిన బిల్కిస్ కూడా ఎంపికవ్వడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. షహీన్ బాగ్ ఆందోళనను ముందుండి నడిపిన వ్యక్తిగా ఆమెకు పేరుంది. 82ఏళ్ళ వయస్సులో చలిని కూడా లెక్కచేయకుండా ఉదయం నుండి అర్ధరాత్రి వరకూ పోరాటంలో నిలిచిన ఆమె పోరాట స్ఫూర్తికి ప్రపంచ ప్రజలు చలించి ఈ ఎంపిక చేసి వుంటారు. టైమ్ మ్యాగజిన్ నరేంద్రమోదీని ప్రభావవంతమైన వ్యక్తుల జాబితాలో పేర్కొంటూనే కొన్ని కీలక వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ లో విభిన్న మతాల ప్రజలు వున్నారు. సర్వమత సహనం విషయంలో నరేంద్రమోదీ పలు అనుమానాలకు తావిస్తున్నారంటూ, టైమ్ మ్యాగజిన్ కరెస్పాండెంట్ కార్ల్ విక్ రాశారు. ఈ విధమైన వ్యాఖ్యలు చెయ్యడానికి పౌరసత్వ సవరణ బిల్లు మొదలైన అంశాలు కారణమై ఉండవచ్చు. ఏది ఏమైనా, మన దేశ ప్రధాని ప్రభావశీలునిగా నాలుగుసార్లు ఎంపికకావడం భారతీయులందరికీ ఎంతో ఆనందాన్ని ఇచ్చే అంశం. తమిళనాడులోని ఒక మధ్య తరగతి కుటుంబంలో పుట్టి, ఉద్యోగం కోసం అమెరికా వెళ్ళి, తన ప్రతిభ, సృజన, కృషితో గూగుల్ వంటి దిగ్గజ కంపెనీకి సీఈఓగా నియామకం కావడం అసాధారణ విషయం. గూగుల్ కంపెనీని విజయాల బాటలో నడిపిస్తున్న సుందర్ పిచ్చయ్య ప్రతిభకు ప్రపంచం పట్టం కట్టింది. అతని జీవిత కథ ఎంతో విశేషమైందని టైమ్ మ్యాగజిన్ ప్రత్యేకంగా కొనియాడింది.ఇది మనందరికీ గర్వకారణం.సుందర్ పిచ్చాయ్ ఆ మధ్య బెంగళూరు వెళ్ళినప్పుడు తనకు విద్య నేర్పిన గురువు దగ్గరికి వెళ్లి కలిసి, ఆశీస్సులు పొందారు.ఇది నేటి యువత ఎంతో స్ఫూర్తిమంతంగా తీసుకోవాల్సిన విషయం.నేడు అగ్రస్థానంలో ఉన్నా, గతాన్ని మరచిపోనితనం సుందర్ పిచ్చయ్ వ్యక్తిత్వంలో ఒక ప్రధానమైన అంశంగా భావించాలి.ఇటువంటి లక్షణాలు విజయవంతమైన వ్యక్తులను మరింత విశేషంగా ప్రజల హృదయాల్లో నిలబెడతాయి. ప్రతిభాశీలురులో, కేవలం బాలీవుడ్ నుంచే కాదు, భారతసినిమా రంగం నుండి ఆయుష్మాన్ ఖురానా ఒక్కరే ఎంపివ్వడం మరో విశేషం. 36ఏళ్ళ ఖురానా తను పోషించిన ప్రతి పాత్రలోనూ పరకాయ ప్రవేశం చెయ్యడం ఇతన్ని విజేతగా నిల్పింది. మొత్తంమీద, టైమ్ మ్యాగజిన్ ఎంపిక చేసిన వీరందరూ ప్రపంచ ప్రజల దృష్టిలో ప్రత్యేకమైన వ్యక్తులుగా గుర్తింపు పొందుతున్నారు. ప్రపంచ ప్రజలు అంటే? ప్రపంచంలోని ప్రజలందరూ కాదు. ప్రపంచ స్థాయిలో టైమ్ మ్యాగజిన్ సర్వేలో ఓట్లు వేసిన కొందరు మాత్రమే అని అర్థం చేసుకోవాలి.టైమ్ మ్యాగజిన్ ఎంపిక ప్రక్రియలో భాగస్వామ్యులైనవారేనని తాత్పర్యం. ప్రభావశీలుర ఎంపికకు ప్రభావం చూపించే అంశాల్లో, విశేషమైన విజయాలు,సేవ,ముద్ర, లక్షణాలతో పాటు మీడియాలో, సోషల్ మీడియాలో వీరందరూ బాగా యాక్టివ్ గా ఉండడం కూడా ఒక కారణం కావచ్చు. మనవాళ్ళు ఐదుగురు ప్రభావశీలురుగా నిలవడం మనకు ఎంతో ఉత్తేజాన్ని ఇచ్చే సందర్భం.

నిలకడలేని నియంత!..

ఎం. శ్రీనివాస్



జనసేనాని పవన్‌కల్యాణ్ ఎంత ప్రమాదకర మనిషో ఇప్పుడిప్పుడే తెలిసొస్తోంది. చనిపోయే ఏ లోకాన ఉన్నాడో తెలియదు కానీ ప్రముఖ జర్నలిస్టు అరుణ్‌సాగర్ 2014లో 'ఒకటో నెంబర్ హెచ్చరిక' పేరుతో పవన్‌పై అద్భుతమై ఆర్టికల్ రాశారు. అంత వరకూ చేగువేరా గురించి మాట్లాడుతూ తనలో ఓ గొప్ప కమ్యూనిస్టు ఆలోచనాపరుడు ఉన్నాడని ఫోజు పెడుతూ వచ్చిన పవన్... 2014 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ - టీడీపీ మిత్రపక్షానికి మద్దతుగా నిలబడడంతో, అతని నిజస్వరూపాన్ని అరుణ్ పరితపించారు.

అందుకే 'ఒకటో నంబర్ హెచ్చరిక' అంటూ తెలుగు సమాజాన్ని జాగృతపరిచేందుకు అరుణ్ తన కలాన్ని ఎక్కుపెట్టారు. అంతర్వేదిలో రథం దగ్ధంతో పవన్‌కల్యాణ్‌లోని మత విద్వేషి ఒక్కసారిగా తన విశ్వరూపాన్ని ప్రదర్శించేందుకు ఒళ్లు విరిచారు. ఈ సందర్భంగా పవన్ గురించి అరుణ్ హెచ్చరికలను మరోసారి మననం చేసుకుని అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది.

అంతర్వేది ఘటనపై జగన్ సర్కార్ సీబీఐ విచారణ కోరడం జనసేనాని పవన్‌కల్యాణ్‌కు ఊహించని షాక్ ఇచ్చినట్టైంది. పైకి మాత్రం సీబీఐ దర్యాప్తును ఆహ్వానిస్తున్నామంటూనే, మళ్లీ మెలికలు పెడుతూ గాథ నిట్టూర్పులు విడవడాన్ని చూడొచ్చు. సీబీఐ దర్యాప్తును కోరకుండా ఉంటే అంతర్వేది ఘటన పునాదిగా మత రాజకీయాలను కొనసాగించాలనే ప్రతిపక్షాల కుట్రలను సీబీఐ పాచికతో జగన్ ఛేదించారు. పవన్ తాజా ట్వీట్ ఏంటో చూద్దాం.

“అంతర్వేదిలో రథం దగ్ధం కావడంపై సీబీఐ విచారణ కోరడమంటే సమస్య పరిష్కారం అయినట్టు కాదు. నిందితులను పట్టుకోడానికి వేసిన తొలి అడుగు మాత్రమే. భవిష్యత్‌లో అంతర్వేది వంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే మన సనాతన ధర్మాన్ని మనమే కాపాడుకోవాలి. దాని వైపు వేసే తొలి అడుగే మహిళల జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం” అని పవన్ పేర్కొన్నారు. అంతర్వేది ఘటనపై సీబీఐ, ఇతర దర్యాప్తు సంస్థలతో విచారణ చేపట్టాలని మొట్ట మొదట డిమాండ్ చేసిందే పవన్‌కల్యాణ్. ఏపీ పోలీసులపై తనకు నమ్మకం లేదని కూడా ఆయన అన్నారు. ఇప్పుడు సీబీఐ దర్యాప్తు చేయాలని జగన్ సర్కార్ కోరితే మళ్లీ అసంతృప్తే. సీబీఐ విచారణ కోరడమంటే సమస్య పరిష్కారం అయినట్టు కాదని సన్నాయి నొక్కులేంటి? అసలు సనాతన ధర్మానికి అంతర్వేది ఘటనకు ఏంటి సంబంధం? మరి ఇన్ని ధర్మాల గురించి చదివానని చెప్పుకునే తమరు...ఇలాంటి మతపరమైన వైషమ్యాలు రెచ్చగొట్టడం ఏం సంస్కారం? “పరమత సహనం అంటే మన మతాన్ని వదిలేసుకోవడం కాదు. సర్వమత సత్యత్వాన్ని లోకానికి బోధించిన సనాతన ధర్మం నా ధర్మం అని సగర్వంగా పాటిస్తూ , మిగతా మతాలను సహనంగా చూడడం” అని ట్వీట్ చేశారు.

అసలు సహనంగా చూడడం ఏమిటి? మమతానురాగాలను పెంచేదే మతం. అలాంటప్పుడు సహనం, అసహనం అనే ప్రశ్నలు ఎందుకు ఉత్పన్నమవుతాయి? మతం అనేది ఓ మత్తు అని కారల్ మార్క్స్ ఏనాడో చెప్పిన విషయం... పే...ద్ద కమ్యూనిస్టు ఫిలాసఫర్ అని చెప్పుకునే తమరికి తెలియక పోవడం ఏంటి సార్! మనుషుల్ని విడగొట్టే మతం అవసరమా? మనుషుల్ని, మనసుల్ని కలిపే మతం కావాలి. అదే మానవత్వం. అదే విశ్వమానవ తత్వం. గత కొన్ని రోజులుగా తనలో మనిషిగా ప్రవర్తిస్తున్న లక్షణాలు ఏమైనా కనిపిస్తున్నాయా? లేదా? అని పవన్ తన అంతరాత్మను ప్రశ్నించుకుంటే జవాబు లభిస్తుంది.

మహిళల జ్యోతి ప్రజ్వలనకు కొత్తగా పిలుపు ఇవ్వడం ఏంటి సార్? ప్రతిరోజూ ప్రతి మహిళా తమ ఇళ్లలో జ్యోతి ప్రజ్వలన చేయడం తమరికి తెలియదా? ఇదేనా తమరి హిందుత్వ చైతన్యం? అయ్యా పవన్ గారూ... తమరిప్పుడు పెడుతున్న దీపాలు ... జనసేన తలాపున వెలిగిస్తున్న దీపాలని గుర్తించుకోండి. మీరిప్పుడు వెలిగిస్తున్న దీపం తమలోని అజ్ఞానాన్ని లోకానికి చూపుతోంది. పవనిజం పుస్తకం రాసిన రాజు రవితేజ తమరి గురించి ఎంత బాగా హెచ్చరిక చేశారో కదా! మనుషుల్ని విడదీసే రాజకీయాలకు పవన్ తెరలేపారని రాజు రవితేజ చేసిన హెచ్చరిక ఎంత విలువైనదో ఇప్పుడిప్పుడే లోకానికి తెలిసొస్తోంది.

'డియర్ చే (చేగువేరా). మమ్మల్ని క్షమించు. ఓ అజ్ఞాని చేసిన అపచారానికి, దాన్ని ఆనాడే నిలదీయకుండా లైటు తీసుకున్న మా అలసత్వాన్ని క్షమించు. నువ్వు నలుగురికీ కొత్తగా పరిచయమవుతావనీ, నువ్వు కొన్ని కొత్త హృదయాలను వెలిగిస్తావని, నువ్వు కొన్ని కొత్త ఆవేశాలను రగిలిస్తావని ఆశతో ఆకాంక్షతో సహించాం. ఇప్పుడిక తాటతీస్తాం' అని అరుణ్‌సాగర్ ఆరేళ్ల క్రితం రాసిన మాటలు ఇప్పటికీ, ఎప్పటికీ సజీవంగా ఉంటాయి. 'బెటర్ లేట్ దేన్ నెవర్. ఇప్పుడొక బహిరంగ హెచ్చరిక. ముందు నీ ఇంటి గోడ మీద చే బొమ్మ తీసేరు. నీ సినిమాల్లో సెట్ ప్రాపర్టీల్లో చే బొమ్మను ఎడిట్ చేసెరు. నువ్వు మోడీ తీర్థం తాగుతావో, చంద్రబాబు స్పాన్సర్డ్ పాట పాడుకుంటావో నీ ఇష్టం. బట్. చేకి దూరంగా ఉండు. నీకిక ఆ అర్హత ఏ మాత్రమూ లేదు. నీకే చెబుతుంది వినిపిస్తుందా?' అని ఆరేళ్ల క్రితం అరుణ్ ఎంత బాగా హెచ్చరించారో కదా.

ప్రకృతి



- వి.నవీన్

చీకటి పడిందని ఇంటి ముఖం పట్టి అంతలోనే తిరిగి వెలుతురు రావడాన్ని చూసి అబ్బురపడే అమాయకపు పక్షులు... ఈరోజుకు సెలవంటూ ముడుచుకున్న మరుక్షణమే తుళ్లిపడి నవ్వుకునే పువ్వులు.. నీలాకాశం.. సంధ్యా సౌందర్యం.. మాటిమాటికీ మారుతున్న మబ్బుల వైచిత్రీ.. అడవులలోనూ.. కొండలమీద.. పొలాల మీద కనబడే రకరకాల రంగులు.. అర్ధరాత్రి అసంఖ్యాక తారలతో అలరించే ఆకాశమూ.. అన్నీ మన కండ్ల ఎదుట మనకోసం వింత కాంతులతో అనుక్షణమూ ప్రసరించే అద్భుత దృశ్యమే ఈ ప్రకతి.

ఇటువంటి ప్రకృతిలో...

ప్రగతి కొమ్మ చివరణ కాలుష్యం విచ్చుకొని మన అస్తిత్వాన్ని దెబ్బ తీస్తూ అభివృద్ధి నాభిలో ఆరోగ్యం పుచ్చి పోతోంది. నరుడి అడుగు సోకి అడవి రావణ కాష్టమై కిలకిల రాగాలు తగ్గి వసంతం మౌనం దాలుస్తోంది. కాలుష్యం కత్తులతో కవిత్వం అదృశ్యమై కరికలే బరముల కదలని కొండకు రాచపుండై రాబందులకు విందవుతుంది. దొరికే చోటే గుడారం వేసి ప్రకృతిలో పొదిగి ఉన్న బంగారు గుడ్లను పొందడానికి బాతును చంపినట్టుగా... అత్యాశకు పోయిన మనిషి అన్ని మలినం చేసి చివరకు ఆవు పొదుగునూ... అమ్మ వక్షాన్ని విషతుల్యం చేసే మిషనవుతున్నాడు. ఒకవైపు నాలుగోవంతు రోగాలకు పర్యావరణ కాలుష్యం కారణమని పరిశోధనలు చెపుతున్నాయి. మరోవైపు ఇప్పటివరకు ప్రపంచంలో జరిగిన అన్ని యుద్ధాల్లోని మతుల సంఖ్య కన్నా అధ్వానమైన వాతావరణం వల్ల మరణించిన వారి సంఖ్య చాలా ఎక్కువ అనేది నమ్మలేని సత్యం. ఇది సహజ వనరులను మూర్ఖంగా వాడటం వల్ల కలిగే అనర్థాల పర్యవసానం.

''బ్యాక్ టూ నేచర్ '' సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన 18వ శతాబ్దపు ఫ్రెంచ్ తత్వవేత్త 'రూసో' మొదలుకొని 70వ దశకంలోని 'చిప్కో' ఉద్యమం నుంచి నేటి "సహజ వనరుల పరిరక్షణ వేదిక" వరకు ఎంతోమంది పర్యావరణవేత్తలు పర్యావరణ ప్రమాదాన్ని హెచ్చరిస్తూనే ఉన్నారు. దానిపై పని చేస్తూనే ఉన్నారు. ఎందుకంటే అది అన్నింటికన్నా ముఖ్యమని భావించారు గనుక. కానీ మనం ఎక్కువ అవసరమైన విషయాలను తక్కువ పట్టించుకుంటూ ప్రగతి అని సంబరపడిపోతున్నాంకానీ వీటి వెనుక ఉన్న చీకటి కోణం ఏమిటి..? ఈ అభివృద్ధికి ఉన్న పార్శ్యం వల్ల అది మసకబారి పోతోంది.. అనే ఇంగితం ప్రదర్శిస్తున్నామా..? ఇంతగా భయపెడుతున్న 21వ శతాబ్దిలో మనం రేపు 'ఎక్కడ' అని ప్రశ్నించుకుంటున్నామా..? ప్రజాస్వామ్యం అని స్పందిస్తున్నాం కానీ కనబడని శత్రువు మన ఆయువును తగలేస్తున్నాడని గ్రహిస్తున్నామా..? గాలి, నీరు, ఆహారంలోని కాలుష్యపు కరవాలాలు మనల్ని చేరటమే కాదు మన కుత్తుకలను కోస్తున్నాయని తెలుసుకుంటున్నామా..? ఇటువంటి మరణ మృదంగానికి కారణమెవరో తెలుసుకుంటే గానీ "కుక్కిన పేను వలే ఉండాలో ఎక్కుపెట్టిన కాలంలా పని చేయాలో అర్థమవుతుంది". అందుకే "ప్రపంచ స్థాయిలో సమస్యను అర్థం చేసుకొని పరిమిత స్థాయిలో పరిష్కారం ప్రారంభిస్తూ ప్రపంచం వైపు నడవాలి". అనే సూత్రంతో ప్రకృతి ప్రేమికులు, పర్యావరణ హితులు సహజ వనరుల విధ్వంసాన్ని నిరసించాలి. పర్యావరణ పరిరక్షణకు నడుం కట్టాలి. సహజ వనరుల పరిరక్షణ కోసం సాగే ఉద్యమాల్లో భాగస్వాములు కావాలి.

''19వ శతాబ్దం బానిసత్వ నిర్మూలనకు - 20వ శతాబ్దం మానవ హక్కులకు ప్రతీకలయితే...

21వ శతాబ్దం పర్యావరణ సాధనకు ప్రతీకవుతుంది".

కిమ్... కరోనా కంటే డేంజర్

- డా॥ముని స్వామి, అసిస్టెంట్ ప్రొఫెసర్

అరబ్‌దేశాల్లో తొలినాళ్లలో వైరస్ వ్యాప్తి చెంద కుండా పదిలక్షలవరకూ జరిమానా, పదేళ్లపాటు జైలుశిక్ష వంటి చట్టాలను కూడా అమలుచేసారు. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేసినా అందుకు భారీ జరిమానాలు చెల్లించాలన్న దేశాలు ప్రపంచంలో ఎన్నో ఉన్నాయి. ఎక్కువగా నియంతృత్వ పోకడలు ఇప్పటికీ కొనసాగిస్తున్న దేశాల్లో ఇప్పుడు ఉత్తరకొరియా ముందువరుసలో ఉంటుందని చెప్పాలి. ఆ దేశాధినేత కిమ్‌జాంగ్ ఉన్ ఏం చేసినా అది ప్రపంచవ్యాప్తంగా సంచలనమే అవుతుంది. తాజాగా సరిహద్దులన్నింటినీ మూసివేయాలని ఆదేశాలు జారీచేసారు. అక్రమంగా తమదేశంలోకి వచ్చినవారెవరైనాసరే కాల్చి పారేయండని మిలిటరీ అధికారులకు ఆదేశాలు జారీచేసేసారు. ఇటీవలి కాలం వరకూ కిమ్‌జాంగ్ మరణశయ్యపై ఉన్నారని, ఆయనకు శస్త్రచికిత్సలు జరిగాయని, ఇప్పట్లో రావడం కష్టమేనని,అసలు ఉన్నారోలేదోనన్న సందేహాలతో ప్రపంచదేశాలు కొట్టుమిట్టాడాయి.

అనుకున్నట్లుగానే తన సోదరి కిమ్ యోజాంగ్‌కు కీలక బాధ్యతలన్నీ అప్పగించేసారు. ఇక ఇప్పుడు అన్ని దేశాల తరహాలోనే ఉత్తరకొరియాలో కూడా కరోనా కట్టడి కీలకంగాచేపట్టాల్సి వచ్చింది. తొలినాళ్లలోనే వైద్యులకుసైతం హెచ్చరికలు చేసిన కిమ్ ఇప్పుడు సరిహద్దుల నుంచి ఎవరు అక్రమంగా ప్రవేశించినా కాల్చివేయాలన్న ఆదేశాలు ఆదేశ ప్రజల్లో ప్రాణ భయాన్ని మరింత రెట్టింపుచేసాయి. గతడిసెంబరు నుంచి వైరస్ వ్యాప్తి విశ్వవ్యాప్తమైన సంగతి తెలిసిందే. ఆదేశాల్లో ఉత్తరకొరియాకుసైతం ఎలాంటి మినహాయింపులులేవు. కరోనా వైరస్ తమవద్దకు రానేరాదని, తమదేశంలో లేనేలేదని ముందు కిమ్ జాంగ్‌ప్రకటించారు. తదనంతరం దేశంలో ఆనవాళ్లు బైటపడటంతో అధికారులకు తక్షణమేఆదేశాలు జారీ చేసి వైరస్‌తో ఎవరు మృతిచెందినా వారితోపాటు చికిత్సలో వైఫల్యం చెందిన వైద్యులను కూడాకాల్చి వేస్తామని హెచ్చరించడంతో ప్రభుత్వ యంత్రాంగం మొత్తం వణికిపోయింది.



ఏప్రిల్‌లోనే ఇద్దరు సీనియర్ అధికారులను తొలగించారు. పార్టీ వైస్‌ఛైర్మన్ రిమాన్‌గాన్, పాక్‌థాడాక్‌లను అవినీతిపేరిట తొలగించారు. గగనతలాన్నిసైతం నిషేధించాలని, చైనాసరి హద్దులను పూర్తిగా మూసివేయాలని ఆదేశించిన కిమ్‌జాంగ్ ఎవరు అక్రమంగా ప్రవేశించినా వారిని కాల్చివేయాలని జారీచేసిన ఉత్తర్వులతో ఇరుదేశాల సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి.

చైనానుంచి ఇబ్బడి ముబ్బడిగా పర్యాటకులు వచ్చిపోతుంటారు. ఉత్తర కొరియాకు మిత్రదేశంగా వ్యవహరిస్తున్న చైనానుంచే ఎక్కువ రాకపోకలు సాగుతాయి.

వీరి రాకవల్ల వైరస్ మరింత పెరుగుతుందన్న భావనతోనే కిమ్ సరి హద్దులు మూసేసి అక్రమంగా వచ్చినవారిని కాల్చి వేయాలని ఉత్తర్వులు జారీచేసారని దక్షిణకొరియా సరిహద్దుల్లో మకాంవేసిన అమెరికా సైనిక అధికారులు పేర్కొంటున్నారు.

అంతర్జాతీయ రైళ్లు విమానసర్వీసులను సస్పెండ్ చేసారు. పర్యాటకులపై పూర్తినిషేధం విధించింది.వాస్తవానికి మిలిటరీ చట్టాలను కఠినంగా అమలుచేసే కిమ్‌జాంగ్ ప్రకటించినట్లుగా తొలినాళ్లలో ఉత్తరకొరియాలో వైరస్ అంతగా లేదు. రానురాను మరింతగా విజృంభించింది. దీనితో చైనా, దక్షిణకొరియా సరిహద్దులను మూసివేసింది. తొలినాళ్లనుంచి కూడా వైరస్‌పై ఆ దేశప్రజల్లో కొంతమేర విస్తృత ప్రచారమే జరిగింది. జిడిపి తలసరి ఆదాయం ఉన్న ఇతర దేశాలతో పోలిస్తే కొరియా కరోనా కట్టడిలో కిమ్ నియంతృత్వవైఖరి కొంత పనిచేసిందని నిపుణులు చెపుతున్నారు. ముందు మా దేశంలో అసలు కేసులే లేవని చెప్పిన కిమ్ ఆ తర్వాత అంగీకరించకతప్పలేదు. కరుడుగట్టిన నియంత అయిన కిమ్ ఇప్పుడు అదే నియంతృత్వ సిద్ధాంతాలను కరోనా కట్టడికి వినియోగిస్తున్నట్లు సరిహద్దుల్లో మకాంవేసిన అమెరికా బలగాలు చెపుతున్నాయి. అనుకున్నట్లుగానే అదే సిద్ధాంతాన్ని కరోనా కట్టడికి ఇపుడు కిమ్ వినియోగిస్తున్నాడు.

అంతకంతకంతకూ పెరుగుతున్న కరోనా కేసులను తీవ్రంగా పరిగణించిన కిమ్ చైనానుంచి తమ దేశంలోకి ప్రవేశిస్తున్న కరోనా సోకి వస్తున్న సందర్శకులను కాల్చి చంపేయాలని ఆదేశాలిచ్చినట్లు అమెరికా సైనిక కమాండర్ ప్రకటించడం చూస్తే కిమ్ ఆదేశాలు ఆ దేశంలో అమలవుతున్నట్లే.

ఉత్తరకొరియా చైనాకు పక్కనే ఉన్నప్పటికీ ఇప్పటివరకూ ఒక్కకేసును కూడా ధృవీకరించలేదు. అసలు వైరస్ లేదనే కిమ్ ప్రకటించాడు. జనవరినుంచి సరిహద్దులను మూసివేసిన ఉత్తరకొరియా అత్యవసర పరిస్థితిని అత్యంత పీక్‌స్థాయిలో అమలుచేస్తోంది.

సరిహద్దుల మూసివేత కారణంగా స్మగ్లింగ్ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగిందని అమెరికా సైనిక బలగాల కొరియా కమాండర్ సైతం ధృవీకరించారు. చైనా సరిహద్దుకు ఒకటిరెండు కిలోమీటర్ల దూరంవరకూ ఉత్తరకొరియా బఫర్‌జోన్ ఏర్పాటుచేసింది.

ప్రత్యేక ఆపరేషన్స్ బలగాలు, స్ట్రైక్‌ఫోర్స్‌ను చైనా సరిహద్దుల్లో మొహరింప చేసింది. చైనానుంచి అక్రమంగా వచ్చేవారిని అక్కడికక్కడే కాల్చిచంపేయాలని అందుకోసమే ఈ బలగాలను అక్కడ మొహరింపచేసిందని సమాచారం. సరిహద్దులు మూసివేతతో చైనానుంచి కొరియాకు దిగుమతులు 85శాతం క్షీణించాయి. మరోపక్క టైఫూన్ మసక్‌తో తలమునకలవుతున్న ఉత్తర కొరియాలో కరోనా కట్టడికి కిమ్ జారీచేసినా ఆదేశాలు సర్వత్రా ప్రాణభయం పెంచాయి.

ఆత్మహత్యలను హత్య చేద్దాం

- కె.వెంకట్, పి.హెచ్‌డి

"GOD CAN ONLY TAKES ONE LIFE..
WHY BECAUSE HE CSN ONLY GIVES IT"

మొన్న సుశాంత్ నిన్న శ్రావణి నేడెవరు ఆత్మహత్య చేసుకుంటారో? జీవితం... అనేది అనుకోకుండా దొరికిన అద్భుతమైన వరం... అవకాశం, పూర్తి జీవితాన్ని కష్టసుఖాల కైనా ఓర్చుకొని ఆస్వాదించలేనివాడు మనిషిగా పుట్టడం వ్యర్థం. పుట్టిన ప్రతి వాడికి మరణం తప్పదు, మరణం జీవితం కాదు. స్వేచ్ఛగా పూర్తి జీవితాన్ని గడిపే అవకాశం, హక్కు ఉంది. దీన్ని ప్రకృతి ధర్మం అంటారు. కానీ కొందరు జీవితాలను అర్ధాంతరంగా ముగిస్తారు. ఆత్మహత్య లేదా ఆత్మను హత్య చేసుకుంటారు. అంటే ఒక బలహీన క్షణంలో తీసుకునే అటువంటి అవివేకమైన చర్య అనే ఆత్మహత్యగా అర్థం చేసుకోవచ్చు. మానవ సంబంధాల మధ్య అగాథాలు పెరగడం, మనిషి చంద్రమండలానికి చేరుకున్నానని గొప్పగా చెప్పుకున్న కూడా, పక్కవాడి మనసును చేరుకోకపోవడం శోచనీయం. జన్మనిచ్చిన ప్రతి తల్లి తన సంతానం నుండి ఒకే ఒక కోరిక కోరుకుంటుందట... అదేమిటంటే తాను చనిపోయిన తరువాత తన కర్మకాండలను, తన సంతానం వారి స్వహస్తాలతో చేయాలని ఆశిస్తుంది. కానీ ఆత్మహత్యలకు పాల్పడేవారు తన తల్లి ఆఖరి కోరిక అయినా కనీస ధర్మాన్ని నిర్వర్తించేలేని దుస్థితిలో జీవితానికి చరమాంకం పాడుకుంటున్నారు. స్వాంతన చేకూర్చవలసిన సమాజంలో ఒక సమస్యకు సమాధానం దొరకడం లేదంటే 'ఆ సమాజం చనిపోయినట్లే లెక్క...' అదే ఇప్పుడు అందరిని ఆందోళనకు గురి చేసి ఆత్మహత్యలకు కారణం అవుతున్నాయి. ఆత్మహత్యలకు కారణాలు: క్షణికావేశం, పట్టరాని ఉద్రేకం, నిలదొక్కుకోలేను అన్న నిరాశ... పురుగు మందులు, ఉరితాళ్లు కన్నా ప్రమాదకరమైనవి. ర్యాంకుల సాధనలో, ప్రేమలోనో వైఫల్యం చెందడం, నిరుద్యోగం, అనారోగ్యం, వైవాహిక సమస్యలు వీటన్నింటి కన్నా జీవితం చాలా ముఖ్యమైనది. జీవితంలో సమస్యలు తప్పవు, జీవితమే సమస్యగా భావించకూడదు. తీవ్ర మానసిక భావోద్వేగాలు, వ్యక్తిగత సమస్యలే మహిళలలో ఎక్కువ మందికి ఉరితాళ్లు పేనుతున్నట్లు జాతీయ నేరాల రికార్డుల విభాగం గతంలో తెలియజేసింది. వేధింపులు, ఆర్థిక సంక్షోభాలు మొదలు... కోరుకున్నది దక్కలేదన్న వేదన వరకు... దేనికైనా చావే పరిష్కారం అనుకునే పెడ ధోరణులు జోరు సర్వత్ర కళ్ళకు కడుతుంది. అక్షరాస్యత, జీవన ప్రమాణాలపరంగా ముందంజ వేసిన కేరళలోనూ ఆత్మహత్యలు విరివిగా నమోదవుతున్నాయి. జీవితాన్ని నిలబెట్టేది చదువు, కూలదోసేది కాదంటూ మరమ్మతుల ఆవశ్యకత ఎక్కడుందో ఈ పరిణామాలు విశదీకరిస్తున్నాయి. నేడు చేయాల్సింది ధైర్యాన్ని పెంపొందించే వ్యక్తిత్వ నిర్మాణం. ర్యాంకులు మార్కులే ముఖ్యమన్న వేలం వెర్రి చదువుల బాధలో రాణించలేక ఆత్మన్యూనత భావంతో, చావే శరణ్యం అన్న దుర్దశకు పిల్లలు చేరడానికి కారణం ఎవరు? మార్కులు తగ్గినా, పరీక్ష తప్పిన ఇక బ్రతుకు వృధా అనుకునే అంత నిస్పృహలో రేపటి తరం కూరుకుపోవడానికి మూలాలు ఎక్కడున్నాయో... ముదింపు చెయ్యాలి, ఆలోచనలను, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే సామర్థ్యం నేటి చదువులలో నేతిబీర చందమైనదని ఆత్మహత్యల ఉరవడి చాటుతుంది. బ్రతుకులో... ఘర్షణ ఉంటుంది...జీవితంలో మాధుర్యం ఉంటుంది. కష్టమో, నష్టమో, బాధో, చెప్పుకోలేని దుఃఖం, ఏమి అర్థం కాని పరిస్థితులు, దగ్గరి వాళ్లు మోసం చేయడం, ఎవరూ పట్టించుకోకపోవడం ఆత్మహత్యలకు కారణాలుగా చెప్పుకోవచ్చు. ఆలోచన ఎక్కడైతే అంతమవుతుందో, ఆవేశం అక్కడ మొదలవుతుంది. ఇందులో ముఖ్యంగా తాగుడుకు బానిసగా మారడం, కుటుంబ పోషణ పట్టించుకోకపోవడం, సున్నిత మనస్సు వల్ల ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఆత్మహత్యలు నిరోధించాల్సిన కనీస బాధ్యత ఒక సామాజిక అంశంగా ప్రతి ఒక్కరూ నడుం బిగించాల్సిన అవసరం ఉంది. విద్యార్థులు పరీక్ష ఫలితాలు, రైతుల అప్పులు, భార్య భర్తల కుటుంబ కలహాలు, పేదవాన్ని కబళించే మైక్రోఫైనాన్స్ సమస్యలు ఆత్మహత్యలకు పురిగొల్పుతున్నాయి. ఈ ప్రపంచంలో జ్ఞానం తెలిసినవాడు, భాష తెలిసినవాడు, భావం తెలిసినవాడు, మాట్లాడగలిగిన వాడు, ఆలోచించగలిగే వాడు ఒకే ఒక్కరు... 'మనిషి...' కానీ దురదృష్టం ప్రపంచంలో మనిషి ఒక్కడే ఆత్మహత్య చేసుకునే స్థాయికి దిగజారడం సిగ్గుపడాల్సిన విషయం. ఆత్మహత్య త్యాగం కాదు: మనల్ని మనం శిక్షించుకునే హక్కు గాని, ప్రాణాలు తీసుకునే హక్కు గాని, ప్రాణాలు తీసే హక్కు గాని, ఇహలోకంలో, పరలోకంలో నైనా లేదు. బతికి సాధించు అనేది సర్వసాధారణం. కానీ బతికించి సాధించు అనేది చాలా అరుదు. అరుదైన జీవితాన్ని అర్థరహితం చేసుకోవద్దు. మార్కులు తెచ్చుకోవడంలో పోటీ, ఆర్థిక ఇబ్బందులు, ఇతర సామాజిక కారణాలు ఆత్మహత్యలు జాడ్యాన్ని పెంచుతున్నాయి. ప్రజల్లో సమస్య పరిష్కారమై అవగాహనను, ఆత్మస్థైర్యాన్ని పెంచాలి. మూలాలను అన్వేషించాలి: ఆత్మహత్యలకు మూలాలను అన్వేషించాలి, అప్పుడే కారణాలు తెలుస్తాయి. వాటిని నివారించడానికి వీలు కలుగుతుంది. ఆత్మహత్య ఆలోచనలు సకాలంలో గుర్తించి తగిన తోడ్పాటు, కౌన్సిలింగ్ చేయిస్తే వాటి బారిన పడటం తప్పుతుంది. ప్రపంచంలో ప్రతి 40 సెకండ్లకు ఒకరు ఆత్మహత్య చేసుకుంటున్నారు. జీవితంపై ఆశ, తీపి కోల్పోయిన వారే ఆత్మహత్య చేసుకుంటారు. ఎదుటి వారి బాధలను అర్థం చేసుకొని, వాటిని పంచుకునే అలవాటును పెంచుకోవాలి. దీని వల్ల బాధలో ఉన్న వారికి స్వాంతన చేకూరి ఆత్మహత్యలు చేసుకోవాలన్న ఆలోచనను మానుకొంటారు.

వైఫల్యాలకు కుంగిపోయి అంతటితో తమ ప్రయత్నాలను, జీవితాన్ని ముగించుకుంటే ఐన్‌స్టీన్, థామస్ అల్వాఎడిసన్, అబ్రహాంలింకన్ లాంటి వారిని తరతరాలు స్మరించుకోగలిగే వారే కాదు. ఓటమి ఒక మలుపు, కానీ ఏకైక గమ్యం గెలుపు. ఆ స్ఫూర్తితో, రెట్టించిన పట్టుదలతో సామర్థ్య నిరూపణకు కంకణబద్ధులైన వారే చరిత్రలో విజేతలుగా నిలిచారు. కుంగిన హృదయాల్ని స్వాంతన వచనాలతో సేదతీర్చే గురువులు, కుటుంబ సభ్యులు, సహోద్యోగులు, మిత్రులు ఉన్న చోట ఆత్మహత్యలు సన్నగిల్లుతాయి. సకాలంలో ఉపశమనం, చికిత్స అందించగలిగితే 90 శాతం ఆత్మహత్యను నివారించగలం.

ఊడిన లక్షలాది ఉద్యోగాలు

– 66 లక్షల మందికి కష్టాలు – రోడ్డున పడ్డ 50 లక్షల మంది కార్మికులు

– నాలుగు నెలల్లోనే ఫట్ : సీఎంఐఈ రిపోర్ట్



- ఎన్.భాను, సీనియర్ జర్నలిస్ట్

గడిచిన నాలుగైదు నెలల్లో లక్షలాది మంది నైపుణ్యం కలిగిన పెద్ద ఉద్యోగులు (వైట్ కాలర్ జాబ్స్) తమ భద్రతను కోల్పోయారు. ఈ కేటగిరీలో ఈ ఏడాది మే నుంచి ఆగస్టు కాలంలో దాదాపుగా 66 లక్షల ఉద్యోగాలు పోయాయని సెంటర్ ఫర్ మానీటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) అంచనా వేసింది. దీంతో 2016 నాటి కనిష్ఠ స్థాయికి ఉద్యోగాలు పడిపోయాయి. ఇదే సమయంలో 50 లక్షల మంది పారిశ్రామిక కార్మికులు తొలగించబడ్డారు. సీఎంఐఈ ప్రతీ నాలుగు నెలలకు ఓ సారి విడుదల చేసే కన్స్యూమర్ ఫిరమిడ్స్ హౌజ్‌హోల్డ్ సర్వేలో ఈ విషయాలను వెల్లడించింది. ఈ రిపోర్ట్ ప్రకారం.. గడిచిన నాలుగు నెలల్లో వైట్ కాలర్ ప్రొఫెషనల్ ఎంప్లాయిస్, ఇతర ఉద్యోగులు పెద్ద మొత్తంలో తమ ఉపాధిని కోల్పోయినట్టు గుర్తించింది. ఇందులో ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో పని చేసే ఇంజినీర్లు, డాక్టర్లు, టీచర్లు, అకౌంటెంట్లు, విశ్లేషకులు ఉన్నారు. ఇందులో స్వయం ఉపాధి ఔత్సాహికులను పరిగణలోకి

తీసుకోలేదు. 2019 మే– ఆగస్టు కాలంలో దేశంలో 1.88 కోట్ల వైట్‌కాలర్ ఉద్యోగులు పని చేస్తున్నారు. 2020 ఆగస్టు నాటికి ఈ సంఖ్య ఏకంగా 1.22 కోట్లకు తగ్గింది. 2016 తర్వాత ఆ స్థాయికి ఉద్యోగాలు పడిపోవడం ఇదే తొలిసారి అని సీఎంఐఈ పేర్కొంది. గడిచిన నాలుగు ఏండ్లలో కొత్తగా సృష్టించబడిన ఉద్యోగాలన్నీ లాక్‌డౌన్ కాలంలో ఆరిపోయాయి. మరోవైపు పారిశ్రామిక కార్మికులు అత్యధికంగా ఉద్యోగాలు నష్టపోయారు. ఏడాదికేడాదితో పోల్చితే 50 లక్షల మంది పైగా రోడ్డున పడ్డారు. ఇది మొత్తం పారిశ్రామిక కార్మికుల సంఖ్యలో 26 శాతంగా ఉంటుందని సీఎంఐఈ అంచనా వేసింది. ఇందులోనూ అత్యధికంగా చిన్న పరిశ్రమల్లో ఉద్యోగాలు పోయాయి. కాగా బిపిఒ, కెపిఒ లాంటి డెస్క్ వర్క్ చేసే ఉద్యోగులపై మాత్రం ప్రభావం పడలేదు. దాదాపుగా వీళ్లందరికి ఇంటి నుంచి పని సౌలభ్యం లభించింది. అలాగని ఈ రంగంలో కొత్త ఉద్యోగాల సృష్టి జరగలేదని సీఎంఐఈ తన రిపోర్ట్‌లో తెలిపింది. లాక్‌డౌన్ కాలం ఏప్రిల్‌లో 12.1 కోట్ల ఉద్యోగాలు పోయాయని సీఎంఐఈ ఇంతక్రితం అంచనా వేయగా.. ఆగస్టు నాటికి చాలా వరకు రికవరీ అయినట్లు పేర్కొంది. అయితే వేతన ఉద్యోగాల్లో మాత్రం క్షీణత కొనసాగినట్లు తెలిపింది.

Printed & Published by Shri Kanaparthi Rajarao and Printed at Amma Offset Printers, D.No.30-8-35, Bhanu Street, Visakhapatnam-530020, A.P. and Published at Praja Manipusa (Telugu), Sai Towers II, Plot No.317, House No.10-12-6/59, Rednam Gardens, Visakhapatnam - 530002. Cell : 9492423833 Email : prajamanipoosa2020@gmail.com, prajamedia2020@gmail.com